



రామాయణం


విచారణ

వాశిష్ఠ రామాయణము-ద్విపద కావ్య









సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

http://www.new.dli.ernet.in



అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

శ్రీరస్తు.

వాసిష్ఠరామాయణము.

ద్విపదకావ్యము

తరిగొండ వెంగమాంబకృతము.

చెన్నపురి:

వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్ వారిచే

ప్రకటితము.

1925

శ్రీరస్తు.

వాసిష్ఠ రామాయణము

ద్విపద కావ్యము.

శ్రీవిఘ్ననాథుని క్షేత్రపాలకుని
శ్రీవాణినిఁ విరించిని హయాననుని
నలఘుదుర్గను జౌడమాంబను శివుని
నల వరాహస్వామి నాత్మ యందుంచి
భక్తిచే నెపుడు సుబ్రహ్మణ్యగురుని
ముక్తిప్రదుని పాదముల నాశ్రయించి
మురిసి నవగ్రహమ్ములకుఁ గేల్మోగిచి
ధరణిమీఁద మదాత్మ తరియించుకొఱకు
సామోదమతిని సుజ్ఞానవాసిష్ఠ
రామాయణార్థసారమును గ్రహించి
వరుసగా ద్విపదకావ్యముగా రచించి
యారలేక మీకు సమర్పింతు నిపుడు
శ్రీతారకోల్లాస శ్రీశ్రీనివాస
శ్రీతరిగొండనృసింహ ధూతాంహ

విన్నవించెద నేను విన్నఁ డదెట్లనిన
మున్ను భరద్వాజమునిపుంగవుండు
మోక్షేచ్ఛ నిజచిత్తమునఁ బ్రకాశింప
వేక్షణభక్తిని బ్రియము రెట్టింప
వరవిరక్తిని బొంది వాల్మీకిమౌని
చరణాంబుజములకుఁ జాఁగిలి మ్రొక్కి
వినుతులు పెక్కుగావించి యిట్లనియె
ఘనమునీశ్వర మీరు కరుణించి నాకు
వేదశాస్త్రాదిసద్విద్య లన్నియును
భేదంబు లేకుండఁ జెప్పి ప్రోచితిరి
మనుజులు సంసారమాయాబ్ధి దాఁటి
సునిశితముక్తి హెచ్చుదఁ బొందుసరణిఁ
దెలుపవే యనుచుఁ బ్రార్థింప వాల్మీకి
యలభరద్వాజున కప్పు డిట్లనియె
వత్స భరద్వాజ వసుధ నందఱిని
వాత్సల్యమునఁ బ్రోచు వైపు భావించి
యతిరహస్యప్రశ్న మడిగితి వార్య
హిత మొప్పఁ జెప్పెద నెట్లన్న వినుము
పుట్టి గిట్టుచునున్న భూప్రజలందు
నెట్టన నెవరైన నిఖిలభోగములు
నిరసించి వైరాగ్యనిష్ఠ పెంపెసఁగ
నెరయ సంసారంబు నిత్యంబు గాదు

తను వశాశ్వతమ సిద్ధముగ నే నెవఁడ
నని విచారించి దీనార్తుఁడై తనకు
నీరహస్యముఁ జెప్ప నిష్టుఁడై నట్టి
కారణగురుఁ డెందుఁ గలుగునో యనుచుఁ
బొరిపొరి దీనార్తుఁడై నట్టి సత్య (1)
నరునకు గురుభక్తి నాఁటుఁ జిత్తమున
నాభక్తి దృఢముగా నాత్మనుంచుకొని
ప్రాభవంబుల కాశపడక కామాది
వైరుల ఖండించి వాంఛల విడిచి
యథార్థుఁడైన మహాగురుస్వామిఁ
జేరి శిశ్రూషలు చేసినఁ బుణ్య
సారవిహీనసంసారాబ్ధి దాఁటి
రమణీయమోక్షతీరమునందుఁ జేరి
యమల సద్వస్తునం దైక్యమై నిలుచు
ధరణి నజ్ఞుండైనఁ దజ్ఞుండునైన
నిరవొందఁ దన్నుఁ దా నెఱిఁగెడికొఱకు
సదమలగురుసేవ సల్పఁగావలయు
నది మాని రేని మోక్షార్థులు గారు
ఆకాశమందు నైల్యాదివర్ణములు
జోకగాఁ గనుపించి శూన్యంబులైన
కరణిఁ జిద్వ్యోమప్రకాశంబునందుఁ
బొరిపొరి భూతముల్ పుట్టి నశించు

నట్టి మిథ్యారూపమైన ప్రపంచ
మెట్టిదని మది నూహింపంగ నీక
పటుజాగ్రత్త భ్రాంతిభ్రమలఁ బుట్టించు
నటువంటి భ్రమకు లోనై చెడిపోక
మదిలోన తద్భ్రాంతి మఱచుటె లెస్స
యదె చూడు దృశ్యంబు లన్ని దబ్బఱలు
గానుండి యజ్ఞానకర్మదృక్కులకుఁ
బూని యప్పుడు నిజంబుగఁ గానవచ్చు
జ్ఞానదృక్కుకుఁ బ్రపంచము కానరాదు
మానితబ్రహ్మ మాత్మకు గోచరించుఁ
జిత్తవృత్తులు నశించిన జీవతత్త్వ
మత్తఱిఁ జిత్తులో నణఁకువై పొందు
నిటువంటి సూత్రార్థ మెఱుఁగనేరకయు
ఘటికులై బహుకర్మకంధిలోపలను
బొరలుచుండెడివారు భూలోకమందుఁ
దఱుచైన గల్పశతంబులకైన
ముక్తిఁ బొందఁగలేరు ముక్తి యెట్లనిన
యుక్తితో వినుము చేయుచునుండు కర్మ
వాసనవాసమై వచ్చుచు లేని
యాసల కాస్పదం బైన పాపంబు
క్షీణించి పోవుటే చిరముక్తి యనఁగ
నాణెమై తగువాసనలు నెట్టి వనిన

సరవిని మలినవాసన యదిగాక
సరసమౌ శుద్ధవాసనయు నీరెండు
అందు మలినవాస నజ్ఞానతమము
పొందుగాఁ దా నహంబు వహించి జన్మ
కారిణి యగుచు దుఃఖము నిచ్చుచుండు
సారమై శుద్ధవాసన పునర్జన్మ
కారిణి గా కహంకారబీజంబు
నారూఢిఁ గాల్చిన యానంద మిచ్చుఁ
దా నర్ధదేహంబు ధరియించియుండుఁ
గానఁ దజ్ఞయునంగఁ గర మొప్పుచుండు
ఘనశుద్ధవాసనకలితులు ధరణి
ననఁగ జీవన్ముక్తు లనఁగ నొప్పుదురు
అందు జీవన్ముక్తుఁ డగు పంక్తిరథుని
నందను కథ విన్న నరులకు జన్మ
మరణదుఃఖంబులు మాయు నారాము
చరితంబుఁ జెప్పెదఁ జక్కఁగా వినుము
అని పల్కువాల్మీకి కంజలిఁ జేసి
మొనసి భారద్వాజముని భక్తినతనిఁ
గని రామచరితంబు క్రమముగా నాకు
వినుపింపవే యని విశ్వాస మొదవ
నడుగ భరద్వాజు నాత్మలో మెచ్చి
యడర వాల్మీకి యిట్లని చెప్పఁదొడఁగె

విను మోభరద్వాజ విబుధులఁ బ్రోవఁ
బనిఁబూని యాపరబ్రహ్మ మచ్యుతుఁడు
శ్రీవిష్ణుదేవుఁ డాశ్రితజనావనుఁడు
పావనాచారుండు భానువంశమునఁ
బొలుపొంద దశరథపుత్రుఁడై పుట్టి
తొలఁగక వృద్ధిఁ బొందుచునుండినపుడు
దేవత లతనిఁ బ్రార్థించి యిట్లనిరి
దేవాదిదేవ పృథ్వీని నీవు మనుజ
దేహంబు ధరియించితివి మానవులను
మోహాబ్ధిలోఁ బడి మునిఁగి పోనీక
కడతేర్చు కారణకర్తవే యనఁగఁ

....

వరయు వసిష్ఠసంయమి నాశ్రయించి
సరసవేదాంతవిజ్ఞానధర్మముల
వరుసగా నాలింపవలె నీవు పరమ
గురుఁడవయ్యును మదిఁ గొంకక యన్య

....

గురు నాశ్రయించి యోగరహస్యమును
వినినను గొంచజావిధమున గురుని
ననుసరించి కృతార్థు లగుదు రటంచు
బహువిధంబుల వారు ప్రార్థింపఁగాను
విదితంబుగా విని విజయరాఘవుఁడు

అనిమిషుల్ ప్రార్థించినందు కచ్చోట
తనమదిలో నిట్లు దలఁచె నాథుఁడు
దేహేంద్రియములు వృద్ధినిబొంది విషయ
వాహినిలోఁ ద్రోయఁబచ్చి హెచ్చినవి
మైత్రిని దొల్త నిమ్మాట్కిని జూపి
శత్రువై నటువంటి సంసారవార్ధిఁ
గడపట ముంచుచు గట్టెక్కనీక
విడఁబడి చెఱచు నీవిషయేంద్రియములు
కావున సకలభోగంబుల విడిచి
నే విరక్తిని జెంది నిస్పృహాత్వమునఁ
బొందిన దశరథభూపతి చింత
నొందునో యనుభీతి యొక్కింత మదిని
బొడమఁగా నది మాని పుణ్యతీర్థములఁ
బొడగాంచి గ్రుంకుచుఁ బుణ్యాశ్రమములఁ
గనుఁగొని వచ్చి యక్కడనుండినట్టి
మునివృత్తు లాత్మ నిష్టుగ మెచ్చికొనుచు
నిజరాజ్యసౌఖ్యంబు నిరసించికొనుచు
సుజనసాంగత్య మచ్చుగఁ గోరికొనుచుఁ
గుజనులతోఁ జెల్మి కొఱగాదటంచు
విజనస్థలములందు వేఱె తా నుండి
యారసి తన్ను మోహార్ణవునిఁ జేయు
కారణగురు వెందుఁ గలుగునో యనెడి

చింతచే డస్సి యాశ్రీరామచంద్రుఁ
డంతఃపురంబులో నార్తుఁడై యున్న
వేళ గాధేయుండు విమలసత్క్రతువు
తాళిమితోఁ జేయఁదలఁచి వేడుకను
దా నయోధ్యకుఁ బోయి దశరథుచేత
నానందముగఁ బూజ లంది యామీఁద
గౌరవంబున మహీకాంతు నీక్షించి
ధీరత్వ మెసఁగఁ బ్రార్థించి యిట్లనియె
నరనాథ మత్సవనంబు రక్షింప
నరలేక శ్రీరాము నంపవే యనిన
విని పంక్తిరథుఁడు నిర్వ్యణుఁడై పలికె
మునినాథ! యిపుడు రాముని బంపలేను
నేక్రమంబుననైన నీక్షణమందె
నీక్రతురక్షకై నేనె వచ్చెదను
అని పెక్కువిధముల నమ్మహారాజు
వినుపింప నమ్మునివిభుఁడు కోపించి
బహునిష్ఠురోక్తుల భాషింపఁ జూచి
మహిమ నొప్పు వసిష్ఠమౌని యానృపుని
గని యిట్టు లనియె నిష్కర్షగా గాధి
తనయునివెంట నీతనయుని బంపు
మని యొప్పఁ జెప్పఁగా నాపంక్తిరథుఁడు
తనమది హర్షించి తదనంతరమునఁ

చారులఁ జూచి యచ్చటికి మీ రరిగి
శ్రీరాముఁ దోడ్తెండు శీఘ్రంబుగాను
అన విని చారు లిట్లనిరి శ్రీరాముఁ
డెనలేనిచింతతో నెనయుచున్నాఁడు
సకలసుఖంబులు చాలించినాఁడు
వికలుఁ డైనాఁడని విన్నవింపఁగను
విని నృపాలుఁడు చాల విన్ననై యతని
గనవలెఁ దోడ్తెండు గ్రక్కున ననఁగ
వేవేగ వారేఁగి విజయరాఘవున
కావార్త లెఱిఁగింప నందుండి లేచి
తా వచ్చి రాముఁ డాతండ్రికి మ్రొక్కి
దీవెన లంది గాధితనూభవునకు
మ్రొక్కి వసిష్ఠసన్మునికిని మ్రొక్కి
యక్కఱగాను విశ్వామిత్రుచెంతఁ
జేరి చేతులు మోడ్చి శిర మర వంచి
యారాముఁ డాత్మయం దార్తి వహించి
తనచింత రెట్టింపఁ దనువు గంపింపఁ
గనుల బాష్పము లొల్కఁగా దీనుపగిది
నున్నరామునిచంద మూహించి మౌని
యన్న రమ్మని పిల్చి యాదరింపుచును
దనువెల్ల నిమురుచుఁ దాప మొందుచును
ముని దయ మీఱ రామున కిట్లనియె

నాతండ్రి రఘువర నాటుగా నిపుడు
నీతండ్రి రాజ్యంబు నెమ్మదిగాను
పాలింప యువరాజ్యపట్టభద్రుండ
వై లలిసుఖములెల్లనుభవింపకయు
యేలుకలు ద్రవ్విన యిట్టిచందమునఁ
గలఁగుచు దిగులందఁ గారణం బేమి
పట్టి నీయౌవనప్రాయంబునందు
నెట్టన సుఖముల నేఁ బొందవలయు
నట్టిచందము మాని యార్తి నొందితివి
యిట్టిమనోవ్యథ యేల జన్మించె
నని పెక్కువిధముల నమ్మునీశ్వరుఁడు
నెనరుతో నడుగఁగా నృపనందనుండు
మరల నంజలిఁ జేసి మౌని నీక్షించి
కరఁగుచు గద్గదకంఠుఁడై పలికె
మునినాథ! యిాలోకమున మర్త్యవితతి
జనియించుటెల్లను జచ్చుటకొఱకె
చచ్చుటెల్లను మళ్లి జనియించుకొఱకె
హెచ్చుగా నిల్చుట స్థిర మెందు లేదు
అన్ని యస్థిరములై నట్టిచందంబు
మున్నుగాఁ దెలిసియు మూర్ఖత్వ మెసఁగ
మది రాజ్యసుఖమునం దల్లాడఁబోవు
నదిమి నిల్పిన నిలవ దాశతోఁ గూడి

యొక్కచోటున నిల్వ కురుకుచు నుండుఁ
జిక్కఁబట్టినగాని చెనఁటియై జరుగు
నిట్టిమదిని నిల్పు బెట్టని చింత
పుట్టిన దిదిగాక భూరిరాజ్యంబు
మొదలైనసంపదల్ ముందుగా సౌఖ్య
మిది యనిపించి దా హెచ్చి పిమ్మటను
మదమును బుట్టించి మాయాబ్ధి ముంచు
నదిగాక దేహేంద్రియాదిభోగములు
ఆదియందమృతమ ట్లానంద మిచ్చి
యాదట గరళమై యతిభేద మిచ్చు
ఘనవిరాగము తొల్తఁ గష్టమై తోఁచి
యనుపమానానంద మయ్యెందు తుదను
నిది సుఖమా లేక నింద్రియభోగ
మది సుఖమో తెల్పఁ దరమర మూని
నానావిధంబుల నాకుఁ జూచినను
జ్ఞానవైరాగ్యభాస్వరచింతనమున
నిఖిలభోగములను నిరసించు సరణి
సుఖమిచ్చునంచుఁ దోఁచుచు నున్న దివుడు
తక్కిన యాశాస్పదంబు లన్నియును
గ్రక్కున లేనిదుఃఖము నిచ్చు బెట్లు
నన్నను విత్తంబు నాశచేఁ గూర్చి
యున్నవాఁ డేవేళ నులుకు నే లనిన

ధరణి తాఁదాఁచిన ద్రవ్య మెందున్న

....

ముదమున పగతు లమ్మగఁ బొంచిపొంచి
పొదివి యెక్కడఁ గొనిపోదురో యనుచు
నూరకే ధనవంతుఁ డులుకుచు నుండు
నారయఁగా వాని కది సుఖం బగునె
కదిసి యౌవనము సుఖం బిచ్చు ననిన
అది రక్తమాంసమేదోయాస్థిచర్మములు
గూడి రూపములైన కొమ్మలముఖము
లాడాడఁ జూచి మోహభ్రాంతి నొంది
తగఁ బెండ్లియాడి విత్తము నపేక్షించి
మగఁటిమిఁ జూపుచు మదమత్తులైన
ధనికుల యాచించి ధనము లార్జించి
తనభార్య కొప్పించి తమకించి దాని
కలసి స్వతేజంబు కరఁగించి విడిచి
బలహీనుఁడై డస్సి పామరుం డగుచు
నందనులం గాంచి నాటుగాఁ బెంచి
యందున బహుసౌఖ్య మబ్బె నటంచు
మురిసి వారలమీఁద మోహంబు నుంచి
మఱిమఱి సంసారమాయలో మునిఁగి
పారార్థసరణి విచారింపఁ దనకుఁ
దీరక పగలు రాతిరి యదే జోలి

గా కాల మూరకే గడపుచునుండి
యాకాల మరుగఁగా నట జరాభార
కలితుఁడై రోగదుఃఖంబులచేతఁ
బలుమాఱు వగచుచుఁ బడి లేవలేక
దేహంబుపై నాశ దిగవిడలేక
మోహలోభములచే మూఢాత్ముఁ డగుచుఁ
దరలి తాఁ బోయినఁ దనయు లిల్లాలు
వెరవక యెట్లు జీవింతురో యనుచుఁ
జింతింపుచుండఁగాఁ జేరువ మొనసి
యంతకాలము రాఁగ నట మృత్యుదేవి
జనులకుఁ బొడగట్టఁగా భీతి నొంది
తను దాని మఱవఁగా దండకింకరులు
స్థూలమందుండిన సూక్ష్మదేహమును
గాలపాశంబుతోఁ గట్టి గొంపోయి
మొనసి యాకాలుని ముందఱ నిడఁగఁ
గని యముఁ డాపాపకర్ము నచ్చోట
నారసి నిజకింకరాళి కొప్పించి
గారించి తగు నరకంబులలోను
బడవైచి కొన్నాళ్లు బాధించి చాల
బడలించి యట పుణ్యఫల మొకకొంత
గలిగియుండినను సుఖంబు నొందించి
బలములై తగు పుణ్యపాపశేషముల

తోడ ధారుణిమీఁదఁ ద్రోయింప మగుడి
వాఁడు దిగంబడి వాయుమార్గమున
జలదంబులోఁ జేరి జలరూప మొంది
మొలుచు సస్యములందు ముందుగాఁ జెంది
పటిమతో బీజరూపముల ధరించి
యటమీఁదఁ దా నన్నమై పూర్వఋణము
గలిగినపురుషుని గర్భంబుఁ జొచ్చి
యలవీర్యరూపమై యతివగర్భమునఁ
జేరి పిండంబై విచిత్రావయవము
లారూఢిఁ బొడమి తనోన్నసరింపకయు
గర్భగతజ్ఞానకలితుఁడై యచట
నర్భకుఁడై యుండి యలమటల్ వడుచు
వెడలుదా రెఱుఁగక వివశుఁడై దుఃఖ
పడుచు నక్కడనుండి పదియవనెలను
ధరణిపైఁ బడి తనతల్లియుఁ దండ్రిఁ
బ్రియముతోఁ బోషింపఁ బెరుఁగుచునుండి (
యవల బాల్యావస్థ యౌవనావస్థ
లవని ననుభవించి యట వృద్ధుఁ డగుచు
భోగేచ్ఛఁ జేసిన పుణ్యపాపముల
తోఁ గూడి క్రమ్మఱఁ దొల్లిటివలెనె
పడిపోయి పుణ్యపాపఫలంబు లచటఁ
దడయక యంత మోదముల నియ్యఁగను

నాకనారకముల నవ్యభోగమును
శోకం బనుభవించు సొక్కి స్రుక్కినను
నెప్పటిరీతిగా నిలమీఁదఁ బుట్టు
నప్పుణ్యపాపంబులం దిందు వరుని
నెప్పుడు నెడఁబాయ కెల్లలోకముల
త్రిప్పుటెకాని ముక్తిని బొందనీవు
బావిలో నేతము బాన తా మునిఁగి
యావేళనే జలం బందుండి తాను
గొని తెచ్చి భూమిపైఁ గుమ్మరింపుచును
మొనసి క్రమ్మఱ నంద మునిఁగి లేచుచును
నుండుచందమున జీవుం డొకచోట
నుండక తిరుగుఁ గావున జన్మకర్మ
మరణదుఃఖముల వేమరుఁ బొందుచున్న
నరులను జూచితే నామది భీతి
పుట్టుచు నున్నది పుణ్యపాపములు
పుట్టువులకు హేతుభూతంబు లనుచుఁ
గడువడి నిటు కాలకర్మద్వయంబు
విడఁబడి పుట్టించు విధిరుద్రముఖుల
నడిపించుజగముల నానావిధములఁ
గడపట వరుసగాఁ గబళించు మరలఁ
బుట్టించుఁ ద్రుంచు నీభూరివిశ్వంబు
నెట్టనఁ గల్గి లేనిది యగుఁ దుదను

గావున నే రాజ్యకాంక్ష శీఘ్రముగఁ
బోవిడి ముక్తిని బొందెద నింక
నెక్కడిసంసార మెక్కడిఘోర
మెక్కడిజాడ యి దెక్కడిపీడ
కామాది రిపు లహంకారచిత్తములు
నామది మానసం బఖిలేంద్రియములు
విషయముల్ తమతమ వృత్తులతోడ
విషమగతుల మించి వేధింపసాగె
దానిచే హృదయంబు దందహ్యమాన
మైనది దాని చల్లార్చి మీ రెఱిఁగి
యున్న సుజ్ఞానంబు నుపదేశ మిచ్చి
నన్ను రక్షింపకున్నను భుక్తి విడిచి
పూని నే మీపదాంబుజములచెంత
మేను దొరఁగువాఁడ మీయాన యనుచు
ఫాల మామౌనీంద్రుపదములమీఁదఁ
జాల హత్తించి బాష్పంబులు కనుల
వెడలుచు నుండఁగా వేఁడి నిట్టూర్పు
విడువఁగా నమ్మౌని వేదనఁ బొంది
రాముని రెండుకరంబుల నెత్తి
ప్రేమతోఁ గూర్చుండఁబెట్టి లాలించి
శిరమును జుబుకంబుఁ జెక్కిళ్లు నిమిరి
పరమార్థహృదయుఁడై పలికె నిట్లనుచు

నాయన్న రఘురామ నను గన్నతండ్రి
నీయాత్మ కడతేరు నెళవు ముందుగను
నీయంతనే నీవు నిశ్చయించితివి
మాయాప్రపంచ యీామర్మంబు లన్ని
తెలిసితి వికఁ నుపదేశంబు చేయ
వలసినదేమి సర్వము నెఱుంగుదువు
కొదవ యేమన్నను గురుముఖంబుగను
విదితంబుగాఁ దత్త్వవిజ్ఞానసరణి
వినకయే తొలుతవివేకంబుచేత
ఘనవిరాగము నీకుఁ గలిగియుండియును
ననుమాన మొంది తీ వంతియే కాని
జనసుత నీకు మోక్షము గల్గు టరుదె
మహిని ముముక్షుధర్మము బాల్యమందె
సహజంబుగా నీకు సంభవించినది
యిపు డిందు కితిహాస మేను జెప్పెదను
నిపుణుండవై విను నీరీతి శుకుఁడు
మొనసి తనంతనే మోక్షధర్మముల
ననఘుఁడై తెలిసియు ననుమాన మొంది
తనతండ్రియైన వేదవ్యాసుఁ జేరి
వినయంబుతో విన్నవించె నిట్లనుచు
జనక యీామలినంపు సంసార మెచట
జనియించె నే మది సంసారవాంఛ

ముందటి గతియేమి మూఢసంసార
మెందు లయంబొందు నెఱిఁగింపుఁ డనుచుఁ
బాదపద్మములపైఁ బడి లేవకున్న
బాదరాయణుఁ డెత్తి పలికె నిట్లనుచు
వినుము పుత్రక సూక్ష్మజ్ఞానసరణి
గను మాత్మబుద్ధివికల్పనచేతఁ
గలుగు విశ్వం బావికల్పనం బణఁగి
పొలిసినప్పుడు జగంబులు గానరావు
అవి గానరాకుండినపుడు సంసార
మెవరిదిగాక తా నెవుడో నశించు
నది నశించిన దేహమం దహంభావ
ముదయింప కణఁగిపోవుట ముక్తి యనుచు
వినుపింప నంతయు విని శుకయోగి
యనుమానమును వీడ కందున్నఁ జూచి
విని సంశయం బిందు విడువలే దనుచుఁ
దా నిశ్చయించి వేదవ్యాసుఁ డనియె (?)
శుక యింతకన్న హెచ్చుగ నే మెఱుంగ
నిఁక నీవు చని మిథిలేశ్వరుం డైన
జనకుని నడుగు నీసంశయం బతఁడు
సునిశితార్థముగఁ దీర్చును నీ వచటికిఁ
దప్పక పొమ్మంచు దయ దళుకొత్త
జెప్పిన మిథిలేశుఁ జేరె నాశుకుఁడు

అప్పు డానందమగ్నాత్ముఁడై లేచి
తెప్పున జనకుఁ డాధీరు నీక్షించి
హెచ్చుగాఁ బూజించి యిచటికి మీరు
వచ్చిన పని యేమి వరయోగిచంద్ర!
చెప్పుఁ డాపని నేను జేసెద ననఁగ
నప్పుణ్యుఁ డావ్యాసు నడిగినరీతి
జనకుని నడుగఁగా సంతసమ్మంది
విని యానృపాలుండు విశ్వాస మొప్పఁ
బలికె నిట్లనుచు నోపరమయోగీంద్ర!
సులలితచిత్పురుషుం డొక్కరుండు
దక్క నన్యము లేదు తత్త్వార్థ మింత
నిక్కంబు నీవు దీనికి సంశయింప
వల దాత్మసంకల్పవాంఛబంధంబు
వెలయు సంకల్పంబు విడుచుటే ముక్తి
యిది యథార్థము సంశయింపకు మీవు
మది దృశ్య ముడిగి సమ్మతిఁ బొందినావు
పదిలంబుగా నిదే పట్టి భావింప
మదియందె లయమొందు మఱిసంశయములు
నుదయింప వదియె మనోన్మని యగును
సదమలచరిత మోక్షం బిదే సుమ్ము
వేఱె మార్గము నింక వెదుకఁబోవలదు
భూరి సంతోషసంపూర్ణానుభవము

నొందు మంచు వచింప నుప్పొంగి శుకుఁడు
మందస్మితాస్యుఁడై మనుజనాయకుని
యానందముగఁ జూచి యరమర విడిచి
నానిశ్చయం బదే నాతండ్రి మొదట
చెప్పినయర్థమే సిద్ధంబుగాను
చెప్పితి పరమేశ చిత్తసంశయము
తీరె నంచు వచించి దిగ్గున లేచి
యారాజు సెలవంది యరిగె నొక్కెడను
బరమైన నిర్వికల్పసమాధినుండి
పరిపూర్ణుఁడై మోక్షపద మందె శుకుఁడు
అని చెప్పి దయను విశ్వామిత్రమౌని
మనుకులోత్తముఁ జూచి మరల నిట్లనియె
సకలజ్ఞ! శ్రీరామచంద్ర! తనంత
శుకుఁడు దెలిసినట్లు సూక్ష్మవిజ్ఞాన
సరణిఁ దెలిసి తీవు సంశయార్థముల
మెరమెరఁ బొంద నేమిటి కింకమీఁద
నరలేక యుపశాంతి యనెడుతోయమున
మఱవక యిపు డాత్మ మలినంబు గడిగి
భూరివిశ్రాంతిని బొంది సుఖంపు
మూరకె పరితాప మొంద నేమిటికి
సమర జ్ఞాతృజ్ఞేయమైన చిత్తరతి
క్రమ మొప్పఁగా సమగ్రంబగు భోగ

సముదయానుభవంబు శాంతమై లేక
శమమొందు దానిలక్షణ మదే యగును
విశ్వంబు సద్వస్తువే యగుఁ గనుక
నీశ్వరరూపమై యింపొందుచుండు
వరుస బంధము భోగవాసనచేత
నరిమురి దృఢతరంబై వృద్ధిఁబొందు
జగతిఁ దద్భోగవాసన శాంతమైనఁ
దగిలియున్నట్టి బంధము విడిపోవు
నిన్ను నీ వెఱుఁగుచు నిఖలరాజ్యంబు
పన్నుగా జ్ఞానివై పాలింపుచుండు
వని దృఢంబుగఁ జెప్పి యపుడు వసిష్ఠ
మునిని వీక్షించి రామునకు సత్కృపను
సలలితబుద్ధి విశ్రాంతివాక్యములఁ
దెలివిగా మీ రుపదేశింపుఁ డిపుడు
అనిన విశ్వామిత్రు నావసిష్ఠుండు
కనుఁగొని పూర్వ మాగాధిపుత్రుండు
తనకుఁ జేసినకీడు దలఁపక మౌని
యనుమతి వే శాంతుఁడై పూర్వ మజుఁడు
తనకుఁ జెప్పిన గూఢతత్త్వ వాక్యముల
మొనసి తలంచి రామున కిట్టు లనియె
రామాభిరామ! యోరఘువంశసోమ!
ప్రేమఁ గౌశికుఁడు చెప్పినవాక్యములను

దగ వింటి వై నను దదనుసారముగ
విగతసంశయముగా వినుపింతు వినుము
సారవిహీనసంసారంబునందు
పౌరుషంబునఁ బొందఁబడును సర్వంబు
విరివి పౌరుషమే ద్వివిధముగా నుండు
సరవి నుచ్ఛాస్త్రంబు శాస్త్రితం బనఁగ
నందెన్న శాస్త్రిత మర్థసంప్రాప్తి
నొందఁ జేయుచునుండు నుచ్ఛాస్త్ర మనెడి
గురుపౌరుషంబు మిక్కుటము తా నగుచుఁ
బరమార్థసౌఖ్యసంప్రాప్తి నొందించు
వదలకుండెడి పూర్వవాసనచేతఁ
బదపడి శాస్త్రితపౌరుషం బొనర
జనియించినప్పు డీజగతి నుచ్ఛాస్త్ర
ఘనపౌరుషంబుచే గ్రక్కున దాని
నారూఢయుక్తిచే నడ్డపెట్టుచును
ధీరతఁ జిత్తశాంతిని బొందు మనఘ!
అనభిజ్ఞచిత్తుఁడై నటువంటివాఁడు
తనియక యజ్ఞానతప్తుఁడై యుండు
నెందాఁక నజ్ఞాన మిరవుగా నుండు
నందాఁక కర్మంబు లంటుచునుండు
నెందాఁకఁ గర్మంబు లెనయుచు నుండు
నందాఁకఁ బుట్టుచు నణఁగుచు నుండు

నెందాఁక జన్మంబు లెత్తుచు నుండు
నందాఁక దుఃఖమగ్నాత్ముఁడై యుండుఁ
గావునఁ దద్దుఃఖకంధి దాఁటుటకు
నావయై యుండు జ్ఞానస్వరూపంబు
నిటువంటి జ్ఞానంబు నెఱిఁగెడికొఱకుఁ
బటుభక్తి దీపింపఁ బరమదేశికుని
సేవించి గురుశాస్త్రసిద్ధాంత మెఱిఁగి
జీవుండు మోక్షంబుఁ జెంది సుఖించు
నారీతిఁ గర్మమం దంటక నీవు
సారవిజ్ఞానలక్ష్యము నొందు రామ
తుదలేని సంసారదుఃఖంబు నణఁచి
సదమలబుద్ధి విశ్రాంతి నొందించి
సంతోషకరమగు సంపూర్ణతత్త్వ
మంతఃకరుణచేత నబ్జసంభవుఁడు
నా కుపదేశించినాఁ డాక్రమంబు
నీకుఁ జెప్పెద నన్ను నెమ్మది నొంది
యావసిష్ఠుని జూచి యంజలిఁ జేసి
పావనాత్ముఁడు రామభద్రుఁ డిట్లనియె
నేకారణమునను నింద్ర పద్మజుఁడు
నీ కుపదేశించె నిశ్చితార్థములు
ఆనిశ్చితార్థ మె ట్లభ్యసించితిరి
దీనుఁడనగు నాకుఁ దెలుపవే యనిన

విని మునీంద్రుఁడు పల్కె విమలం బమృతము
ననఘం బనంతంబు నాదిమధ్యాంత
రహితంబు సర్వపూర్ణంబు నిత్యంబు
సహజంబు సత్యంబు సచ్చిద్ఘనము
శుద్ధచైతన్యంబు సుస్థిరతత్త్వ
సిద్ధాంతమై ప్రకాశింపుచు నుండి
యెక్కడఁ జూచిన నెడ యింత లేక
యొక్కవస్తువు నిల్చియుండు నెప్పటికి
నది చంచలించియు నచల మాచోట
నుదయించె విష్ణుదేవుండు మహాత్ము
నదమల నాభికంజమున విరించి
సదయుఁడై జనియించి సకలభూతములఁ
బుట్టించె నతని తపోమహత్త్వమునఁ
బట్టుగా సర్వప్రపంచమ్ముఁ దెలిసె
సరసభారతవర్ష సంభవులైన
నరులు పామరులు నానావిధన్యాయ
కలితులు లోభులు కాముకుల్ జడులు
బలహీనులును మోహపరవశుల్ శఠులు
గురువంచకులును మూర్ఖులు దాంభికులును
పరధనాసక్తులు పరసతీరతులు
కావున బహునారకములందు మునిఁగి
పోవుదు రని తనబుద్ధి నూహించి

శోకింపుచుండెడి సుతులకై తాను
శోకించు జనకుని చొప్పున నజుఁడు
చింతించి జపహోమశీలధర్మములు
వంతుకెక్కిన తపోవ్రతముల జనుల
శాంతిని బొందింపఁ జాల వందఱికి
సంతోష మిచ్చు సుజ్ఞానం బటంచు
మది నిశ్చయించి సమ్మతముగా నన్ను
ముదమొప్పఁ దనమనంబుననె సృజించె
నపుడు బ్రహ్మజ్ఞాని నైనను బుట్టి
కపటప్రపంచసంగతులలోఁ జొరక
తెలివియగా నను నేనె తెలియుదు నందు
వలన సద్గురుఁడు గావలె ననుచింత
నా కందు లేకయున్న విరించి చూచి
యీకుమారుఁడు తత్త్వ మిల తనంతటనె
తాను దెలిసి గురుత్వంబు నామీఁద
నూనికగా నిల్పుకున్నాఁడు గురుఁడు
చెప్పని సద్విద్య సిద్ధింప దనుచు
నప్పు డజ్ఞానివియై యిటుమీఁద
గురుభక్తి నెద నుంచికొని తత్కరుణను
మరల విజ్ఞానివై మహి నుండు మనుచు
శాప మియ్యఁగ బ్రహ్మసత్తను మఱచి
యాపట్ల నే నెవ్వ రైనది మదికిఁ

దోఁచక యుండఁగాఁ దోయజోద్భవుని
జూచి శుశ్రూష హెచ్చుగఁ జేసి మ్రొక్కి
నిలిచి నే నెవ్వరు నీ వెవ్వ రిపుడు
దెలుపవే సద్గురుదేవ! యటంచు
నేను బ్రార్థింప మన్నించి విరించి
తా నందు సద్గురుత్వమును వహించి
సరగున నాకు సంసారరోగంబు
హరియింప నౌషధంబైన జ్ఞానమును
దేటగాఁ దా నుపదేశంబుఁ జేసి
హాటకగర్భుఁ డిట్లనె నోకుమార!
యరుదుగా శ్రమకారి యగు క్రియాకాండ
కరుణతో బోధించు కర్మకారులకు
నది మాని వైరాగ్యమందుఁ జిత్తంబు
కుదిరించువారికిఁ గొంకక నీవు
నేను జెప్పిన జ్ఞాననిష్ఠ బోధించి
యానంద మొందించు మని చెప్పెఁ గనుక
రహి నొప్పు భూతపరంపరలందు
విహరించుచుండుదు విజ్ఞానపటిమ
వలనఁ గర్తృత్వాదివాంఛల విడిచి
యలుకక యూరకె యుండు నిద్రించు
వానికై వడి దేహవాసన మఱచి
మానసంబును గెల్చి మతి శాంతి నొంది

కర్మఠులకుఁ గ్రియాకాండ బోధింతు
నిర్మలవైరాగ్యనిష్ఠుల కెల్లఁ
దిరముగా జ్ఞానోపదేశంబుఁ జేతు
నరసి సంసారినై యుం దంటకుందుఁ
జేయఁగాఁ దగుపనుల్ చేసియు నొకటి
చేయనివాఁడనై జీవింపుచుందు
గురి గానలేని మూర్ఖుండైనఁగాని
గురుసేవఁ జేసి యీగురుతరజ్ఞాన
సరణిని వినుచున్న సకలపాపములు
పారిపారి నశియించిపోవు పిమ్మటను
నరయ మేధాశాలియై గురుమర్మ
మెఱిఁగి ముక్తిని బొందు నినకులోత్తంస
సరససద్గురువాక్యసరణి సచ్ఛాస్త్ర
మరసి మనోనిశ్చయంబు నాత్మైక్య
పరుఁడైన పురుషుండు పరమందుఁ జెందు
ధరణీశ! వినుము తీర్థస్నానములును
మొనయుఁ గాయక్లేశములు సతీసుతులు
ధనధాన్యములు దేవతాసేవనములు
పురుషుని ముక్తినిఁ బొందింపలేవు
తిరముగా మది నిరోధింపకుండినను
నది నిరోధంబగు నటువంటిరీతి
విదితంబుగా నీవు విను మదె ట్లనిన

నమలిన మోక్షగృహద్వారమందు
శమము విచారంబు సంతోష మలఘు
సాధుసాంగత్య మెంచంగ నీనాల్గు
బోధ శాకరములై పొసఁగుఁ బాలకులు
అందు శమం బెట్టి దన్నఁ జెప్పెదను
బొందుగా విను రామ! భూపాలవరులు
తను దిట్టునప్పుడు తా వారిమీఁద
నొనర నల్లక తిట్టకుండుటే శమము
అట్టినిర్మలశమం బతిశయంబుగను
బుట్టిసంతోషముల్ పొందించుఁ గనుక
సకలదుఃఖహరంబు శాంతగుణంబు
ప్రకటమోక్షద్వారపాలుండు గాన
నందరికన్న శాంతాత్ముఁడే ధన్యుఁ
డిందుకు సందేహ మించుక లేదు
అలవిచారం బెట్టిదన్నఁ జెప్పెదను
బొలుపొంద శాస్త్రంపుబోధచేఁ బ్రబలి
ఖ్యాతిగాఁ బూర్ణమై ఘనమైన బుద్ధి
చేతఁ గారణము సుస్థిరముగా నెఱిఁగి
ధర నటువలెఁ జేయఁదగుపను లెల్ల
పరుఁడు తానై సేయు బద్ధుండు గాఁడు
తిమిరమం దణఁగదు దీపప్రకాశ
మమరఁ గల్గిన పుట్ట దండంబులేక

యెంతటి మఱుగైన నెదురుగాఁ జూచి
సంతోష మిచ్చు విచారసందృష్టి
ధీర యీసువిచారదృష్టి సంధింప
నేరిచి యటమీఁద నే ననువాఁడు
ఎవ్వఁడు సంసార మెవరిది నేను
నెవ్వఁడనో యని యిచ్చఁ జింతించి
చిరమైన నిజయుక్తిచేతఁ దన్నెఱుఁగు
సరణి భావింప విచారమౌ దీని
భావింపఁ దద్వారపాలకుం డగును
గావున రామ! యీక్రమము భావించి
కాలగతులచేతఁ గదిసి కీడులును
మేలులు వచ్చిన మిడికి యుబ్బకయు
రెండును మది నొక్కరీతిగాఁ గనుచు
నుండుట సంతోష మోరామచంద్ర!
సంతోషమే సుఖసారమై యుండు
సంతోషమే మోక్షసౌఖ్యంబు దీనిఁ
బరికింపఁ దద్వారపాలకుం డగును
మఱియును విను రామ! మనుజుండు గర్వ
విరహితమతియై వివేకియై భోగ
నిరసనస్వాంతుఁడై నిస్పృహుం డగుచు
జృంభణ మొప్ప హెచ్చి యహంకరించు
డంబులఁ దర్కవాదములలోఁ జొరక

కోపతాపములను గుత్సితంబులను
చాపల్యగుణములఁ జాల వర్జించి
జయకాంక్ష జీవహింసల మాని భూత
దయగల పురుషుఁ డింపఱ శాంతమూర్తి
ఘనుఁ డట్టిసాధుసాంగత్యంబుఁ జేయు
మనుజుండు తరియించు మాయాంబునిధిని
గనుకను సాధుసాంగత్యంబు లోన
వనువడి తద్ద్వారపాలకుం డగును
చిరముగా నిది యభ్యసించిన వారు
వరుసగా మోహార్ణవంబు దాఁటుదురు
స్పష్టంబుగాఁ బరబ్రహ్మోపదేశ
దృష్టాంత మీరీతిఁ దెలియఁజెప్పితిని
ధీరాత్మ! యిది యొక దేశసామర్థ్య
మారసి చూడు నీయంతరంగమున
నచర నిరాకార మగు బ్రహ్మమందుఁ
గ్రమముగా సాకారకల్పన దీఁగె
తగ దన దృష్టాంతదార్ష్టాంతరంబు

లగుచు నెప్పుడు ప్రమాదాంతంబు లగుచు
ధర నొప్పు మూర్ఖకుతర్కవాదములఁ
బొరక సదా పరిశుద్ధమై వెలుఁగు
శుద్ధచైతన్య మచ్చ్యగ భావమందు
సిద్ధాంతముగ నెంచి చింతింపుచుండు

ధీర నీ వందుఁ బొందెద వని కరుణ
నారూఢుఁడైన సంయమి దృఢంబుగను
మొనసి రామునకు ముముక్షుప్రకరణ
మనువొంద బోధించె ననుచు వాల్మీకి
క్రమమొప్ప వినుపింపఁగా భరద్వాజుఁ
డమర శ్రీరామున కావసిష్ఠుండు
మఱియేమి చెప్పె సమ్మతముగా నాకుఁ
దిరమైన దయతోడఁ దెలుపవే యనుచు
నడుగ భరద్వాజు నాత్మలో మెచ్చి
యడర వాల్మీకి యిట్లని చెప్పఁదొణఁగె
వినుము భరద్వాజ విజయరాఘవుని
గని వసిష్ఠుండు సత్కరుణ నిట్లనియె
ధరణీశ యుక్తియుక్తములైన వాక్య
సరణి బాలుండైనఁ జక్కఁగాఁ జెప్పె
నే నని భావించు నిజముగా నెంచు
మానలినోద్భవుండైన నయుక్త
వచనముల్ చెప్పిన వాంఛతో వినకు
మచలుండవై సత్యమాత్మ నూహించు
మాకాశజాఖ్యాన మాదిచేసికొని
ప్రాకటంబుగ దశోపాఖ్యానములను
నీకుఁ జెప్పెద నది నెళవుగాఁ దెలియు
మాకాశము నిజసూక్ష్మంబైన చోట

మొదట దోఁచకయుండి మూలవస్తువును
దుద నాత్మదృష్టికిఁ దోఁపింపుచుండుఁ
బొలుపొంద ప్రతిపత్తిభూతి వేదనలు
నలయుపమోక్షంబు నని చెప్ప నొప్పు
నీనాల్గునామంబు లెనయ జీవుండు
పూని సంవిత్స్వరూపము మించి దనరు
ఘనపదార్థజ్ఞానకలితుఁడై యిహము
నెనసి పురుషుఁడన నిం పొందు నతఁడు
పరఁగ సంకల్పాదిభావంబునందు
విరివిగా నుదయించి విపరీతమైన
జ్ఞానంబుచే మహాజలధితరంగ
ఫేనబుద్బుదములై పెంపొందినటులఁ
దానె ప్రపంచమై తగ వెల్గు చుండుఁ
గాని తదన్య మెక్కడఁ బుట్ట లేదు
ఆప్రపంచము బంధ మై యుండుఁ గనుక
నాప్రపంచము తనయం దణంచుటయె
ముక్తి యనంబడు ముక్తికి వేఱె
యుక్తి లే దిది మహాయోగి నిశ్చయము
మనుజేంద్ర! తద్దృశ్యమార్గంబు నీకు
వినుపించెదను నేను విశదంబుగాను
గలరీతిఁ దోఁచు జగంబు లన్నియును
విలయకాలములందు విరిసి నశించు

కల లన్ని యణఁగి చొక్కముగా సుషుప్తి
యలవడినట్లుండు నంధకారమును
జలజాప్తచంద్రనక్షత్రపావకుల
వెలుఁగు లెక్కడ లేనివేళఁ దా నొకటె
అవ్యక్త మచల మనాఖ్యమై నిండి
దివ్యచిన్మాత్రమే దీపించుచుండు
నలచిత్తునకు ఋరుమాత్రసద్బ్రహ్మ
మలఘుసత్తను మాత్ర మని యార్యజనుల
చేతను వ్యవహారసిద్ధికై వివిధ
పూతనామములఁ జెప్పుట కొప్పు నతఁడు
చెలఁగి యన్యునిపోల్కి జీవాత్మఁ డగుచుఁ
కలనాకవితృసంకలితుఁడై చెలఁగి
మానసంబున మహామాయమై మించి
తానె సంకల్పబృందము లగుచుండు
మొనసి తత్సంకల్పమున నింద్రజాల
మనఁగ నొప్పుచు విశ్వమంతయుఁ బుట్టు
వనధివల్లఁ దరంగవారముల్ కనక
మున భూషణమ్ము లిమ్ముగఁ బుట్టుకరణి
సత్యమైనటువంటి సద్బ్రహ్మమందు
నత్యంత మీశ్వర మగునట్టి సృష్టి
మనమై ప్రకాశించి మాయాబలమున
మొనసి పృథగ్భావముగఁ గల్గుచుండు

సునిశితమైనట్టి సూర్యప్రకాశ
నము నెండమావులు మొనసి గన్పించు
కరణిఁ బరాత్మప్రకాశంబునందుఁ
బొడిపొరి విశ్వంబు పుట్టిన రీతి
ఘనతరోత్పత్తిప్రకరణంబు నీకు
వినిపించితిని మఱి విను మింక నొకటి
కర మర్థితోఁ బూర్వకాలమం దాత్మ
నరయ నాకాశమం దనఘవర్తనుఁడు
అలఘుఁ డాయుష్మంతుఁ డను విప్రుఁ డొకఁడు
గలఁడు మృత్యువు వానిఁ గదిసి గొంపోవ
వలె నంచు డగ్గఱ వచ్చి దా నతని
బలము తేజముఁ జూచి భయమొంది మదిని
దలఁచె నిట్లనుచు భూతంబుల నెల్ల
మెలవుగా నే దిగమ్రింగుచుండుదును
అటువంటినాకు నీయువనీసురుండు
ఘటికుఁడై చిక్కఁ డెక్కడివాఁ డితండు
అని వితర్కింపుచు నంతకు కడకుఁ
జని మ్రొక్కి నిలిచి యాచంద మంతయును
వినుపింపఁగాఁ బ్రేతవిభుఁ డిట్టు లనియె
విను మృత్యుదేవి యావిప్రపుంగవుఁడు
ఆకాశజుండు మహానుభావుండు
నీకుఁ జిక్కఁడు తపోనిష్ఠ పెంపునను

నాయు వుండినవారి నదిమి చంపుటకు
నీయత్న మున్నదే నెఱి వారివారి
కర్మానుసారంబుగా గతాయువుల
నర్మిలిఁ గొనిపోదు వంతియే కాని
యేకర్మములఁ జేయ కిరవొందినట్టి
యాకాశజుని ద్రుంప నలవియే నీకుఁ
గోపతాపములచేఁ గ్రూరాత్ములైన
పాపకర్ములను జంపం నగుఁ బొమ్ము
అనినఁ దండ్రికి మ్రొక్కి యామృత్యు నడిగె
నన వసిష్ఠుని జూచి యారాముఁ డనియె
మునినాథ! యాకాశమునఁ బుట్టె విప్రుఁ
డనఁగ నాతఁడు బ్రహ్మ మని తోఁచె దాని
విశదంబుగాఁ జెప్పవే యన్న మౌని
దశరథాత్మజుఁ జూచి తగ నిట్టు లనియె
వసుధేశ! మృత్యుదేవత కగపడని
యసమానుఁడే బ్రహ్మ యగుఁ బృథివ్యాది
భూతవిరహితుఁడై పొసఁగి యాకాశ
మీతీరుగా నుండు నెల్లదిక్కులను
నారీతిగాఁ దా నిరాకారుఁ డగుచు
భూరిసంకల్పసత్పురుషుండు నయ్యె
నరయఁగా నతఁ డజుఁ డాదిమధ్యాంత
విరహితుం డాద్యుండు విమలుండు నగుచుఁ

గలలోన నొకవంధ్య గన్నపుత్త్రకుని
వలెఁ గల్గి తా దేహివలెఁ దోఁచుచుండుఁ
దెలిసితే పరమార్థదేహి గాఁ డనఁగ
నలరామచంద్రుఁ డిట్లనె నో మునీంద్ర!
యరయ భూతంబుల కాదివాహికము
తెఱఁగొప్ప నాదిభౌతిక మన రెండు
తనువులు కల వావిధాతలు రెండు
నొనరంగ గలవా లెవో యన్న మౌని
పలికె నిట్లని భూతపటలి కారణము
వలనఁ బుట్టఁగఁ దగ ద్వయము ఘటించె
ఘనకారణాత్ముండు గాక విజ్ఞాన
మొనయఁగా నాదివాహినుఁ డయ్యె నజుఁడు
కనుక జీవుండు సంకల్పపురుషుఁడు
తనుతరచిత్తమాత్రస్వరూపుఁడును
వెలయు సృష్టిస్థితివిలయకారణుఁడు
మొలచు మనోరూపమును స్వయంభువును
తా నై సృష్టి విస్తారంబు సేయుఁ
గాన నీతోఁచు జగమ్ము లన్నియును
మొనసి మనోమయంబుగఁ జూడు రామ!
యనిన మనోరూపమును నొంది దాని
సరణిఁ జెప్పు మటంచు జలజాప్తకులుఁడు
మఱవక నడుగ నమ్మౌని యిట్లనియె

జననాథ! విను మాత్మసంకల్పసరణి
మన మనంబడుఁగాని మది వేరె కలదె
సంకల్పజాలముల్ సంకీర్ణ మగుచుఁ
బొంకంబులై మనంబుననె వసించుఁ
గావున మదికి సంకల్పంబులకును
దావల మగును భేదములే దవిద్య
యగు మనంబు మలంబు నంధకారంబు
నగుచు సంకల్పాఖ్య లగుచుండు వాని
వలన జగంబులు వర్ధిల్లుచుండుఁ
దెలువారి యవి నశించినవేళలందు
గగనాదిభూతసంఘములు లయంబు
లగు నందుఁ జిన్మాత్ర మంతట నిండి
యగణితముగ నేకమై వెల్గుచుండుఁ
దగ జగద్రిక్తయై దనరు నాత్మకును
నెనవుగా నీవును నేను జగంబు
లను దృశ్యసత్త యున్నట్టివేళలను
దలఁగాని కేవలత్వము లేకయుండు
నలదృశ్యసంభ్రమం బణఁగినతఱిని
బ్రతిబింబరహితదర్పణముచందమున
హితమొప్ప ద్రష్టృత్వహీనమై నిండి
ఘనకేవలాత్మ యొక్కటి వెల్గుచుండు
మొనయు చిదాకాశమున మానసంబు

అనిశంబు తాన సదాకృతి యగుచుఁ
గను మూసి నిద్రించుకాలంబులందుఁ
గనిన స్వప్నంబులకై వడిగాను
బెనుచు లోకములను భేదరూపముల
నటువంటిలోకంబు లడఁగెడి వేళ
స్ఫుటముగాఁ గ్రమ్మఱఁ బుట్టెడి వేళ
శాంతమై గ్రుంకని జలజాప్తుకరణి
నంతట నవశిష్టమై నిల్చియున్న
యజరుఁ డనామయుఁ డాదిదేవుండు
నజుఁ డనంతుఁడు పరమాత్మ యీశ్వరుఁడు
సర్వకాలంబును శాశ్వతుఁ డగుచు
సర్వవిశ్వమును ముచ్చటగఁ జేయుచును
నన్నియుఁ జేసి సేయనివాఁడు నగుచు
పన్నుగా నంతట బరిపూర్ణుఁ డగుచు
నరయఁగా వాఙ్మనసాతీతుఁ డగుచుఁ
బరమమోక్షస్వరూపకుఁ డగుచుండు
నతనికి నాత్మముఖ్యాభిధానములు
ప్రతిభతోఁ గల్పింపఁబడు న దెట్లనినఁ
దొలుత వేదాంతవాదులు బ్రహ్మ మనుచుఁ
బొలుపొంద సాంఖ్యులు పురుషుండ యనుచు
విజ్ఞానవిదులు భావించి నిక్కముగఁ
బ్రజ్ఞాన మే నని పల్కఁగా మఱియు

శూన్యమతస్థులు శూన్య మే ననుచు
ధన్యమౌ శుద్ధచైతన్యంబునకును
నెనలేని నామంబు లీప్రకారముల
మొనసి కల్పింతు రాయూలతత్త్వంబు
జలజాప్తచంద్రనక్షత్రపావకుల
కలఘుగ్రహంబుల కమితతేజములఁ
దా నిచ్చి వానిచేతను దాను వెలుఁగుఁ
గాన స్వయముగాఁ బ్రకాశత్వమునను
వెలిఁగి సూర్యాదుల వెలిఁగింపుచుండుఁ
బోలుపుగా స్రష్టయు భోక్తయు భర్త
ద్రష్టయు తంబునై తా నన్నియెడల
నిష్టంబుగా నుండి యెచట నంటకయు
ఆరయ దేహస్థుఁడై దాని కెపుడు
దూరమై తానె చిత్తును సత్తు నగుచుఁ
బోలువుగా స్త్రీపున్నపుంసకలింగ
ములుగాక యింతకు మూలమై యుండు
అతని దేహంబునం దమితాబ్జభాండ
వితతులు పుట్టుచు విరియుచు నుండు
నాయనంతుఁడు విశ్వమంతయుఁ జేసి
సేయక యే నిర్విశేషమై యుండు
నని తత్త్వనిశ్చయం బారాఘవునకు
మనమొప్పఁ జెప్పి యమ్మౌని యిట్లనియె

యరయఁగా నిది యితిహాససారంబు
పరమ మాకాశజోపాఖ్యాన మగును
ననుభవంబుగ దీని నాలించువార
లనఘ! జీవన్ముక్తులై సుఖింపుదురు
ఇలను జీవన్ముక్తు లెట్టివా రనిన
బలియు రాగద్వేషభయములు లేక
యాకాశమునుబోలె నత్యుచ్చ మగుచుఁ
బ్రాకటంబుగ నన్నిపనులు చేయుచును
నెల్లకార్యములందు నేవేళ నాత్మ
చల్లనై తగునట్టి శాంతి వహించి
పొరిఁ బదార్థములందుఁ బూర్ణుఁడై గర్వ
విరహితుఁ డగుచు వివేకి యైనట్టి
వాఁడు నిక్కముగ జీవన్ముక్తుఁ డగును
బోడిమిగా నట్టి పుణ్యాత్మకుండు
కాలవశంబునఁ గాయంబు విడిచి
వాలాయమైన జీవత్వంబు నణఁచి
పరమాత్మయందుఁ దప్పక పొందు నదియె
మురువుమీఱు విదేహముక్తి యటంచుఁ
బలుక నొప్పునటంచుఁ బట్టుగాఁ జెప్పి
పలికె నమ్ముని యీయుపాఖ్యానమందు
నలపరమాత్మమాయామనోరూప
కలితుఁడై జగములు గల్పించినట్టి

సరణి జెప్పంబడె సాత్వికమాయ
కిరవైన దుర్ఘటహేతుత్వమహిమ
మఱి జగత్తునకును మాయికత్వమును
దర మిడి యెఱుఁగంగఁ దగునట్టిలీల
చరితంబుఁ జెప్పెదఁ జక్కఁగాఁ దెలియు
మరు దది యెట్లన్న నాలించి వినుము

లీలోపాఖ్యానము.

కమనీయసామ్రాజ్యకలితుఁ డనంగ
నమరెడు పద్మకుఁడను మహీపతికి
నలర భార్యామణి యైనట్టి లీల
వలనొప్పఁగా సరస్వతిని బెక్కేండ్లు
కడఁక నుపాసింపఁగా వాణి వచ్చి
పొడసూప లీల తెప్పున లేచి మ్రొక్కి
వినుతులు పెక్కు గావింప నవ్వాణి
వనిత నీ కిపు డేమి వర మిత్తు ననఁగ
నాలీల పలికె నాకన్న ముందుగను
దాళిమి లేక నాధవుఁ డొకవేళఁ
గప్పి తెప్పునఁ గాలగతి నొందెనేని
యొప్పి నాయింట జీవుం డున్నయట్టి
వర మీయు మదిగాక వరుఁడు దేహంబు
దొరఁగినతఱి నాకుఁ దోడుగా నీవు

వచ్చి నాపతిఁ బ్రోవవలె నన్న వాణి
మెచ్చి యిట్లనియె నోమెలఁత! నీవిభుఁడు
తనువు వీడినవేళఁ దడయ కాక్షణమె
పనిఁబూని సుమమంటపంబు గల్పించి
యందు నీపతి నుంచి యపుడె పుష్పములఁ
బొందుగాఁ బైనఁ గప్పుము దానఁ దనువు
కందక కుందక కాంతితో నుండు
మందరఁ దత్ప్రాణములు వచ్చు మరల
బ్రదికి యీరాజు నీభర్తయై యుండు
నిది నమ్మియుండు మోయింతి యటంచు
నాలీల కెఱిఁగించి యరిగె నవ్వాణి
మేలు గోరుచు లీల మెలవుగాఁ బతిని
గలసియుండఁగ నంత కాలంబు రాఁగ
నలపద్మభూపాలుఁ డంగంబు విడిచి
చనఁగ నాలీల పుష్పములమంటపము
పనిఁబూని నిర్మించి పతిదేహ మచటఁ
బెట్టి పైఁ బూలు గప్పించి కన్నీరు
పెట్టి వాణిని దాను బేర్కొనఁగానె
వచ్చి సరస్వతి వరపీఠమందుఁ
జెచ్చెరఁ గూర్చున్నఁ జేదోయి మొగిచి
కనుల బాష్పము లొల్కఁగా లీల భార
తిని జూచి పలికె నోదేవి! మద్విభుఁడు

యెచ్చటి కరిగెనో యెఱుఁగఁ దద్దేహ
మిచ్చట నుంచి నీ వెఱిఁగించినటులఁ
జేసితి నిఁక నేమి సేతు మత్పతిని
బాసి ప్రాణము లెట్లు భరియింతు నేను
నని యేడ్చుచుండఁగా నాదరం బెసఁగ
నెనసిన నెనగుతో నిట్లనె వాణి
యోలీల! క్లేశంబు నుపసంహరింపు
కాల మెంతటివారు గడువఁగా లేరు
పుట్టినవా రెల్లఁ బోవుట నిజము
నెట్టనఁ దిరముగా నిల్వ రెవ్వరును
గలలవంటిది యీజగంబులరీతి
తెలిపెద నెల్లన్నఁ దేటగా వినుము
నానాశరీరముల్ నశియించి పోవు
నూని శాశ్వతముగా నుండు జీవుండు
ఆవిధ మెల్ల నీ వసుదుగాఁ జూడఁ
గావలసినఁ జూతు గాక నీ కిపుడు
తిరముగా జ్ఞానోపదేశంబు సేతు
నరసి భావించు చిత్తాకాశ మొకటి
యనుపమం బైన చిదాకాశ మొకటి
యొనరంగ నాకాశ మొకటి యిమ్మూఁడు.
గల వివెప్పుడు నిరాకారంబు లగుచు
నలరఁగా నొండొంటి నంటక యుండు

మానితసంసారమంటప ముందు
దానియం దొకశైలతటమున నొక్క
పట్టణంబున నిజభార్యతోఁ గూడి
పట్టుగా నొక్కవిప్రవరేణ్యుఁ డుండి
యలకొండక్రింద మహావినోదముల
బలముఁ జూపుచు నొక్కపార్థివేశ్వరుఁడు
అలరుచు సఖి! వేఁట లాడఁగాఁ జూచి
తలఁచె నిట్లనుచుఁ జిత్తమున నీరాజు
పగిది నెన్నఁడు భూమిఁ బాలింతు ననుచు
వగచి చింతను బొంది వాఁ డందుఁ దనువు
వడవైచి పద్మభూపాలుఁడై పుట్టె
నడలుచు నతనిభార్యామణి మేను
బాసి లీలాఖ్యతోఁ బ్రభవించి నీవు
భాసురాత్మకుఁడైన పద్మభూపతికి
నిల్లాల వైతివి యిష్టభోగముల
నెల్లవా రెఱుఁగ భూ మేలుచుండితిరి
మొనసి బ్రాహ్మణదేహములు మీరు విడిచి
యెనిమిదినాళ్ళయ్యె నిచ్చట మీరు
పొడమి డెబ్బదియేండ్లు భోగేచ్ఛ మీఱఁ
బుడమి నేలితిరి యిప్పుడు రాజు తనువు
వీడిన దినమందె విను పదాజేంద్ల
వాఁ డయ్యె నని మఱి వాణి యిట్లనియె

నావిప్రభార్య నీయటువలె నన్ను
వావిరి నర్చించి వరయుగళంబు
నడుగ నిచ్చితి విప్రుఁ డానాఁడు తనువు
విడిచియు నాయిల్లు వెడలిపోవుటను
గాన మీాయిరువురి కాఁపుర మెల్లఁ
బూని బ్రాహ్మణగృహంబున నున్న దిపుడు
అరయఁ బున్నగాతుఁడైన భూవిభుఁడు
గురుతరసంసారగోష్ఠి నీయింట
నిలిచియున్నది యని నిశ్చయంబుగను
బలుకఁగా విని లీల భారతి కనియె
నక్కడ జనని! బ్రాహ్మణవర్యజీవ
మెక్కడ వచ్చి మాయింటిలోఁ జొచ్చె
వాఁ డేడ మే మేడ వనగిరుల్ దిశలు
నేడ నవెల్ల మాయింట నెట్లుణఁగె,
నిమ్మాట వచియింప నేల యిచ్చోట
నమ్మ యీావాక్యంబు లన్ని దబ్బఱలు
కుదురైన సర్పకోటరమందుఁ బిపఁ (?)
బదపడి సురదంతి బంధింపఁబడియె
బలమొప్ప నణువులోపల నుండు సింహ
ములతోడ మశక మిమ్ముగఁ బోరి గెలిచెఁ
గమలబీజంబులోఁ గనకాద్రి యున్న
నమర భృంగము మ్రింగె ననినచందంబు

గా వచియింప కెక్కడిమాట లనఁగ
నావాణి లీల కిట్లనియె నెన్నఁడును
నే దబ్బఱాడను నీచేత నియతి
భేదనసేయ నభేద మాత్మీయ
మందిరమందు బ్రాహ్మణుని జీవాత్మ
పొందియున్నది యిది బొంకు కా దతివ!
యావిప్రుఁ డున్న మహారాష్ట్ర మాత్మ
భావింప గగనరూపం బగుఁ గనుక
గగనాత్మకుండై ప్రకాశించి యున్ని
యగణితుఁ డగుచుఁ దా నందుండి చూచు
నానాఁటి దేహంబు లందున్నతలఁపు
లీనాఁడు మఱచితి రిద్దఱియందు
మనముల వేఱె సంస్మరణముల్ పుట్టె
వనజాక్షి! జాగ్రదవస్థలు దలఁచు
తలఁపు లన్నియును జిత్తమున వసించి
కలలందు సుఖము దుఃఖమును జీవునకుఁ
బరిపరివిధములఁ బాపపుణ్యాను
సరణులఁ దోఁపించి జాగ్రదవస్థ
మరల వచ్చిన నందు మాయంబులైన
కరణిని మరణంబు గలిగినవేళ
బొందిలో మునుపుండి పుణ్యపాపముల
నిందుఁ జేసిన వెల్ల నెనసి వెన్నాడి

చనఁగ లింగశరీరసహితుఁడై స్వర్గ
మున మహాసుఖము నిమ్మగ నారకముల
యందు దుఃఖము పూర్వ మవనిపైఁ గలలఁ
జెంది తా ననుభవించినచందములను
ననుభవించినమీఁద నవనిపై మరల
జనియించి పరలోకసౌఖ్యదుఃఖముల
మఱచుచు సంసారమాయలోఁ దగిలి
పరువడి పుణ్యపాపంబులే చేసి
చని పుట్టు నిటువంటి చావుపుట్టువులు
కినిసి జీవునకుఁ గల్గినచందమునను
గనిపించు విజ్ఞానకలితుఁడై పుట్టి
మనుజుల కని చెప్పి మరల నిట్లనియె
ముదితరో! సంకల్పముకురంబుపోలెఁ
గుదురు చిదాకాశకోశకోటరము
నందొప్ప నంతస్థమై యుండు భూమి
యం దెన్నఁ బరమాణు వనఁ దోఁచు నాత్మ
యందుఁ దద్రూప మైనట్టిమనంబు
నందు సర్వజగంబు లద్భుతంబుగను
గనఁ బ్రతిభానాత్మకంబులై యుండు
నన విని లీల యిట్లనె సంశయమున
జనని! యావిప్రుండు చనిపోయె నేటి
కెనిమిదినా ళ్ళంటి విచ్చట నాకు

నెన్నఁగా డెబ్బదియేండ్లయ్యె నిట్టు
లున్న కలఁకఁ దీర్పు మోతల్లి! యనిన
విని వాణి పలికె నోవిరిఁబోణి! నిజము
పనుపడ నాలించు ప్రతిభాసకన్న
నల దేశకాలముల్ హ్రస్వము దీర్ఘ
ములు లేవు చిత్రాంశమునకన్న వేఱె
ప్రతిభాస లే దట్టి ప్రతిభాసవిధము
సతి విను మెట్లన్నఁ జంద్రచంద్రికల
కరణి భేదాభేదకలితంబు లగుచుఁ
బరమచిత్తును జిత్ప్రతిభాసలు వెల్గుఁ
జిత్తునఁ బ్రతిఫలించిన కారణమునఁ
జిత్తు జీవాత్ముఁడై సృష్టిలోఁ దగిలి
మరణమూర్ఛలఁ బొంది మదిఁ బూర్వసరణి
మఱచి క్రమ్మఱఁ బుట్టి మాయచేఁ జిక్కి
కలఁ గాంచి మేల్కొన్నకై వడిగాను
వలనుగా నన్యభావన నొంది తాను
నాధేయ మగుదు నా కాస్థూలదేహ
మాధార మనుచు దేహాభిమానమునఁ
దనకు వీరలు తల్లిదండ్రు లటంచు
గునిసి భార్యాపుత్రకులు వా రటంచు
మించి కొందఱు శత్రుమిత్రు లటంచు
నెంచి వివేకహీనుండైన నందు (?)

చేఁ బ్రపంచము దోఁచు సిద్ధమైనట్లు
నీప్రపంచము కల్ల యీభ్రాంతు లెల్ల
విడువుము జీవుండు వివిధదేహములఁ
బడవైచుచును బ్రాఁతబట్టల విడిచి
క్రొత్తబట్టలఁ గట్టుకొనినచందమునఁ
జిత్తవిభ్రాంతిచే జీర్ణంబులైన
తనువులు విడిచి నూతనశరీరముల
నొనరంగ ధరియించుచుండు వానికిని
నెందఱు తలిదండ్రు లెందఱు భార్య
లెందఱు నందను లెందఱు హితులు
శాత్రవు లెందఱు చర్చింప నీకు
మాత్ర మీపురుషుండు మగఁడయ్యె ననుచు
భ్రాంతినొందుచు దుఃఖపడక నీయాత్మ
నంతరంగంబునం దరసితి వేని
పొలుపార స్త్రీపున్నపుంసకలింగ
ములు గల్ల వాత్మ కిమ్ముగ నెన్నఁటికిని
గావున నీవు నిక్కము నెఱింగినను
నీవు స్త్రీయును గావు నెఱి పురుషుఁడవు
గావు నపుంసకాకారంబు గావు
భావింప నీకొక్కపతి లేఁడు నీవు
పద్మభూపాలునిభార్యవు గావు
పద్మాక్షి! నీ వట్టిభ్రాంతి వర్జించి

పరమాత్మ నే నని భావింపు మనుచుఁ
బరిపరివిధముల భారతీదేవి
చెప్పినఁ దనుఁ దా నె చింతించి లీల
యప్పు డిట్లనియె నోయమ్మ! గీర్వాణి!
నీవు చెప్పినరీతి నిశ్చయం బయ్యె
నావిప్రమిథున మున్నట్టి పజ్జకును
నను గొనిపొ మ్మన్న నగుచు న ద్దేవి
మనమున భావించి మరల నిట్లనియెఁ
దరుణి యప్పరమచైతన్యచిద్రూప
సరణిని నీవు నిశ్చయముగా నాత్మ
భావించి తత్స్వరూపంబున నైనఁ
బోవచ్చు నావిప్రపుంగవుఁ జూడఁ
గావచ్చు నీస్థూలకాయంబుతోడఁ
బోవుట దుర్లభంబుగ నుండుఁ గానఁ
బరఁగఁ జిత్తస్వరూపమును ధరించి
తెలఁగొప్ప నాదిభౌతికశరీరంబు
నారసి ధ్యానింప నపుడు మావంటి
వారి కెల్లను జిరవాసనచేత
బలవంతముగఁ గనంబడునట్టివాస
నలు తనుత్వము నొందినను శరీరమున
వనరఁగఁ దగ నాతివాహికం బగును
నన విని లీల యిట్లనియె నీజ్ఞాన

మొనసి నే సాధించు టెట్లొకో యనుచు
ననుమాన మొందఁగా నావాణి పలికెఁ
దనుమధ్య విను పరతత్త్వచింతనము

....

ధన్యతాప్రదమగు తత్కథాశ్రవణ
మన్యోన్యబోధనం బతిశయశాంతి
పనుపడిన తదేకపరత యభ్యాస
మనఁబడు దృశ్యంబు లన్ని నశ్యములు
గా మదిఁ గని కర్మకారులందఱును
బామరు లని వారిపథములఁ బోక
యూరికె యుపశాంతి నొందినరీతి
నారూఢమైన బ్రహ్మానుసంధాన
సరణి యటంచు నిశ్చయముగాఁ జెప్పి
సరిప్రొద్దు వెళ్ల నిశ్చలతరజ్ఞాన
దేహంబులో భారతీదేవి దివ్య
దేహంబులో లీల దిగ్గున లేచి
గ్రక్కున గగనమార్గంబున కెగసి
యక్కఱగాఁ బద్మజాండమండలము
పటుతీవ్రముగ నెడఁబాసి యాయిరువు
రటపోవఁగా నొక్కయద్రిపైఁ బురము
వేవేగ గని యందు విప్రమంటపము
భావించి యిరువు రాపంథను బోయి

అచట రెండవస్వర్గమందు బొంది కొని
ప్రచురమై తగుపూలపానుపుమీఁదఁ
బవళించియుండిన పద్మభూపాలు
శవముతో నొప్పిన సదనంబుఁ జేర
గాను దత్పతి వారిఁ గని మ్రొక్కి వాణి
నానందముగఁ జూచి యంఘ్రు లర్చించి
యందున్నఁ జూచి యిట్లనె వాణి నృపతి
పొందుగా నివుడు నీపూర్వజన్మములఁ
దలఁపు మటంచు మస్తకముపై హస్త
జలజంబు నిడఁగ నాజననాయకునకు
మనమునం దంటిన మాయ దొలంగె
ననఘుఁడై విజ్ఞానియై పూర్వజన్మ
సరణిఁ దాఁ దెలిసి యాశ్చర్యంబు నొంది
సరవి నహో మహాసంసారమాయ
గెంట నీదివ్యయోగినుల సత్కృపను
గంటి నంచు దలంచెఁ గరములు మొగిచి
పలికె నిట్లనుచు నోభామినులార!
వెలయుచుండిన మేను విడిచినదినమె
నాకు షోడశవాయనములయ్యె మఱియుఁ
బ్రాకటకార్యముల్ బంధుమిత్రాది
జనులును దోఁచిరి స్వాంతమం దనిన
విని వాణి యాభూమివిభున కిట్లనియె

అలవడు మోహముార్ఛానంతరమునఁ
గలిగెఁ దత్స్మృతి నీకుఁ గలగన్నకరణి
నాలోకమును బాసి యరుగ ముహూర్త
కాల మాయింటిలోగా విచిత్రముగ
మఱియు వేఱే విభ్రమం బుదయించె
నరయఁగఁ గననిభయం బగు మనము
విను తగఁ వ్యవహారవిశ్రమ శ్రుతము
ననఁగ నొప్పఁగ నందు నల్పప్రతిభాస
వుట్టె షోడశవర్షములవాఁడ వైతి
విట్టిరీతిఁ దలంప నిలఁ గలయందుఁ
దగు ముహూర్తమున నబ్దశతంబు నైన
పగిదిఁ దోఁచుచునుండుఁ బటుమాయవలన
దానికై వడి జాగ్రత్భ్రాంత మిదియుఁ
గాని నిశ్చయమనఁ గారాదు నృపతి
యలపరమార్థంబునందుఁ బుట్టుటలు
పొలియుటల్ నీటిబుద్బుదవికారములు
నిరుపాధికుఁడ వీవు నిర్లేపనుఁడవు
పరమభోగస్వరూపకుఁడవు నీవు
అన్నియుఁ గనుచుండు వన్నియుఁ గనవు
నిన్ను నీ వెఱిఁగిన నీ కన్య మగును
గనిపించువస్తు వెక్కడనైన లేదు
దనర బాలకుఁడు భేతాళభూతమును

గని మరణాంతదుఃఖము నొందుకరణి
మనుజేంద్ర! యదిగాక మఱి మరీచికలఁ
గాంచి మృగములు తత్కాంతి తోయముగ
నెంచి ద్రావను బరుగెత్తుచందమున
ననవరతం బసత్తైన ప్రపంచ
మును సత్తుగా నెంచి మూఢు లయ్యెదరు
సత్తుగా దీప్రపంచం బసత్తనుచు
నత్తఱి సకలవేదాంతమర్మములు
చెప్పి వీడ్కొని దివిఁ జేరి యాయిరువు
రొప్పగాఁ జూచుచు నుండి రంతటను
ఆవిదూరదుఁడు నం దాత్మతత్త్వమును
భావింప నంతలోఁ బరరాజొకండు
బలముతోఁ బద్మభూపాలునిమీఁద
నలిగి కయ్యముఁ జేసి యాతని వధించె
నప్పుడు వాని దేహంబులో నుండి
తెప్పున నొకసూక్ష్మ తేజంబు వెడలి
గ్రక్కున గగనమార్గంబున కెగరె
నక్కడఁ జూచుచున్నటువంటివాణి
పదపడి లీలతోఁ బలికె నిట్లనుచు
నిదె చూడవే లీల! యింతకు మున్ను
మనలతో భాషించు మనుజనాయకుని
బనిఁబూని యన్యనృపాలుండు ద్రుంచె

వాని తేజం బిదే వచ్చి యాకసము
నూని పై కెగరిపోవుచు నున్న దివుడు
చూడు మనుచుఁ జూపుచును వాణి లీల
తోడఁ బోవ విదూరదుని జీవరేఖ
రహిమీఱ సర్గపరంపరలందు
సహజంబుగాఁ బొంది చనిచని మఱియు
గురుతర బ్రహ్మాండకోటులయందు
మెఱయుచును బరిభ్రమించి యామీఁద
మరల దిగంబడి మహిమీఁద వ్రాలి
యిరవుగా మును పద్మఁ జేలినపురముఁ
జేరి యిల్లిల్లుఁ జొచ్చియును వెళ్ళియును
వారక పద్మభూవరునిమందిరము
గనుఁగొని యట కేఁగి క్రమ్మఱఁ బద్మ
మను జేంద్రతనువులో మాయగాఁ జొచ్చి
వెలుఁగ నప్పద్మభూవిభుఁడు నిద్రించి
కల గాంచి లేచినకై వడిగాను
ఆవులింపుచుఁ గన్ను లప్పుడు దెఱచి
లేవగాఁ జూచి యాలీల సంతోష
కలితయై భారతి ఘనమహామహిమ
తలఁచి నుతింపుచుఁ దత్పతికడకుఁ
బోలఁగ కాశారదతోడఁ దా వచ్చి
నిలువ లీలను జూచి నృపుఁ డిట్టు లనియె

మానిని! యీపుష్పమంటపస్థళము
నే నెన్నఁడైనను నిర్మించలేదు
ఈలక్షణం బేమి యెఱిఁగింపు మనఁగ
నాలీల నడుచువృత్తాంతంబు లెల్ల
వినిపింప విని రాజు విస్మయ మ్మొందె
ననుపమకరుణతో నానృపాలునకు
జ్ఞానోపదేశ మచ్చుటఁ జేసి వాణి
పూని లీలను జూచి పొసఁగ దీవించి
గ్రక్కున సత్యలోకంబున కరిగె
నిక్కడ లీల నిజేశ్వరుఁ గూడి
యెనుబదివేలయేం డ్లిష్టభోగముల
ననుభవించుచు నుండి యట ముక్తులైరి
మానవేశ్వర! మనోమాయావశమున
నూని గనంబడుచున్న విశ్వంబు
పొలుపార లీనమై పోవుట జనులు
తెలిసికొందురటంచుఁ దేటగా లీల
కథఁ జెప్పి వీనినిక్కములన కవలి
కథ విను బ్రహ్మాదుఃఖాండచిన్మయము
పరిపూర్ణ మమలంబు భావనాతీత
పరమాత్మతత్త్వంబు భావింప నదియె
యచలమై సర్వదేహములందుఁ బొంది
ప్రచురనిర్వాతదీపముభంగి నుండు

నదె జీవకళయని యాత్మ భావించు
వదలక సంసారవాసన నదియె
గణుతికెక్కుచు నహంకారమై నిలిచి
యణు వల్ల సూక్ష్మమై యగ్నికణంబు
బహుకాష్ఠములఁగూడి ప్రభవింప నందు
బహువిస్ఫులింగముల్ ప్రభవించుకరణి
నాయహంకారాణువం దనేకములు
గా యహంకారాణుగణములు గలిగె
ఘనమైన యాద్యహంకారమే ప్రకృతి
యన మాయ యన మనం బనఁగా ననేక
నామరూపముల నానా ప్రపంచముగఁ
దా మించి వికసించి తన కాదియైన
పరమాత్మతత్త్వంబు భావింప నీక
మఱుఁగు తా నైనట్టి మానసమందుఁ
బొలుపుగా నీజగంబులు విస్తరించుఁ
గలలచందంబునఁ గనిపించు నణఁగు
నలజీవునకుఁ బరమాత్మ కైక్యంబు
గలిగినచందంబుగాను జీవాత్మ
చిత్తరూపము దాల్చి చేష్టింప నవలఁ
జిత్తంబు ప్రభవించి సృష్టి గల్పించె
సదమలచైతన్యసాన్నిధ్యపటిమ
నొదవి విశ్వముపుట్టు నుండు నటించు

నాపరమాత్మచే నణఁగ దెన్నఁటికిఁ
గాపట్యజగములే కలుగు లయించుఁ
గాన నంతటి కాదికారణ మాత్మ
దానిని నీవుగాఁ దలఁపు శ్రీరామా!

కర్కటి కథ.

ఇపు డొకయితిహాస మేను జెప్పెదను
జపలత నొందక చక్కఁగా వినుము
అర్కకులేశ! యీయవనీతలమున
గర్కటి యనెడి రక్కసి గల దొకటి
యది మహీశైలోత్తరారణ్యములను
గదిసి చరింపుచుఁ గనఁబడినట్టి
జనుల ననేకులఁ జంపి భక్షింపు
చును దిరుగుచు మహాక్షుద్రాత్మయైన
పాపరాక్షసి పుణ్యపరిపాకకాల
మాపట్టణము రాఁగ నాహార ముడిగి
శాంతిచేఁ జీవహింసలు జేయ రోసి
యాంతరంగికదృష్టి నాత్మ భావించి
గనుచు వెయ్యేండ్లు నిష్కర్షగాఁ దపము
నొనరింప నటుమీఁద నొక్కనాఁ డజుఁడు
దానిచెంతకు వచ్చి తరుణి నీతపము
నేను మెచ్చితి శాంతి నిలిచె నీమదిని

కూడు విడిచిపెట్టి ఘోరతపంబు
నీడ చేయక లేచి యేఁగి యెందైనఁ
బాపకర్ములఁ జంపి భక్షింపు మనుచు
నాపద్మజుఁడు దాని కప్పుడు చెప్పి
చనియె నంత సమాధి చలియింప కతివ
పనిఁబూని నిర్వికల్పసమాధియందుఁ
దెగువ మీఱ ననేకదివ్యవత్సరము
లగణితమతి నుండి యట లేచిపోయి
యాఁకలి మునుపటియట్ల పుట్టఁగను
వీఁకతో మనుజుల వెదకుచు నొక్క
యడవిలో నడిరేయి నరుగుచు నుండి
విడిఁబడి మెకముల వేఁటాడి యందు
వచ్చుచున్న కిరాతవరుని దన్మంత్రి
నచ్చుగా నీక్షించి యార్భటింపుచును
బదరి పల్కెఁ గిరాతపతి! నిన్ను మైత్రి
నదిమి చంపి భుజింతు నాఁకలిదీఱ
అటుచావరేని నే నడిగినప్రశ్న
లిటమీఁదఁ జెప్పుఁడ వెట్లన్న వినుఁడి
పాయక మితిలేని పద్మజాండంబు
లేయణువందుండు నింపుసొం పెసఁగఁ
గదిసి యనేకసంఖ్యలు బుద్బుదములు
వదలక యే మహావారిలో నుండు

నాది నవకాశ మైన యాకాశ
మేది తా నరయఁగా నేమియు లేక
యుంచుక గలవస్తు వెయ్యది గలదు
చంచలసంసారసౌఖ్యంబు లనెడి
జాడల భరియించి చరియింపకున్న
వాఁడు నెవ్వాఁడు సర్వంబునం దెపుడు
ఘనముగా నుండియుఁ గడముట్టిచూడ
నొనర నుండక వెల్గుచుండు నెవ్వండు
ధరను జేతన నొంది తా నెవ్వఁ డయ్యె
నరయ నెవ్వఁడు మింట నద్భుతంబుగను
చిత్తరువును వ్రాసి చిత్రవర్ణముల
సత్తైన సూక్ష్మబీజంబులో స్థూల
వృక్షం బణఁగినట్లు వివిధప్రపంచ
మక్షయ మగుచు నేయణువులో నుండుఁ
బ్రాకటంబుగఁ బృథగ్భావమై యెపుడు
నేకమై తగువస్తు వెయ్యది ద్రవము
నుదకంబు నొకటిగా నుండుచందమున
వదలక యే రెండువలెఁ దోఁచి యొకటి
యగుచు నుండెడి దెద్ది యని వితర్కించి
పగటుతో నడుగ నప్పుశ్రుతివాక్యములు
విని భీతిలక జనవిభుఁ డాత్మమంత్రిఁ
గనుఁగొని దీనివాక్యముల కర్థములఁ

దెలుపు మటన్న సుంత్రి వివేకయుక్తి
కలితుఁడుగానఁ గర్కటి కిట్టులనియె
నతివ రాక్షసి! మమ్ము నడిగిన ప్రశ్న
లతిరహస్యములు వేదాంతగూఢములు
కావునఁ జెప్ప శక్యంబు గాదైన
భావించి చెప్పెదఁ బట్టుగా వినుము
సదమలబ్రహ్మంబు సత్య మనంత
మది వాఙ్మనోతీత మాకాశనిభము
నగుచుండు నటువంటి యాత్మానువందు
తగ నజాండములు విస్తారంబు లగుచుఁ
బొడముచు బుద్బుదంబులమాడ్కి నణఁగు
నడరార మఱియు నత్యద్భుతం బగుచుఁ
బ్రవిమలాకాశమై బాహ్యంబులేని
యవకాశమే చిన్మయంబు లొచుండి
యద్వయంబై యిది యది యనరాదు
తద్వస్తుసంతతి దాననే గలిగెఁ
గ్రమ మొప్పఁగాఁ దత్ప్రికాశతవలన
నమరి చేతనుఁడైన యతఁడు భేద్యుండు
గనుక స్వశీలసంకలితుఁడై యుండె
ననుపమాత్మాకాశ మంది జగములఁ
దనతలంపుననె చిత్తరువుగా వ్రాయు
ననఘాత్ముఁడై నట్టి యతనితలంపు

వలననే సర్వవిశ్వము దోఁచెఁ గనుక
వెలయు నీవిశ్వంబు వేఱుగా దన్ని
తానె యగుటఁ జేసి తన కన్యవస్తు
వేనాఁటికిని గల్గ దింత కాశ్రయుఁడు
నగువాఁ డొకఁడు నిశ్చయంబుగా నుండు
నగణితసద్రూప మగుచుండుఁ గనుకఁ
బరమాత్మ గలఁడని పండితోత్తముల
చిరతర ప్రజ్ఞతోఁ జెప్పఁగా నొప్పు
నని మంత్రి కర్కటి కాత్మనిశ్చయము
వినిపింప నది వాని వినుతించి యతని
దొరను సంతోషంబుతోఁ జూచి నీవు
నెఱిఁగినరీతి నా కెఱిఁగింపు మనఁగ
విని యమ్మహీపతి వేడ్కగా దానిఁ
గని యిట్టు లనియె నఖండయుక్తులను
వినవె కర్కటి! సర్వవిశ్వంబు మిథ్య
యని యెఱింగిన నె మహాత్మునిఁ దెలియ
వచ్చు సంకల్పవివర్జితుఁడైన
హెచ్చుగానే స్వామి నెద నుంచవచ్చు
మెఱయ నేస్వామి యున్నేమనిమేష
సరణి నంతయుఁ బుట్టి సమయుచు నుండు
ఘననిగమాంతవాక్యంబు లేదైవ
మును గొప్పగా నెంచి మొనసి నుతించు

గురుతర బ్రహ్మాండకోటుల నిండి
తిరముగా నుండి యే దేవుండు దృష్టి
విషయంబు గాక యే వెలుఁగుచు నుండు
ఝషఫషలేక చరాచరమ్ములును (?)
లలిని నే దేవులీలను బ్రభవించి
బలిసి వర్తిలు నదే బ్రహ్మమా నింతి!
విశ్వాత్ముఁడై సర్వవిశ్వంబుఁ జేసి
విశ్వంబు తానయై విశ్వంబుఁ గనుచు
విశ్వేశ్వరుండన వెలుఁగుచున్నట్టి
శాశ్వతాత్మబ్రహ్మ సన్మాత్ర సత్య
వాక్యార్థమును నీవు వరుసగా నడుగ
నైక్యానుసంధాన మబ్బె మా కనుచుఁ
బలికిన సంతోషభరితాత్మ యగుచు
నలరి కర్కటి యిట్టు లనియె నో నృపతి!
యహాహా మీ వాక్యంబు లమృతతుల్యములు
సహజసుజ్ఞానభాస్వరములు గాన
మీరు పుణ్యాత్ములు మీదయఁ జ్ఞాన
మారూఢమై సంశయములఁ దీర్చినది
యానంద మొదవె నది విని యనుడు (?)
దాని కిట్లనియె నో దానవి! నీవు
పనిఁబూని వికృతరూపము మాని సౌమ్య
తనువుతో వచ్చి మాస్థలమున నుండు

సతి నీకు వస్త్రభూషణముఖ్యవస్తు
వితతులు నిత్య మాపీడులయందుఁ
జరియించుచున్న రాజద్రోహమతులఁ
బరఁగుచోరుల మహాపాపకర్ములను
జెనఁటులఁ జంపి భక్షించుచు నుండు
మని చెప్పి మంత్రితో నానృపాలుండు
తనగృహంబున కేఁగెఁ దదనంతరమున
జనపతి చెప్పినసరణి దప్పకయె
తనపూర్వదారుణతను వందు పీడి
ఘనసుందరాంగియై గంధమాల్యములు
చేలభూషణము లిచ్చిన ధరించుచును
మేలిమి నానృపు మేడలం దుండు
పాపకర్ములఁ జంపి భక్షించికొనుచు
నాపట్ల నుండక యరిగి హిమాద్రిఁ
జేరి యందు సమాధిఁ జేసె నటంచు
నారామచంద్రున కావసిష్ఠుండు
పనుపడ కర్కటి ప్రశ్నోత్తరముల
మన మొప్పఁగాఁ జెప్పి మరల నిట్లనియె
జనవర! నీకును సంసారసుఖము
తనియ కున్నట్టి చిత్తవిలాసమునను
గలుగు రాగాదివికారదోషములఁ
జెలువార్చి రోసినచిత్తమే మరల

విమలమై సంసారవిభ్రమ మొక్క
సమయ మందణఁగక చపలించెనేని
తెప్పున సుజ్ఞానదృష్టి సంధించి
యప్పు డాచాపల్య మణఁచుచు నుండు
నినతేజ! యిఁకనొక్క యితిహాస మేను
వినుపింతు నెట్లన్న విమలచిచ్ఛక్తి
సువిలాసమున మనుజులనిశ్చయంబు
ప్రవిమలంబై జగద్భ్రాంతి నణంచు
అది యెట్లనినఁ జిత్త మనఁ బాయకుండుఁ
బోదు ప్రపంచమున్ భూతమున్ గాంచి (?)
వెఱచుచున్నటువంటి వేళ గురుండు
సరసాత్మ యిది ప్రపంచవినాశ మనుచు
భయము నొందకు మీప్రపంచంబు బ్రహ్మ
మయమని చెప్పఁగా మది భీతి విడిచి
యరసి చిత్తార్భకుఁ డానంద మొందు
కరణి నీ కిఁక నొక్కకథ వినిపింతు

ఇందుపుత్రోపాఖ్యానము.

నది యెట్లనిన నిందుఁ డను భూసురుండు
కదలక సతితోడఁ గైలాసమందుఁ
బరమేశుఁ గూర్చి తపముఁ జేసి శివుని
వరమునఁ బదిమంది వరపుత్త్రకులను

గాంచి కొన్నాళ్లుండి కాలవేగమునఁ
బంచత్వమును బొంది పడిపోవ నతని
సతి యగ్నిలోఁ జొచ్చి సమయఁగా వారి
సుతు లందఱును జూచి శోకించి తాము
నేయఁగాఁ దగుక్రియల్ చేసి యామీఁద
నాయగ్రజునిఁ దమ్ము లందఱుఁ జూచి
తల్లిని దండ్రిని దలఁచి బేర్కొనుచుఁ
దల్లడింపుచు నేడ్చుతమ్ములం బిలిచి
యేల యేడ్చెదరు మీ రెంత యేడ్చినను
జాలిచే జనకుండు జనని క్రమ్మఱను
వచ్చి మీశోకంబు వారింపఁగలరె
యిచ్చట వగవక యేమైన వరము
లరలేక మీరు న న్నడుగుఁ డటంచుఁ
గరుణ మీఱఁగఁ బల్కఁగాఁ దమ్ము లనిరి
యన్న గోపుగనూరి యధికారికొలఁది (?)
యున్నంతపదవి మా కొసఁగు మటంచు
నడుగఁగా నది స్వల్ప మది మీకు వలవ
దడర నింకేమైన నడుగుఁ డటంచుఁ
బలుకఁగా సామంతపదవి మా కొసఁగు
మలయ కిప్పు డటన్న నది యేటి పదవి
యిఁక మఱేమైన నే నిచ్చెద ననినఁ
బ్రకటమై తగు రాజపదవి నిమ్మనిన

విని యది మీ కేల వేఱె వరంబు
మొనసి న న్నడుగుఁ డిమ్ముగ నన్న వారు
సకలరాజన్యశాసనుఁడైన నృపతి
యకలంకపద మియ్యు మనఁగ నవ్వరము
ఆరాజపద మేల యని నింద్రపదము
గౌరవంబుగ వేఁడఁగా నతం డనియెఁ
దగఁ బ్రజాపతికి సిద్ధముగా ముహూర్త
మగువేళఁ జెడిపోవు నయ్యింద్రపదవి
కావున మీ రది కాంక్షింపవలదు
వేవేగ నడుగుఁడీ వేరొక్కవరము
అనవుడు వారుకల్పాంతరంబులను
ఘనమై లయింపనిగతి నీయు మనిన
నాయగ్రజుండు కల్పాంతరంబులను
మాయక వెలుఁగుబ్రహ్మపదంబు మీకు
నిచ్చెద ననఁగ నదేరీతి మాకు
హెచ్చుగాఁ బ్రాపించు నెఱిఁగింపు మనిన
దయను దజ్జ్యేష్ఠుండు తమ్ములం జూచి
నయముగా నిట్లనె నానాజగములఁ
బుట్టించు బ్రహ్మను బుద్ధిచేఁ జిక్క
బట్టి ధ్యానించి తత్పద మందవచ్చు
నని చెప్పి తమ్ముల నందఱఁ దోడు
కొనిచని యొకదిక్కు గురుశుచిస్థలిని

జేరి పద్మాసనాసీనులై బ్రహ్మ
నారూఢిగా చిత్తమందు భావించి
యమరులఁ బుట్టించునటువంటి బ్రహ్మ
లము తా మనుచు నిశ్చలత్వంబు నొంది
తముఁ దామె చూచుచుఁ దప మాచరింప
నమితమౌ వర్షశీతాతపవాత
ములచేతఁ దద్దేహములు నాశ మొందె
నలఘుదివ్యాంగంబు లాపదినుండి
ధరియించి తాము విధాతలై వేఱె
వారివారి జగములఁ బుట్టింపఁ జూచి
మొదటిబ్రహ్మైశ్వర్యమును బొంది తలలు
కదలించి యూఁచె నీక్రమముఁ బాటింపఁ
జిత్తమే కర్తయ్యె సృష్టి కంతటికిఁ
జిత్తమే జీవుఁడై చేష్టింపుచుండు
నది యెట్టు లనిన బ్రహ్మలమని వారు
పదిమంది చిత్తముల్ పట్టి భావించి
భావనాసిద్ధియే బ్రహ్మలై దేహ
భావన మఱచి రో పార్థివాధీశ!
దేహవాసనలఁ బొందిన దేహి మరల
దేహమే దాల్చు ముక్తిని బొంద లేఁడు
ఆత్మవాసన నొందినటువంటి దేహి
యాత్మయం దైక్యమౌ నని వసిష్ఠుండు

చెప్పిన నూహించి శ్రీరామచంద్రుఁ
డప్పు డిట్లనియె దేహమున కందున్న
జీవునకును వేరు సిద్ధమై యుండు
నావిధంబుగ నుండినప్పటికైనఁ
గాయంబు సుఖము దుఃఖంబు జీవునకు
నాయాయెడలఁ గల్గిన ట్లుండకున్నె
హిత మొప్పఁ జెప్పు మునీంద్ర! యటంచు
నతిభక్తితో రాముఁ డడుగ వసిష్ఠ
మౌని యిట్లనియె నో మనుజేంద్ర! దీని
కే నొక యితిహాస మెఱిఁగింతు వినుము.

కృతమేంద్రోపాఖ్యానము.

అరయ నింద్రద్యుమ్నుఁ డనువాని భార్య
మెఱయుచుఁ దగుపైఁడి మేడపై నుండి
యొకవీథి నొకచోట నొకవిటకాని
సుకుమారదేహుని జూచి మోహించి
కలయఁ గోరుచు నుండఁగా నానృపాలు
కొలువులో నితిహాసకుఁడు చేరి మదిని
దలఁచి ప్రాస్తావోచితంబుగా మున్ను
బలభేది గౌతముభార్యను గూడి
చనిన వృత్తాంత మాజననాయకునకు
వినిపింప నది తాను విని రాజపత్ని

తనమది నిటు తాను దలఁచె నహల్య
మొనసి యింద్రుని బొందె మునిని వంచించి
యిటువంటి పెద్ద లట్లై రఁట పూర్వ
మిట పాపభీతి నా కేల యహల్య
నే నేను విటకాఁడు నిర్జరేశ్వరుఁడు
గా నిర్ణయించి యాఘునుని బొందెదను
నా కేమిభయ మని నడిరేయి పోయి
జోకగా మును తాను జూచినవిటుని
గలిసి వేడ్కల నుండఁగాఁ బొంచిపొంచి
వలనుగాఁ దలవరుల్ వారి నిద్దఱిని
గనుఁగొని దండించి గ్రక్కునఁ దోడు
కొనిచని యొకదిక్కుకూర్చుండఁ బెట్టి
క్షితిపతి కావార్త చెప్పిన లేచి
యతిభీషణాకారుఁడై వారిఁ జేరి
వారక కొట్టింపఁగా వారు మోహ
పరవశులై మోహబాధ లాత్మకును
దోఁచగ నందుఁ బొందుకు నొండొరులను
జూచుచుఁ బలుమారు చొక్కుచు హావ
భావవిలాసవిభ్రమవికారములఁ
గావింపఁ జూచి యాగ్రహముతో నృపుఁడు
కొంకక మఱిమఱి కొట్టింప నగుచు
శంకింప కిరువురా జనపతిం జూచి

పలికి రిట్లనుచు భూపాల మామైత్రి
తెలియక కొట్టించితివి శరీరములఁ
గోయించినను నొప్పి కోపంబు భయము
కాయాభిమానంబు గలుగ దెట్లనిన
సరసమౌ దేహవాసన నెడఁబాసి
పరమనోవాసనావశులమై కలసి
యుండఁగా నీ విప్పు డొట్టిదేహముల
దండించి కొట్టింపఁ దగ దదెట్లనినఁ
జిత్తమే హేతువౌ సృష్టి కంతటికిఁ
జిత్తంబు లేకయే సృష్టి యెటగును
నారయ భూజలతాదులఁ జగము
సారెకు వత్తి రసంబైనకరణిఁ
దనువులయందుఁ జిత్తము ప్రకాశించి
తనియక పను లిట్లు తానె గావింపఁ
గాను జడములైన ఘటముల నీవు
పూని కొట్టించినఁ బోవునే కినుక
తను వణంగినను జిత్తము దేహశతము
లను దాల్చు విడుచు మూలములఁ దా నిల్చుఁ
దాఁ దాల్చి విడిచిన తనువులకొఱకుఁ
దాఁ దాపపడునె చిత్తం బెడనైనఁ
జిత్తధర్మముల లక్షించి నీ వెఱుఁగు
మి తతి నీకోప మేల నీ కనిన

విని వారి నాయూరు వెళ్ళఁగొట్టించి
మనుజేశ్వరుండు సమ్మతిఁ బొందె నంత
వారిద్ద ఱలిగి యువ్వలఁ గోర్కెతీఱఁ
గూరిమితోఁ గూడి కొన్నియేం డ్లుండి
తనివొంది యటమీఁదఁ దనువులు విడచి
మొనసిన సుజ్ఞానమున సిద్ధులైరి
యని చెప్పి మరల నిట్లనె వసిష్ఠుండు
జననాథ! వినవయ్య సకలదేహులకు
నరయఁగా రెండు దేహము లుండు నందుఁ
దెఱఁగొప్పఁగా మనోదేహంబు శీఘ్ర
గతిచలనంబు నాక్రమముగా స్థూల
మతిశ యమాంసమయంబుగా నుండు
నన విని రాముఁ డిట్లనె నోమునీంద్ర!
మనము జడంబును మఱి యమూర్తమును
బొరిని సంకల్పప్రభూతమై యుండి
ధరను దేహము నెట్లు ధరియించియుండు
నన వసిష్ఠుం డిట్టు లనియె నో రామ!
విను మనంతంబును విమల మవ్యయము
నచలంబు నగు పరమాత్మ సంకల్ప
ఖచిత మేమనఁ గనంగా నొప్పుచుండి
తిరముగా బ్రహ్మోపదేశమా నొక్క
సరసేతిహాస మాశ్చర్యంబుగాను

శ్రీమహితాత్మ! నేఁ జెప్పెఁగ ననుచు
నామానివస్యఁ డిట్లనియె వెండియును

చిత్రోపాఖ్యానము.

చోరవగా నేదిక్కు చూచినఁగాని
యరుదుగా నూఁతేసియూనుడలంత
నిడుపు వెడవు గల్గి నెరసియున్నట్టి
యడవిలోపల సహస్రాక్షులు వెయ్యి
కరములు గల భీమకాయుండు మించి
పరిఘులఁ దనమేను పలుమాఱు తాన
నతికికొంచును నాశనంబును బొంద
కరఁటు లుండినతోఁట కరిగి కరంజి
వనములోఁ జేరి యవ్వల నూతిలోన
మునిఁగి గ్రక్కున లేచి మునుపటిరీతిఁ
గదలి కావనములోఁగాఁ బ్రవేశించి
పదపడి మే నెల్లఁ బగల నడంచి
కొనుచున్న నేను గన్గొని యంతఁ గటికి
తనమున నడిచికోఁ దగదని పట్టి
వారింప నెలుగెత్తి వాఁ డేడ్వ నేడ్వ
కూరకుండు మటంచు నూఱడింపఁగను
నతఁడు నవ్వుచు మేను హస్తంబు లెత్తి
ప్రతిభతో ఖండించి పాఱవైచినను.

నది చూచి వెఱఁగొంది యావలఁ జనఁగఁ
గదిసి భయంకరాకారుఁ డందొకఁడు
తనమేనికండలు తానె ఖండించి
తినుచున్నఁ జూచి యీఘోరకృత్యంబు
వలదు నిలుపు మన్న వాఁడు నామీఁద
నలిగి తిట్టుచుఁ జని యందుఁ గూపమునఁ
బడియె నం దిటువంటిప్రజలను బెక్కు
పొడగంటి నో రామభూపాల! నీకు
నీకథతాత్పర్య మెఱుఁగరా దేను
వీఁకతోఁ జెప్పెద విను మదెట్లనిన
నరవి నరణ్యంబు సంసారఘోర
మిరువురు పురుషులం దెవ్వ రటన్నఁ
గన మానసాఖ్య లక్కరములు పరిఘ
లనినవి ధీవృత్తు లగుచుండు మఱియుఁ
బొలుపారు ప్రహరణంబులు పాపదుఃఖ
ములు నందు కూపంబు మొగి నిరయంబు
అరఁటితోఁటన్నది యమరలోకంబు
మఱి కరంజము లను మనుజసంఘములు
ఎలమి శాస్త్రవివేక మేను భావింప
నలభోగశైథిల్య మగుచుండుఁ జిత్త
పరితాప మగువాని ప్రబలదుఃఖంబు
సరసహాసం బాత్మసంతోషసుఖము

తలఁప నమంగళత్యాగం బనంగ
విలసిత మైనట్టివృత్తి నాశంబు
ననువాఁడు కోపించినది నాస్తికత్వ
మని పితామహుఁడు మున్నతికృపతోడఁ
దేటగాఁ దన కుప దేశించినట్టి
మాటల వరుస రామక్షితీంద్రునకు
మచ్చిక నెఱిఁగించి మాని యిట్లనియె
హెచ్చుగా మోక్షంబు నిశ్చయింపుచును
నొనర నాత్మవివేక మొకకొంత గలిగి
యును భోగములు మానియును బాహ్యసంగ
మును బాసి సంశయమ్ముల వీడలేక
పనుపడి నిర్వాణపద మొందలేక
స్థిరమోక్ష పదమొందఁ దివురు-చందంబు
పరితాప మనఁబడు భావించి చూడ
జ్ఞానయోగము నొంది సర్వంబు రోసి
పూని మనోలయంబు నొనర్చునదియె
హర్తినయానంద మని చెప్పఁబడును
చిత్తమే పురుషుండు చిత్తమే ప్రకృతి
చిత్తమే సంసారసృష్టి యటంచుఁ
జిత్తమందే నీవు చింతించి తెలిసి
మొనసి చిత్తత్యాగమును జేసి సౌఖ్య
మును బొందు రామ! యిమ్ముగ సర్వశక్తి

పరమద్వయము సర్వపరిపూర్ణ మజము
పరమాత్మయును బరబ్రహ్మ మనంగఁ
దగి సర్వభూతవితానంబులందు
నగణితమై యుండి యంతట నుండు
సకలదేహములందు శక్తిరూపమున
నకలంకమై మానసము వెల్గుచుండు
ననఘచరిత్ర! నీ వది యేది యనిన
విలసితప్రజ్ఞతో వినుము చెప్పెదను
లలి మించు నాత్మనుల్లాసశక్తియును
బొలుపొందు నా బ్రహ్మమునకుఁ జిచ్ఛక్తి
సలిలంబునకు ద్రవశక్తి యగ్నికిని
యలరువాహకశక్తి యాకాశ మంటి
నలువొప్ప వాయువునకు స్పందశక్తి
యలగగనంబున కతిశూన్యశక్తి
కానవినాశనమునకును లయశక్తి
యును గల్గుచుండు మయూరంబు తరువు
పై నుండ నీళ్లలోపల దానినీడ
కానవచ్చినరీతిగా సూక్ష్మ మగుచు
వెలయు బీజంబులో విపులవృక్షములు
పొలుపొందుచుండిన పోలికగాను
సలలితస్థూలసూక్ష్మస్వరూపముల
వెలుఁగుచు నుండు నీవిశ్వ మంతయును

నలరారు దేశకాలాదిపై చిత్రి
వలన సస్యంబులు వసుమతిమీఁదఁ
బరమాత్మబలముచేఁ బండు నశించు
నరయఁగా వృద్ధిక్షయంబులు లేక
ఫలితార్థ మగు పరబ్రహ్మసాన్నిధ్య
బలముచేఁ జిత్తంబు బహువిధదృష్టి
గావించు లేనివి గలిగించుఁ బ్రోచు
భావింపఁ దాఁ గనఁబడ దందు నిపుడు
ఒకయితిహాస మే నొగి వినిపింతు
నొకరాజపుత్రకు నొకదాది చాల
గారవింపుచు నొక్కకథ వినిపించె
నారీతి యెట్లన్న నరుదుగా వినుము
అరయఁగా నతిశూన్యమైన పట్టణము
నిరవొంద నొకరాజు నేలుచు నుండు
వానికి ముగ్వురు వరసుతుల్ గలరు
గాని యం దిరువురఁగ గనలేదు తల్లి
ఒకఁడు గర్భంబునం దుదయింపఁ డట్టి
యకలంకపుత్రకు లాకాశవనముఁ
జేరి యచ్చటను బూచి ఫలించువృక్ష
వారంబులను గాంచి వారందు నిలచి
యప్పుడే యొకవేఁటలాడి రటంచు
విపరీతకథఁ జెప్ప విని బాలకుండు (?)

నిజ మనుకొనినట్ల నీవు లోకముల
నిజమని చూడక నిస్పృహాత్వమున
సంకల్పమును మాని సారెకుఁ బొడము
శంకల నణఁచి నిశ్చలశాంతిఁ బొందు
సంకల్పములు చిత్తసంభవమ్ములుగ
నంకితంబుగఁ జూడు మవి నీవు గావు
కడఁగి తాఁ జేయుసంకల్పంబుచేత
నడరారఁగా బద్ధుఁ డగు మూఢజనుఁడు
ఘనుఁడు తాఁ జేయు సంకల్పంబువలన
ననఘాత్ముఁడై ముక్తుఁడగు నిశ్చయముగ
సరవి నెన్నఁగ నసత్సంకల్పములను
మఱచి సత్సంకల్పమతి నొందు మీవు
అతిబాల్యకాలంబునందు విజ్ఞాన
రతుఁడవై గాఢవైరాగ్య మొందితివి
గనుక బంధుఁడవును గావు బంధుండ
నని చింతఁజేతురే యర్కకులేశ!
సరసమనోవిలాసము బంధ మగును
మెఱయఁ దన్నిరసనమే ముక్తి యగును
లలిని దన్మానసోల్లాసవైభవము
వలన గోష్పదమంత వసుధ యోజనము
కరణిఁ దోఁచును క్షణకాలంబుఁ జూడఁ
బరువడి బ్రహ్మకల్పం బగుచుండు

నొకనిదర్శన మిందు కూహించి నీకుఁ
ప్రకటించి చెప్పెద భావించి వినుము

లవణశాంబరీకోపాఖ్యానము.

అవని మహోన్నతం బగుపురమందు
లవణుం డనేడురాజు లలి నొక్కనాఁడు
సదురునఁ గొలువున్న సమయమం దతని
కెదుట నిల్వంబడి నింద్రజాలికుఁడు
మాయలఁ బన్నుచుఁ మంత్రింప సభ్యు
లాయెడ మోహితులై చూడఁగాను
నొనరఁగా రెండుముహూర్తముల్ రాజు
కను మూసి నిద్రించి కలఁ గాంచి లేచి
తనమంత్రివరులతోఁ దగ నిట్టు లనియె
ఘనులార! నే నొక్కకల గంటి నిపుడు
అది యెట్టులన్న ఘోరారణ్యమునకుఁ
బదపడి తురగంబుపై నెక్కి చనఁగ
నప్పు డాఘోటక మడవిలో నన్ను
దెప్పునఁ బడవైచి తెఱఁగున మించి
పరుగెత్తఁగా నేను బ్రాణభీతినను
దరుశాఖ వేగ హస్తంబుతోఁ బట్టి
వ్రేలాడఁగను వాజి విడఁబడి యుఱికె
నాలోన సూర్యోదయం బయ్యె నంతఁ

దనచేనికాఁపున్న తండ్రి కన్నంబు
గొని యౌవనముదారిఁ గులుకుమిటారి
యగు నొక్కచండాలి యరుదేరఁ జూచి
దిగువకు మెల్లగా దించవే నన్ను
నీ వనగా నది నేర్పుగా త్రాళ్లు
వేవేగఁ దెచ్చి యా వృక్షంబుక్రింద
నెత్తుగాఁ జేర్చి పైకెక్క నన్బట్టి
మెత్తగా దించిన మెచ్చి నేదానిఁ
గామించి వరియించి కలసి యచ్చోట
నామాలదానియం దనురాగసుతుల
నలుగురిం గని కొన్నినాళ్లు పోషింప
నలజడి పొడమఁగా నాలుబిడ్డలను
దోడుక వలసలో దూరాటవులకుఁ
గడువేగఁ జని కొంతకాలమం దుండఁ (?)
గాను బిడ్డలు నాలుఁ గాలవేగమున
మేనులు విడువఁగా మిడికి దుఃఖంబు
చే సహింపఁగలేక చిచ్చులో దుమికి
యాసమయంబునం దదరి మేల్కొంటి
మహిని విశాంబరీమాయాకృతంబు
సహజమైనటువంటి స్వప్నంబుగాదు
అలరుమనోమాయ లఖిలమర్త్యులకుఁ
గలిగించు దుఃఖ మీకరణి నటంచు

నెఱుఁగఁగా నందున్న యింద్రజాలికుఁడు
మఱి యందు నిల్వక మాయమై చనియె
వెఱఁగంది సభ్యు లావింత భావించి
యెఱిఁగి యాభూపాలు నీక్షించి యనిరి
జననాథ! వీఁ డింద్రజాలియై యున్న
ధనము గైకొనక యంతర్ధాన మొంది
చనునె జగద్విలాసం బిట్టి దనుచు
జనులకుఁ జూప నిచ్చటికిఁ దా వచ్చి
మెఱసినవాఁ డనిమిషదూత గాని
నరుఁ డనఁగూడ దనంతరూపముల
నలరుచున్నపగాత్ముఁ డాఢ్యుఁడై తాను
నొలయక మాయామనోరూపములను
దా తాల్చి సకలభూతములకు భ్రమల
ఖ్యాతిగా నీరీతిఁ గల్పించుచుండుఁ
గావునఁ జింతింపఁగా నేల యనుచు
భూవరునకు వారు పొసఁగఁ జెప్పి రని
పలికి క్రమ్మఱ రామభద్రునిఁ జూచి
జలజాప్తకులదీప స్వల్పకాలమునఁ
జాలగాఁ బెక్కేండ్లు జరిగిన యింద్ర
జాలంబుగాని నిశ్చయ మనరాదు
చింతించి యెంతఁ జేసిన మనోమాయ
లంత హెచ్చుచు నుండు నణఁచిన నణఁగు

నలువొప్ప సంయమనంబున శాంతి
గలుగుఁ దచ్ఛాంతిని గట్టిగాఁ బట్టి
మదిని నిరోధించి మానితజ్ఞాన
మెన నుంచి ధ్యానసమేతుఁడై దినము
మఱవక ధ్యానముౙ మందరా చలము
నరసి సంసారతోయధిని గలంచి
విడిచి సంకల్పముల్ విడిచి భోగేచ్ఛ
విశనాడి సంసారవృక్షము ల్ద్రుంచి
యులమనోవ్యాధుల కౌషధం బగుచు
వెలసిన వైరాగ్యవిభవంబు నొంది
చిరతరసచ్ఛాస్త్రశిక్షచేఁ జిత్త
మఱిముఱి మెత్తనై సప్పు డేమఱక
యొఱుకగా నినుముతో నినుమును ద్రుంచు
కరణిని సుజ్ఞానకలితచిత్తంబు
చేత నీవజ్ఞానచిత్తము ల్ద్రుంచు
ఖ్యాతిగాఁ బౌరుషకలితేప్సితముల
వదల కనుభవింపవలె నన్నచిత్త
మదియె కోరుచు నుండు నణఁచిన నణఁగుఁ
గావునఁ జిత్తవికారధర్మముల
భావించి వానికిఁ బరుఁడవై యుండు
మని మఱికొన్ని రహస్యముల్ దెలుప
విని రాముఁ డమ్మునివిభుని కిట్లనియెఁ

దొడరి తామరనూలుతోఁ బర్వతములు
పడనీడ్చి బంధించుపగిది విశ్వమును
దెరలక తాను బంధించె నావిద్య
వెలఁగైన దీరీతి వినవిన లవణ
కుతలాధిపతి తనకొలువులో నుండి
యతికష్టముల నొందె యవల మేల్కాంచి
మఱి యేమి జేసి సమ్మతిఁ బొందె ననఁగ
వరమునీంద్రుండు భూవరున కిట్లనియె
బరువడి లవణభూపాలపుంగవుఁడు
సురుచిరమతి రాజసూయాధ్వరంబు
నూని నేయఁగఁ బురుహూతుండు చూచి
తా నొర్వఁజాల కాధరణీంద్రు కడకుఁ
దనదూత నంప నత్తఱి వాఁడు లవణ
జనపతిసభ నింద్రజాలంబు పన్ని
యావేళ నతని మోహాంధునిం జేసి
వేవేగఁ జనియె నవ్విధ మేల యనిన
నది విను రాజసూయాధ్వరకర్త
పదియును రెండేండ్లు ప్రబలదుఃఖముల
ననుభవించుట నిజ మటుగాన నతఁడు
తనియ కాద్వాదశాబ్దముల దుఃఖంబు
గన ముహూర్తద్వయకాల మాకష్ట
మనుభవించినమీఁద నంతఃపురంబుఁ

చేరి యాస్వప్నవిచిత్రంబు మఱవ
కారటఁబడుచుండి యమ్మఱునాఁడు
కలలోనఁ దాఁ గన్న కాననంబునకు
బలములతోఁ దాను బైనమై పోయి
యాకలలోఁ గాంచి నట్టిచందములు
వీఁకతో నిజముగా వేవేగఁ జూచి
యది యెవ్వరికిఁ జెప్ప కక్కటా! యనుచు
మదిఁ జింత నొంది యమరపురిఁ జేరి
యట సుఖస్థితి నుండె నాలవణుండు
పటుతరవిద్యానుప్రభవ మిట్టిదియె
జగతి నసత్యంబు సత్యమై తోఁచు
నగణితాత్మక! యిది యద్భుతం బనిన
విని రామచంద్రుండు వెఱఁగు నొందుచును
మనము సంశయ మొంద మరల నిట్లనియె
గలలోన లవణుండు గన్నచిహ్నములు
నిలుకడగా నందు నిలిచి యెట్లుండె
నీవింత దెలుపు మునీంద్ర! యటన్న
నావసిష్ఠుం డిట్టు లనియె నవ్వుచును
విను రామచంద్ర! యీవిద్య పెం పిదియె
గని యిది యది యని గణుతింపరాదు
కలది లేదనిపించుఁ గలుగనిదాని
బెలుచ నిశ్చయ మనిపించుచు నుండు

ఘనతపోధనుఁడైన గాధివర్తనము
విన నది యిట్టిదే వెనుకఁ జెప్పెదను
నలిని జాగ్రద్వాసనలు నిక్కములుగఁ
గలలోన నిజములై గనిపించి మరల
మేలుకొన్నపుడును మిథ్యగా వెలయు
నాలవణుండు ప్రత్యక్షంబుగాను
మఱునాఁడు చూచినమాయ యేమనినఁ
గరమొప్పఁగాను బుష్కరదేశములను
బరఁగఁ జండాలసంస్పర్శనుం డొక్క
నరపతిపురములోనం గనఁబడును
భావికార్యములస్వప్నముల సూచించుఁ
గావున లవణునికల నది దోఁచె
జగతిని నీకు నాశ్చర్య మేమిటికి
నగధీర! వినుము జ్ఞానంబు జ్ఞేయుంబు
వరుస నాపాదించు వస్తుసత్తను
వెఱఁగేల సుజ్ఞానవిధ మిదే నమ్ము
మావింత లన్నతంబు లంచు భావించు
వావిరి బహువస్తువరమధ్యమముల
యందుఁ గేవలగగనాభమై నిండి
యెందు నెవ్వరికిఁ దా నెదురుగాఁ గానఁ
బడక తెలివిలేక భావనగాక ·
జడతలే కుండెడి సద్రూప మెద్ది

అది నీవుగాఁ గని యానంద మొందు
పొదువుగా నాబ్రహ్మమున నాదియందుఁ
జిత్తంబు పొడమెను జేష్టాకరముగఁ
జిత్తమందే పుట్టుఁ జింతనంబులును
సటల చింతనముల సవికల్పజాల
పటిమ జనింపఁ బ్రపంచంబు నభము
నందు నీలిమ దోఁచినటువలెఁ దోఁచి
యెందును శూన్యమయ్యె నిజంబుగను
గనఁబడుచుండులే గాని యథార్థ
మని దానిఁ జూడకు మాత్మనే చూడు
సంకల్పజాలముల్ చాలింప నవుడు
కొంకక చిత్తంబు కుదిరి తా నణఁగుఁ
జిత్తం బణంగినఁ జిత్తన్నియెడల
సత్తై వెలుఁగుఁ జంద్రచంద్రికకరణి
నని లవణచరిత్ర మరుదుగాఁ జెప్పి
మునిపతి మరల రాముని కిట్టు లనియెఁ

అజ్ఞానభూమికాసప్తకము.

బొలుపొంద నజ్ఞానభూమిక లేదు
గలదని యెట్లన్నఁ గ్రమముగా బీజ
జాగ్రత్తయును మఱి జాగ్రదవస్థ
జాగ్రదతిశయంబు జాగరస్వప్న

మును మఱియును స్వప్నమును స్వప్నమందు
జనియించు జాగ్రత్త సరవి సుషుప్తి
యనఁబడు నిఁక దీని కర్థ మెట్లనిన
విను చిత్తునకు నాది విమలచేతనయు
నై వెలుంగుచునుండినట్లు చిత్తార్థ
జీవత్వభజన కంచితముగా నమరి
భేదబీజంబగు బీజజాగ్రత్త
యాదిభూమిక యిది యన నొప్పు తెలివి
యనుదాని కది నూతనావస్థ యగును
మనుజేంద్ర! యిదియె నా మందిరం బనుచు
నా దేహ మిది వారు నావా రటంచుఁ
బాదుగా విశదమై ప్రాగ్భావమునను
జనియించు నెఱుకయే జాగ్రదవస్థ
యనఁబడి రెండోది యను భూమి కదియె
నే నతఁ డితఁ డంచు నిగుడి జన్మాంత
రానుభవము నొందినటువంటి యెఱుక
చంద మెన్నఁగ మహాజాగ్రత్త యగును
బొందుగా మూఁడవ భూమిక యిదియె
యూరక యొకచోట నుండి భోగముల
సారెకుఁ గోరుచు సంతసించినది
యలఘుమనోరాజ్య మనఁబడు నదియె
పొలుపుమీఱఁ జతుర్థభూమిక యయ్యెఁ

జెదరెడి మరుమరీచికయందు జలము
నదియుఁగా కయు శుక్తియందు రౌప్యంబు
కలదంచు నివి యాదిగా వృథా భ్రమల
కలవడుటే స్వప్న మని చెప్పఁబడును
బోరి నిది పంచమభూమిక యయ్యె
నఱిముఱి బహుకాల మరిగి రాకుండి
మరల వచ్చినవాని మఱచి యవ్వలను
సరవి నెఱుంగుటే స్వప్నజాగ్రత్త
భూమీశ! విను షష్ఠభూమిక యిదియె
కామాకరంబు విక్రమము లన్నియును
వరుసగా నీషదవస్థలఁ దొరఁగి
కరఁగుచు భావిదుఃఖములఁ దలంచి
యచలుఁడై చింతించునదియె సుషుప్తి
ప్రచురాత్మ యిదియె సప్తావస్థ లగును
నట్టి యవస్థామహాంధకారమునఁ
బట్టుదోఁచక జీవపటలి మునుంగు
జననాథ! యివియె యజ్ఞానభూమికలు

జ్ఞానభూమికాసప్తకము.

విను జ్ఞానభూమికల్ వివరింప నేడు
గల వవి యెట్లన్నఁ గ్రమముగా నీకుఁ
దెలియఁజెప్పెదఁ దేటతెల్లంబుగాను

వసుధపై బహుపుణ్యవాసనచేతఁ
బొసఁగ జనించిన బుద్ధిమంతుండు
తనమదిలోఁ దా నె తలఁచె నిట్లనుచు
జనియించి యీఘోరసంసారవార్ధి
మునుఁగుట కే నేల మూఢుండ నైతి
ననుచు వైరాగ్యశాస్త్రాభ్యాసి యగుచుఁ
గడఁకతో సాధుసాంగత్యంబుఁ జేసి
యెడర గాఢవిరక్తిఁ దగుట శుభేచ్ఛ
యన నొప్పు నిది చూడ నాదిభూమికయె
జనవర! వైరాగ్యశాస్త్రవిచార
సరణుల మఱవక సజ్జనమైత్రి
యురుభక్తితోఁ జేయుచుండెడిరీతి
పొదుపుమించు విచారభూమిక రెండ
వది యిదె యగుచుండు వసుధాతలేంద్ర!
యీరెండుభూమిక లెక్కినమీఁద
దారుణవిషయబృందంబును రోసి
తనమనసము తనుత్వంబు నొందుటయె
తనుమానసాఖ్యచేఁ దనరి మూఁడవది
యన నొప్పుభూమిక యగుచుండు మఱియు
ననఘుఁడై యీమూఁటి నభ్యసింపుచును
సకలవాంఛల వీడి సత్యాత్మనిష్ఠ
నకలంకుఁడై చింతలన్ని వర్జించి

జననుతుఁ డగుటయే సత్యసంప్రాప్తి
యన నొప్పుభూమిక యగు నాలుగవది
యీనాల్గిఁటిని మది నిరవుగా నుంచి
తాను నిస్సంగుఁడై తత్త్వచింతనము
వదలక యెపుడు సత్వస్థితినుండి
నదియె సంసక్తినామాంకితం బగుచుఁ
బొలుపొందుపంచమభూమిక యనుచుఁ
బలుక నొప్పుచు నుండు భానుకులేశ!
పొగడొందు నియ్యెను భూమిక లెక్కి
యగణితాత్మారాముఁడై చలింపకయ
యనిశంబు బాహ్యమధ్యాంతరంబులను
మొనసి యన్యపదార్థములు లేమి దెలిసి
పరమార్థ మెఱిఁగి నిర్భరుఁడై నరీతి
నరసి చూచినఁ బదార్థాభావసిద్ధి
యన నొప్పుచుండు నీయాఱు భూమికల
ఘనతరగతుల నిష్కర్షగా నెఱిఁగి
తన కన్యమైన యర్థము లేని దెఱిఁగి
పనుపడి తగుతత్త్వభావైకనిష్ఠ
నొదవిన యొఱుకయం దూహించి చూడ
నది తుర్యగాగతి యన నొప్పుచున్న
సప్తమభూమికై శాంతిమై మించి
సప్తాత్మగతిఁ బ్రకాశంబుగా నుండుఁ

దుద కెక్కు నిటువంటి తుర్యగావస్థ
వదల కుండెడిది జీవన్ముక్తి యగును
మఱువుమీఱు విదేహముక్తి యనంగఁ
దెఱఁగొప్పఁ దుర్యగాతీతమై యుండు
నమలాత్మ! నప్తమంబగు తురగాఖ్య
నమర భూమిక కెక్కినటువంటివారు
అనఘు లాత్మారాము లధ్యాత్మవేత్త
లనుపమానులును మహానుభావులును
జనసుతుల్ వారు సంసారసౌఖ్యముల
ననుభవింపుచు నుందు రందు నంటకయె
సుఖదుఃఖరసములనుల్లలోఁ బడకె
నిఖిలకార్యంబుల నిరసింతు రెపుడు
మాయాగుణములందు మగ్నులు గాక
సేయఁగాఁ దగుపనుల్ సేయుచుండుదురు
మరులుపట్టినవారిమాడ్కి మాటలను
మఱితురు బాలునిమాడ్కి నుండుదురు
పట్టిననిర్వాణపద మిదే యనుచు
నెట్టనఁ దెలియుమో నృపకులోత్తంస!
యని రామచంద్రున కావసిష్ఠుండు
ఘనతరోత్పత్తిప్రకరణంబు చెప్పె
నని భరద్వాజసంయమికి వాల్మీకి
వినిపించె నాకథ విశదంబుగాను

ఇది సోమనాథవిశ్వేశ్వరస్వామి
పదభక్తి యగుచు సుబ్రహ్మణ్యయోగి
చరణాంబుజాతషట్చరణాయమాన
పరిపూర్ణనిత్యసద్భావనిమగ్న
మానసాంబుజ వెంగమాంబికారచిత
మై నిత్యమై సత్యమై ధన్యమైన
సామార్థసారసుజ్ఞానవాసిష్ఠ
రామాయణం బను రమ్యసద్విపద
యందు సారంబగు నాదిప్రకరణ
మందమై విపులమోక్షాకరం బగుచు
శ్రీతరిగొండనృసింహుం డనంగ
ఖ్యాతిగా వెలయు వేంకటరాయ నీదు
పదయుగళికి సమర్పణమయ్యె దీని
సదమలులై వ్రాసి చదివిన నరులు
వారు తాపత్రయవననిధి దాటి
పరమైన నిర్వాణపదము నొందుదురు
భూచక్రమున నిది పురుషార్థ మగుచు
నాచంద్రతారార్కమై యుండుఁగాత.

ప్రథమప్రకరణము సమాప్తము.

ద్వితీయప్రకరణము.

శ్రీతారకోల్లాస శేషాద్రివాస
శ్రీతరిగొండనృసింహ దూతాంహ
విన్నవించెద నది వినుము వాల్మీకి
పన్నుగా దెల్పె నుత్పత్తిక్రమంబు
తప్పక విని భరద్వాజుండు మరల
నప్పు డిట్లనియె మహాగురు దేవ!
శ్రీ రాఘవునకు వసిష్ఠుండు మరల
నేరహస్యము జెప్పె నెఱిగింపు డనిన
నలర వాల్మీకి యిట్లనె భరద్వాజ!
తెలియ జెప్పెద నది తేటగా వినుము
శ్రీరాఘవుండు వసిష్ఠు నీక్షించి
యారూఢభక్తి నిట్లనె నోమునీంద్ర!
చిత్తమందే సర్వసృష్టి పుట్టుటయు
జిత్తవృత్తులు విసర్జించుట ముక్తి
యగుటయు జెప్పితి రానంద మొదవె
నగణితచరిత కృతార్థుండ నైతి
ననిన వసిష్ఠు డిట్లనియె వెండియును
జననాథ! యీప్రపంచము మానసమున

జనియించి యందుండు సంసార మాత్ర
నెనసి యున్నటువలె నిలఁ జిత్తమునకుఁ
గనుపించుచుండుఁ దత్కథ వినిపింతు
విను చిత్రవర్ణముల్ వెదకిన లేక
కొమరొప్పఁగాఁ జిత్రకుఁడు లేక మింట
నమరి చిత్తరు వుండినటువలె నిదుర
లేకయే కల వచ్చు లీల నందమునఁ
బ్రాకటంబుగఁ గనఁబడు నీడవలెను
సతతప్రకాశమౌ స్వచ్ఛాత్మయందుఁ
బ్రతిబింబ మగుచుఁ బ్రపంచంబు దోఁచుఁ
గనుకఁ బ్రపంచంబు కల్లగా నెఱుఁగు
మను పరాత్మను జూడు మంతరంగమునఁ
జపలాత్ములై బ్రపంచముఁ జూచుమనుజు
లపరిమితాఘదేహములఁ బొందుదురు
జననాథ! దీనికి సాదృశ్య మొకటి
వినిపింతు నెట్లన్న విప్రపుంగవుఁడు
విమలుండు భృగుఁడు వివేకభావమున
నమితమందరపర్వతారణ్యమందుఁ
దప మయుతాబ్దముల్ తగఁ జేయ శుక్రుఁ
డవుడు తండ్రికి సేవ లమరఁ దాఁ జేయ
వలసి యందుండి విశ్వాచి యనంగఁ
జెలువొప్పునప్సరస్త్రీని వీక్షించి

మోహించి మదనాస్త్రముల కోడి నైజ
దేహ మయ్యడవిలోఁ దెప్పున వదలి
యఱిముఱి సూక్ష్మదేహంబుతో నెగసి
మరులొంది దానివిమానంబుఁ జేరి
తెఱఁగొప్పఁగా దివ్యదేహంబుఁ దాల్చి
నెఱవాది యగుచు దానిని గూడి యవల
పొలసి జన్మాంతరసుఖదుఃఖసరణి
నలజడిఁబడుచుండె నందందు నిచట
నలర నాభృగునిమహాతపోబలము
వలన శుక్రాంగంబు వనములో వ్రాలి
యున్న తద్దేహంబు నుగ్రజంతువులు
పన్నుగాఁ గని పట్టి భక్షింపకుండె
వలనొప్ప నట దివ్యవర్షసహస్ర
ములకు సమాధిని నిమ్ముగ వీడి భృగుఁడు
శుక్రాంగమును జూచి శోకించి మించి
యాక్రోశచిత్తుఁడై యంతకుమీఁదఁ
గోపంబు రెట్టింప ఘోరమైనట్టి
శాప మియ్యఁదలంచు సమయంబునందు
నదరుచు మహిషవాహన మెక్కి వచ్చి
పదరెడి భృగుమౌని పజ్జను నిల్చి
పలికె నిట్లని దండపాణి మునీంద్ర!
లలిమీఱఁ బెద్దకాలముఁ జేసినట్టి

తప మెల్లఁ జెడుటకై తామసబుద్ధి
నిపుడు శాపంబు నా కియ్యఁ బూనుచును
ఈకరణిని గన్ను లెఱ్ఱఁ జేసితివి
నీ కపకారంబు నేఁ జేయలేదు
పదరి నాకిపుడు శాపము నిత్తు ననిన
నాదరించి ప్రతిశాప మిచ్చెద నీకు
విను నేను మును పదివేవురు రుద్రు
లను లక్షవిష్ణువులను బ్రహ్మాండ
కోటులఁ బట్టి మ్రింగుదుఁ గాన మిమ్ము
బోఁటివిప్రులు నాకు భోజ్యము ల్గారె
యింత తపముఁ జేసి యీనాఁటికైన
శాంతిఁ బొందవు మునీశ్వర! మదిలోనఁ
గుదుకుచున్నటువంటి క్రోధంబు నణఁపు
మది యెట్టులనిన నెయ్యంబుతో వినుము
సొరిది చిత్తము పురుషుండు తత్కృతము
పొరి బుద్ధి యనఁబడు బుద్ధికృతంబు
అలయహంకారమై
ముల నొనరించు నిమ్ముగ నటు గనుక
సంతతంబును జిత్తశాంతి సమస్త
శాంతి యటంచు నాశమనుండు బలుక
విని భృగుముని చాల విన్ననై యముని
గని యిట్టు లనియె నిక్కడ శుక్రుఁ డుండఁ

దను వింధుఁ బడవైచి తర్లి నచంద
మును నాకుఁ దెల్పు మిమ్ముగ నన్న యముఁడు
తా నిట్టు లనియె నోతాపసప్రవర!
నీనందనుం డిందు నిలిచి శుశ్రూష
సేయుచుండఁగ మీరు చిరకాల మిచట
మాయను గెలిచి సమాధియం దున్న
సమయంబునందు విశ్వాచి యనంగ
నమరు దేవాంగన యాకాశమందుఁ
జనుచు నుండఁగఁ జూచి చాల మోహించి
తనతను వందుంచి తరలి యందొక్క
దివ్యదేహముఁ దాల్చి ధీరుఁడై మించి
నవ్యభోగముల నానళినాక్షి నెనసి
పెద్దకాలం బుండి పిమ్మట నతఁడు
నద్దయితను బాసి యవనిపై వ్రాలి
యురుశోణపురమునం దొక్కభూసురుని
వరసుతుఁడై పుట్టి వసుధ న త్తనువు
విడిచి కోసలదేశవిభుఁడై జనించి
పుడమి పాలించి యప్పుడు శరీరంబు
తటుకున విడనాడి దండకాటవిని
బటిమ మీఱఁ గిరాతపతియై జనించి
అప్పు డాదేహంబు నననిపై వైచి
తెప్పున జాహ్నవీతీరంబునందు

నావల నొకరాజహంసయై పుట్టి
యాపీటఁ జరియించి యాదేహ మచటఁ
బడవైచి పిమ్మటఁ బౌండ్రదేశమునఁ
బుడమిపై నినవంశమునఁ బుట్టి మరల
జనులను బాలించి చని సాళ్వదేశ
మునఁ బుట్టి యచ్చోట ముఖ్యుఁడై నిలిచి
యొనరంగ సౌర మంత్రోపదేశముల
జనులకుఁ జేయుచుఁ జరియింపుచుండి
యవనిని దద్దేహ మట విసర్జించి
యవల విద్యాధరుఁడై జనియించి
రహి నొప్పునలకాపురమునఁ గొన్నేండ్లు
విహరించి యాబొంది విడిచి పిమ్మటను
మఱియొక్క మౌనికుమారుఁడై పుట్టి
యఱిముఱి సర్వేంద్రియముల నడంచి
తివిరి సరస్వతీతీరంబునందుఁ
బ్రవిమలుం డగుచుఁ దపముఁ జేసి తనువు
జగతిపైఁ బడవైచి సౌరదేశమున
మగుడి దా నొక్కసామంతుఁడై పుట్టి
కొంతభూ మేలుచుఁ గొన్నియేండ్లుండి
యంతటఁ దద్దేహ మచ్చట విడిచి
క్రమ్మఱఁ బోయి త్రిగర్తదేశమున
సమ్మతంబుగ మహాశైవుఁడై పుట్టి

లలితుఁడై బహుశిష్యులకు నుపదేశ
ములు సేసి తద్దేహమును విసర్జించి
చనియు నాకొంతదేశమున నొక్కెడను
గొనకొని యొకవేణుగుల్మమై పుట్టి
చని యొకభూమిలో శ్వానమై తాను
జనియించి యందుండి చని యొక్కచోట
హరిణమై యుదయించి యాశరీరమును
ధరణిపైఁ బడవైచి తాళవృక్షమునఁ
బసచెడ నొకపెనుఁబామై జనించి
వసుధఁ దత్తనువును వాల్చి యామీఁదఁ
జని తమాలమహీజజాలమధ్యమున
వనకుక్కుటం బయ్యె వాఁ డివ్విధమున
సారెకీగతి బహుజన్మంబు లెత్తి
ధారుణిమీఁదఁ దత్తనువుల విడచి
యతిదుఃఖభాజియై యాత్మవివేక
గతి మది న్మఱచి గంగాతీరమందు
భూసురోత్తమునకుఁ బుత్త్రుఁడై పుట్టి
వాసుదేవాఖ్య నవ్వలఁ దపోవేష
కలితుఁడై నిలచి యక్కడ తపంబునను
వెలుఁగుచు నెనుబది నూఱేండ్లనుండి (?)
అచట నున్నాఁడు మహాయోగివలెను
సుచరిత్ర! యిఁక వాని‌ఁ జూచెద ననినఁ

జూపెద నివు డీవు సుజ్ఞానదృష్టి
దీపింపఁజేయుచు దివ్యదేహమును
ధరియించి రమ్మన్నఁ దపసి యారీతి
నరుదైన దివ్యదేహంబునుఁ దాల్చి
తెప్పున భాగీరథీతీరమునకు
నప్పు డయ్యమునితో నరిగి వా రచటి
కతికృశీభూతాంగులై శుక్రుకడకు
హిత మొప్పఁ జనఁగ వాఁ డెదురుగా వచ్చి
మ్రొక్కఁగా నతనికి మోక్షమార్గంబు
చక్కఁగాఁ దెల్ప సుజ్ఞానియై యతఁడు
తనజన్మదుఃఖముల్ దలఁచుచు వగచి
యెనసిన భక్తి నయ్యిరువురఁ జూచి
పలికె నిట్లని నేను బహుజన్మదుఃఖ
ములఁ బొంది యలసితి మోసంబుచేత
మున్ను మీసాన్నిధ్యమున నుండ కరిగి
నన్ని దుఃఖసుఖంబు లనుభవించితిని
నెఱుక చిన్మాత్రమై యెల్లదిక్కులను
మెఱయుచు నున్న దేమికొఱంత లేదు
కనుఁగొంటి ముక్తిమార్గమును మత్పూర్వ
తనువులోఁ జేరి మీతనయుండ ననుచుఁ
బెదరక మీసేవఁ జేసెద ననిన
వదలనికృప మీఱ వా రిద్ద రతని

వెంటఁ దోడ్కొనిపోయి వింతగా నేల
నంటిన కృశీభూతమైన దేహమును (?)
జూపఁగాఁ జూచి యాశుక్రుఁ డీతనువు
నాపట్లఁ బడవైచి యంతకువరము
చే పూర్వతనువులోఁ జేరి యచ్చోట
దీపింపఁగాను దద్దేహంబు లేచి
తనతండ్రిచేత యథాప్రకారముగ
నొనర సుఖస్థితి నుండఁగాఁ జూచి
శమనుండు నిజనివాసంబున కరిగె
నమితసంతోషాత్ముఁ డయ్యె భృగుండు
అని శుక్రువృత్తాంత మావసిష్ఠుండు
మనుజేంద్రునకుఁ జెప్పి మరల నిట్లనియె
విను రామ! సంసారవిభ్రమవ్యథలు
మనమునందే పుట్టి మాయునీ కిపుడు
తెలియుట కిది చెప్పితిని మానసమును
నిలిపి శాంతిని బొంది నెమ్మది నుండు
చెలఁగి వివేకంబుచేఁ జిత్తశాంతి
గలుగ సంసారదుఃఖ మణంగిపోవు
నిలను వివేకవిహీనచిత్తునకుఁ
గలుగుసంసారదుఃఖము వృద్ధిఁ బొందు
సతతంబు నాత్మవిచారంబు సేయు
నతనిచేతోవృత్తు లణఁగి నశించు

వడిగొన్న సంసారవాసన మరలఁ
బొడమినయపుడు తెప్పునఁ దా విరాగ
మతి నొంది సంసారమనిన వర్జించి
హితమొప్పఁ దన్నుఁ దా నెఱుఁగుచుండఁగను
సరవిసంసారవాసన మూషకములు
కొఱికిన వలరీతిఁ గురిసి నశించు
తరలి మనోగ్రంథి తెగు నటుమీఁదఁ
బరమవిజ్ఞానస్వభావంబు మించి
నిత్యప్రసన్నమై నిండుచు నుండుఁ
బ్రత్యక్ష మీయనుభవము భావించు
నట్టియోగాభ్యాసి యైన పూరుషుని
పట్టైన కరుణకు బ్రహ్మాదిసురలు
తగుపాత్ర లగుదు రంతటి యోగివర్యుఁ
డగణితచరితుఁడై యన్నిదిక్కులను
గనులు స్వభావంబుగాఁ జూచుపగిది
ఘనతరంబగు చిత్తగతిలేక తాను
జేయఁగాఁ దగుపనుల్ సేయుచునుండు
నాయోగి యెఱుకతో నఖిలభోగములఁ
దెలిసి భోగించి తృప్తిని బొందు దురిత
ములు వాని నంటక మురికి నశించు
నారీతి యెట్లన్న నఖిలేంద్రియములు
చోరకులై తనుఁ జొక్కింప వచ్చు

సమయమం దడలిన జాగరూకతను
భ్రమయ కాచోరస్వభావంబు లెఱిఁగి
తొలఁగ కాచోరులతో మైత్రిఁ జేసి
కలసినట్లుండి భోగములను జెంది
గెంటక తన్నుఁ జొక్కించు కామాది
కంటకులను దాను గాంచి వంచించి
వాని నెల్లను దనవశముఁ జేసికొని
వాని కెందును దాను వశుఁడు గాకుండు
నది యెట్ల నన్న మహాబధిరుండు
పొదువుగా దారులఁ బురముల నదుల
నూరక గనుచుఁ బోవుచు నుండుఁగాని
వా రందుఁ బలికెడివా రలు వినని
గతిని దాఁ బ్రారబ్ధకర్మశేషముల
నతినిస్పృహుండునై యనుభవింపుచును
నరయ జీవన్ముక్తుఁ డగుచుండి తుదను
మురువుమీఱ వి దేహముక్తుఁడై నభము
నభమందుఁ గలిసియున్న విధంబుగాను
శుభకరపరమవస్తువునందుఁ గలియుఁ
గావున నిప్పు డేక్రమమున నైన
నీ వింద్రియములను నిగ్రహింపుచును
ధీరసంసారవార్ధిని దాఁటవలయు
నారీతి చేయ కహంకారభావ

కలితుఁడ నైన దుఃఖములు ప్రాపించు
నిల నిందు నితిహాస మెఱిఁగింతు వినుము
జననాథ! పూర్వంబు శంబరాసురుఁడు
పనిఁబూని చతురంగబలములఁ గూడి
శక్రాదిదివిజుల సమయింతు ననుచు
విక్రమాటోపంబు విపులంబుగాఁగ
ననిమిషావళితోడ ననిఁ జేయువేళ
మొనకు నిల్వక వానిముఖ్యబలంబు
విరిగి డాఁగినఁ జూచి విపులదుఃఖమున
మఱియును వాఁడు దామవ్యాళకటులఁ
బుట్టింపఁగా వారు భూరిశౌర్యముల
నట్టహాసంబుతో ననిఁ జేసి సురలఁ
దఱుము దేవత లావిధాతను జేరి
శరణని శంబరుసామర్థ్య మెల్ల
వినిపింప విని ధాత విబుధులం జూచి
పనిఁబూని యొక్కయుపాయ మూహించి
పలికె నిట్లనుచు శంబరుని మీఁ రిపుఁడు
గెలుచుట కొకయుక్తి గెంటక వినుఁడు
వాఁడు కయ్యము సేయ వచ్చినవేళ
నాడాడ డాఁగుచు నళికినరీతిఁ
బోరాడుచుండుఁ డప్పుడు విజయాళి
నారాక్షసునియుం దహంకారగుణము

పాడము సందున వారు పొలిసి పోవుదురు
జడియక చనుఁ డన్న శక్రాదు లరిగి
పొరిపొరి దానవుల్ పోరాడుతఱిని
వెఱచినరీతి నావిబుధు లందందు
డాఁగుచుఁ బోరుచుండఁగ దానవులకు
వేగ నహంకారవికృతి జనించె
నాయహంకృతిచేత నఖిలరాక్షసులు
నాయమరుల కోడి యరిగి రటంచు
ముని దెల్పఁగాను రాముఁడు వెఱఁగంది
మనమున నూహించి మరల నిట్లనియె
కలుషదామవ్యాళకటనామభటులు
నిలను బరాత్మయం దెటు గల్గి రనిన
మౌని యిట్లనియె దామవ్యాళకటులు
పూని యద్భుతముగాఁ బుట్టు టెట్లనిన
వెరవొప్పఁ జెప్పెద విను సూక్ష్మమతిని
బరమాత్మవిప్రతిభాతిమాత్రంబె
గాని సత్యంబులు గా విది చెప్పఁ
గా నేల రామ! తక్కక నీవు నేను
ననుట లసద్భావ మగు నాత్మరూప
మునఁ గల్గు నాభాసముగఁ జూడు మదియొ
జీవశక్తి యనంగఁ జెలరేఁగి త్రివిధ
భావవిస్ఫూర్తిచేఁ బ్రభవించి మించి

తనువు లనేకముల్ ధరియించు విడుచుఁ
గనుక నాభాసాత్మకం బింత యనుచుఁ
దెలిసి జీవత్వంబు దీని విజ్ఞాన
బలముచేఁ జిత్పరబ్రహ్మమై యుండు
నెఱుఁగని యహమర్థ మిల నెద్దియైనఁ
బరువడి మలినరూపముతోఁ జిదాత్మ
యందుఁ బొం దెఱిఁగిన యహమర్థ మొనరఁ
బొందుగా బ్రహ్మమై పూర్ణమై వెలుఁగు
మొనసి తదహ మెన్న మూఁడులోకములఁ
గనఁబడుఁ ద్రివిధప్రకాశముల్గాను
అందు బ్రహ్మంబు తానని యహంభావ
మొందిన యహమర్థ మున్నతోన్నతము
పరఁగ నీశ్వరుఁడు ప్రపంచంబునందుఁ
బరమానువూర్ణుఁడై భాసిల్లుచుండు
నతనికి దాసుండ ననునహమర్థ
మతులితోత్తమ మగు నారెండు విడిచి
తనువు నింద్రియములు తానను నహము
జనియింప నది కనిష్ఠం బగుచుండుఁ
గడపటికిని నహంకారత్రయంబు
విడిచిన ధన్యుండు విమలనిర్వాణ
పదమందుఁ జెందుఁ దప్పదు నిశ్చయంబు
కదిసియుండెడి యహంకారంబు నణఁచి

ముందు భీమాదులు ముక్తులైనట్టి
చందంబుఁ జెప్పెదఁ జక్కఁగా వినుము
మనుజేంద్ర! నాదుదాము వ్యాళికటులు
మొనయునహంకారమున బలాయువులఁ
దాము గోల్పడి దేవతల గోడి రనుచు
సామంబుతో మళ్ళి శంబరాసురుఁడు
అమలాత్ములను నిరహంకారమతుల
నమితసుశాంతుల నధ్యాత్మవిదులఁ
బుట్టింప జలధి బుద్బుదములమాడ్కిఁ
బుట్టి యద్భుతముగాఁ బుగుహూతముఖులఁ
దఱిమి జయించి సంతసము దీపింపఁ
బరమపదంబును బ్రాపించి రపుడె
పరఁగ దుర్వాసనాబద్ధమానసము
సరససుజ్ఞానవాసనచేతఁ గ్రాఁగి
సతతంబు విమలమై శాంతిని బొందు
నతిశయంబగు సమ్యగాలోకనంబు
చే చిత్త మణఁగు నార్చినదీపమట్లు
నీచంద మిపుడు నీ కేను జెప్పినది
యేలన్న నీవిశ్వ మెల్ల మాయికము
గా లక్ష్యకముఁ జూతుఁ గాకంచుఁ దాము
భీములకథలఁ జెప్పితి నన్న రాముఁ
డామునిఁ గాంచి విశ్వాతీతమైన

పరమాత్మయందుఁ బ్రపంచ మేరీతి
నిర వొందు ననఁగ మునీంద్రుఁ డిట్లనియె
నమలాత్మ! రామ! చిదాకాశమందు
భ్రమకాకరంబై ప్రపంచ మంతయును
నూరక యెండమావులయందు నీళ్లు
పాఱినగతిఁ గనంబడు మృగంబులకు
నటువలెఁ దనయాత్మ నంటినమదము
పటిమ నన్యుఁడ నని భ్రమ నొందు దేహి
మఱపను నజ్ఞానమహిమంబుచేత
నరయ నేరక యాతఁ డతఁడు గాకుండు
వెలయు దీపమునందు వెలుఁగున్నకరణిఁ
దెలియ భానునియందు దీపమున్నట్లు
పొసఁగుచిత్తున జగంబులు దోఁచుచుండు
నసమానచరిత! నీ వంతరంగమున
భావింపుచుండు మీపరమరహస్య
మే వేళ ననిన మునీంద్రు నీక్షించి
పలికె శ్రీరాముఁ డోపరమమునీంద్ర!
నెలవుగా క్షీరాబ్ధినిధితరంగముల
వలె నుండు మీసాగవాక్యముల్ వినఁగ
నలఘునుజ్ఞానోదయం బయ్యె మదిని
నడర జ్ఞానోదయం బయ్యున్నఁ గాని
గడియగడియకుఁ జీఁకటియు వెలుంగు

వలనుగాఁ జలి యెండ వర్షమేసుంబు
గలిగించుచందంబుగా నామనంబు
గలిబిలి చేసి సంకల్పవికల్ప
ములను బుట్టించు నిర్మూలంబుగాదు
అరయ ననంతంబు నప్రమేయంబు
పరము నేకమును సర్వము నైనబ్రహ్మ
యందు సృష్టి లయంబు లగు వికారంబు
లెందుకు జనియించె నీహేతు వేమి
యనిన వసిష్ఠుఁ డిట్లనె రాముఁ జూచి
యనఘ! యథార్థవాక్యార్థంబు లగుచుఁ
దనరు పూర్వాపరార్థ నిరూపణలకు
మొనసి చూడ విరోధములు గల్గ వెందు
సుజ్ఞానదృష్టిచే సూటిగాఁ జూడ
నజ్ఞానభావంబు నంటుమనంబు
రూపింప విద్యాస్వరూపమై వెలుఁగు
నాపట్ల నస్త్ర మయ్యస్త్రంబుచేత
క్రమముగా గరళ మాగరళంబుచేత
భ్రమ చెడ ఖండింపఁబడినచందమున
ననుమానవిరహితమై యున్న సూక్ష్మ
మనముచేత మనంబు మడియుచు నుండు
వెలయు ననాది యవిద్య యేరీతిఁ
గలుగునో యనుచింత కడముట్ట విడిచి

నిరతంబు పరతత్త్వనియతి నవిద్య
నతిముఖిఁ జెఱుచు నెట్లను విచారంబు
నీయాత్మయం దుంచు నెల వెందు లేక
నాయవిద్య నశించునపుడు తజ్జనన
కారణ మాత్మకుఁ గనిపించు ననిన
శ్రీరాముఁ డనియె నాజీవుండు మించి
తామసరూపంబు దాల్చి హరించి
ధామంబు నొందువిధం బెట్టు లనిన
మానియిట్లనియె బ్రహ్మశరీర మొందు
మానితచరితంబు మది నిల్చి వినుము
అరయఁగా దేశకాలాదులు లేక
పరుసగాఁ జూచిన వస్తుభేదంబు
లేక యంతట నొక్క లీలగా నుండి
యాకాశనిభమగు నాత్మతత్త్వంబు
అదియె బ్రహ్మశరీర మనఁబడుచుండు
వదలక యుండెడి వాసనాంశమ్ము
చేత జీవుండగు జీవునివలన
నాతతంబుగ సంశయాత్మకంబైన
మది గల్గె దాని నిర్మలశక్తియందుఁ
గదిసి శబ్దోన్ముఖాకాశాదిభూత
సముదయం బుదయింప సకలప్రపంచ
మమితమై గనుపట్టె నాకాశమందు

ననలకణమురీతి నాద్యహంకార
ఘనబుద్ధిబీజసంకలిత దేహంబు
కనుపట్టి పురియష్టకం బను పేర
మొనసూపుచును భూతముల హృదబ్జముల
మెలఁగుచు నుండు తుమ్మెదరీతి నుండు
బలసి పిమ్మట మనోభావ వేగమున
లలిమీఱ బిల్వఫలంబుచందమున
సొలయక బలువుగా స్థూలమై యదియె
చెలువొప్పఁ గరఁగిపోసినపైఁడిబొమ్మ
వలెఁ బ్రకాశించి యవ్వల నాకసమున
మొనసి తత్త్వద్రూపముల వెల్గుచుండుఁ
దనరఁగా వాని కూర్ధ్వంబు శిరంబు
నుదరంబు మధ్యంబు నొగి హస్తములును
ముదమొప్పఁ దగుపార్శ్వములు పాదములును
చాల నధఃప్రదేశముగాఁగ నిట్లు
కాలవశంబునఁ గాయమై నిలిచి
గణుతి కెక్కుచు బుద్ధి ఘనతత్త్వముఖ్య
గుణములు తనయందు గుమికూడి మెఱయఁ
దరమిడి లోకపితామహుండైన
పరమేష్ఠి యుదయించుఁ బరమార్థమైన
యతనికి జన్మలయంబులు గల్గ
వతిశయమిథ్యలైనట్టు భావనల

చేతనే గలవంచుఁ జెప్పఁగాఁబడును
ఖ్యాతిగా నటుగానఁ గర్మసంసార
కలిత తృష్ణాభుజంగంబును ద్రుంచి
యలఘుసౌఖ్యము నొందు మాదిత్యకులజ!
మొనయు నజ్ఞానాంశములు సతీసుతులు
ధనధాన్యముఖసంపదలుగాఁ దలంచి
మొనసి తత్సుఖదుఃఖముల మది రోసి
నను సదా నిశ్చలానందంబు కుదురు
నరయఁగా మూర్ఖాత్ము లగువారితలఁపు
లటిమటి మోహశోకాబ్ధులఁ ముసుఁగు
నటువంటి తలఁపులే యతివివేకులకు
ఘటితవైరాగ్యసౌఖ్యంబు పుట్టించి
జననాథ! చేఁ దప్పి చనినట్టికార్య
మునకు జింతింప కిమ్ముగ దానివిడువు
మలకాలవశమున నబ్బినసౌఖ్య
ముల నీ వనుభవించు మోహివిగాక
కలిగెడు సుఖము దుఃఖము మిథ్య యనుచుఁ
దెలియ నేర్చిన మహాధీరచిత్తుండు
ఆసుఖదుఃఖంబులం దంటి యంట
కీసూర్యుఁ డున్నట్లు నింపొందు చుండు
నొకవేళ శివునిచే నుదయించు సృష్టి
యొకవేళ నజునిచే నుద్భవం బగును

నొకవేళ విష్ణుదేవునిచేతఁ గల్గు
నొకయెడ మునులచే నుత్పన్న మగును
నొకతఱిఁ గమలమం దుదయించు బ్రహ్మ
యొకవేళ జనియించు నుదకంబునందు
నొకకాలమునఁ బుట్టు నురుతరాండమున
నొకవేళఁ బొడమును వ్యోమంబునందు
నొకవేళఁ దరులతాయుత మగు భూమి
యొకవేళ నరులతో నొప్పు సిద్ధాత్రి
యొకవేళ నాకాశ ముదయించు మొదట
నొకవేళ యీభూమి యుదయించుఁ దొలుత
నొకవేళ నాదియం దుదకంబు పుట్టు
నొకవేళ పావకుం డుదయించు మొదట
నొకవేళఁ దొలి వాయు వుద్భవం బందు
నిఁక నెన్ని చెప్పు దనేకచిత్రములఁ
బ్రకటమై తోఁచుఁ బ్రపంచ మీరీతి
నొకబ్రహ్మపుట్టు వే నొనరఁ జెప్పితిని
నమితంబులైన బ్రహ్మల పుట్టువులును
గ్రమముగా నెవరును గణుతింప లేరు
నిక్కంబుగా నిది నిర్ణయం బనుచుఁ
జక్కఁగా సృష్టిముచ్చట చెప్పఁ దరమె
మానవేశ్వర! జగన్మాయాస్వరూప
మేను జెప్పెద నది యెట్లన్న వినుము

భూతోత్పత్తి.

అనఘాత్మ! దాశూరుఁ డను మునితండ్రి
చనిపోవఁగాఁ జూచి జనకునికొఱకు
నలుగెత్తి దాశూరుఁ డేడ్వ నవ్విధము
తెలిసి తెప్పున వనదేవత యటకుఁ
జని జనించినవారు చచ్చుట నిజము
గనుక నీ వింక దుఃఖంబును విడువు
మని యూఱడింపఁగా నోఁగాక యనుచుఁ
దనతండ్రి కటనె యత్తగినకర్మముల
సుస్థిరమతిని దాశూరుండు చేసి
యస్థిరంబు శరీర మని తాఁ దపంబు
సేయ సంకల్పించి క్షితి నుండ రోసి
యాయెడ నొక్కవృక్షాగ్రంబుఁ జేరి
యతిశయంబగు తప మం దాచరింప
నతనికిఁ బ్రత్యక్షమై హుతాశనుఁడు
వరముల నియ్యఁగా వాఁ డటుమీఁద
మరి పెంపుతో జన్నములు చేయఁ దలఁచి
పరమభక్తిని వనస్పతిని గుఱించి
పరఁగఁ బదేండ్లు తపం బాచరించి
మదిలోన యజ్ఞసామగ్రి నిగూర్చి
సదమలమతిని నిర్జరుల రప్పించి

శ్రామరొప్ప నరహయగోమేధయాగ
సముదయంబులు పెక్కు పావ్రంతంబునందె
తా నాచరింపఁ దత్త్వజ్ఞాన మాత్మ
లోనె ప్రకాశింప లోకజాలముల
నిరసించి యటమీఁద నిస్పృహుం డగుచుఁ
బరమైన నిర్వికల్పసమాధి నుండె
నలరుచు నంతట నతని ధన్యతను
దెలియుటకై వనదేవత యతని
జేరి తా వందనాల్ చేసి నుతించి
ధీర! దాశూర! నాదెసఁ గృపనుంచి
యివుడు నా శోకవుత్త్రుని మిగాయకున్న
నపరిమితాగ్నిలో నైనను జొచ్చి
తనువు నీ కర్పింతుఁ దక్కక యిచట
ననవిని నవ్వుచు నామహామహుఁడు
తనచేతికమల మాతరలాక్షి కిచ్చి
వనిత! మాసమునకు వరవుత్త్రకుండు
గలుగు నన్నిటు బలాత్కారంబు చేసి
యలరుచు సుతుని నీ వడిగితి గాన
జనియించు సుతుఁడు విజ్ఞాని యౌ నననిన
విని యది పలికె నోవిమలాత్మ! నాకు
సుజ్ఞాని యైనట్టి సుతుఁడు గల్గినను
బ్రజ్ఞాసమేత! నీ నీపదసేవచేయ

నే వాని నీచెంత నిలిపెద ననుచు
నావనదేవత యట మ్రొక్కి పోయి
మాసంబునకు సత్కుమారునిం గాంచి
యాసుతుం గొనిచని యచలాత్మ యగుచు
మ్రొక్కి యాదాశూరు మున్నిడి పలికె
నిక్కంబుగా వీని నీసేవకొఱకుఁ
గని మీ కొసంగి తిక్కడ వీనిఁ బ్రోవు
మని పుత్త్రు నందుంచి యరిగె నద్దేవి
యావల దాశూరుఁ డాపుత్త్రకునకు
వేవేగ వేదాదివిద్య లన్నియును
నరలేక చెప్పి వేదాంతరహస్య
మెఱిఁగింప నొక్కనాఁ డిట్లని పలికె
నోవరపుత్త్ర! నీ కొకకథ నేను
భావించి చెప్పెదఁ బట్టుగా వినుము
అది యెట్టు లనిన ఖోత్థాభిధానుండు
సదమలచరితుండు సమ్యగాకార
కలితుఁ డతఁడు చేయు కార్యముల్ దుఃఖ
ములు నగుచు ననేకములు సముద్రమునఁ
బుట్టుతరంగలు పొడముచు నుండు
నట్టిరీతి నశక్య మగుచుండ నతఁడు
సరవిని విహారణక్షునకై త్రితనువు
లఱిముఱి ధరియించి యలరుచు నుండుఁ

వలకొని యమ్మూఁడు తనువులు లోక
ములయందు నిండి యిమ్మగ నుత్తమంబు
ననఁగను మధ్యమం బనఁగఁ గనిష్ఠ
మనఁగఁ గలుగుచుండు నాస్వోర్ద్ధనామ
ధేయుండు నెవుడు తద్దేహత్రయమును
బాయక యుండదందుఁ బక్షిచందమునఁ
నురవడిఁ జలియింపుచుండె నటంచు
సురుచిరమతినిదాఘూరుండు దెలుప
విని యాకుమారుండు వెఱఁగొంది యతని
కనియె నిట్లనుచు నోద్దాభిధానుండు
ఎవ్వఁడు దేహంబు లెన్ని ధరించె
నెవ్విధంబునఁ జరియింపుచు నుండెఁ
దేటగా వివరించి తెలుపుఁ డటన్నఁ
బాటించి యమ్ముని ప్రవరుఁ డిట్లనియె
విను పుత్ర! సంసారవిభ్రమచక్ర
మనఁబడునది దీనియం దనేకములు
గా వస్తువితతులు గలుగుచు నుండుఁ
గావున నచ్చిదాకాశంబునందుఁ
బూనిన సంకల్పపురుషుఁ డనంగఁ
దాన జనింపుచుఁ దా లీన మగుచు
వేడుకల్ చూపుచు వెలుఁగుచునుండు
వాఁ డగు సర్వవిశ్వమటంచు నెఱుఁగు

హరిహరవిధిసురేంద్రాదు లందఱును
బొరి వాని యవయవంబులుగా నెఱుంగు
మతిశయసత్యలోకాదిలోకంబు
లతని నివాసంబు లగుచుండు మఱియు
వానితలంపున వనజసంభవుఁడు
పూని జనించె నద్భుతవిశేషముల
నిట్టిసంకల్పమహీపాలకుండు
మట్టుమీఱుచు నధమంబు నుత్తమము
ననఁగాను మధ్యమం బనఁగ నొప్పుచును
దనరుచున్నటువంటి తామససత్వ
రాజసగుణశరీరంబులు మూఁడు
మోజగాఁ దాల్చు నిమ్ముగ నదెట్లనిన
సరవిని దామససంకల్పమహిమ
నఱిముఱిఁ గ్రిమికీటకాదులై నట్టి
జననంబు లొందును సత్వసంకల్ప
మున వివేకశరీరములను ధరించు
సారెకు రాజససంకల్పమహిమ
నారాయణుండు దేహముల ధరించు
మొనసి యీసంకల్పములు మూఁడు విడిచి
తనలోని పరమాత్మతత్త్వంబుఁ దెలియఁ
గోరుసంకల్పంబు కొనసాఁగి పొడము
నారూఢిగాఁ బొందు నయ్యాత్మయందు

సరసాత్మ సర్వవిషయజాలములను
నిరసించి విడిచిన నిర్మలమనము
చేతనే మనమును జెదరిపోనీక
యేతీరుగానైన నెఱిఁగి బంధించి
పట్టుచు మఱిమఱి బాహ్యాంతరములఁ
బుట్టెడిసంకల్పముల వీడు మనిన
విని యాశ్రామారుండు వేగ నిట్లనియె
జనక! యీసంకల్పజాల మెచ్చోట
గలుగుచు నుండు నేగతి వృద్ధిఁబొందు
విలయ మెట్లగు నది? వివరింపు మనినఁ
దనయుని మన్నించి దాశూరుఁ డనియె
వినుమా యనంతంబు విమల మద్వయము
నన(దగు పరమాత్మ కాదికాలమున
జననమైనట్టి సంసారోన్ముఖతయె
అవిరళసంకల్ప మగు నదె ట్లనిన
లవమాత్ర మగుచు నుల్లాసంబు నాత్మ
రూపింపఁగ జడస్వరూపమై మింటఁ
జూపట్టు జలదంబు చొప్పున మించి
దట్టమై తాను జిత్తం బగుచుండుఁ
బట్టుగా మాయాప్రపంచభావనకుఁ
గన వ్యతిరిక్తంబుగాఁ దోఁచుచుండు
ననుపొందఁగా బీజ మంకురం బైన

గతిఁ బ్రపంచంబు సంకల్పమే యగును
బ్రతిభ నీసంకల్పభావన తనకుఁ
దానె గల్గుచుఁ దనంతనె వృద్ధి యగుచుఁ
దానె యణఁగు నీటితరఁగలరీతిఁ
గాన దీన సుఖంబు గలుగ దెన్నటికిఁ
బూని మహాదుఃఖములను బుట్టించుఁ
గావున నీవు సంకల్పభావనలఁ
బోవీడి సుఖమొందు పుత్ర! యెట్లనిన
మొనసిన సంకల్పములు నశించినను
మునుపు ఫుట్టుప్రయత్నములు గల్గ వవల
వరుస భావనసభావంబు చేసినను
గరఁగి సంకల్పముల్ గళితంబు లగును
గడను సంకల్పముల్ గళితంబు లైన
నెడలేని సంతోష మిరవొందు మదిని
జనన మొందెడి యసత్సంకల్పములను
మొనసి తత్సంకల్పమున నిగ్రహించు
మనముచే మనమును మడియించు మవలఁ
గనినను నీకుఁ దుష్కరము గా దెద్ది
యనుచు దాశూరుఁ డిట్లని కుమారునకు
వినిపించెఁ బరమైన వేదాంత మనుచు
ముని దయమీఱ రాముని కెఱింగించి
మనము రంజిల్లఁగా మరల నిట్లనియె

నిలను మనోజాల మిట్టిది యనుచుఁ
దెలిసి ధీరతను వర్తింపుచునుండు
లీలగాఁ దుద మొదల్ లేదు కాలమున
కేలాగుఁ జూచిన నిదమిత్థ మనుచు
నెఱుఁగ శక్యంబుగా దెన్నసూ తేండ్లు
నరుఁడు జీవించు నిర్ణయముగా ననుచుఁ
బట్టుగా వేదంబు పలుకుచునుండు
నట్టి నియతి దప్పు నర్ధకాలంబు
బ్రదికి యుండుట దుర్లభంబుగా నుండు
యిది నాది నే నని యెల్లమానవులు
వదలక సంసారవనధిలో మునిఁగి
సదమలజ్ఞానవిచారంబు లేక
కాలమృత్యువుకోటి కబళంబు లగుచు
భూలోకమున గిట్టి పుట్టుట సుఖము
కాదని వైరాగ్యకలితాత్ములైన
వేదాంతివేత్త లేవిధమున ధరను
మెలఁగుచుండుదు రట్లు మెలఁగుచు నుండు
కలుగ వారల జన్మకర్మదుఃఖములు
అంతరాస్థ నణంచి యట సేయుపనుల
నెంతని విడువక యొఱుక దప్పకయు
సేయుఁగాఁ దగుపనుల్ చేయుచుండినను
మాయలే కణఁగు చిన్మయ మగునంత

నిచ్ఛలేకయె యాత్మ యెపుడు తనంత
స్వచ్ఛమై వెలిఁగెడిచందంబుగాను
నణురూపమగు పరమాత్మునియందు
గణుతి కెక్కుచును లోకములు తమంత
నే తాము లీలగా నెరసి వెలుంగు
నాతతంబుగ నాత్మయందుఁ గర్తృత్వ
మును నకర్తృత్వ మిమ్ముగఁ దాఁచుచుండుఁ
గనుఁగొను నాసలేకయె చేయుచుండుఁ
గనుకను దాఁ గర్త గా దాకకర్త
యొనరంగఁ దనచెంత నుండుటం జేసి
పూని కార్యముల నెప్పుడు చేయు నెడల
దాను గర్త నటంచుఁ దలఁపక సేయఁ
దగుకార్యములు చేసి తాఁ గర్త నసక
జగతి నిర్లేపసంజ్ఞను బొందవలయు
నటు గాకయుండిన నంతటి కేను
ఘటికుఁడ నని నీవె కర్తృత్వ మొంది
సకలకార్యములను సమబుద్ధిచేత
వికలత లేక వివేకివై నడుపు
మొలుచు రాగద్వేషముల మోదభేద
ములయందుఁ బొందకిమ్ముగ నెప్పుడైన
లలిని సంకల్పజాలంబు నణంపఁ
జెలువొప్పు నమతచేఁ జిత్తు దీపించుఁ

గాన నకర్తృత్వకర్తృత్వములను
మాని మనోలయమార్గంబు నొంది
నీవు సుఖింపుచు నెమ్మది నాత్మ
భావించినంతనె పరిపూర్ణముగను
దనువు తా నను నహం తను విచారింప
నునిశితంబుగఁ గాలసూత్రనారకము
గాన వీడందగు ఘటము నే ననుట
మానవేశ్వర! యొక్క మర్మంబు వినుము
అంతకు నేఁ గర్త ననియైనఁ దలఁపు
మంతకుఁ గర్త గా ననియైనఁ దలఁపు
మింతటికిని గర్త యెవఁడు నే నెవఁడ
నింతంత యనఁగూడ దీవింత యనుచు
నైనఁ దలఁపుచుండు మస్థిరంబైన
మేను నే ననకు సుమీ! రామ! దేహ
వాసన బంధమౌ వరుసగా సర్వ
వాసనాత్యయము జీవన్ముక్తి యనుచుఁ
దెలిసి యావలన ముక్తిని గోరవలదు
వలనొప్పఁగా మనోవాసనావళిని
బరిహరింపుచు మహాపావనసత్వ
వరగుణస్నేహాదివాసనలందుఁ
దగులుచు వర్తించి తద్వర్తనముల
దిగనాడి యటమీఁద ధీరత మీఱఁ

బొసఁగ నంతట శాంతిఁ బొంది యామీఁద
నసదృశచిన్మాత్రమందు సుఖించి
మఱి మనోబుద్ధిసమన్వితం బగుచు
మెఱయు వాసన నటుమీఁద వర్జించి
తఱుచైన చిరసమాధానంబుచేత
నెఱుకకు నెఱుకగా నేకాగ్రమతిని
దెలిసితి వెడ్డి యదియు వీడు మవల
విలసితంబగు మనోవృత్తిని జేసి
మొలుచు నఖిలదృశ్యముల వీడినపుడు
చెలువొప్పు నెది విశేషించునో చూడ
నది మోక్ష మనఁబడు నాగుఱియందుఁ
గుదిరిన ధన్యుండు గురుఁ డనం దగును
నాగురుతరపుణ్యుఁ డటు జ్ఞానకర్మ
యోగముల్ మరలఁ జేయుచునున్న మేలె
చేయకుండిన మేలె సిద్ధించు నతని
కేయెడఁ గొదువలే దినకులోత్తంస!
నిలకడయైనట్టి నిర్లేపయుక్తి
గలవాని సంసారకాంక్ష గోష్పదము
వలె నుండి యణఁగు నవ్వల లేపయుక్తి
గలవానిసంసారకాంక్ష మహాబ్ధి
వలెఁ బొంగి కడపట వాని ముంచు నని
పలికి క్రమ్మఱ మునిప్రవరుఁ డిట్లనియె

జననాథ! యింక నొకసరణిం జెప్పెదను
విను మది యెట్లన్న విబుధదేశికుని
తనయుండు కచుం డాత్మతత్త్వసమాధి
నొనరంగం గూర్చుండి యుండి యానిష్ఠ
చాలించి లేచి విశ్వంబు నీక్షించి
యాలోచనంబుగా నంతరంగమునం
దలంచె నిట్లనుచు భూతప్రపంచమున
వెలుంగుచుం బరమాత్మ వేఱుగా కెల్ల
దిక్కులం బూర్ణమై దీపించె నేను
నిక్కమై యంతట నిండి యున్నాండ
నెక్కడ పోవుదు నింక నేమిసేతు
నొక్కపరబ్రహ్మ యున్నదే యనుచుం
గనుకం దదన్య మెక్కడ లేదటంచుం
దనయనుభవముచేం దా పూర్ణుం డయ్యె
నని కచువృత్తాంత మమర వసిష్ఠ
ముని దెల్పి మరల రాముని కిట్టు లనియె
నెవ్వండు సత్యంబు నెనయుచునుండు
నవ్విమలుండు వాండె యనిశంబు కనుకం
గమలంబురీతిం బ్రకాశింపుచుండు
నమరం గోరండు కోర్కె లాత్మయం దెవుడు
మొనసి రమించు నిమ్ముగం జంద్రబింబ
మున శైత్యగుణము గ్రమ్ముచునుండుకరణి

నా యోగిహృదయమం దమలశాంతంబు
పాయక యుండు నప్పగిదిని జిత్త
శాంతి పొందుము రామచంద్ర! యీ బాహ్య
చింతల నొందక చెలఁగి సుఖించు
మో రామ! యిది రహస్యోపదేశంబు
సారంబుగా నెంచు స్వాంతమం దనుచుఁ
దెఱగొప్పఁగా ద్విస్థితిప్రకరణము
కరుణను విజయరాఘవునకుఁ దెలియ
నా వసిష్ఠుఁడు చెప్పె ననుచు వాల్మీకి
ప్రావీణ్యశాలి భరద్వాజమునికి
మనము రంజిలఁ జాల మన్నించి పొసఁగ
వినిపించె నత్యంతవిశదంబుగాను
యిది సోమనాథవిశ్వేశ్వరదివ్య
పదపద్మభక్తి సుబ్రహ్మణ్యయోగి
చరణాంబుజాతషట్చరణాయమాన
పరిపూర్ణనిత్యసద్భావనిమగ్న
మానసాంబుజ వెంగమాంబికారచిత
మై నిత్యమై సత్యమై ధన్యమైన
పామార్థసారసుజ్ఞానవాసిష్ఠ
రామాయణం బను రమ్యసద్ద్విపద
యం దెన్నఁగా ద్వితీయప్రకరణము
నందమై విమలమోక్షాకరం బగును

శ్రీతరిగొండనృసింహుఁ డనంగ
ఖ్యాతిగా వెలయు వేంకటరాయ నీదు
పదయుగళికి సమర్పణ మయ్యె దీని
సదమలులై వ్రాసి చదివిన వినిన
నరులు తాపత్రయార్ణవము తరించి
పరమైన నిర్వాణపదము నొందుదురు
భూచక్రమున నిది పురుషార్థమగుచు
నాచంద్రతారార్కమై యుండుఁ గాత!

ద్వితీయప్రకరణము సమాప్తము.

తృతీయప్రకరణము.

శ్రీతారకోల్లాస శేషాద్రివాస!
శ్రీతరిగొండనృసింహా! ధూతాంహా!
విన్నవించెద నిది వినుము వాల్మీకి
పన్నుగాఁ దెల్పిన పరతత్త్వసరణి
తగ విని యాభరద్వాజుండు పొసఁగ
మగుడి యిట్లనియె రామక్షితీంద్రునకు
నవల వసిష్ఠసంయమి మఱియేమి
వివరించి చెప్పెనో విమలాత్మ! యనిన
మెఱసిన దయను వాల్మీకి యిట్లనియె
వరగుణయుత! భరద్వాజ! రాఘవుని
జూచి వసిష్ఠుఁడచ్చుగ నిట్టు లనియె
నీచరాచరవిశ్వ మెల్ల మనంబు
చేతఁ గల్పితమై ప్రసిద్ధమా సరణి
ఖ్యాతిగా వింటివి గద రామచంద్ర!
నలువొప్ప నుపశమనప్రకరణము
తెలిపెద నెట్లన్నఁ దేటగా వినుము
జనకభూవిభుఁడు రాజ్యంబు చేయుచును
మనమున మోక్షధర్మంబును మఱచి

చరియించునపుడు వసంతకాలంబు
సరసమై రాఁగ నాజననాయకుండు
ఒకనాఁడు నడిరేయి నుల్లాస మెసఁగఁ
బ్రకటంబుగా నిజబలములఁ గూడి
వనవిహారముఁ జేసి వచ్చుచుండఁగను
ఘనతమాలమహీజగణమధ్యమందు
సిద్ధపురుషులు భాషింపుచుండఁగను
సద్ధర్మరతుఁడైన జనకుఁ డచ్చటికి
నరుగ నదృశ్యాంగులై వారు తమలో
పరతత్త్వసారానుభవవాక్యములను
దలఁచి ప్రస్తావోచితంబులుగాను
బలికిరి మఱి యందుఁ బ్రథమసిద్ధుండు
కనఁబడువస్తువుల్ గనుచున్నవాని
ఘనయోగమున నాత్మ ఖండంబుగాక
యమలమై నిశ్చలమగునట్టి జ్ఞాన
మమర భావింతు మదంతరంగమున
నదియుఁ గాక యభీష్ట మగు పదార్థంబు
విదితమై యబ్బినవేళ జనించు
నానంద మరయ బ్రహ్మానంద మనుచు
దాని భజింతు సిద్ధంబుగా ననుచుఁ
దెలివిగాఁ బల్కె ద్వితీయసిద్ధుండు
సలలితద్రష్టృదర్శనదృశ్యములను

దద్వాసనలను సిద్ధంబుగాఁ బాసి
విధ్వస్తతంబునై విమలంబు నగుచు
తనివినిచ్చుచు నాది దర్శనాభాస
మన నొప్పు నాత్మ నే ననిశంబు దలఁతు
నడరారఁ గలదు లే దను పక్షయుగము
నడుమ వసించి నిర్ణయముగా నన్ని
చెదరక పొడగానఁ జేయుచునుండు
నది యెద్ది దాని నే నాత్మ భావింతు
సాకార మనియు నిరాకార మనియు
నాకట శూన్యంబు నని నిశ్చయించు
జనమతంబులను నిశ్చయముగా విడిచి
యనఘసద్రూపచిదాకాశ మెద్ది
దాని నే నని చూతుఁ దప్పక యనుచు
నానిర్మలుఁడు పల్కె నవలఁ దృతీయ
సిద్ధుండు తనలోనఁ జింతించి పరమ
సిద్ధాంత మైనట్టి చిద్వస్తు వొకటి
వెలుఁగు నవ్వెలుఁగులో వెలుఁగునా వెలుఁగు
నలరి నేను దలంతు నంతరంగమున
నడరార నని పల్కె నవ్వల మఱియుఁ
దొడరి చతుర్థసిద్ధుఁడు పరమాత్మ
తనువులయం దీవిధంబుగా నిలిచి
కనుపించుచుండఁగాఁ గానక వేఱె

దేవుళ్ల వెతుకుచుఁ దిరిగెడి మనుజు
లేవిధంబునఁ దరియింతురో యనుచుఁ
బలికె నీనలుగురిపలుకు లాలించి
కలఁక నొందుచు జనకక్షితీశ్వరుఁడు
తనమదిలోఁ దానె తలఁచె నిట్లనుచు
ఘనతరమోక్షమార్గంబును మఱచి
యుంటి నిక్కడ సిద్ధు లుపదేశ మిచ్చి
రొంటిగా నొకవస్తు వున్నది యనుచు
నావస్తు వేను మదాంతరంగమున
భావించి నిర్వాణపదము నొందెదను
నక్కట! దేహేంద్రియాదిప్రపంచ
మెక్కడ వచ్చె నా కిది యేల యింక
నని యాత్మనందె మహావిరాగంబు
పెనఁగొను చుండఁగా ఖేదంబు మఱచి
తాను నందొకకొంతతడవు సమాధి
గా నుండి తనుఁ దాను గని లేచి మరలఁ
బురిఁ జేరి సుజ్ఞానపూర్ణుఁడై రాజ్య
మిరువు నాసక్తి లే కేలుచు నన్ని
పనులందు నిర్లేపభావుఁడై దినము
లనువొంద నడిపించు నాదిత్యుకరణి
నడరి నిర్లేపుఁడై యఖిలకార్యముల
నడిపించుచుండె నానరనాయకుండు

పరువడి నాకాశఫలపాకసరణి
నెఱుకఁ బొందుచు మిథిలేంద్రుఁ డెల్లపుడు
మహిని నహంకార మమకారములను
సహజంబుగా వీడి సమచిత్తుఁ డయ్యె
నన విని శ్రీరాముఁ డమ్మునీశ్వరుని
గని యిట్టు లనియె నహంకారగుణము
విడుచుట కష్ట మీవివిధ దేహములు
పడి నాశమొందినప్పటి కీయహంత
మొనసూప కణఁగునేమో కాని తనువు
లోనరుచుండినయప్పు డుండక చనునె
యని రాఘవుఁడు సంశయము నొంది పలుక
విని మునీంద్రుఁడు రామవిభున కిట్లనియె
ననఘాత్మ! విను ధేయ మన నేయ మనఁగఁ
దనరారు రెండువిధము లవె ట్లనిన
నీపదార్థములు నా కిష్టంబు లనక
యాపదార్థంబులం దాసక్తి విడిచి
తా నూరకే చేయఁదగుపను లెల్ల
మానక సేయుచు మమత వర్జించి
సమబుద్ధిచే సర్వశాంతుఁడై యున్న
నమరు ధేయత్యాగ మగు నవ్విధంబు
నెనవుగా సర్వంబు నేనను బుద్ధి
జనియింప సకలవాసనలు లయించు

స్వాంతంబుతో దేహసంబంధ మెడలు
నంత నావిధము నేయత్యాగ మగును
కాయమే నను నహంకారవాసనల
నేయెడలను బొంద కిల విసర్జించి
కర్మవాసనలను గడముట్ట విడిచి
నిర్మలస్వాంతుఁ డై నిఖిల మే ననుచు
నచలాత్ముఁ డగుట నేయత్యాగ మగును
ప్రచురనేయత్యాగభావన నొంది
సంపూర్ణదృష్టిచే సర్వ మీ వగుచు
నింపుమీఱ సుఖింపు మినకులోత్తంస!
వెలికార్యములయందు వివిధకర్తృత్వ
ముల నొంది నడుపు మిమ్ముగ రాజ్యపదము
అనిశ మాతుర్యంబునందుఁ గర్తృత్వ
మున నొంద కానందమును బొందుచుండు
మెలవుగాఁ గొందఱు మిత్రు లటంచు
చలముతోఁ గొందఱు శత్రు లటంచుఁ
దలఁపక వస్తుసత్తను విచారించి
యలరి బంధువు లంద ఱంచు విభావించి
కలఁత నొందక సదాఖండభావమునఁ
జెలఁగుచు సంతోషచిత్తుండ వగుము
తోడరు నహంకృతి దుఃఖంబు దాని
విడుచుటే సుఖ మింక విను మోక్షసరణి

ధరణిఁ బూర్వము దీర్ఘతపుఁ డను వాని
వరసుతుల్ పుణ్యపావను లనఁ గలరు
అం దగ్రజుఁడు పుణ్యుఁ డమలవిజ్ఞాని
సందడిం బడక సంసారంబు విడిచి
లలితుఁడై విజనస్థలమున సమాధి
సలుపుచుండఁగ వాని జనకుండు కాల
గతి నొంది పడిపోవఁగాఁ బావనుండు
మతిని దుఃఖించి బ్రాహ్మణులతో నందుఁ
దనతండ్రి కటు చేయఁదగు క్రియల్ చేసి
జనకున కేడ్చి యచ్చట నిల్వ కరిగి
యన్నను వెదకుచు నడవిలోఁ దిరుగు
చున్న నందొకచోట నుండి పుణ్యుండు
కనఁబడఁగాఁ జూచి కనలి పావనుఁడు
తనతండ్రిఁ బేర్కొని ధరణిపై వ్రాలి
పొరలి యేడ్వఁగఁ జూచి పుణ్యుండు వచ్చి
కరుణమీఱఁగ రెండు కరముల వానిఁ
గుదురుగాఁ దా నెత్తి కూర్చుండఁబెట్టి
వదనంబు నిమిరి యవ్వల నిట్టు లనియెఁ
దమ్ముఁడా! నీవిందుఁ దండ్రినిఁ దలఁచి
యిమ్మాడ్కి నేడ్చిన నిచటికి మరల
వచ్చునే నమ్మహావరతపోధనుఁడు
హెచ్చు బోధస్థితి నిరవుగాఁ బొందె

సతనిశరీరంబు నాత్మలోఁ దలఁచి
మతిజెడ నీ వేద్చుమాత్రమే కాని
యిందుల సుఖము లే దించుకంతైన
నెందఱు తలిదండ్రు లీవఱదనుకఁ
గలిగిరో వారిని గణుతింపఁదరమె
తెలివినొం దేద్వ్యక ధీరత్వ మెసఁగ
విను మహంకృతిచేత విస్తీర్ణ మగుచు
మొనసెడి మోహసముద్రంబులోన
బొలయు కెప్పుడు శుభాశుభసుఖదుఃఖ
ములు ఫేనబుద్బుదంబులమాడ్కిఁ బొడముఁ
చెదరెడి మరుమరీచికయందు జలము
కదలుచున్నటు దోఁచి కడపట మిథ్య
యగునట్టిభ్రాంతి కిట్లగపడి నీవు
పొగల నేటికి శాంతిఁ బొందు రక్తాస్థి
కలితమైనట్టి యీఘటపంజరమున
నిలుచు టెట్లని దాని నిరసించికొనుచు
ననిశంబు నీవు నే నను భేదబుద్ధి
నెనయక యంతటి నెఱుక పూర్ణముగ
నిండియున్నది యదే నీ వని తలఁపు
చుండు వివేకివై యుపశాంతిఁ బొందు
మొదటియహంకారమున మమకార
ముదయింపుచుండుఁ గావున నిది నీవు

విడువు మటన్న వివేకము లేక
నడలుచు నుండఁగా ననుజుని జూచి
పలికె నాపుణ్యుఁ డోపావన! యిపుడు
గలిగి పోయిన తండ్రికాయంబుఁ దలఁచి
మొనసి యేడ్చినరీతి ముసు జన్మజన్మ
మును గని పెంచిన ముచ్చటఁ జూచి
ధర వ్రాలిపోయిన తల్లిదండ్రులకుఁ
బోరిని నీ వేడ్వ మిప్పు డదెట్టు లనిన
నొకయద్రిశృంగమం దొకసింహమునకుఁ
బ్రకటంబుగా నీవు ప్రభవించినావు
పొలువగు దాశార్ణభూతలమందుఁ
దెలివి లే కీవు కోఁతికిఁ బుట్టినావు
సరవిఁ దుషారదేశమున భూపతికి
నరుదుగాఁ బుత్త్రుండవై పుట్టినావు
అలపౌండ్రదేశంబునం దటమీఁద
నలువొప్పఁ గాకంబునకుఁ బుట్టినావు
పొలుపొంద హైహయంబున మదదంతి
కలరి నీ వేనుఁగువై పుట్టినావు
కరుగుచు నవలఁ ద్రికర్తదేశమున
నురుఖరగర్భమం దుదయించినావు
సురఘుం డనెడువాని సుతుఁడవై పుట్టి
యిరవొందసాళ్వభూ మేలుచుండితివి

కటకట! యిట్లనేకశరీరములను
బటువేగమున నీవు పక్షిచందమున
సంచరించితి వట్టి జననీజనకుల
నెంచి నీ పితండ్రి కేడ్చినరీతి
వారికి నేడ్వఁగా వలదె యజ్ఞాన
మీరీతి విడువలే వేమందు నిన్ను
ధరణిఁ బూరుషునకుఁ దల్లిదండ్రులును
బోరి ననంతంబులు పొలిసిపోవుదురు
మురువొప్ప వనపత్రములు వ్రాలిపోవు
కరణి వ్రాలుచునుండుఁ గాయముల్ పెక్కు
లీతల్లిదండ్రులు నీబంధుమిత్రు
లీతనువులుఁ జూడ నెవుడు శాశ్వతమె
నీవు శోకింపకు నెమ్మది నొంది
పావన! విను మింకఁ బరతత్త్వసరణి
మొనసినయజ్ఞానమునఁ బుట్టి శోక
మును దత్త్వవిజ్ఞానమున నివారించు
మది నహంభావంబు మానిన శోక
ముదయింప కణఁగిపోవుచునుండు మేను
నే ననునది మాని నేనను తెలివి
నే నని భావించి నిను నీవు చూడు
మని పెక్కువిధముల నాత్మతత్త్వంబు
పనిఁబూని పుణ్యుండు పట్టఁ జెప్పినను

-విని పావనుఁడు తెలివిని బొంది యవలఁ
దనుఁ దాను భావించి తత్త్వవిజ్ఞాన
కలితుఁడై సకలదుఃఖంబుల మఱచి
యలఘుజీవన్ముక్తుఁ డయ్యె నటంచు
వరుసగాఁ బుణ్యపావనులవృత్తాంత
మెఱిఁగించి క్రమ్మఱ నిట్లనె మౌని
యోరామ! విను ధర నొక్కరొక్కరికి
సారసత్పుణ్యాతిశయమున విషయ
వాసన లణఁగు సర్వవిరక్తి గలుగు
నీసరణిని మది నితిహాస మొకటి
పనిఁబూని విను తొల్లి బలిచక్రవర్తి
వసువడ ధాత్రిని బదికోట్లయేండ్లు
పాలించి యట పుణ్యఫలపరిపాక
కాలంబు రాఁగ భోగములను రోసి
వరుసగాఁ దనకుఁ బూర్వము తనతండ్రి
యొఱుకకై యుపదేశ మిచ్చినవాక్య
సరణిఁ దలంచి యచ్చటనుండి పోయి
సరసాత్ముఁడగు నిజజనకునిఁ జేరి
పాదపద్మములకు భక్తితో మ్రొక్కి
వేదాంతసూక్తుల విన్నఁగోరి పలికె
జనక! యీసుఖదుఃఖజాలముల్ పొడమ
ననిశంబు మూలమైనట్టి దేశంబు

వది యవిద్య నీయీషణత్రయము
నాదరణముసేయ కణఁప విశ్రాంతి
పుట్టెడిచో బెట్టి భూరిసత్కరుణ
నట్టిచందంబు నా కానతిం డనిన
విని విరోచనుఁ డతివిశ్వాస మొదవ
తనసుతు నీక్షించి తగ నిట్టు లనియెఁ
గొడుక! చిదాకాశకోణకోటరము
కడువింత యగుచుఁ బ్రకాశింపుచుండు
నందు బ్రహ్మాండకోట్లణఁగి వర్తించు
నందెన్న భూతంబులైదును లేవు
అచటఁ దేజోమయుఁ డాఢ్యుఁ డవ్యయుఁడు
సుచరిత్రుఁడైన రాజు వెలుంగుచుండు
నతనిని యుక్తిచే నఖిలకార్యముల
హితత మొప్పఁగాఁ బెంప హెచ్చుచుఁ ద్రుంపఁ
గా నేర్చినటువంటి ఘనమంత్రివరుఁడు
పూని యందుండు నెప్పు డటంచుఁ దెలుప
నలబలి పల్కె నిట్లనుచు నోజనక!
కలకాల మలఘుప్రకాశమై మించి
వెలసి యాధివ్యాధివిరహితం బగుచు
నలరుదేశం బెద్ది యది యెట్టి దరయఁ
జెచ్చెర నేమిటిచే నందుఁ బొంద
వచ్చు నానృపుఁ డెట్టివాఁడు తన్మంత్రి

యనెడు ధీరుం డెవ్వఁ డానతిం డనఁగ
నెనసి విరోచనుం డిట్లని పలికె
ననఘాత్మ! యొకదేశ మనుటయే కాని
ఘనతరంబైన మోక్షస్థాన మదియె
భూరిసద్గుణపరిపూర్ణుఁ డవ్యయుఁడు
నారా జనఁగఁ బరమాత్ముఁ డాఘనుని
వరమంత్రి చిత్త మీవ్యాపారగతిని
తఱచుగా నింద్రియార్థములఁ బాలించు
నరుడుగా నంతటి కధికారి యగుచు
నతిముఱి నెవరియం దాపరమాత్మ
కడజారనియక మార్గంబున కడ్డ
పడి యావరించి ప్రపంచమం దుండు
నతని గెల్వఁగ నప్పరాత్మునిచేర
నతత మెవ్వరికిని శక్యంబుకాదు
గానఁ జిత్తమును దక్కక గెల్వవలయు
నానియమనుం బిప్పు డమరఁ జెప్పెదను
విను విరాగంబు వివేకంబు శాంత
మును బరమజ్ఞానమును గల్గెనేని
చిత్తశాత్రవునిఁ ద్రుంచియుఁ బరమాత్మ
చెంత నత్తఱిఁ జేరుధీరార్యయుక్తి
దప్ప నేమిటను జిత్తము గెల్వఁగూడ
దిప్పరమరహస్య మెఱిఁగి వర్తింపు

బలి! విను ధరణి నప్రాజ్ఞుం డనంగ
నలరు రల్పప్రాజ్ఞుఁ డనఁ బ్రాజ్ఞుఁ డనఁగ
మువ్వురు గల రందు మొనసి యప్రాజ్ఞుఁ
డెవ్వేళలను విషయేంద్రియసుఖము
మరగి వర్తించు సన్మార్గంబునందుఁ
జొరక విరక్తులఁ జూచి హసించు
తలఁపున శాస్త్రచింతన మొకపాలు
గలుగఁగా నంతలో గర్వింపుచుండు
వానిచిత్తము కర్మవాసనచేత
నూనదు మోక్షేచ్ఛ నొకవేళ నైన
నమర నల్పప్రాజ్ఞుఁ డగువాఁడు ధనము
విమలుఁడై కూర్చుచు విద్వజ్జనులకు
వరుసగా నొసఁగుచు వారిసాంగత్య
మిరవుగాఁ జేయుచు నింద్రియవిషయ
సరణుల రోయుచు సాధుమార్గముల
నెఱుఁగుచు మోక్షేచ్ఛ నెనయుచుఁ గ్రమము
గా తత్త్వవిజ్ఞానకలితాత్ముఁ డగుచు
నాతతమోక్షార్థుఁ డగుచు నానాఁట
నతులితప్రాజ్ఞుఁ డై నటువంటిపురుషుఁ
డతిశయుఁ డన నొప్పు నతఁడు చిత్తమునఁ
దలఁచి తనంతనే తాను వైరాగ్య
కలితుఁడై సకలభోగముల వర్జించి

తాను విచారించి తను దాను దెలియు
లేను జెప్పెద నది యెట్లన్న వినుము
హరిభక్తుఁడైన ప్రహ్లాదుఁ డాచక్రి
నరలేక సంతత మర్చింపుచుండి
పరమాత్మవిశ్రాంతిపర్యంత మైన
పరమవిచారంబు పరముగా నాత్మ
యొనరఁ బ్రకాశించు నెల్లెడం దాను (?)
నని నాఁడు బోధించె నంబుజాక్షుండు
అది యెట్టిదో నేను నరయ నెవ్వఁడనో
పదపడుసృష్టివిభ్రమము నెట్టిదియొ
యేది యంగీకార మెయ్యది కృత్య
మేది నేఁ దెలియుదు నెక్కడ పోదు
నడర భావింప నీయఖిలభూతములు
జడములే కాని యజడములు కావు
కావున నిది యాత్మ గాదు నా కన్య
మీవిశ్వ మని మది నెఱుగంగ వలయుఁ
బొరి జడం బనిలవిస్ఫురణ మనిత్య
మరసి భావించిన నసదుద్భవంబు
గాన దేహంబు నిక్కంబుగా నేను
గాన నే నెవరనో గణుతించి చూడఁ
బసమించునట్టి శబ్దస్పర్శరూప
రసగంధగుణము లారయ నేను గాను

అలమనోబుద్ధిచిత్తాహంకృతులను
నెలవుగా భావింప నే నవి గాను
నెఱుకయై యన్నిట నెఱుఁగుచు నుండు
సురచిరచిత్పురుషుండును నేను
భావింపఁగా సర్వపరిపూర్ణ ముగుచుఁ
దావలంబుగఁ బరతత్త్వంబు నేను
నాపరతత్త్వమం దఖిలేంద్రియములు
దీపించు జగములు దీపించు చుండు
నలపరబ్రహ్మ మే నైనందువలన
నలువొప్పఁగా నేను నామాచసమున
నాకు మ్రొక్కెదఁ జిదానందసద్రూప!
శ్రీకరానంతాత్మ! చిరకాలమునకు
నీవు నే నైతిని నేను నీవైతి
వేవిధంబున భేద మించుక లేదు
గనుక నే నాకు మ్రొక్కుందగుఁ గాన
మొనసి నాకే నేను మ్రొక్కెద ననుచుఁ
దనలోనె భాషించి తనుఁ దానె మఱచి
పనుపడ నిర్వికల్పసమాధియందు
నచలుఁడై పంచసహస్రవర్షములు
నుచితవృత్తిని నిల్చి యుండె నంతటను
బ్రాకటంబుగ రాజ్యపరిపాలనంబు
లేకుండినందున లేచి చోరకులు

లోఁగక పాతాళలోకంబు చెఱుప
సాగిరి ధర్మంబు సమసె నానాఁట
నావిధం బెఱిఁగి మహానుభావుండు
శ్రీవిష్ణుదేవుండు చిరకృపమీఱఁ
బక్షివాహన మెక్కి ప్రహ్లాదుచెంత
కక్షీణ తేజోమయాంగుఁడై వచ్చి
కదలక మెదల కఖండసమాధి
వదలక ప్రహ్లాదువరనిష్ఠఁ జూచి
ప్రేమతో జలదగంభీరభాషలను
వేమాఱుఁ బిలచిన విని లేవకున్న
హరి దిశల్ ఘూర్ణిల్ల నలఘుశంఖంబు
పొరిఁబొరి వరుసగాఁ బూరింపుచుండె
సరసమై శ్రీస్వామిశంఖారవంబు
విరివిగాఁ బ్రహ్లాదువీనులలోను
జొచ్చి మేల్కొల్పఁగా సూక్ష్మలక్ష్యంబు
నచ్చట విడిచి ప్రహ్లాదుండు చక్రి
చాలఁ బూరించెడి శంఖారవంబు
మేలిమిగా విని మేఘనాదంబు
విని చొక్కు(నెమ్మిలి)విధమునఁ జొక్కి
ఘనుఁడైన హరి నరగన్నులఁ జూచి
యప్పటికైన దేహస్మరణంబు
తెప్పున రాకున్నఁ దెలిసి మాధవుఁడు.

తనలోన నగుచు న త్తతిని బ్రహ్లాదు
కనుదోయి నివురుచుఁ గరుణ నిట్లనియె
యిదియేమి బాలక! యేను ని న్నిందుఁ
బదపడి పిలచినఁ బలుకకున్నావు
నను జూడు నను జూడు నాదిక్కుఁ జూడు
మని బుజ్జగింప బ్రహ్లాదుండు కనులు
చక్కఁగాఁ దెఱచి యాస్వామినిజూచి
మ్రొక్కి కరంబులు మొగిచి నిల్చినను
సంతోషమునఁ జూచి చక్రాయుధుండు
వింతగా నతని దా వీక్షించి పలికె
దనుజనాయక! నీవు తనువు నలింపఁ
బనిలేదు నీ వతిప్రజ్ఞ దీపింపఁ
బట్టభద్రుండవై పాతాళలోక
మిట్టట్టు చెదరిపోకేలుచునుండు
గతనేయహేయసంకల్పుఁడ వగుచు
హిత మొప్ప నిన్ను నీ వెఱిఁగిన వెనుక
నీమేను కలిమి లే మెంతమాత్రంబు
కామాదిశత్రువర్గంబు నణంచి
నీవు జీవన్ముక్తి నియతిని దనువు
తో విమలుండవై తుదముట్టఁగాను
నరమర లేక కల్పాంతపర్యంత
మిరవొంద నీరాజ్య మేలుచునుండు

మిను లొక్కమాటు పన్నిద్దఱు పొడమ
రనుపమశైలంబు లణఁగ నొక్కటను
జగము లన్నియు నొక్కసమయంబునంద
పొగలి నశింపవు పుణ్యాత్మ! నీవు
ఘటమునంత నలింపఁ గారణం బేమి
యిటమీఁద విషయంబు లింద్రియంబులును
జొరఁబడి వేధించు సుఖదుఃఖములును
గర మనురాగంబు కర్మవాసనలు
నిరతంబు బొంకించి నిన్నంటకుండు
వరము లిచ్చితి లెమ్ము వత్స! నీ వింక
నళుకుచు మూఢుండ నని తను దాను
దెలియక యూరకే దీనుండ ననుచుఁ
బామరుం డగువాఁడు బ్రతుకుటకన్న
భూమిమీఁద నణంగి పోవుట లెస్స
పటుతరాశాపాశబద్ధుఁడై చిత్త
మటునిటు నీడ్వఁగా నలమటం బడుచు
ధర శమం బొందక తామసుండైన
పురుషుఁ డుండుటకన్నఁ బోవుట మేలు
దనుజేంద్ర! సర్వభూతసముండ నగుచుఁ
దనివొంద నాత్మబోధనిమగ్నుఁ డగుచుఁ
దొడరునహంకారదూరుఁడై శాంతి
నెడబాయ కెల్లపు డెఱుకతో నుండు

విమలచిత్తునకు జీవిత మొప్పు నిలను
భ్రమల నెల్ల నణంచి బ్రహ్మానుభవము
సేయుచుండెడి నీకుఁ జింత యేమిటికిఁ
బాయక నీరాజ్యపదము పాలించు
మని యొప్పఁ జెప్పి పద్మాత్ముండు కృపను
బనిఁబూని యతనికిఁ బట్టంబు గట్టి
యొనరంగ సుఖియింపుచుండు మటంచు
దనుజారి యవల నంతర్ధాన మొందె
నన విని శ్రీరాముఁ డపు డావసిష్ఠ
మునిని వీక్షించి నిమ్ముగ నిట్టు లనియెఁ
బనుపడి యత్యంతపరిణతంబైన
దనుజాధివిభుని చిత్తము పాంచజన్య
ఘనరవం బెసఁగ నేకరణి మేల్కాంచియె
నన వసిష్ఠుం డిట్టు లనె రామ! వినుము
ఖర నది యెట్లన్న దగ్ధబీజంబు
కరణి జన్మాంకురకారిణిగాక
వరయోగివిమలహృద్వనజంబునందు
సరసమై శుద్ధవాసన గల్గియుండు
నది పావనియు నది యధ్యాత్మవతియుఁ
బొదుపగునిత్యప్రబుద్ధ యై పొసఁగి
మొనసి యనేకాబ్దములకైనఁ జెడక
యొనసి తత్తను వాశ్రయించి యొక్కొక్క

కాలంబునందుఁ బ్రకాశించి బాహ్యా
మాలోకనము సేయ నాకరం బగుచు
విలసితమైన సంవిత్తత్త్వపటిమ
తెలివిగా వృద్ధిఁ బొందింపుచునుండుఁ
గావునఁ జక్రిశంఖనినాద మేఁగ
నావేళ మేల్కాంచి యసురనాయకుఁడు
అనఘ! సంసారమాయకు నవమాన
మనునది లేదు నిత్యముగాదు లేక
గలిగియున్నటు దోఁచుఁ గావున దాని
నలరారుచేతోజయంబున నణఁప
వచ్చు మఱేమిటన్ వారింపరాదు
హెచ్చుచునుండున దెట్లన్న వినుము
అరుదుగా లవణవృత్తాంతంబు పూర్వ
మరసి చెప్పితి నిప్పు డటువంటిగాధి
చరితంబుఁ జెప్పెదఁ జక్కఁగాఁ దెలియు
మురునిష్ఠ నాదిదేవుండైన హరిని
ధ్యానించి గాధి గోదావరినీట
పూని యుగ్రతపంబు పొసఁగఁ జేయఁగను
నతనికిఁ బ్రత్యక్షమై చక్రి వరము
హితమొప్ప నడుగు నే నిచ్చెద ననిన
ముఱియుచు నాగాధి మ్రొక్కి నీమాయ
నెఱిఁగెడి యావరం బీవె లక్ష్మీశ!

యన విని హరి గాధి కావర మిచ్చి
చనె నట కొన్ని వాసరములు జరిగెఁ
దదనంతరమున గోదావరినీట
ముదముతో నాగాధిమునియు నచ్చోట
నలువొప్ప నఘమర్షణముసేయుతఱిని
వెలయుగాధికిఁ జిత్తవిస్మృతి పొడమఁ
దనయింటిలోఁ దనతనువుల వీడి
చని వేగ హూణదేశమునఁ జండాల
భామగర్భమునందుఁ బ్రభవించి పెరిఁగి
యామీఁదటను బెండ్లియాడి బిడ్డలను
గని పెంచుచుండఁగాఁ గాలవేగమునఁ
దనబిడ్డ లిల్లాలు తనువుల వీడి
చనినట్టి జాలిచే సైరింపలేక
కనలుచు నవల నక్కడనుండ కరిగి
పోయి తెప్పునఁ గీరపురిఁ జేరియుండె
నాయవనీశ్వరుఁ డచట దేహంబు
పడవైచి చనఁగ నప్పార్థివేంద్రునకుఁ
గొడుకు లేకున్నఁ దత్కుల మేలుటకును
దగినవాఁ డెవఁ డని తాను జింతించి
తెగువ నారాజ మంత్రిజనంబుఁ గూడి
మొనసి పట్టపుగజమును నలంకార
మొనరఁ గావించి పువ్వులదండ తొండ

మున నుంచి విడిచి రిమ్మగ నది పోయి
తనముందరికి వచ్చి ధరణీసురులను
వరరాజకులజుల వైశ్యశూద్రులను
దఱుముచుఁ జనిచని తా నొక్కచోట
నాలిబిడ్డలఁ బాసి యడలుచున్నట్టి
మాలనిమెడఁ బుష్పమాలిక నుంచె
నవుడు మంత్రులు మొదలైనట్టివారు
కపటంబు దెలియక గజముపై వాని
నెక్కించుకొని చని యిలఁ బ్రోవ నతని
నక్కడ తాము పట్టార్హునిఁ జేసి
కొలిచియుండఁగ వాఁడు కొంకింత లేక
చలితాత్ముఁడై రాజసతులను గూడి
పనిఁబూని వేడ్కనఁ బడియెడు రాజ్య
మొనరంగఁ బాలింపుచుండె నొప్పుగను
అట హూణదేశంబునం దుండి మాలఁ
డట నొక్కఁ డరుదెంచి యాదొరం గాంచి
తొలఁగక పూర్వబంధుత్వంబు నందుఁ
దెలుపఁగా నెఱిఁగి మంత్రిపురోహితాది
మనుజులు దెలిసి యామాలని దెచ్చి
ఘనముగాఁ బట్టంబు గట్టినకతనఁ
బాప మందఱికిని బ్రాపించెఁ గనుక
నీపాపమును నీఁగ నిందఱు మగ్న

యందుఁ బ్రవేశింత మని నిశ్చయించి
యందఱు గుమిగూడి యగ్నిలోఁ బడిరి
అదిచూచి చండాలుఁడైన యాప్రభువు
కొదికి యందఱు తనకొఱ కగ్నిలోనఁ
బొలిసిపోయిరి తాను భూమియం దుండ
వలెనే యనుచును బావకునిలో వాఁడు
తానును దుమికి యుత్తఱిఁ దెలివొంది
యానీట నున్న దేహంబుతో లేచి
కటకట! యిటువంటి కష్టదుర్దశల
కిటువలె లోనైన దేమొకో నాల్గు
గడియలలో నింత కర్మదుఃఖములఁ
బొడఁగంటి నిట్టియద్భుత మేమి చెలఁగె
గహనంబులందు వ్యాఘ్రము నిజేచ్ఛలను
విహరింపుచుండెడివిధమున సకల
మానవుల నశక్తి మాయలోఁ ద్రోచి
యూని తా భ్రమపెట్టుచుండుఁ జిత్తంబు
అనుచుఁ దలంచి నిజాశ్రమంబునకుఁ
జని గాధి చింతించుసమయంబునందుఁ
బొరిని వింతగఁ గీరపురినుండి యొక్క
ధరణీసురుఁడు గాధిదగ్గఱఁ జేరి
ఆవిప్రవరుఁ జూచి యాగాధి పూజ
గావించె నటుమీఁదఁ గ్రమముగాఁ గీర

పురవాసు లందఱు పొలిసినవిధము
వరుసగాఁ జెప్పిన వార్త లన్నియును
విని గాధి యది తనవృత్తాంతముగను
మనమున భావించి మఱునాఁడు పోయి
కరఁగుచుఁ దాఁ గలఁ గన్నమార్గమున
సరగున హూణదేశము ప్రవేశించి
యచ్చట తల్లియు నాలుఁబిడ్డలును
జచ్చినచోట్లు నిశ్చయముగాఁ జూచి
పోయి చెచ్చెరఁ గీరపురమందుఁ జేరి
యాయెడఁ దనకొలఁ కనలంబులోన
నాపురజను లంద ఱణఁగుట గాంచి
తాపమొందుచును విధాతచేఁతకును
గడు వెఱఁగంది యక్కడనుండి కదలి
తడయక క్రమ్మఱ దా వచ్చి యవలఁ
జెలువార నలసిన సింగంబురీతి
నలసి పూర్వాశ్రమమం దుండ కరిగి
తక్కకయొకశైలతటమందు నిలిచి
యొక్కఁడే విష్ణుదేవుని గూర్చి తపము
సలుపుచు నుండఁగా జలజాక్షుఁ డతని
కలరక ప్రత్యక్షమయ్యె నాహరిని
గని లేచి నమ్రుఁడై గాధి తా మ్రొక్కి
మొనసి కరంబులు మొగిచి యిట్లనియె

వోనలినాక్ష! నే నుదకమధ్యమున
నూని స్నానముసేయు చుండఁగా నాల్గు
గడియలలో బహుకాలదుఃఖముల
చెడ లేర కనుభవించిన కర్మ మేమి (?)
యీచిత్తవిభ్రమం బేల జనించె
నోచక్రి! దెలుపవే! యున్న దున్నటుల
ననవుడు విని విష్ణుఁ డాగాధి కనియె
విను విప్ర! నీ వది విశదంబుగాను
నెలమిని భూమాయాదు లీచిత్తమునకు
వెలిగాక యచటనే విరివిగా నుండు
మనమున నవ్విభ్రమస్వప్నగతుల
ననుభవించితివి నీ వఖిలకృత్యములు
తలఁచి కల్పించుచిత్తమునకుఁ జూడ
నిలను జండాలత్వ మెందైనఁ గలదె
శ్వపచత్వ మొందినసరణి నీమదికి
విపరీతముగఁ దోఁచువిధమున నతిథి
గనిపించె మఱియు నక్కడ హూణదేశ
మునను చండాలత్వమును బొంది నీవు
పుట్టుటయును గీరపురిఁ జేరి యచట
పట్టభద్రుండవై ప్రజల నేలుటయు
మదిలోనఁ బ్రతిభాసమాత్రం బటంచుఁ
బదపడి తెలియు మోబ్రాహ్మణోత్తంస!

తొలుత నీమదియందుఁ దోఁచిన వెల్లఁ
దెలివిగా నలహూణదేశవాసులకుఁ
బొలుపారు తత్కీరపురనివాసులకుఁ
జెలువొప్ప నీకుఁ దోఁచినప్రతిభాస
వలనఁ దద్భ్రాంతులు వరుసగాఁ గలిగె
నలరఁ దద్గతు లిది యది యనరాదు
మాయావిలాసమర్మము లీవిధమున
నాయెడఁ దోఁపించె నమర నందఱికి
నావిధ మెట్లన్న నాశ్చర్య మరయు
నోవిప్ర! విను మది హూణదేశమున
జనియించి యట కటంజకుఁ డను పేర
నొనరిన చండాలుఁ డొక్కఁడు తొలుతఁ
బెనుపొందఁ బెండ్లాము బిడ్డలు సమసి
రనుచు దుఃఖింపుచు నరిగి యాకీర
పురిని బట్టాప్తుఁడై భువిని బాలించి
పరువడి నగ్నిలోఁ బడినదే నిజము
మొనయు స్వసంబంధమునఁ జేసి చిత్త
మొనర నంతటఁ గల్గి యుండెడికతన
నా వేళ నీచిత్తమందాకటంచు
భావంబు దోఁచె నిబద్ధమాకరణి
నంతియె కాని నీ వరమరఁ బొంది
చింతింపవల దింకఁ జిత్తంబునందు

నతఁడ నే నితఁడఁ గానని భిన్నభావ
మతిచే నతిభ్రమమగ్నుఁ డైనట్టి
పురుషుండు సుఖదుఃఖపూరితుం డగును
మఱివక చిద్వస్తు మగ్నుఁ డైనట్టి
మానవుం డిలను నామాయను గెలిచి
తానె సర్వంబగు తత్త్వదృష్టినను
తపసి! నీ వాత్మతత్త్వంబు నెఱుంగ
వివు డందుచేఁ గల్గె నీభ్రాంతు లన్ని
మొనయు మాయాచక్రమున కీమనంబు
ఘననాభి దాని దక్క కణంపవలయుఁ
గావునఁ బదియేండ్లు కడముట్టఁ దపము
గావింపుచును మనోగ్రంథి ఛేదించి
నిను నీవె భావించు నిర్మలబోధ
జనియించు నని చెప్పి చనియె విష్ణుండు
తదనంతరమున నాధరణీసురుండు
పదపడి యచ్చోటు పాసి వేఱొక్క
నగమందుఁ జేరి నానాత్మవిభ్రాంతి
తెగువగా విడిచి యదే విచారముగఁ
దప మాచరించి తత్త్వజ్ఞాని యగుచు
నిపుణతచేఁ బొందె నిర్వాణపదము
శ్రీహరిధ్యానంబు చెడక భక్తులను
మోహాబ్ధి దాఁటించు ముక్తిఁ బొందించు

నని గాధి వృత్తాంత మావసిష్ఠుండు
మనము రంజిలఁ జెప్పి మరల నిట్లనియె
ధరణీశ! రామ! చిత్తజయౌషధంబు
సరసమై సంసారజాడ్యంబు నణఁచు
వేరె వెఱవుచేత విడువ దారోగ
మారయ వృద్ధియౌ నటుగాన నందు
అంటక చిత్తంబు నణఁచునుపాయ
మొంటిగా నూహింపుచుండఁగా వలయు
మెలుపుగా క్రిందటి మీఁదటికాల
ములఁ గల్గు సుఖదుఃఖములఁ దలంపకయు
మానుచుఁ దగ వర్తమానకాలమునఁ
బూనిక ననుభవంబునకు వచ్చినది
యనుభవింపుచు బాహ్యమందు వర్తించు
చును నిజాంతర్య భాసురలక్ష్యమందుఁ
బొంది సూక్ష్మంబైన బుద్ధియం దమరఁ
జెందిన చిత్తంబు చిత్పద మొందుఁ
గ్రమముగా భోగసంకల్పముల్ విడిచి
మమతాహముల మాని మది చల్లనైనఁ
జిరతరభావనాసిద్ధి నీయాత్మ
నెఱుకకు నెఱుకయై యింపొందుచుండు
తొడరెడి చిత్తవృత్తులు నశింపకయు
విడువదు సంసారవిభ్రమం బెపుడు

తనరారఁ బూర్వ ముద్దాలకుం డనెడు
మునిపుంగవుఁడు చిత్తమును గనిపెట్టి
పనిఁబూని శిక్షించి పరమందుఁ జెందె
ననిన శ్రీరాముఁ డిట్లనె మునినాథ!
గొనకొని యుద్దాలకుఁడు నిజచిత్త
మును గెల్చి సంతోషమున ముక్తుఁడైన
తెఱఁగు నాకతికృపఁ దెలుపవే యనినఁ
జిఱునవ్వునవ్వి వసిష్ఠుఁ డిట్లనియె
ననఘాత్మ యుద్దాలకాఖ్యచే నొప్పు
ముని గంధమాదనమున కేఁగి యచట
ఘనతరంబుగ వివేకస్వాంతుఁ డగుచుఁ
దనలోన తా నిట్లు దలఁచె నంతటికిఁ
బరమప్రధానమై ప్రాప్తమైనట్టి
సరసప్రకాశ మెచ్చట నుండి చూతు
నే నెన్నటికి దుఃఖనీరధిఁ గడచి
యానంద మొందుదు ననుచుఁ జింతించి
గ్రక్కున సకలసంకల్పముల్ విడిచి
యక్కడ పద్మాసనాసీనుఁ డగుచు
హరిని గుఱించి మహానిష్ఠమీఱఁ
జిరతరతప మొప్పఁ జేయుచు నుండె
నప్పు డతనిచిత్త మాధ్యానపటిమ
నెప్పుడో విడచి తా నేమేమొ తలఁచి

భ్రాంతికై వడిఁ దిరుగుచునుండు బెఱిఁగి
యాతపసుఁడు రోష మగ్గలింపఁగను
ఆచిత్తమును బట్టి యంతరంగమున
నాచక్రధరుని పాదాబ్జంబులందు
నిలిపి బంధించిన నిగుడి చిత్తంబు
తలఁపు లేమో తాను దలఁపుచు విషయ
వాసనలను గూడి వర్తించి మరల
నాసంయమీశ్వరు నచట వంచించి
తక్కక పక్షిచందమున బాహ్యమున
దిక్కుల నెగురుచుం దిరుగుచు మించి
యొకవేళ నం దుదయార్కునిపగిదిఁ
గకవికఁ జేయుచుఁ గనిపించుచుండు
నొకవేళ గగన మట్లూరక యుండు
నొకవేళ శూన్యమౌ నొకవేళ నుఱుకు
నొకవేళఁ దిరముగా నుండినట్లుండు
నొకవేళ యోజన లూరకె చేయు
నీవిధంబున నిల్వ కెగురుచిత్తమును
భావించి యచ్చోటుఁ బాసి యాతపసి
భూమియుఁ బరిభ్రమింపుచును జరించి
యామీఁద నొక్కనాఁ డందొకదిక్కు
తెరలు చిత్తంబు నుద్దేశించి తాను
పరుఁడై వివేకించి పలికె నిట్లనుచు

నక్కట చిత్తమా! హరియందు నిలువ
కెక్కడికో తేర కేఁగుచున్నావు
ధరను మాయాసంపదల విచారించి
కరఁగి నీ వేమి సౌఖ్యముల నొందెదవు
కామంబు లతిదుఃఖకరము లటంచు
ధీమంతు లగువారు తెలిసిన వేళ
నీప్రయత్నంబులు నిరసింతు రప్పు
డీప్రపంచముతోడ నేఁగెద వీవు
యింతలో న న్నిటు హింసలఁ బెట్టి
నంతట నీ కేమి యబ్బె సౌఖ్యంబు
శాంతామృతము గ్రోలి సంతసింపకయ
వింతవింతలఁ జూపు విషయసౌఖ్యముల
మరిగి నీ వరుగు టిస్సుహి నిసంతాన
తరు వాశ్రయింప కాతపకాలమందు
మరుభూమిలోఁ జైత్రమధ్యాహ్నమునను
జరియింపుచుండెడి చందంబుగాదె
మురియుచుఁ బాతాళమున నుండు మింటఁ
దిరుగుచు నుండు మే తెఱఁగున నైనఁ
దఱుచైన శమనామృతంబు గ్రోలఁగను
దొరకదు నీకు సంతోష మెందులను
మొనసిన కల్మిలేములు దలంపుచును
జనిఁబూని సుఖదుఃఖపరవశత్వమునఁ

జొక్కి ప్రుక్కుట మాని సుస్థిరజ్ఞాన
మొక్కటి సంతోష మొసఁగునటంచుఁ
దెలియలే వైతి వింద్రియముల కెపుడు
వలనుగా దాసునివలె మెలంగుచును
బరువడి శ్రోత్రియభావంబు నొంది
మురిసి ఘంటానాదమును విని చొక్కి
యుడుగక వేఁటకాఁ డొడ్డినవలను
బడు జింకగతిని లోఁబడకవే మనస!
చర్మభావము నొంది సంపదసుఖము
నర్మిలిఁ గోరి మహాగజేంద్రుండు
కరిణితో నెరయ నక్కడ పర్వబాఱి
యరిగి యచ్చటి వాదమందుఁ దాఁ గూలు
కరణిని సంసారగహనకూపమునఁ
బరువడి నెఱిదప్పి పడకవే మనస!
వదలక రసనభావము నొంది యొఱ్ఱ
నదిమి మ్రింగెద నంచు నరిగి గాలమును
మ్రింగి చచ్చినయట్టి మీనంబుపగిదిఁ
బొంగుచు రుచి గోరి పొలయకే మనస!
నేత్రభావము నొంది నిగుడుచు మీన
నేత్రలు మొదలుగా నెఱయ దృశ్యముల
యం దాసపడి యగ్ని నణఁగిన మిడుత
చందంబునను నీవు చావకే మనస!

పసుపడీ నాసికాభావంబు నొంది
ఘనసుగంధము గోరి కమలమధ్యమునఁ
జేరినభృంగంబుచెలువునఁ గర్మ
చిరవాసనలయందుఁ జిక్కకే మనస!
మెఱయు జింకయుఁ గరి మిడుత మీనంబు
నరయఁగా భృంగ మి ట్లాశలఁ బొంది
యొక్కటొక్కటిచేత నొకటొక టణఁగు
నక్కట! యిటువంటి యైదింద్రియముల
నెనసియుండంగ నీ వెటు తరించెదవు
చెనఁటులపొందు వర్జింపవే మనస!
యటువంటివాసన లన్ని బంధకము
లిటువంటిరీతుల నెఱిఁగి వైరాగ్య
చింతన సతతంబు చేసిన నీవు
శాంతిఁ బొందెదవు నిశ్చయముగా మనస!
యీవఱ కేను ని న్నెఱుఁగక భ్రమసి
నీవె నే ననుకొని నీవు గావించు
పనులు నేఁ జేసిన పనులంచుఁ దలఁచి
నిను వేఱుగాఁ జూడ నేరకుండితిని
సతత మందున నీవు శాంతిఁ బొందకయు
హితశత్రు వగుచు న న్నేఁచుచుండితివి
పరమాత్ము నంతట భావించి చూచి
నిరుపమప్రజ్ఞతో నిన్ను మ్రింగెదను

మఱి కరి మ్రింగిన మారేడుపండు
కరణి నాలో నీవు కరఁగిపోయెదవు
కావున నీవు సంకల్పముల్ విడిచి
శ్రీవిష్ణురూపంబుఁ జెందక మించి
యవయవకలితదేహము నాశ్రయించి
యవిరళంబుగ నాత్మయందున్న నిన్నుఁ
గనిపెట్ట శక్యంబు గా దేరికైన
నని నిక్కుచుంటి వాహారికటాక్షమునఁ
జిక్కితి విపుడు నాచేత బొంకించి
యెక్కడఁ బోయెద వింకమీఁదటను
సకలప్రపంచంబు సత్త్వస్వరూప
మకలంక మద్వయ మని నిశ్చయించి
యాయాత్మ నేనైనయప్పుడు వేఱె
నీయత్నములు సాగునే వెఱ్ఱిమనస!
యలరుచు దేహేంద్రియములు నేననుచుఁ
దెలియుచుండెడి తెల్వి చేటయై తుదను
ఆపరబ్రహ్మమై యంతట నిండి
దీపించు నారీతి తెలియనీయకయు
అజ్ఞానవైరి నిన్నలముటఁ బెట్ట
ప్రజ్ఞచే నటువంటి పాపాత్ముఁ బట్టి
దునుమాడి యధికసంతోషంబు నొంది
యనిశంబు నీ వాత్మ యందుండు మనస!

నిన్ను నే నెఱుఁగుదు నిశ్చయంబుగను
నన్ను నీ వెఱిఁగిన నాత్మవిభ్రాంతి
విడువు మటంచు వివేకంబు మదికిఁ
బొడకట్ట బహువిధంబుల బోధ సేసి
విడువక యటుమీఁద విషయేంద్రియముల
కెడము తానై ప్రేమ నిట్లని పలికె
నెలవుగాఁ దనకుఁ దానే బంధకంబు
గలిగించుకొని యందు కడపటఁ జిక్కి
కరఁగించెడుపసిండికాయలోఁ బురుగు
కరణి నాశాపాశకలితదుఃఖముల
ననుభవించితి రింద్రియములార మేలు
వినుఁడు నేఁ జెప్పెద విషయవాసనలఁ
బొందక వైరాగ్యబుద్ధితోఁ గూడుఁ
డందున సుఖము మీ కబ్బు నిక్కముగ
ననుచు నింద్రియముల కాప్తవాక్యముల
వినిపించి యటమీఁద విషయవాసనలఁ
గని యిట్టు లనె నింకఁ గరణంబులందుఁ
జొనుగుచు నో రింకఁ జొచ్చి వేధింప
వలవదు దృఢముగా వైరాగ్యబుద్ధి
నిలఁ గూడి వర్తింపుఁ డిందున మీకుఁ
గలుగు సౌఖ్యం బని గట్టిగాఁ జెప్పి
తొలఁగని యజ్ఞానధూర్తు నీక్షించి

పలికె నిట్లని త్రాటఁ బాము న్నకరణి
నలఘు పరబ్రహ్మమం దుండి నీవు
విపరీతములు చూపి వెఱపించుచుంటి
విపుడు నీమూలంబు నెఱిఁగితి నిన్ను
గావను సుజ్ఞానఖడ్గంబు నెత్తి
యీవేళ నిను ద్రుంచి యిలపై నణంతు
నని ప్రతాపింపుచు నజ్ఞానధూర్తు
ననఘుఁడై ఖండించి యచలాత్ముఁ డగుచు
నట శుచిస్థలిని బద్ధాసనమందు
ఘటికుఁడై కూర్చుండి కనుఁగవమోడ్చి
ధారాళముగ మారుతమును రేచించి
పూరించి కుంభకంబున నిల్పి మదిని
నెఱిఁగి ప్రాణములతో నింపొందఁ గూర్చి
పరఁగ హృదగ్నిని ప్రబలింపఁ జేసి
కాయ మాయగ్ని కక్కడ సమర్పించి
మాయ నడంచి నిర్మలభావుఁ డగుచు
నరవి నాధారాదిచక్రషట్కంబు
కరమొప్ప దాఁటి శృంగాటకమందుఁ
గదలక నాసికాగ్రంబుపై దృష్టి
గదియించి నడిమిమార్గంబునఁ బోయి
కరమర్థితో దీర్ఘఘంటారవంబు
మొఱయు సహస్రారమునఁ జేరి యవల

చలమున నూరక శ్రమనొందు ప్రాణ
ములు చేతనామృతమున శాంతిఁగోఱకుఁ
బొంది తదాకాశమున దోఁగి చాల
నందు సంపన్నంబు లయ్యె నయ్యెడను
మనము నంతర్బాహ్యమధ్యంబులందు
ననఘమై పరిపూర్ణమై నిండియున్న
పరతత్త్వమును బొంది పరమసంతోష
భరితమై వెలి చలింపక నిల్చియుండెఁ
దపసియు హృదయాగ్నిదగ్ధదేహంబు
నపుడు బోధామృతమం దుంచి శాంతిఁ
బొందించి చక్రిరూపు ధరించి శమము
నొంది కొన్నాళ్ల్ల యుండి పిమ్మటను
గ్రమ మొప్పఁగా నిర్వికల్పసమాధి
నమరఁగా సాధింప నంతరంగమునఁ
బరఁగఁదోఁచిన ప్రతిభాసల నాత్మ
కరవాలమున వేగ ఖండించివైచి
భ్రమపెట్టు తద్వికల్పనముల నెల్లఁ
బ్రమదంబుతో నెడఁబాసి యామీఁద
నమలమైనట్టి హృదాకాశమందుఁ
గమలాప్తచంద్రప్రకాశముల్ గప్ప
నమరు నజ్ఞానగాఢాంధకారమును
సమయించి మీఁదితేజంబును గాంచి

ఘనతరమైనట్టి కమలాకరమున
మొనసి సొచ్చిన గజంబువిధంబుగాను
మొనసూపు తత్తేజమును దునుమాడి
యనువొందు తేజోమహాంధకారంబు
లను మోహనిద్రల నటు దాఁటి యోగి
వినుత మైనటువంటి విశ్రాంతిఁ బొంది
సరసత ధ్యానానుసంధానపటిమ
నఱిముఱి ధన్యమై యచలమై మఱియు
విమలమై యాత్మసంవిత్పరిస్పంద
నముచేతఁ గనకంబు నవ్యభూషణము
తానై వెలుంగుచందంబున విశ్వ
మై నిరుపమచిన్మయత్వంబు దాల్చి
తడయక యాత్మచిత్తమున నైల్యంబు
విడిచి చిత్తంబును విడనాడి శుద్ధ
చిత్తస్వభావ మంచితముగాఁ బొందె
నత్తాపసుండు బోధానురక్తినను
వలనుగా వాసనావర్జితుఁ డగుచు
నలదిగంబరరూపమై ప్రకాశించి
యనుపమపరమాత్మతార్ణవమందు
మునిఁగి తద్రూప మిమ్ముగ విడనాడి
యరుదుగా నిద మిత్థ మనరానిచోట
మఱియును సత్తాసమానత నొంది

పరపరమానంద వార్ధి తా నగుచుఁ
బరఁగ నిర్వాతదీపముభంగి నిలిచి
భాసురచిత్రరూపమువాడ్కిఁ జేష్ట
బాసి చలింపక బ్రాహ్మణోత్తముఁడు
అఁఘునానందపద్మాకరమందె
యలఘుచిన్మయహంసమై యొప్పుచుండె
నారీతిఁ జిరకాల మందున్నఁ జూచి
యోరుపఁజాలక యురువిచిత్రములఁ
దొడరి చూపుచు దేవదూతలు మించి
కడువడి యోగవిఘ్నములు సేయఁగను
నాయతి శాంతుఁడై యచ్చోటు విడిచి
పోయి యొక్కొకదినం బొక్కొకచోట
నొకచోట నొకమాస మొకవత్సరంబు
నొకచోటఁ బెక్కేండ్లు నుండి పోవుచును
శాంతుఁడై తాపసాశ్రమములయందు
వింతవింతల నొప్పు విపినంబునందు
వలనొప్ప విమలజీవన్ముక్తుఁ డగుచు
నలుకక యిచ్ఛావిహారియై తిరిగి
అలఘుచిత్తత్త్వఘనాభ్యాసములను
బొలుచు నాచిత్తును బొంది యామీఁద
జెలఁగు చిత్సామాన్యచిదనుభవంబు
వలన నుద్దాలకవరయోగివరుఁడు

నలిని సత్తాసమానతఁ బొందె ననఁగ
నలరి రాఘవుఁ డిట్టు లనియెఁ గ్రమ్మఱను
మౌనీంద్ర! సత్తాసమానత యెట్టి
దానతీయుఁ డటన్న నమ్ముని పల్కె
ననఘాత్మ! తన కన్యమైనది మిథ్య
యనుభావనకుఁ జిత్త మణఁగఁగా నపుడు
సహజమైనట్టి చిత్సామాన్యమునకు
మహనీయసత్తాసమానత గలుగు
మొదటిసంశయభయంబు నణంగునట్టి
పదమందుఁ జెంది ప్రపంచగేహమున
లలితుఁడై కొంతకాలంబు వర్తించి
యలఘుశాంతిని బొంది యచలసమాధి
యందుండి తద్దేహ మట విసర్జించి
యెందులఁ గొఱవ లేకిరవైన బ్రహ్మ
పదమందుఁ బొందె నాబ్రాహ్మణోత్తముఁడు
కొదక కీయుద్దాలకుని చరిత్రంబు
వినిన మానవు లతివిమలాత్ము లగుచు
ఘనముక్తిమార్గంబు గని సుఖింపుదురు
ధరణీశ! నీవు నుద్దాలకమౌని
కరణి నిన్నే నీవు గనుచు విశ్రాంతి
నొంది యుత్తమమైన యున్నతపదము
నందు వర్తింపుచు నానంద మొందు

మనిన మౌనికి మ్రొక్కి యా రాఘవుండు
మనమున నూహించి మరల నిట్లనియె
మునినాథ! సంసారముననుండి యొక్క
ఘనమైన సుజ్ఞాని యగుచు విశ్రాంతిఁ (?)
బొంది సంసార మొప్పుగఁ జేయుచుండు
మందతన్ విడిచి సమాధి గావించు
నటుగాక మఱియొక్కఁ డారణ్యములను
బటువిరాగమునఁ బ్రపంచధర్మముల
మఱచి యేవేళ సమాధి గావించు
నరయ నయ్యిద్దఱియం దధికుండు
ఎవఁ డన్న నవ్వి మునీంద్రుఁ డిట్లనియె
నవనీశ! చెప్పెద నా రెండుగతుల
విను మెట్టులనిన వివేకాత్ముఁ డగుచుఁ
గొన మొదల్ గని సర్వగుణసమూహంబు
జడమంచు నాత్మ యజడమంచుఁ దెలిసి
యడరఁ దదాత్మ తా నని నిశ్చయించి
యాంతరంగికదృష్టి ననవరతంబు
శాంతుఁడై చిత్తవిశ్రాంతి వహించి
పనుపడుదృశ్యప్రపంచంబు మిథ్య
యని తను ధ్యానించునటువంటివాఁడు
హాయిగా సంసారి యయ్యున్న నేమి
పోయి తపోవనంబున నున్న నేమి

కాఁబట్టి తే దతఁడు ముక్తుం డేడ నున్న
నరుడుగా సంసారియగు యోగి కెపుడు
ధర నిరుపాధిచేతశ్శీతలత్వ
మిరవగుటం జేసి యెపు డరణ్యమున
ఘనతరవై రాగ్యకలితుఁడై యోగ
మొనరించి విమలుఁడై యుపశాంతుఁడైన
యతనికి నతనికి నరసి చూచినను
గతి యొక్కటే రెండుగతులు గా వనఘ!
లలిని చేతశ్శీతలత్వంబు మదిని
నిలువక చరియించెనేని యేమఱక
మఱి హఠయోగసమాధి గావించి
పొరిసి దచ్ఛాంతినే పొందఁగావలయు
నమరి యున్మత్తంబు లగు చిత్తతాండ
వము లెల్ల నుపశాంతివలననె కాని
మఱి వేఱె గతి నది మాన్పఁగా రాదు
సరవి నందున శాంతి సాధింపవలయుఁ
దరమిడినట్టి శాంతగుణంబుచేత
మఱిమఱి చిత్తసమాధాన మొదవు
నంతటియోగికి నఖిలవాసనలు
శాంతంబు లగు సర్వసముఁ డగు నతని
మది బాహ్యమం దేక్రమంబున నున్న
నది చిన్మయంబై సదానంద మొందు

సందేహరహితుఁడై శాంతుఁడై మమత
యందంటి యంటక యచలాత్ముఁడైన
ఘనుఁ డింటిలో నున్న గహనమం దున్న
గనుఁగొన నారెండు గతు లొక్కసమమె
వలనుగా నిట్టిసద్వాసన నొంది
చెలఁగుచిత్తం బేమిసేసినం గాని
సేయనిదే యగు సిద్ధ మీవాక్య
మీయర్థమున సంశయింపకు మీవు
ఆసల రోసి నిరాసక్తి నొందు
భాసురజ్ఞానానుభవముచే స్వల్ప
వాసన గలిగిన పరచిత్త మన్ని
చేసిచేయని యిది చిత్తులో నణఁగు
అలమానసము దూర మరిగి యందొకటి
నలరఁగా ధ్యానించునట్టి కాలమున
దనువందు వెల్గు నాత్మసుఖంబు దుఃఖ
మొనర నెఱుంగక యూరకె యుండుఁ
గావున సకలవికారముల్ మదిని
నావిమలచిదాత్మకంబె నెద్ది యగు
నావిధ మెట్లన్న నమరస్వప్నమున
బావిలోఁ బడి లేచి బాగు మేల్కొనిన
వానియంగములకు వచ్చునే హాని
మానవేశ్వర! వానిమర్మ మెట్లనిన

మనమున నెద్ది సమ్మతముగాఁ జేయు
కునికి సమాధాన మూహించి చూడఁ
జెలువొప్ప నిరతంబు చిత్తశాంతంబు
గలుగు ధన్యునకు జగంబు భావింప
సతతంబు చల్లనౌ శాంతంబు లేని
యతనికి దావాగ్నియై తోఁచు జగము
కావున శాంతమే గావలె నరున
కేవిధంబుననైన నిది నిశ్చయంబు
యియ్యర్థమున నిపు డితిహాస మొకటి
నెయ్యంబుతో విను నేను జెప్పెదను
సురఘుం డనెడు రాజు సుస్థిరుండగుచు
పటిమచేఁ దగు నిగ్రహానుగ్రహముల
ధరణి నేలుచు రాజ్యతంత్రంబు నడుప
మురువొప్ప సుఖదుఃఖములను జిత్తంబు
పరిభూత మైన యప్పార్థివేశ్వరుఁడు
తర మిడి తనలోన తా నొక్కనాఁడు
తలఁచె నిట్లనుచు మోదంబు ఖేదంబు
వలయు నక్కఱలు నావలె భూజనులకుఁ
గలుగుట తెలియ కాగ్రహము చూపుచును
తిలలఁ బీడించెడి తిలయంత్రమువలెఁ
బీడించుచుంటిని బేదల నెల్ల
నేఁడాదిగా శాంతి నేఁ బొందవలయు

నా కట్టి శాంత మెన్నటికి లభించు
నేకరణిని దరియింతు నటంచుఁ
దనలోనె తాను వితర్కించి రాజ్య
మొనరఁ బాలింపక నురుచింత నెనసి
యుండఁగా నంతలో నొక్కనాఁ డటకు
మాండవ్యుఁ డనియెడు మౌనిపుంగవుఁడు
వచ్చిన నమ్మౌనివరునకు మ్రొక్కి
హెచ్చుగాఁ బూజించి యెంతో నుతించి
తనమదిలోఁ జింత దాఁచ కంతయును
వినిపింప నమ్మౌనివిభుఁ డిట్టులనియె
ధరణీశ! విను మహాంతను కామములను
మురువొప్ప మమకారమును విసర్జించి
నీయాత్మ నీవె యై నిఖిలరాజ్యంబు
నేయుచు నుండు మీచింత యేమిటికిఁ
దనయుపాయమున యత్నమున నీహార
మున నుండు లతచందమున మానసంబు
తనవిలపము వీడి తనియుచు నుండుఁ
దనవిచారమున నంతర్మనోమలిన
మును దన్ను బొందక ముఱిగి నశించు
జననంబు నొందుచుఁ జచ్చుచు మరలఁ
బుట్టుచు గిట్టుచు భూరిదుఃఖముల
నట్టిట్టు సోలుచు ననుభవింపుచును

కడతేరలేక దుఃఖసుఖాబ్ధులందుఁ
బడి పొరలుచునుండు ప్రజలను జూచి
భయము నొందుచు వారిపంథలఁ బోక
జయ మొంది నిలుచు భాస్వరవస్తువందు
మదిని నిల్పి మహాంత మమత నివ్విడుచు
బెదరక యుపశాంతిఁ బొందుచు జనులఁ
బాలింపు చుండు నిర్భరముగాఁ జింత
యేలని చెప్పి మునీశ్వరుం డరిగె
సురఘుఁ డావల నతిసూక్ష్మభావమున
నెఱుక తా ననుచు దేహేంద్రియవిషయ
తతి జడం బగునది తానుగా ననుచు
నతిశయబ్రహ్మరుద్రాది దేహముల
యం దనేకంబు లైనట్టి రత్నముల
యందొకసూత్రమున్నట్టి చందమున
వెలుఁగు చుండు చిదాత్మ వేఱుగా ననుచుఁ
దలఁచి యెన్నటికిని దాపసుం డగుచు
నలసుఖదుఃఖద్వయాతీతుఁ డగుచు
నెలమిఁ గుటుంబియై యేకాకి యగుచు
నెఱి దయాకరుఁడు నై నిర్దయుం డగుచుఁ
జిరతరంబుగ యోగసిద్ధిని బొంది
తొడరి నిరాసక్తితో రాజ్యపదము
నుడుగక పాలింపుచుండఁగా నటుకుఁ

బరిఘుం డనెడు మహీపతి రాఁగ సురఘుఁ
డరుదుగాఁ బూజించె నాపరిఘుండు
అతనిచే సత్కృతుఁడై యటమీఁదఁ
హితము రెట్టింపఁగా నిట్లని పలికె
ధరణీశ! నీకుఁ దత్త్వజ్ఞానసరణి
తిరముగాఁ గుదిరిన దే మానసమునఁ
దలఁపున నిస్పృహాత్వము నొంది ధరను
నలిని బాలింపు చున్నాఁడవే నీవు
పటుతర నిర్వికల్పసమాధినిష్ఠ
యెటువంటి దాచంద మెఱిఁగింపుమనిన
నా వేళ సురఘుఁ డిట్లనె నోమహాత్మ!
పావన నిర్వికల్పసమాధినిష్ఠ
చంద మెట్లనినను సర్వభోగముల
యం దనాసక్తుఁడై యచలాత్ముఁ డగుచు
నలరుచుఁ గాలకర్మానుసారముగ
వలనుగాఁ దాఁ జేయువలయుకార్యముల
నాసక్తి లేక బాహ్యమునందుఁ దాను
జేసి తా నొక్కటి చేయలే దనుచు
నంతరంగమ్మునం దతినిస్పృహాతను
శాంతరసము నించి సంతోషి యగుచు
మఱియు నహంకార మమకారములను
బొరయ కంతట పరిపూర్ణమై నిండి

యున్నచిద్వస్తువు నూహించి కాంచి
యన్నిటికి నతీతమైనచిద్వస్తు
సత్తతానై శీతశైలంబుమాడ్కిఁ
జిత్తవిశ్రాంతిని జెంది యున్నదియె
పట్టున నిర్వికల్పసమాధి యగుచు
నెట్టన నటుచేయ నేరనివాఁడు
క్రమముగా సకలయోగములు చేసియును
శమ మొంద కున్న మోక్షసుఖంబు లేదు
తనివి పుట్టించు నంతశ్శీలతయును
ననఁగ జీవన్ముక్తి యను శబ్దములకుఁ
గలిగినయర్థముల్ క్రమముగా నపుడు
విలసితసూక్తుల వినుపింపఁగాను
ననఘుఁడు చిత్తవిశ్రాంతిని బొంది
గొనకొని యతని పీడ్కొని చనె నంత
సురఘుండు తను దాను జూచుచు రాజ్య
మిరవుగా బహుకాల మేలుచునుండి
కొనకు విదేహముక్తుం డయ్యె నిట్లు
ఘనుఁడైన సురఘునికథ విన్నవారు
పరమవిజ్ఞానసంపన్నులై ముక్తి
నరలేక పొందుదు రని వసిష్ఠుండు
ఘనముగా విజయరాఘవునకుఁ జెప్పి
మనము రంజిల్లఁగా మరల నిట్లనియె

రక్తిచే చిత్తవిశ్రాంతిలేకున్న
ముక్తిఁ బొందుట కష్టము దలంచి చూచి
హింసాస్పదంబును హేయమౌ దేహ
సంసారమును వీడ శక్యంబుగాదు
ఇనకులోత్తమ! రామ! యీయర్థమందు
వినిపింతు నొకకథ వినుమదెట్లనిన
లలితులు హాసవిలాసు లిద్దఱనఁ
గల రన్నదమ్ము లగ్రజుఁడు హాసుండు
అనుజుఁ డొప్పు విలాసుఁ డతఁ డొక్కనాఁడు
ఘనుఁడైన! హాసునిఁ గాంచి యిట్లనియె
యోయన్న! యెఱుఁగంగ నుచితమైనట్టి
నీయాత్మతత్త్వంబు నీవెఱింగితివె
తక్కక పరమబోధము జనించినదె
చక్కఁగా బుద్ధివిశ్రాంతి నొందితివె
గురునిష్ఠ గల నీకు కుశలమే యనుచు
నరమరలేక యిట్లడుగ హాసుండు
విని యిట్టులని పల్కె విపినంబులందుఁ
బనిఁబూని విపులతపముఁ జేయు నిన్ను
మొనసిన నాపుణ్యమున నేఁడు గంటి
ననఘ! సంసారమం దలమటం బడుచు
వారక వర్తించువారికిఁ గుశల
మేరీతిఁ గలుగు నదెట్లన్న వినుము

యెందాఁకఁ బరమాత్మ నెఱుఁగకయుండు
నందాఁక జిత్తలయంబు గాకుండు
నెందాఁక సంసార మెనయుచు నుండు
నందాఁక నీయాశ యణఁగిపోకుండు
నెందాఁక సమబుద్ధి యిరవు గాకుండు
నందాఁక నుదయింప దాత్మసద్బోధ
కావునఁ గుశల మెక్కడ గల్గు పరమ
పావనజ్ఞానసంప్రాప్తి లేకున్న
మనుజులు సుఖదుఃఖమగ్నులై పుట్టు
చును గిట్టు చుందు రెచ్చోటులనైన
నిలకడ గానరు నీచసంసార
కలితులై యుందు రొకానొకఁ డాత్మ
తత్త్వంబు గని విరక్తస్వాంతుఁ డగుచు
సాత్వికుం డై ఘోరసంసారజలధి
తన వివేకంబుచే దాఁటి సుఖించు
ననుచును వేదాంతమహా రహస్యముల
వివరించి దెల్పఁగా విని విలాసుండు
నవిరళభక్తితో నన్నకు మ్రొక్కి
పరమవిజ్ఞానసంపన్నుఁడై ముక్తి
సురచిర మతి విలాసుఁడు పొందె ననుచు
శ్రీరాఘవునకు వసిష్ఠుండు కరుణ
నారసి వినిపించి యవల నిటనియె

ననఘాత్మ! దేనియం దభిలాష లేక
మనము వై రాగ్యనిర్మగ్నమై యున్న
వలనుగాఁ బ్రారబ్ధవశమునఁ గూడి
చలనమొందుచును సంసారమందున్న
స్వాంత మాబంధసంశ్రయమున కెపుడు
శాంతి బొంది సుఖించు సద్వస్తువందుఁ
బనిఁబూని యుగ్రతపంబు సేయుచును
వనమునం దుండిన వానిచిత్తంబు
ఇరవొంద నాసక్తి నెనసి యుండినను
గర మర్థి నది బంధకం బగుచుండు
నెఱి నిది దేహంబు నే దేహి ననెడి
యెఱుక లేకయ దేహ మే నంచు భ్రమయు
జనునకు సంసారసంగంబు బంధ
మని చెప్ప నొప్పు నోయవనీశచంద్ర!
శారీరసుఖదుఃఖసరణులు రెండు
నారయఁ బరమాత్మయందు వింతలుగఁ
దనరార నారోపితంబులై యపుడు
తనియని చిత్తబంధకములై యుండు
సర్వపూర్ణంబైన సత్యాత్మదృష్టి
సర్వకాలము మానసములందు నిలచి
యున్నను బంధంబు లూడు చిత్తంబు
పన్నగ నాపరబ్రహ్మమం దణఁగుఁ

గావున నీవు నఖండాత్మసుఖము
భావింపు మొకటిగాఁ బార్థివాధీశ!
వలనొప్పు సంసక్తి వంధ్య యనంగ
నలరారఁగా నవంధ్య యనంగఁ గలదు
అందు వంధ్య యనంగ నమరు నాసక్తి
పొందుగా సంసారము జనింపఁ జేసి
భావింపఁ దాను నిష్ఫలమై మెలంగుఁ
దావల మగు నవంధ్యాసక్తి ముక్తి
దాయిని యై మహాధన్యత నిచ్చు
నాయాత్మవిజ్ఞానమందు నేరకయు
యఖిలవస్తుజము తానై వంధ్యసక్తి
సుఖము నీయక మనుజులు రౌరవాది
నరకంబులను ముంచు నానావిధముల
నరవి నవంధ్య భాస్వరవివేకాది
సద్గుణసమితిచే శాంతి వహించి
చిద్గగనమునందుఁ జెంది వర్తించు
నట్టిశక్తిని బంకజాక్షుండు చెలఁగి
పట్టుగా జగములఁ బాలింపుచుండు
నదిగాక బ్రహ్మరుద్రాదు లందఱును
వదలక తచ్ఛక్తివశు లైరి మఱియు
మొనసిన భవపాశములఁ ద్రెంచివైచి
మనమున దేహాభిమానంబు మఱచి

స్థిరబుద్ధిగలవాఁడు చిద్రసమందు
కరఁగి జలంబులోఁ గలిసిన యుప్పు
పగిదిని గలయు నో భానుకులేశ!
జగతి నెన్నఁగ జడాజడములనడుమ
సరసమై వెలుఁగు దృక్సంధిమధ్యమున
నరయఁగాఁ బరమార్థమై యుండు నెద్ది
యరయఁగా విమలపరాత్మ యటంచు
నిరతంబు కాండోపనిషదర్థములన
తెలియుతత్త్వజ్ఞు లా తెఱఁగు తేటగను
దెలుపుచు నుందురు ధీయుక్తి మెఱయ
సరసమై దృశ్యదర్శనయుక్త మగుచు
నరయఁగా ననుభూత మగుచును మఱియుఁ
దెలియఁగాఁ బారమార్థికసుఖం బెద్ది
యలరార నది బ్రహ్మ మన నొప్పుఁగాని
వేఱబ్రహ్మం బెద్ది వెదకి చూచుటకు
నారవిబింబంబు నాక్రమించుకొని
వనదంబు దట్టమై వనజాప్తకళను
గనఁబడ నీయనికరణిఁ జిత్తంబు
ఆనిర్మలబ్రహ్మ కడ్డమై నిలచి
తానుండి పరమాత్మతను గననియదు
గానఁ దోఁచదు సదాఖండాత్మవస్తు
వానీచచిత్తంబు నదిమి పట్టుకొని

యాయఖండబ్రహ్మ మందు లయంబు
జేయుటే మోక్షంబుఁ జెందుటే గాని
మోక్షంబు పాతాళమున నింట దిశల
నీక్షోణిమీఁద లే దిది నిశ్చయంబు
ఆస లన్నియు లయ మైనదే ముక్తి
యీసత్త గనిన యోగీశ్వరుం డిలను
జారపురుషుపైని స్వాంత ముంచుకొని
భూరియాశను నిజపురుషుని మైత్రి
వదలక హావభావవిలాసములను
బదపడి తాఁ జూపుపగిది నాఘునుఁడు
ఆసలు గలవానియటువలెఁ బనులు
చేసి వానిని నిరసింపుచు నంత
రంగంబునందుఁ బరాత్మసౌఖ్యమును
బొంగుచు ననుభవింపును నుండు నెపుడు
ప్రారబ్ధ మనుభవింపఁ దలంచి యతఁడు
వారక సంసారివలె నటించినను
నలఘుసూర్యుఁడు చల్లనైనను గాని
యులఁ జందురుం డుష్ణుఁ డైనను గాని
మొగి నగ్నిశిఖ లధోముఖములు గాని
యగణితాత్మసుఖంబు నంటిన యోగి
పొలుపారి విస్మృతిఁ బొంద రటంచు
పలికిన విని రామభద్రుఁ డిట్లనియె

నోమునీశ్వర! యూరకుండక చిత్త
మేమిట చలియించు నేమిట నిలుచుఁ
గరుణ నాచిత్తరోగమ్ము హరించు
పరమౌషధంబు చెప్పం దగు ననిన
విని వసిష్ఠుఁడు పల్కె విను రామచంద్ర!
ఘనమైన చిత్తరోగమునకు రెండు
గల వౌషధములు యోగ మనంగ నొకటి
యలఘుతత్త్వజ్ఞాన మన్నది యొకటి
యున్నది విను యోగ ముఖుకుచిత్తమును
పన్నఁగాఁ జికఁబట్టి బంధింప నోవు (?)
పరమవిజ్ఞాన మాపరమవస్తువును
సురుచిరప్రజ్ఞచేఁ జూపఁగా నోపు
నది యెట్టులనినఁ బ్రాణాపానయుగళ
ముదయించి చరియింపుచున్న చిత్తంబు
చలియింపుచుండు నుచ్ఛ్వాసనిశ్వాస
ములను నిల్పినఁ జిత్తమును నిల్చుఁ జిత్త
చలనం బణంగిన సంసార ముడుగు
నలపూరకము మొదలైనట్టి పవన
ధారణ సేయు చిత్తంబు నిరుద్ధ
మై రయంబున నిల్చు నంతరంగమున
దనచిత్తధారణాధ్యానసమాధి
పనుపడినప్పు డాప్రాణవాయువులు

కదలక యంతరంగమున నెమ్మదిని
గుదురుచు నుండు యోగులకు వెండియును
బ్రణవశబ్దార్థంబు భావించి దాని
గణుతించుకొనుచు నేకాంతంబునందు
సురుచిరజ్ఞానసుషుప్తి యొందినను
జరగిపోయెడిమది చలనం బణంగు
మఱియు నీ వింక నొక మర్మంబు వినుము
మురువొప్పఁగాఁ దాలుమూలాంత మగుచు
గురుతరంబుగఁ గంఠకోటరాగ్రమున
కరుదుగా స్థూలజిహ్వాగ్రముఁ జొనిపి
యదనుగా సూక్ష్మజిహ్వాగ్రంబుతోడఁ
గదియించి మధ్యమార్గంబునం దున్న
తనుతరవిమలరంధ్రమునఁ బ్రాణముల
నొనరంగ నడిపించుచుండినఁ బ్రాణ
చలనం బణఁగుఁ జిత్తసంచార ముడుగు
నలఘుయోగానంద మబ్బుచు నుండు
నిదియోగ మనఁబడు నివి యేను గాక
నదమలమైన విజ్ఞానయోగంబు
వినుపింతు విను జగద్వితతియుఁ జిత్త
మును దద్వికల్పనములు లయంబైన
తఱి నవశిష్టమై తా నెద్ది నిలుచు
నరయ నదే జ్ఞాన మని చెప్ప నొప్పు

జనవర! యిటుగాన సర్వంబు బ్రహ్మ
మనియెడి యెఱుక పదార్థదర్శిత్వ
మగు యోగమునకు బ్రహ్మజ్ఞానమునకుఁ
దగు నిదర్శనము సిద్ధముగఁ జెప్పెదను
విను వీతహవ్యుఁడన్ విప్రపుంగవుఁడు
ఘనతరవైరాగ్యకలితుఁడై విపిన
భూమిని జేరి యద్భుతనిష్ఠఁ బూని
యేమరక సుశాంతి నెనసి తామసము
విడిచి యంతర్బాహ్యవిషయకృత్యముల
నడిచి నిర్మలమైన యంతరంగమునఁ
దలఁచె నిట్లనుచు బ్రత్యాహార మెంత
సలుపు చుండిన చిత్తచలనం బణంగి
పోక లోలోఁ జరింపుచునున్న దిపుడు
నేకరణి నణంతు నింకఁ జిత్తమును
నని విచారింపుచు నప్పు డాచిత్త
మును బిగఁబట్టి యిమ్ముగ దాని కనియెఁ
జిత్తమా! చలనంబు చెందక నీవు
సత్తాస్వరూపమై సర్వమై సర్వ
సాక్షియై యచలమై సంపూర్ణమైన
యక్షీణపరమాత్మ యందు సంతతము
నిలిచియుండెదవైన నీకు సుఖంబు
గలుగు జడములైన కరణజాలములఁ

గూడి నన్నింకఁ జిక్కులు పెట్టనేల
వీడు మయ్యింద్రియవిషయసఖ్యమును
అరయ యతేంద్రియంబై పూర్ణమైన
పరమాత్మతత్త్వంబు భావింపుచుండు
మని బుద్ధిఁ జెప్పుచు నపుడు చిత్తమును
గనిపెట్టిహృదయపంకజమందు నిలిపి
గురువింధ్యపర్వతగుహఁ జేరి యచట
నతిముఱి శుద్ధాసనాసీనుఁ డగుచుఁ
గనుదృష్టి నాసికాగ్రంబుపై నుంచి
తనువును నిక్కించి తలఁపుల నెల్ల
మఱచుచు నచలసమాధియం దున్న
తఱి పీతహవ్యుని తనుమధ్యమందుఁ
జరియించుప్రాణముల్ శమ మొందె నిట్లు
పరమైననిర్వికల్పసమాధి నొంది
యున్న నం దొక్కముహూర్తంబుకరణి
నెన్న మున్నూఱేండ్లు నిలమీఁదఁ జరగె
ఘనమైన భూమిపంకంబులో నతని
తను వణంగక యున్నఁ దా నేర్పఱించి
కనఁగూడ కుండె నీకరణి దపంబు
నెనసి యాధన్యుఁ డం దిరవుగా నుండి
మొనసి మున్నూఱబ్దములమీఁద మేలు
కనఁ బూర్వజన్మసత్కర్మవాసనలు

బలములై యతనికిఁ బ్రత్యక్షరూప
ములుగాను మానసమునఁ గ్రమంబునను
దోఁచుచు నుండఁగాఁ దొలఁగక యతఁడు
నాచోట నన్నిటి నానందముగను
మొనసి మనోరాజ్యమున సర్వ మొనర
ననుభవించుచు నుండె నది యెట్లులనినఁ
గనులందుఁ బొడము జాగ్రత్స్వప్నయుగళ
మును నమ్మనోరాజ్యమును నన మూఁడు
గలుగుచు నుండు నెక్కడనైన మాన
వుల నాక్రమము లిప్పు డూహింపు మీవు
తెలివితో నన్నిటి దెలిసి కాఁపురము
సలుపుచు నుండు టే జాగ్రదవస్థ
నెరయునింద్రియములు నిదురలో నణఁగ
నరసి యాంతరవిషయములతోఁ దగిలి
పొలుచు చిత్తము రమింపుచు నుండురీతి
యలరు స్వప్నావస్థ యనఁబడుచుండు
నెఱుక గల్గియు బాహ్య మెఱుఁగక మఱచి
మురిసి పురోభూతములు గాకయున్న
గురువస్తువితతులఁ గూడి మానసము
పొరినిలోపల సుఖంపుచు నుండురీతి
నరయ మనోరాజ్య మనఁబడుఁగాని
విరివి రెట్టింప నాపీతహావ్యందు

హృదయగతంబున నింపుసొం పెసఁగఁ
గదలక రజతనగప్రాంత్యమందుఁ
బ్రకటితమగు కదంబకతరుచ్ఛాయ
నకలఁకుఁడై నిల్చి యచట నూఱేండ్లు
తప మాచరించి యింద్రపదంబు నాత్మ
నపుడు గామించి విద్యాధరుం డగుచు
శతవత్సరంబులు చరియించు చుండి
హితమొప్పఁ దా మర లింపుసొం పెసఁగఁ
గాలుఁడై యవల నాఖండలపదము
పాలించుచును భోగభాగ్యసౌఖ్యముల
ననుభవించుచు నుండి యావల నరిగి
పనిఁబూని శివుచెంతఁ బ్రమథుఁడై యుండె
వారక ప్రత్యాశవలన నీరీతి
సారెసారెకు బహుజన్మసౌఖ్యములు
పారిపారి ననుభవించుచు వేడ్క నుండి
మరలఁ దత్పూర్వజన్మములఁ దలంచి
కలగాంచి మేల్కాన్నకైవడి గాను
దెలివొంది యతఁడు మదిఁ వెఱఁగొంది
యలరుచు వీతహవ్యాభిధానంబు
కలిగినతను వింతకాలంబునకును
సమయక యిచ్చోట శాశ్వతం బగుచు
నమరి యున్నది గదా యని సంతసించి

పంకంబులోఁ బూడి పడియున్న మేను
నింక నైనను నీఁది కెత్తెద ననుచుఁ
దాఁ బ్రయత్నము సేసి తనువు పై కెత్తఁ
గాఁ బ్రయాసై తోఁపఁగా దాని విడిచి
యాతఁ డంతఁ బుర్యష్టకాంగంబుతోడఁ
బ్రతిభ మీఱఁగ లేచి పవనుఁడై సూర్య
నారాయణుని జేరి నను బింగళాఖ్య
నాయూథుఁడగు దూత నబ్జబాంధవుఁడు
పనుపఁగా జని నేలఁ బంకమధ్యమున
మునిఁగి యున్నట్టి యిమ్మునిశరీరమును
గుదురుగాఁ బెకలించికొని చని చాల
ముదముతో సూర్యుని ముందర నిడఁగ
నాదిత్యుఁ డావీతహవ్యు నీక్షించి
నీదేహమున నీవు నిలువు మటంచు
నానతిచ్చిన వీతహవ్యుఁ డామేను
నూని ప్రవేశించి యున్నతుఁ డగుచు
ముదమంది సంగనిర్ముక్తుఁడై మమత
వదలించి విడిచి జీవన్ముక్తుఁ డగుచు
స్వచ్ఛమనస్కుఁడై సర్వస్థలముల
నిచ్ఛావిహారుఁడై యొక నేమఱక
యనఘుఁడై దశసహస్రాబ్దముల్ గడపి
కినిసి విదేహముక్తిని బొందఁ దలఁచి

లలితుఁ డేకాంతస్థలమునందుఁ జేరి
చెలఁగి శుద్ధాసనాసీనుఁడై యుండి
తనలోనె తాను వితర్కించి రాగ
మును ద్వేషమును జూచి మొనసి యిట్లనియె
రాగమా! ద్వేషమా! రాతిరి పగలు
నీగతి మున్ను న న్నెనసి నాదవుల
వైరాగ్యవహ్నిచే వాడిపోయితిరి
మీ రిఁక నైన నమ్మిక చోటులందుఁ
జేరి సుఖంపుఁడు చింతచే నన్ను
గారింప నేల శీఘ్రంబుగాఁ జనుఁడు
అంచిత పంచేంద్రియములార నేను
బంచినగతిని దప్పక సంచరించి
యలసితి రింక మీ రనువైనయెడల
కలుగక చనుఁడి నెయ్యమున న న్విడిచి
పసువు లెత్తుచు నీవు పరమాత్మసుఖము
మఱపించి నాకు నీమాయలఁ జూపి
విషమగతులయందు విడువక ద్రిప్పి
విషయసౌఖ్యమునందు విడిచి లె మ్మిఁకను
నెరసిన దుఃఖమా! నీచేతఁ జిక్కి
పరితాపమును బొంది పాపసంసార
నిరసనం బొనరించి నీదయవలనఁ
బరమైననిర్వాణపద మేను గంటి

నా కుపకార మూనాఁడు చేసితివి
నీకు మ్రొక్కెదను నీనెలవున కేఁగు
నే నిన్ను విడిచిన నీ వొంటిగాను
బోనేర నని యింకఁ బొగల నేమిటికిఁ
జక్కఁగా నేఁగి సంసారులచెంత
మక్కువనుండి నామాలిమి విడువు
దండంబు నీకు నాదగ్గఱ నిలిచి
యుండక చను మింక నోతల్లి! తృష్ణ!
యనుచు నంతఃకరణాదిగుణాళి
నొనర వీడ్కొల్పి తా నుపశాంతిఁ బొంది
యున్నతుఁడై ప్రణవోచ్చారణములఁ
బన్నుగాఁ జేయుచు పైజ్యోతి నాత్మఁ
గనుచు సంకల్పవికల్పాదివివిధ
తనుధర్మవితతినంతర్బాహ్యములను
బొడమనీయక నిజబుద్ధియం దణఁచి
యడరారఁ బ్రణవాంతమైన నిశ్శ్వాస
తంతువుతోఁ గూడి తన్మాత్రవితతి
నంతఃకరణమునం దరసి యవ్వాలను
తనివిఁ బొందిన విశ్వతైజసావస్థ
లను దాఁటి మెల్లమెల్లగ లోనితిమిర
పటలంబు లణఁగించి ప్రాజ్ఞసంబంధ
పటుతర తేజముఁ భావించి యణఁచి

సరవిని దమము తేజంబు లేకయును
నరుడుగా శూన్య మైనటువంటిచోటు
గని దానిఁ బాసి తక్కక సూక్ష్మమైన
మనముచే మనము నేమఱక ఖండించి
బడలక చిద్వస్తుపదము నీక్షించి
తొడరిన మేమ చతుర్థభాగమునఁ
బరఁగఁ జంచలతను బాయుమారుతము
కరణిసొ చైత్య మక్కడ విసర్జించి
నెనరుతో సతతైకనిష్ఠితం బగుచుఁ
దనరిన శాంతిపదమునందుఁ బొంది
తుదఁ గని మేరుస్థితుండై సుషుప్తి
పద మవలంబించి పటుతీవ్ర గతిని
ఆవరయోగి తుర్యానంద మొందె
నీవిధంబున నెవ్వ డిల నిరానంద
పరుఁడు సదానందభరితుండు స్వచ్ఛ
విరహితుఁ డటుగాక విపులస్వచ్ఛుఁడును
మఱి చిన్మయుండు చిన్మయుఁడునై యిట్లు
లిరవొప్పఁగా నేతినేతి వాక్యములఁ
జెలఁగి యుపన్యసించినవేళ తుదను
దెలియువాఙ్మానసాతీతమై సర్వ
పరిపూర్ణమగు పరబ్రహ్మంబునందు
విరివిగాఁ గలిసె నాపీతహావ్యుండు

ఆపరాత్ముని నిశ్చయం బది యనుచుఁ
దోఁపక శూన్యవాదులు శూన్య మనఁగఁ
దర మిడి బ్రహ్మవేత్తలు బ్రహ్మ మనఁగ
వరుసగా విజ్ఞానవంతు లందఱును
విరివి నాబ్రహ్మంబు విజ్ఞాన మనఁగ
భూరి సాంఖ్యయోగులు పురుషుం డనంగ
నిల సిద్ధయోగీంద్రు లీశ్వరుం డనఁగఁ
జెలఁగి శైవులు సదాశివుఁ డాత్మ యనఁగ
లలిఁ గాలవిదులు కాలమె బ్రహ్మ మనఁగఁ
దొలఁగ కాసాద్ధవంతులు చిదాత్మనఁగ
రహితాదృశులును నైరాసతత్త్వమున
మహి మాధ్యమికు లెల్ల మధ్యమం బనఁగ
ననిశంబు సమచిత్తు లగువారు సర్వ
మును బ్రహ్మ మనఁగ నామూలతత్త్వంబు
అగుణమై సర్వసిద్ధాంతసమ్మతము
నగుచు నన్నియును దానై వెలుంగులకు
వెలుఁగై యనంతమై వేరొండు లేక
యలఘు పరబ్రహ్మ మంతట నుండు
విమలుఁడై ముప్పదివేలేండ్లు యోగ
మమర సల్పెను పీతహావ్యుండు తుదకు
నాపరమాత్మ తా నయ్యె నటంచు
భూపాలునకుఁ గృపాబుద్ధి దీపింపఁ

జెప్పి క్రమ్మఱి నావసిష్ఠుఁ డిట్లనియెఁ
దప్పక విను రామ ధరణీతలేంద్ర!
యానందముగ వీతహవ్యుని చరిత
మూని నాలింపుచు నుండెడువార
లఖిలపాపవిముక్తులై పరమాత్మ
సుఖము నొందుదు రంచు నూటిగాఁ జెప్పి
జనవర! చిత్తోపశమన వాక్యములు
వినుచున్న రాముభూవిభుఁ డిట్టులనియె
నమర జీవన్ముక్తు లాత్మార్థవిదులు
నమరాత్ములైనట్టి యాయోగులకును
నరుదైన గగనయానాదికసిద్ధు
లిరవొందఁ గలుగని దేమంచు నడుగ
విని ముని పల్కె నావిధ మెట్టి దనిన
విను రాఘవేశ్వర! విశదంబుగాను
ఘనములై తగు నభోగమనాదిసిద్ధు
లనువొందఁ గలిగిన నది ముక్తిగాదు
దనరారు ద్రవ్యమంత్రక్రియాసక్తు
లొనరఁగఁ గప్పించుచుండు సిద్ధులను
నట్టిసిద్ధులఁ గోరినటువంటివాఁడు
పట్టుగాఁ బొందఁడు పరమైన ముక్తి
ఆత్మజ్ఞు లాసిద్ధులం దాస విడిచి
యాత్మయందు సుఖించి యవల మోక్షంబు

చెందుచుందురుగాని సిద్ధు లెందఱ
మందుఁ గోరరు కొంద ఱవి గోరుకొంద్రు
దనరారు ద్రవ్యముల్ తంత్రయంత్రములు
ఘనమంత్రములు క్రియల్ కాలశక్తులను
సిద్ధులం బుట్టించి చిత్రముల్ చూపు
సిద్ధాంతమగు ముక్తిఁ జెందెడుపనికి
నవియం తపాయంబు లగుచుండుఁగాని
ప్రవిమలంబగు మోక్షపద మందనియవు
ఆరీతి యేమన్న నట్టి సిద్ధులకు
గౌరవంబులు చాలఁ గలుగుచునుండు
సారెసారెకుఁ బ్రజాసంఘంబు గలుగు
భూరిదుశ్శాశలు పుట్టునందునను
నప్పు డహంకార మతిశయం బగుచు
ముప్పిరిగొనుచుండు ముక్తిమార్గంబు
చూడనీయవు గాన క్షుద్రసిద్ధులను
వేడుకగా నైన విమలాత్మవిదులు
గలవారు సిద్ధులఁ గాంక్షింప రెపుడు
పొలుపొంద నుపశాంతిఁ బొందుచుండుదురు
అన విని రాముఁ డిట్లనె మునినాథ!
ఘనయోగమున బహుకాల మగ్గలము
విడువ కుండుదు రట్టివిధ మెట్టులనిన
పుడమిఁ జేనికి మానిపుంగవుం డనియె

లలితాత్మ! విను మనిలంబు సారెకును
జలియింపు వాయువు సమయ నందులను
బడు శరీరంబులు పవనంబు బైట
వెడల నీయక లోన విసువక నిలుపు
యోగులకెల్ల నాయువు వృద్ధిఁ బొందుఁ
గాఁగ వారిల బహుకాల ముండుదురు
అన విని శ్రీరాముఁ డమ్మునీశ్వరుని
గని యిట్టు లనియె నోఘనపుణ్యచరిత!
యలఘు విజ్ఞానోదయమునఁ జిత్తంబు
విలయంబు నొందిన వేళ మైత్ర్యాది
సుగుణసమూహ మెచ్చోట జనించు
నగణితచరిత నా కానతిం డనిన
ముని యిట్టులనియె నిమ్ముగ రామచంద్ర!
వినుము నీ వారీతి విశదంబుగాను
అనఘాత్మ! చిత్తలయమునందు రూప
మనఁగ నరూపంబు నన రెండు గలవు
అందు జీవన్ముక్తి యగు నరూపంబు
పొందుగాఁ గన్న రూపు విదేహముక్తి
యలఘుజీవన్ముక్తుఁ డంగంబుతోడ
మెలఁగుచుండుటఁ జేసి మేలునుఁ గీడు
కలుగఁగా సుఖదుఃఖకలితమై మనసు
చలనంబు విడువక సంసారనాసు

భూరివృక్షమునకుఁ బ్రోదిగా నుండు
నీరీతి భావింప నివి చిత్త సత్త
దీని సంక్షేపంబు దెల్పెద వినుము
పూని పర్వతము గాడ్పునఁ జలింపకయ
నిలిచియుండినరీతి నెఱి సుఖదుఃఖ
ములు గల్గినప్పు డిమ్ముగ హెచ్చుతగ్గు
నొందక శాంతుఁడై యుగ్రభావమును
జెంద కున్నదికదా చిత్తాలయంబు
అటువలెఁ జిత్తాలయంబైన వెనుక
నెటు గుణంబులు గల్గు నెఱిఁగింపుఁ డనిన
జ్ఞానస్వరూపమై చలనంబు లేని
మానసము లఘునిర్మలబుద్ధిచేతఁ
బూని తద్జ్ఞాన మొప్పుగ నిశ్చయించు
మానస మేసత్వమయ మగుచుండు
నారీతి యెట్లన్న నాలించి వినుము
సారవిహీనరాజసతామసములు
పొలువులేక నశించి పోయినయపుడె
బలమరి చిత్తంబు పలచనై తగ్గి
చలియింప కుండఁగా సత్వగుణంబు
నిలచి యచ్చట నుండు నిర్మలం బగుచు
నలసత్వగుణమునం దవుడు మైత్ర్యాది
లలితగుణంబు లెల్లను గల్గుచుండు

జ్ఞానస్వరూపమై చలియింపకున్న
మానసం బాత్మలో మగ్నమైయుండి
యందు జీవన్ముక్తుఁ డగు యోగివరుని
యందు మైత్ర్యాదిమహాసద్గుణముల
నూరక పుట్టింపుచుండు వేడుకను
వారక యట్టి జీవన్ముక్తుఁ డవల
ముదము నొంది విదేహముక్తుఁ డైనపుడు
మది యతిస్వల్పమై మతితోడఁ గూడి
యావిమలాత్మయం దపుడు లయించి
పోవుఁ గావున గుణంబులు పుట్టవవల
నలసరూపమును లయంబు భావింప
నెలమి జీవన్ముక్తి యిది యన నొప్పు
నదియునుంగాక రోషాస్పదంబైన
హృదయంబు న్యాసమై యిదియది యనుచుఁ
దెలియఁగూడనిది విదేహముక్తి యగు
నలరజంబును దమంబను గుణద్వయము
విలయమై పోయిన వెనుక శేషించి
తొలఁగక సకలసద్గుణసారముగను
స్థిరముగా నున్న సాత్వికవిశేషంబు
మురువుమీఱ విదేహముక్తియం దణఁగు
సారెకు మారుతస్పందవాసనలు
ప్రేరేపుచున్న నింద్రియములమీఁది

జ్ఞానంబు రాక నిశ్చలవృత్తి నున్న
నానిర్గుణబ్రహ్మ మయ్యెద వీవు
వినుము రాఘవ! వేద్యవేదనోల్బణత
లొనరఁగఁ బుట్టింపుచుండుఁ జిత్తంబు
మోసపుచ్చు ననర్థమూలమై లేని
యాసలు పుట్టించు నటుగాన దాని
లయముఁ జేసిన మోక్షలాభంబు గలుగు
భయము లణంగు నిర్భయ ముదయించుఁ
గావునఁ జిత్తవికారంబు నణఁపఁ
గావలె నని మున్ను కమలజాత్మజులు
సనకాదు లాచిత్తసంరంభ ముడుప
ననిలధారణ సేతు రది యెట్టులనిన
మొనయు ప్రాణాయామమున సదాధ్యాన
మున యుక్తికల్పితముల యోగములను
అనిలనిరుద్ధమానవుఁడు లక్ష్యమును
దనయందె నిలుపఁ జిత్తముశాంతిఁ బొందు
దాన విజ్ఞానసుస్థైర్యంబు గలుగుఁ
బూని వృత్తిజ్ఞానభూతమైనట్టి
యనుభూతివాసన నంటి చలింప
కొనరినఁ బ్రకటచిత్తోత్పత్తిపదము
వినుము వాసనలచే విడువంగఁబడక
మొనయు పూర్వాపరముల విచారముల

జననమొందు పదార్థసక్తియే వాస
నని చెప్పఁదగుచుండు నదె యాత్మయందు
నూనికగా నిల్చియున్న సంస్కృతులు
నేనాఁటికైనఁ బో విట్టివాసనలఁ
దగిలిన పురుషుఁ డేద్రవ్యంబుఁ గనిన
మొగి నాత్మ ననిశంబు మోహింపుచుండుఁ
బడపడు వాసనాభ్యాసంబుచేత
నదియె పుట్టును గిట్టు నల హేతు వగును
దెలియఁగా హేయపాథేయమై చాల
నలరు జాగ్రద్భావ మణుమాత్రమైనఁ
దొడరి చిత్తమునందుఁ దోఁచనియపుడు
పొడమదు మానసంబు దలంచి చూడ
రహిఁ గర్మవాసనారహిత మైనపుడు
మహి నొప్పు పరమశమప్రదంబైన
యలమనోలయ మగు నది యెట్లులనినఁ
దెలిపెద విను రామ! తెల్లంబుగాను
బలములై మారుతస్పందనవాస
నలు గల్గునట్టు లెన్నంగ నారెండు
మొనయుబీజాంకురమును మానసమున
ననఁగ నొప్పుచు నుండు నమ్మాటి కొనర
జనవర! యీప్రపంచము బీజ మగును
గనుకఁ దద్ద్వైద్వ్యసంగతి విసర్జించు

మఱుమీఁద నిర్మూల మైనట్టి వృత్తి
మఱువలె సర్వంబు నణఁగును రామ!
సంవేద్యమునకు నిశ్చయము భావింప
సంవిత్తు బీజ మెంచఁగ నవి రెండు
కరమొప్ప నూనె లేకయు నూలులేని
కరణి నొండొంటి నేకడ విడకుండు
నలవిషయాజ్ఞాన మతిదుఃఖములకు
నిలయంబుగా నుండు నెఱిని నిర్విషయ
మైనట్టి సుజ్ఞాన మమలమై యాత్మ
కానందకారణ మై వృద్ధిఁబొందు
ననిన శ్రీరాముఁ డిట్లనె జాడ్యరహితుఁ
డనఘుండు నిర్విషయజ్ఞాని యైన
వానికి మఱి జడత్వముఁ బొందుటేమి
యానతియ్యఁ డటన్న నమ్ముని పలికె
నరయ సర్వావస్థలందు నిర్వాణ
సరణిని భావింపు శాంతచిత్తుండు
అవనిపై నెన్నికార్యములయుం దున్న
నవిరళనిర్విషయజ్ఞాని యగును
ధరణీశ! మఱి సర్వధర్మవాసనలు
పొరిపొరిని నశించి పోవఁగా నతఁడు
బాలుని గని మూఢుపగిది నున్మత్తు
పోలికఁ జిత్సుఖంబునఁ జొక్కుచుండు

జెలఁగి యిమ్మాఁ డభ్యసించు ధన్యునకు
గలవాసనామనోగ్రంథు లణంగుఁ
దనువు నిత్యం బని దలఁపుచుండుటను
దనయందుఁ గలపరతత్త్వభావనను
ననిశంబు నిస్సంగుఁ డగుచు నుండుటను
జనియించు వాసనల్ సమయుఁ జిత్తంబు
శాంతిఁ బొంది యణంగు సకలార్థములకు
నంతఃకరణమునం దంటియున్నట్టి
సంగంబు హేతువు సకలార్థములకు
సంగంబు నిలయంబు సంసృతి కెల్ల
సంగంబు మూల మాశాలతావళికి
సంగమే యాపదాళల కెల్ల నెలవు
సంగవర్జనము మోక్షము సంగవిరతి
మంగళప్రదము జన్మవినాశకరము
కలిమిలేములను సుఖము దుఃఖములను
గలుగఁ జేయుచునుండుఁ గలుషమైనట్టి
వాసన యనునది వసుధాతలేంద్ర!
వాసిగా నిలను జీవన్ముక్తులైన
జనులందు హర్షవిషాదవిరహిత
యనఁగ నొప్పుచును జన్మాంకురహరణ
యగు శుద్ధవాసన యమలమై నిలిచి
యగణితమోక్షసౌఖ్యంబు నొందించు

నతిమూర్ఖు లగువారియందు దట్టముగ
సతతంబు మలినహింసన నిల్చి మరలఁ
బుట్టించి గిట్టించి పొగిలింపుచుండు
నట్టివాసన నొంద రాత్మార్థవిదులు
కాదని సుఖము దుఃఖంబు గల్గినను
మోదఖేదాబ్ధుల మునుఁగుచుండకయు
పొలుచు నాశల వృద్ధిఁ బొందనీయకయు
పలుమాఱు సంపదాపదలు వచ్చినను
జిగురొత్తుసమబుద్ధిచే వానియందుఁ
దగలక తగినప్రాప్తపదార్థములను
ననుభవింపుచు నుంటివై నను నీవు
ననఘ! నిస్సంగుఁడవై సుఖించెదవు
ఆకాశగత్యభావాఖ్యనసరణి
నీకుఁ జెప్పెద రామ! నృపకులోత్తంస!
తెలి వందు మీ యుపదేశంబువలన
నలఘుచిత్త మణంగు నాత్మానుభవము
చక్కఁగా నగు నుపశమనప్రకరణ
మెక్కువఁగాఁ జెప్పి తిపుడు నీ కనుచు
జననాయకున కుపశమనప్రకరణ
మనువొంద బోధించె ననుచు వాల్మీకి
తప్పక యాభరద్వాజసంయమికి
నప్పుడు బోధించె నానందముగను

యిది సోమనాథవిశ్వేశ్వరస్వామి
పదపద్మభక్తసుబ్రహ్మణ్యయోగి
చరణాంబుజాతషట్చరణాయమాన
పరిపూర్ణనిత్యసద్భావనిమగ్న
మానసాంబుజ వెంగమాంబికారచిత
మై నిత్యమై సత్యమై ధన్యమైన
సామార్థసారసుజ్ఞానవాసిష్ఠ
రామాయణం బను రమ్యసద్విపద
యం దెన్నఁగాఁ దృతీయప్రకరణము
నందమై విమలమోక్షాకరం బగుచు
శ్రీతరిగొండనృసింహుఁ డనంగ
ఖ్యాతిగా వెలయు వేంకటరాయ! నీదు
పదయుగళికి సమర్పణ మయ్యె దీని
సదమలులై వ్రాసి చదివిన వినిన
నరులు తాపత్రయార్ణమును తరించి
పరమైననిర్వాణపదము నొందుదురు
భూచక్రమున నిది పురుషార్థ మగుచు
నాచంద్రతారార్కమై యుండుఁగాత.

తృతీయప్రకరణము సమాప్తము.

చతుర్థప్రకరణము.

శ్రీతారకోల్లాస శేషాద్రివాస !
శ్రీతరిగొండనృసింహా! ధూతాంహా !
విన్నవించెద నిది వినుము వాల్మీకి
సన్నసైగల నుపశమనక్రమంబు
తనియఁ జెప్పఁగ భరద్వాజుండు మరల
ననియె నిట్లని యోమహాగురుదేవ !
చిరకృప నమ్మౌని శ్రీరాఘవునకు
మఱి యేమి జెప్పె సమ్మతముగా ననుచు
నడర భరద్వాజుఁ డాసక్తివలన
నడుగ వాల్మీకి యిట్లనె నోకుమార !
శ్రీరఘుపతిని వసిష్ఠుఁ డీక్షించి
యాగాఢకరుణ నిట్లనియె నోరామ !
వెలయ నేఁ జెప్పిన వివిధార్థములకు
వలనైన ఫలము జీవన్ముక్తి యగును
నమరుదేహంబులం దహమికదృశ్య
సమితి యాత్మ యనుచుఁ జపలాకరముగ
నెందాఁక ద్రవ్యాళి నెనసి వర్తించు
నందాఁకఁ జిత్తంబునందు విభ్రాంతి

తెలుపగుచుండు నంతవిముఖుండగుచు
మురువుచూపెడి జగంబులను జిదగ్ని
యందె తృణములట్ల నాహుతిచేసి
సందేహముక్తుఁడై శాంతాత్ముఁడగుచుఁ
బట్టుగాఁ దను దాను భావింపుచుండి
నట్టి సంయమిచిత్తమందు విశ్రాంతి
కలుగ దెన్నటి కన్నఁ గాకుత్స్థతిలకుఁ
డలరి వసిష్ఠసంయమి కిట్టు లనియె
సద్గురువర్య! మీసత్కటాక్షమునఁ
జిద్గగనానందసీమలోఁ జేరి
వసుధపై నేను జీవన్ముక్తిపదము
వసమీఱఁ బొందితిఁ బ్రాణధారణము
నేయునుపాయంబుఁ జెప్పవే యనిన
నాయతీశ్వరుఁ డిట్టు లనియె నోరామ
విను చెప్పెదను నది విశదంబుగాఁగ
ననిలధారణ మంచు నన్నది యొకటి
ఘనతరజ్ఞానయోగం బన నొకటి
యనువొందఁగాఁ గలవని మున్ను నీకు
బోధించియుంటి నిప్పుడు నేను మరల
నాధారణాయోగ మమరఁ జెప్పెదను
దడఁబడుదేహశోధనఁ జేసి మలము
కడిగి రేచకపూరకములు కుంభకము

గావింపు చునికి యోగం బగు నాత్మ
నేవేళ భావించి యెఱుకకు నెఱుక
గాను దలంచి యక్కడ సుఖించినదె
జ్ఞానయోగం బగు శంభుండు మున్ను
అనిలధారణ సేయు టతికష్ట మనుచు
ఘనమనోధారణక్రమమున సిద్ధి
గలుగుట జ్ఞానయోగము సూక్ష్మముగను
విలసితసూక్తుల విరచించి యుంచె
తగు నధికారిభేదముల నా రెండు
నగు యోగముల ధన్యు లభ్యసింపుదురు
అనిలధారణ చేయునపుడు లక్ష్యమున
మన మొప్ప నిలిచి సమ్మతిఁ బొందుచుండు
తలకొని ఘనమనోధారణ చేయ
నలరి మనముతోడ ననిలంబు నిలుచు
వాయుధారణసేయువానికి ధరణి
నాయువు బహువృద్ధి యగుచుండుఁ దొలుత
సాధించునపుడు కష్టం బగుఁ గాన
మాధవ! నీకు నేర్పుగను విజ్ఞాన
యోగంబుఁ జెప్పితి యుక్తితో దీని
బాగొప్ప సాధించి పరమాత్మ వగుము
రహిమీఱఁ బ్రాణధారణఁ జేయువారి
మహిమంబుఁ జెప్పెద మది నిల్పి వినుము

పొలుపొందు మేరువుభూరిశృంగమున
కళగల పద్మరాగపుఝరిం గల్వ
తరు వొప్పుచుండు విస్తారమై యందుఁ
గర మొప్ప దక్షిణస్కంధమధ్యమున
గురుతరంబుగ నొక్కకోటర ముండు
నిరవొంద దానిలో నీటివల్లరులఁ
జూపట్టునీట భుశుండుఁడన ఘనుఁడు
తాపసశ్రేష్ఠుండు తత్త్వార్థవిదుఁడు
వీతరాగుఁడు కాలవేది శ్రీమంతుఁ
డాతతవిశ్రాంతుఁ డధికశాంతుండు
ఆయువుగల పుణ్యుఁ డనఘవర్తనుఁడు
వాయసశ్రేష్ఠుండు వసియించి యుండు
నతనిఁ జూచుటకు నే నరుగఁగా నెదుట
నతిశయవృక్షముం దల్లి దట్టముగఁ
దెలిఁగొప్ప బంగారుతీఁగెలకొనల
సరసంబులైన పుష్పఫలంబులందుఁ
గలకలధ్వనులతోఁ గలసి క్రీడించు
లలితవిహంగజాలములఁ జూచుచును
అలఘుసహస్రదళాబ్జనాళములఁ
జెలరేఁగి ద్రొక్కుచుఁ జిందుద్రొక్కుచును
వనజాతభవునకు వాహనం బగుచుఁ
దనరారుహంససంతతులఁ జూచుచును

పటు చనచన నంజనాద్రిసమాన
పటుతరదేహంబు పక్షయుగంబు
ఘనతీవ్రతుండంబు గలి గిరువంక
లను వృద్ధకాకజాలంబులు గొలువ
నచట సుఖాసీనుఁడైన భుశుండు
నచలాత్ము నీక్షించి యంచుకుఁ బోయి
నిలచిన నను జూచి నెనరుతో లేచి
నలువొప్ప విహితాసనమున నన్నుంచి
యుచితవృత్తిని నిల్చియుండఁగా నట్టి
యచలితాత్మునిఁ గాంచి యచటఁ గూర్చుండ
నియమించి యాఘను నెమ్మోముఁ జూచి
దయపుట్ట వాయసోత్తమున కిట్లంటి
నోకాకపుంగవ! యోపుణ్యచరిత!
యేకాలమందు నీ విలను బుట్టితివి
నీకుఁ దత్త్వజ్ఞాననిష్ఠ యెట్లబ్బె
నీకాయు వెంతయ్యె నెఱి నేటివఱకు
నీకాంచనాద్రియం దిర వెప్డుఁ డిచ్చె
నేకార్యములను నీ వెఱిఁగి యుండుదువు
ఆకథ లెల్ల నీవరమర విడిచి
నాకుఁ దెల్పుమటన్న ననె భుశుండుండు
పలికె నిట్లని మునిప్రవర! నాచంద
మెలమి నెట్లనిన మీ రెఱిఁగింతు వినుఁడి

యలపూర్వకాలమం దంబికావిభుని
విలసితోత్సవము సేవించువేడుకలఁ
గర మొప్పుచుండెడి కైలాసగిరికి
సరసమానసలైన సప్తమాతృకలు
మనము లుప్పొంగఁగా మచ్చికల్ మీఱఁ
జను మార్గమున సరస్వతివాహనమయి
పొలుచు హంసిక కనుఁ బొరి నలంబుసకు
నలరార వాహనం బగు కాకమునకుఁ
బుట్టితి పుట్టినప్పుడె నన్నుఁ జూచి
పట్టైనకరుణ నాభారతీదేవి
యిట్టి బ్రహ్మజ్ఞాన మిచ్చి రక్షించె
నట్టికాలంబునం దలరి మాతండ్రి
యీకోటరమున న న్నిరవుగా నుంచె
నాకాలముననుండి యమర నిచ్చోట
నిలచియుండంగ ననేకకల్పాంత
ములు మనుబహుకాలములు పోయె ననిన
విని యిట్టులంటి నే వెఱఁగొంది యంత
మునులు యోగులునైన మొనసి కల్పాంత
సమయంబులం దుండ శక్తులు గారు
విమలాత్మ! యెట్లు జీవించితి వీవు
అనిన భుశుండుఁ డిట్లనియె మునీంద్ర!
జననుతచరిత! యీశ్వరశాసనంబు

గడప నెవ్వరికి శక్యముగాదు గనుకఁ
గడనుఁ గల్పాంతరకాలంబులందుఁ
బొలుచు పృథివ్యాదిభూతజాలముల
నలఘురుద్రుండు లయముచేసినపుడు
అతులితతేజోమయంబైనభూత
వితతియం దేను బ్రవేశించి యవల
మొనసి యాయారూపములను ధరించి
యొనర నానందింపు చుంటి నెమ్మదిని
ననిన నే నప్పు డిట్లంటి భుశుంఠ!
విను నీవు పరతత్త్వవిదుఁడవు గాన
నవియు లయంబునం దణఁగి పోకుండి
యెవియేవి చూచితి వెఱిఁగింపు మనిన
నురుచిరాత్మకుఁ డాభుశుంఠుఁ డిట్లనియె
వరమునివర్య! తద్వార్తలు వినుము
అరయఁగాఁ బెక్కేఁడు లవనీతలంబు
నరశూన్యమై యుండె నానాముఖముల
మురువొప్పు వనశైలములు భస్మమయ్యె
నరుదుగా సూర్యచంద్రాగ్ను లణంగె
మూఁడులోకములను ముంచెఁ దోయంబు
క్రోడమై హరి మహోక్రూరుఁ డైనట్టి
హేమాక్షు నణఁగించి యిల నుద్భవించె
నీమహామహిమంబు నేను బాల్యమునఁ

గనుఁగొనుచుంటిఁ దక్కక యిదిగాక
గొనకొని మున్నేడుగురు వసిష్ఠులను
జెలువొప్ప నేను వీక్షింపుచుండితిని
పొలయ కష్టమవసిష్ఠుఁడవైన నిన్నుఁ
గనుఁగొంటి నొకమాఱు గగనంబునందుఁ
బనిఁబూని యొకమాఱు పవనంబునందు
వనువొంద నొకమాఱు ననలంబునందు
నొనరంగ నొకమాఱు నుదకంబునందు
నొకమాఱు ధరణియం దొకమాఱు మఱియుఁ
బ్రకటమై తగు మహాపర్వతమ్మందు
మొనసి మహత్తత్త్వమున నొకమాఱు (?)
ననఘాత్ముఁడగు బ్రహ్మయం దొకమాఱు
నురుతరబ్రహ్మతో నుద్భవం బొంది
చరియింపుచుండుదువు సకలలోకముల
నరయ నీజన్మంబు లద్భుతలీల
లరుదవి యటులుండె నవిగాక యేను
అల చక్రి నూఱు బుద్ధావతారములు
నలరార నూఱు కల్క్యవతారములును
ధరియించినవి గంటి ధర నిదిగాక
తెరలి ముప్పదిమార్లు త్రిపురముల్ గూలె
దక్షమహాధ్వరద్వంద్వం బణంగె
నక్షరకలితవేదావళు లరిగె

బహుశాస్త్రవితతులు బహుపురాణములు
బహులేతిహాసముల్ పరువడి నేఁగె
నలువొప్ప రామాయణములు పెక్కురిగె
సలలితమోక్షశాస్త్రములగు గ్రంథ
లక్షలు నుదయించె లలిని వాల్మీకి
శిక్షచే నితరుల శిక్షచే వ్యాస
మౌనిచే ఘనులైన మనుజులచేతఁ
బూని రామాయణంబులు భారతాది
వరకథ లుదయించె వసుమతిమీఁదఁ
దర మిడి రామావతారంబు లెన్నఁ
బరఁగ భవిష్యదుద్భవముతోఁ గూడ
నరయఁ బండ్రెండయ్యె నదియునుంగాక
యిరవొంద శ్రీవిష్ణుఁ డింకమీఁదటను
ధరియింపఁదగు నవతారంబుతోడ
రహిని కృష్ణావతారములు పదాఱు
సహజంబుగా నగు సంయమిశ్రేష్ఠ!
యిట్టి జగద్భ్రాంతి కేనాఁటి కవధి
పుట్ట దే నేమి చెప్పుదు నింకమీఁద
నీ వడిగిన వెల్ల నిశ్చయంబుగను
నే వినిపించితి నీ వింక నేమి
వినవలతు వటన్న విశ్వాస మొదవ
నొనర నే నిట్లంటి నోవాయసేంద్ర!

పరఁగఁ బుట్టుచు గిట్టు ప్రాణు లేరీతిఁ
జిరజీవు లగుదురు చెప్పవే తెలియ
నన వాయసేంద్రుఁ డిట్లనె మునినాథ!
వినుము చెప్పెద నవి విశదంబుగాను
నరయఁగా దోషంబు లను మౌక్తికముల
నఱిముఱి సానల నను తంతువులను
వరుసగాఁ గూర్చి యవ్వలఁ గూర్చునరణి
మఱచి యూరక యున్న మదిగలవానిఁ
బట్టదు మృత్యు వేపట్టున నైన
నట్టి చందం బెట్టు లనినఁ జెప్పెదను
వినుము పావనమును విమలం బనేక
మును జిన్మయము సౌఖ్యమును నైన పరమ
పదమునం దెవ్వని భావమ్ము చేతఁ
గుదిరి చిత్తము గఱంగుచు నుండునట్టి
వాని నమ్మృత్యుదేవర పట్ట వెఱచుఁ
బూనిన సంసారి భోగవిచార
కర్మమూలములైన కామాదిరిపుల
మర్మముల్ గని వాని మర్దించి విడిచి
తనువులోఁ బ్రాణచింతనఁ జేయుచున్న
ఘనుల మృత్యువు పట్టఁగా నోడి యుఱుకు
మొనసిన బహుదుఃఖములను హరించు
తనప్రాణచింతయే తనసఖ యగుచు

నానంద మొందించునటువంటి సరణి
నేను జెప్పెద నది నెలవుగా వినుము
పాదుగా నుండెడి ప్రాణంబు వెలిని
ద్వాదశాంగుళులంత తరలి యడంగు
నిదె రేచకంబగు నిదె నిశ్చలతను
గదియ బహిఃకుంభకం బగుచుండు
నదియె క్రమ్మఱ హృదయంబులోఁ జొచ్చి
కదలకుండినఁ బూరకం బగు నదియె
ఘనతరాంతరకుంభకత్వంబు నొందుఁ
దనియ నిభ్భంగి నాంతర్యమం దనిల
చింతనం బది ప్రాణచింతనం బగుచు
సంతోషకరమగు సహజంబుగాను
నిందె చలింపక యెవ్వరు నిలిచి
యుందురో వారు మహోన్నతు లగుచు
నతిశయశుద్ధబుద్ధాత్ము లభిన్న
మతులై యెఱుకగల్గి మనియుందు రిలను
గన బహిరంతర్ముఖములందుఁ బ్రాణ
మునునై యపానంబు మొనసి వర్తించు
నట్టిరెంటిని గూర్చ నారెంటినడుమ
నెట్టనఁ జిత్తంబు నిలిచియుండినదె
గుఱియైన కేవలకుంభకం బనుచు
వరయోగు లగువారు వచియింతు రిలను

మఱియుఁ బ్రాణము పోడముక యపానంబు
నఱిముఱి నణఁగంగ నపు డెద్ది ప్రబలి
సత్తుగా నిలచుఁ దద్జ్ఞానస్వరూప
ముత్తమోత్తనుముగా నూహించి దాని
యందు నైక్యంబయి యానందపదము
నొంది యందుఁ జలింపకుండు మనంబు
అట్టి ప్రాణసమాధియం దంటి సతత
మట్టిటు చనక చిదాకాశమందె
శాంతిచేఁ జిత్తవిశ్రాంతిని బొంది
యాంతర్యసౌఖ్యంబు ననుభవింపుచును
వసుధ భూతము భావివర్తమానముల
విసువక కర్తనై వీక్షించుచుండు
నలఘుసుఖంబులం దాపదలందుఁ
గలుగుసౌఖ్యమును దుఃఖమును బొందకయ
సరవి నెన్నఁగ సర్వసముఁడనై మఱియు
వరచిత్తసత్వభావనుఁడనై యపుడు
చిరజీవినై ప్రకాశించి యుందుందుఁ
బరమమునీంద్ర! నాబ్రతు కిట్టి దనిన
విని భుశుంతుని జూచి విమలాత్మ! నీవు
ఘనకాలవేదివి గాంభీర్యమతివి
పరతత్త్వరతుఁడవు పావనాత్ముఁడవు
నిరతసంతోషివి నీచరిత్రములఁ

దలపోయ నతివిచిత్రములు గావునను
సలలితవిశ్వభూషణముగా నమరి
తనివిఁ బొందుచు సదాత్మసుఖాతిశయము
ననుభవించుచు నుండవయ్య! నీ విచట
ననుచు వాయసయోగి నచ్చట వీడు
కొని నేను వచ్చితిఁ గుతలంబునందు
నానందముగ భుశుంతాఖ్యాన మెవరు
వూని విన్నను వారు భూరిచిత్పదము
నందుఁ బొందుట కర్హు లగుచు జీవింతు
రిందుకు సందియం బించుక లేదు
అలభుశుంతునివలె ననిలవారణము
చెలఁగి చేసినఁ జిరంజీవు లయ్యెదరు
మేనుండు యోగము నెంచక కొంద (?)
ఆనందకరమగు నట్టివిజ్ఞాన
యోగసాధనము సేయుదు రందువలన
రాగదోషములు దూరము లగుఁగానఁ
గాయంబుపై నాశ గలుగ దందులను
వాయుధారణఁ జేసి వసుధ జీవింప
నాస నొందరు ప్రాజ్ఞు లదియేల యనినఁ
గాసిలి వచ్చి యెక్కడనైన నరుఁడు
అలసి నిద్రించి లింగాంగంబుతోడఁ
గలలను జెంది సుఖంబు దుఃఖంబు

పొరిపొరి ననుభవింపుచు దిశలందుఁ
జరియించు నొకదిక్కు శాశ్వతంబుగను
నిలువలేఁ డాజీవునికి సంస్మరణము
దలఁప మనోభ్రాంతిదము మఱి దీర్ఘ
శమణమై తగుచిత్తరాజ్యం బటంచు
నమర భావించు మీ వంతరంగమున
నిలలోన నీణ్ణూల మిరవుగా నుండ
వలె నంచు మదిలోన వాంఛింపనేల
జనియించువా రెల్లఁ జచ్చుట నిజము
గనుక జచ్చుటకు దుఃఖము నొందవలెనె
యలరాగదోషంబు లనెడి భుజంగ
ములు మనోబలముతో మొనసి వసించి
కలపఁగా మోక్షమార్గంబు చొప్పడక
చలియింపుచుందురు చాల మానవులు
సరసులై సకలశాస్త్రంబులు చదివి
సరవిని రాగదోషముల నణంపఁ
జాలనివాఁ డగు సాధువస్తువుల
నోలి మ్రోయుచు గంధ మూహింపలేని
ఖర మనఁ దగు వానిఁ గాల్పనే తండ్రి!
యరయఁగా నటుగాన నతిభయదంబు
ఘనదైర్యఘూతి మంగళరహితంబు
ననఁబడు హృత్పిశాచావేశ మణఁచి

యేనాఁడు చెడక యిహపరమా చిన్త
యానందమునఁ బొందుమయ్య శ్రీరామ!
వాయుసేంద్రునివలె వాయుధారణముఁ
జేయుట విజ్ఞానసిద్ధియగా టగుదు
కావున నిర్వాణగతి నీయఁదగిన
దేవతార్చనరీతి దెల్పెద వినుము
అని యావసిష్ఠసంయమి రాఘవునకు
వినిపించి క్రమ్మఱ వేడ్క నిట్లనియె

దేవతార్చనవిధానము

అనఘ! గంగాతీరమందు నేఁ జేరి
యనలాంబకుని భక్తి నాత్మ నర్చించి
కనువిచ్చి చూడ శంకరుఁడు నాముంద
రనె నిల్చియుండె నారాజశేఖరుని
బ్రత్యక్షముగఁ జూచి ప్రాంజలి నగుచు
నత్యంతభక్తి నిట్లంటి నోదేవ!
హర! మంగళప్రద మజ్ఞానదోష
హారణ మైనట్టి దేవార్చనసరణి
దెలుపు మన్నను మహాదేవుఁ డిట్లనియె
విలసితముక్తిచే విను మోమునీంద్ర!
కలిగినహరిహరుల్ గారు దేవతలు
తెలిసి చూచినఁ జిత్తదేహరూపులును

గా రహంకృతియు నఖండ మద్వయము
నై రమ్యమగు వస్తువగు తొలివేల్పు
ఆకాశమునఁ బుట్టినట్టిభూతము ల
నేకముల్ గాఁగ నం దెనసి కల్పితము
గాక యంతట సదాఖండ మైనట్టి
శ్రీకరచిత్సత్త శివుఁ డన నొప్పు
నామూల మెఱుఁగక యజ్ఞానులైన
పామరు లాకారభావపూజనల
నరసి సేయుచు నుందు రామడదూర
మరుగంగలేక యారామడపోయి
నిలచి యావలఁ జననేరనివాని
వలె ఘనభక్తిభావనులయ్యు మరల
నపరిమితపరాత్ము నరయ నోపకయు
చపలులై వారు పాషాణాదివివిధ
రూపపూజలు సేతురు ధరిత్రి మనుజు
లాపరబ్రహ్మంబు నాత్మభావించి
తెలియ రాబ్రహ్మమందే సర్వభూత
ములు బుద్బుదములు సముద్రంబులోను
గలిగి యణంగినకరణి రూపములు
చెలఁగి పుట్టు నణంగుఁ జిద్వస్తువందె
గానఁ దద్వస్తు వాకారంబు గాదు
లేని రూపములు గల్గినరీతిఁ దోఁచు

నరయు ననంతకల్పాంతరతతులు
తెరలి యావస్తువందే లయ మొందు
నంతటఁ జిత్సత్త నర్చించుటకును
శాంతిబోధయు సర్వసమత పుష్పములు
గా సమర్పించి యాఖండభావనను
బాసి సమర్పించవలె నంతేగాని
యాకారపూజ లాత్మార్చనం బగునె
ప్రకటంబుగఁ బరాత్పరము నద్వయము
ననుపమంబు నబాహ్య మమల మద్భుతము
ననఘ మఖండంబు నానంద మందు
రహిని బాహ్యయు నాంతర యనంగఁ బూజ
విహితంబుగా రెండువిధములై యుండు
నిందు బాహ్యార్చనం బెట్టు లటన్న
నందెన్న సర్వభావాంతరస్థయును
శమితకళయు సదాసత్తు లనంగ
నమరు సామాన్యసత్తైన సంవిత్తి
సత్త యొక్కటి మహాసత్వభావంబు
నత్తఱిఁ బొంది తా నయ్యె దేవుండు
మానీంద్ర! బహుశక్తియుఁడయ్యె నతఁడు
గానఁ దచ్ఛక్తి తక్కక యాదినుండి
విదితప్రవృత్తినివృత్తులఁ బొందు
నది పరాశక్తియు నాదిశక్తియును

దెలివియై జ్ఞానశక్తియుఁ గ్రియాశక్తి
యులరు నిచ్ఛాశక్తి యాకర్తృశక్తి
యాదిగాఁ గలుగు ననంతశక్తులును
బ్రోదియై జగములఁ బుట్టించి నందుఁ
జపలయై యుల్లాసశక్తి సంసార
మపరిమితము చేసి యాడుచు నుండు
సరవి నంత నిరోధశక్తి సంసార
మురుపరాక్రమమున నుపసంహరించు
నట్టికృత్యంబుల కాధార మగుచుఁ
బట్టుగా భాసకాభాసకం బగుచు
నగుణంబు సంవిన్మయంబు ననంగఁ
దగి నిండియుండు నంతశ్చిత్ప్రకాశ
మే పూజ్యమై తాను మెఱయుచునుండు
నా పరమాత్మ సర్వాత్మ యెట్లనినఁ
గడలేని తత్పరాకాశకందరము
నడరారఁగా నసికాదికాకాశ
కోశాంఘ్రితలము దిక్పూర్ణంబులై ప్ర
కాశించు బాహుసంఘంబు లనేక
వనజజాండముల నవారిగా దాఁచ
ననుకూలమైన మహాకుక్షి గలిగి
వెలుఁగు నద్దేవుండు విశ్వరూపకుఁడు
నలఘుసంవిన్మయుం డఖిలపూర్ణుండు

నైన దేవున కుపహారముల్ వలదు
ధ్యానంబు శీతలత్వము నమృతంబు
తెలివి తదేకబుద్ధియుఁ బ్రమోదంబు
చలనరాహిత్యంబు సత్వంబు ననెడి
యాత్మీయదివ్యపుష్పార్చన సేయ
నాత్మసంతుష్టుఁడై యానంద మొందుఁ
బరమధర్మం బిది పరమయోగంబు
పరమాత్మ నీరీతి భావించి చూడ
నెఱుకకు నెఱుకయై యెల్లదేహములఁ
బరిపూర్ణుఁడై నిండి బహుశబ్దములను
విలసితప్రజ్ఞయై వినును శీతోష్ణ
ములఁ దా దెలియుచుండు మొనసి రూపములఁ
గనుఁగొనుచుండుఁ దత్కరషడ్రసములఁ
గొను గంధములను మూర్కొను నిద్రఁ జెందు
మరల మేల్కొనుఁ బల్కు మైత్రిని నెఱపు
నిరవొందు నీయాత్మ నేవేళ మదిని
బూని ధ్యానించుటే పూజితధన్య
మైన పూజలు నేల యాచిదాత్మునకు
అలపూజ పదియు మూఁడైన నిమేష
ముల యంతకాల మిమ్ముగఁ జేసినట్టి
ధ్యానశీలునకు గోదానఫలంబు
మానితంబుగఁ గల్గు మఱియొక్కదినము

పరిపూర్ణముగఁ జేయువాఁ డనాత్మకుఁడు
పరమధామమునందుఁ బ్రాపించియుండు
భావింప నిది యెల్ల బాహ్యపూ జగును
దావలమైన యంతఃపూజ వినుము

అంతఃపూజా విధానము.

నిత్యంబు నచలంబు నిర్వికారంబు
సత్యంబు సగుణంబు సర్వాత్మకంబు
అమిత మాకాశశివాత్మకాబ్జజము
విమలంబు పరమసంవిస్మయపూర్ణ
లింగంబు నర్చించులీల యెట్లనిన
మంగళప్రద చిత్సమాధిసౌఖ్యమును
దాను బొందినది యంతఃపూజ యగును
మౌనీంద్ర! యిఁక నొక్కమర్మంబు వినుము
స్థితుఁడు నిర్గతుఁడు నాసీనుండు జముఁడు
గతభోగి భోగి యఖండసుషుప్తి
యుతుఁ డవ్యయుం డద్వయుం డజరుండు
నతిజాగరూకుఁ డనాచారుఁ డజడ
సత్తాస్వరూపుఁ డెంచఁగ నేనె నాకుఁ
జిత్తదృక్ఛక్తుల సేవించుసతులు
అలఘువిశ్వంబున కర్పించు మనము
తలఁపులచే నొప్పు దౌవారికుండు

వెలయు ఖండజ్ఞానవివిధవృత్తులును
బొలుపొందు నాకు సద్భూషణావళులు
అమితంబులగు నాగృహంబుల కెల్ల
నమరియుండు దశేంద్రియములు వాకిండ్లు
ఆరీతి నారూప మగు నీకు నాకు
వేఱుగా దాత్మ భావించి చూచినను
గావున సమబుద్ధిగలవాఁడ వగుచు
నీవు న న్నర్చించు నిస్పృహత్వమున
నట్టి మదర్చన కన్యంబు లగుచుఁ
బుట్టియుండెడి ద్రవ్యపుంజ మేమిటికి
నలరగాఁ గామనం బను పూజ యొకటి
కలదు చెప్పెద నది క్రమముగా వినుము
పరమాత్మనగు నన్ను భావించి మదికిఁ
బరఁగఁ దోఁచిన పుష్పధూపాన్నపాన
వితతులు కల్పించి విశ్వాస మొదవ
ప్రతిదిన మర్పింప భావనాసిద్ధి
యగుచుండు నట్టి యాత్మార్చనార్హంబు
లగునట్టి భక్ష్యభోజ్యాదివస్తువులు
సమబుద్ధి శాంతరసముచేఁ దిరస్కృ
తములగు నటుగానఁ దత్త్వార్థ మెఱిఁగి
కలనాకలితదేశకాలకర్మములఁ
వలనఁ బ్రాప్తములైన వస్తువులందుఁ

దలఁగని యాశచేతను సుఖదుఃఖ
ములచేత విభ్రమంబునఁ బొందకుండు
తెలిసి జ్ఞానార్పితదేహనాయకుఁడ
వలరి నీ వగుచుండు మమలాంతరంగ
భూమిలో నిటువంటి పూజలు సేయు
నామహాత్మునకు నే నఖిలదేవతలు
నొనర సేవకులమై యుందు మాఘనుఁడు
తను దా నెఱిఁగి పరతత్త్వంబు నొందుఁ
గలమాడ్కి లేనిదై కలిగిన ట్లెపుడు
బలముగాఁ దోఁచు ప్రపంచ మంతయును
దఱచి యాభాసమాత్రంబుగా నెఱుఁగు
మఱి యది యెటులన్న మరుమరీచికల
యం దుదకం బుండినటు దోఁచి లేని
చందంబుగాఁ బ్రపంచం బాత్మయందుఁ
గనిపించిన ట్లుండుఁ గడను లేకుండు
ననిశ మజ్ఞాని యైనటువంటివాఁడు
మొనసి తద్భ్రాంతిలో మునుఁగుచు నుండుఁ
గనుక మూఢాత్ముఁడై కష్టదేహముల
ధరియించు విడుచుఁ దత్త్వము గనలేఁడు
పరికింప నటువంటి భ్రాంతచిత్తునకుఁ
జెలివిగా నాత్మోపదేశంబు సేయఁ
దలఁచు టెట్లనిన నిద్రను గలయుందుఁ

గనినపురుషునకుఁ గన్యక నిత్తు
నని తలంచుటగాదె యని యివ్విధమున
నెనసి నా కుపదేశ మిచ్చి రక్షించి
మొనసి తిరోధానమును బొందె శివుఁడు
ఈరీతి హరుఁ డానతిచ్చిన పూజ
లారూఢులైన సంయములును నేను
జిరతరనిష్ఠఁ జేయుచునుందు
మరయఁ బ్రాప్తములగు నర్చనంబులకుఁ
బొరిపొరి విఘ్నముల్ పొసఁగినఁగాని
మెరమెరఁ బడరాదు మిక్కిలి పూజ
యదియాగు దృఢనిశ్చయంబుతో నున్నఁ
బదపడి తద్దోషపటలం బణంగుఁ
జెలువొప్పుచుండెడి జీవులయందుఁ
గలుగు గ్రాహ్యగ్రాహకత్వముల్ రెండు
సరియగు యోగపూజలు సల్పుచుండు
మిర వందు సుజ్ఞాన మినకులాధీశ!
యని రఘువరున కాత్మార్చనక్రమము
పనుపడ నమ్మౌనిపతి సత్కృగుణాను
నెఱుకగా నుపదేశ మిచ్చి యీసరణి
మఱవవద్దనుచుఁ గ్రమ్మఱ నిట్టులనియె
తగ విను రామ! యంతర్వ్యాపితంబు
లగు సకలార్థంబులందుఁ గల్గినది

వెలయుచు నేవేళ వివిధభేదములఁ
జలియించు టది చిత్తచపలత గాని
యరయ నన్యంబుగా దని నీవు దెలియు
కొఱకు బిల్వఫలంబు గుఱుతుఁ జెప్పితిని
నిరతంబు పరసత్తు నిర్వికల్పయును
గరమొప్పునట్టి యఖండైకరసయు
నగణితం బగునట్టి యర్థంబు విశద
ముగఁ జేయుటకు మది ముదము రెట్టింప
భాసురంబగు శిలోపాఖ్యానసరణి
వాసిగాఁ జెప్పెద వసుధాతలేంద్ర!
పావనం బతిగోప్యపద మదే గనుక
సావధానముగాను జక్కఁగా వినుము
అది యెట్టు లనిన మహామృదులంబు
సదమలతేజ మాశ్చర్యకరంబు
పొరి నరంధ్రయును సంపూర్ణయు నగుచుఁ
జిరతరంబై యొక్కశిల యుండు ననిన
విని రాముఁ డనియె నోవిమలమునీంద్ర!
పెనుపొంద మీరు చెప్పినది చిత్ప్రదము
ఘనము శిలయు నేకకళయు నరంధ్ర
మును దా నగుచునుండి మొనసి లోకముల
నిరతంబు తనలోన నిండించుకొనుచుఁ
బోరి నాకసంబు గాడ్పును దాఁచుకొనిన.

వగిది నాకాశాదిపంచభూతముల
నగణితబహుపద్మజాండకోటులును
ఆమహాశిలలోని కాకర్షణంబు
వేమాఱు చేయుచుఁ గవిదుచుచునుండుఁ
దా నరంధ్రయు నభేద్యం బగుచుండు
నేనాఁడుఁ గనినఁ దా నేకమై యుండు
జలజగదాశంఖచక్రాదిచిహ్న
ములతోడఁ బరిపూర్ణముగ నిండియుండుఁ
దెలివియై తా సుషుప్తిని బొందుచుండు
నలఘుపరబ్రహ్మ మదియే యటంచు
నగణితప్రజ్ఞతో నారాఘవుండు
విగతసంశయుఁడై వివేకియై నిజము
చెప్పిన విని యాంజనేయుండు లోన
నుప్పొంగి హర్షాశ్రు లుబ్బుచుండఁగను
బరమసంతోషి నిర్భరమానసుఁడును
గరమొప్పఁ బులకితకాయుండు నగుచు
గద్గదకంఠుఁడై కరములు మొగిచి
చిద్గగనరహస్యశిల కర్థ మిట్లు
చెప్పిన రాము నీక్షించి తా మెచ్చి
యప్పు డిట్లనియె మాయప్ప! శ్రీరామ!
ఔహోహోహో నీవిమ్మహోరురహస్య
మూహించి చెప్పితి వున్నదున్నట్లు

లలపరబ్రహ్మ మీవై తివటంచుఁ
బలికి క్రమ్మఱ రామభద్రు నీక్షించి
సమ్మతంబుగఁ జాల సంస్తుతిఁ జేసి
యమ్మునివర్యుఁ డిట్లనియెఁ గ్రమ్మఱను

అర్జునోపాఖ్యానము.

విను రామచంద్ర! వివేకి వైనట్టి
జనపతి కథనాదిసకలక్రియలను
సలుపుచుఁ జిత్తవిశ్రాంతి వహించు
నిలను బద్ధుండుగాఁ డీయర్థమందు
బలముగా నర్జునోపాఖ్యాన మొకటి
కలదు చెప్పెద నది క్రమముగా వినుము.
ఇటుమీఁద జముఁడు తా నెల్లదేహముల
పటురోష మెసఁగ జంపక రోసి తపము
తా నాచరించి భూతలబాధ యుడుపఁ
గా నోపునటువంటి ఘనశౌర్యధనుల
నగధీరులగు నరనారాయణులనఁ
బాగ డొందఁ దగినట్టి పుత్రులఁ గాంచఁ
బరఁగ నయ్యురువుగు బదరికాశ్రమము
నిరవు సేసికొని యహీనతపంబు
పొసఁగఁ జేయుచునుండి భూభార ముడుప
నసహాయశూరులై యదుకులమందు

నారాయణుఁడు జననం బగుతోడ
భూరికౌరవవంశమునఁ బుట్టునరుఁడు
నలఘుమైత్రిని కృష్ణుఁ డర్జునుం డనఁగఁ
బొలుపొందుచుండు రప్పుడు కౌరవులకుఁ
బాండవులకు దొడ్డబవరంబు గలుగు
నండయై శ్రీకృష్ణుఁ డపు డర్జునునకు
ననుగుణసారథియై యుండు నిట్లు .
మొనయుభారతయుద్ధమున నాదియందు
సదయుఁడై జ్ఞాతుల చంప నొల్లకయు
విదితుఁడై పార్థుండు వెఱచు చుండఁగను
నాపార్థునకుఁ గృష్ణుఁ డాదరింపుచును
దీక్షితతత్త్వోపదేశంబు సేయు
నది యెట్లు లనిన నీ వాలించి వినుము
చెదరకయుండెడి చిద్రూప మెప్రుడు
చెడదు దృశ్యంబు లే చెడిపోవుచుండు
నడర నే నెవ్వఁడ నని యంటివేని
నిజము భావించిన నీవు నిర్జరుఁడ
వజుఁడవు నిత్యుండ వాత్మవు గానఁ
బుట్టువు చావు నెప్పుడు నీకు లేదు
నెట్టన నీరీతి నిఖిలజీవులకుఁ
జావు పుట్టువు లేదు చర్చించి చూడ
నేవేళ నయ్యాత్మ యిరవుగా నుండు

యట్లగుచుండఁగా నిది యది యనుచు
మాట్లాడఁగూడ దాత్మపరాత్మసర్వ
మయుఁడు శాశ్వతుఁడు చిన్మయుఁ డటుగాన
భయము లే దాత్మ కేపట్టుననైన
జడములు దేహముల్ జలబుద్బుదములు
పొడమి యణంగిన పోలికగాను
ఆయాత్మయందు దేహము లుద్భవించి
మాయగా నణఁగు నాత్మ చరింపకుండుఁ
గనుక జడములైన ఘటములఁ ద్రుంపఁ
జనుభీతి నీ కేల సరిసమూహముల
మొనసి నీతో యుద్ధమును జేతు మనుచుఁ
జనుదెంచినవు డీవు శాంతిఁ బొందుదువె
ంబు నెత్తి
కార్యంబు మొనసిన కాలంబునందు
ఘనశూరుఁడై యుండి కానిచందమున
వెనుక త్రొక్కని యెంత వెఱ్ఱివాఁ డైనఁ
దనుబాధ లెందు నాత్మను బొందకుండు
నని నిశ్చయించి యోగాత్మబుద్ధినను
అన్నివర్తనలు బ్రహ్మార్పణం బనుచు
నున్న నా బ్రహ్మంబు నొందెదవీవు
లోకులలో నింత లోఁగిపో నేల
ప్రాకటంబుగఁ జేయు భండనం బిపుడు

విలయ వాయువు వీచ వింధ్యపర్వతము
చలియించినను సుశాస్త్రము లలంఘ్యములు
అటుగాన మనుజులయప్రబోధమునఁ
బటుదేహవాసనల్ ప్రబలంబు లగుచుఁ
బొలుచు నాత్మజ్ఞానబుద్ధిచే వాస
నలు క్రమక్రమముగా నాశంబు నొందు
నని యనేకములుగా నాకృష్ణుఁ డర్జు
నునకు బోధింప ననూనవిజ్ఞాన
కలితుఁడై పార్థుఁ డక్కడ ఘోరసమర
మలరి యనాసక్తుఁడై చేసి గెలుచు
నటుగాన నీవు నిరాసక్తిఁ బొంది
ఘటికుఁడవై సర్వకార్యముల్ నడుపు
మఱి జంతువులకు జన్మపరంపరలను
బొరిపొరి సంకల్పపూర్వకంబులుగఁ
బరఁగుచుండెడిది విభ్రాంతియే కాని
నెరసి భావించిన నిలుకడల్ గావు
అని యవ్విధంబుగా నారాఘవునకుఁ
బనుపడ నర్జునోపాఖ్యానసరణి
వినిపించి క్రమ్మఱ విశ్వాస మొదవ
మునివర్యుఁ డవల రామున కిట్టు లనియె
నపుడగుచుండు నీయర్థంబునకును
సరియైన శతరుద్రచరితంబు వినుము

శతరుద్రజననము.

ఒక్కనాఁ డొకచోట నొక్కభిక్షుండు
చక్కఁగాను సమాధి సలుపుచున్నపుడు
తొలఁగి యాచిత్తవృత్తులు లోనఁ బొడమి
గలిబిలిఁ జేయఁగా గర్హ్యాశ్రమమున
చింతసేయుచుఁ గొంతసే పూరకుండె
నంతలో వింతగా నతనిచిత్తమున
బలిమి నాత్మను ప్రతిభాసవిశేష
కలనముల్ పొడమఁగా గామేచ్ఛ లోన
జనియింప నసమాన్యజనభవకాంక్ష
నొనరంగఁ గూడి వేఱొకనరుఁ డయ్యె
నతఁ డంత జీవలుఁ డను పేరుతోడఁ
బ్రతిభాస పొంది స్వప్నపురంబునందుఁ
దా విహరించి మద్యము ద్రావి నిదుర
వోవుచు విప్రుఁడై పుట్టి యాకలను
నేతి నన్నము భుజించి నిద్రించి కలను
మరల నందొక్క సామంతుఁడై పుట్టి
తేటఁ గొప్ప నన్నంబు తిని నిద్రవోయి
విరివిగాఁ గలను భూవిభుఁడై జనించి
పూలపాన్పున నిద్రఁ బొంది స్వప్నమున
నాలో సురాంగన యై జనియించి

యలఘురతిశ్రాంత యగుచు నిద్రించి
మెలపుగాఁ గల నొక్కమృగియై జనించి
పరఁగ నిట్లుగ స్వప్నభవపరంపరలఁ
బొరిపొరి ననుభవింపుచునుండి తుదను
నలఘురుద్రుండు తా నైతి నటంచుఁ
గలగాంచి సంతోషకలితుఁడై లేచి
యాకలలోఁ గల లాత్మ భావించి
ప్రాకటాశ్చర్యసంభరితాత్ముఁ డగుచు
శివునిరూపును గలఁ జెందినకతన
నవిరళవిజ్ఞానియై మది నిట్లు
దలఁప నీస్వప్నశతంబులు మాయ
వలనఁ గల్గి నిజంబువలె దోఁచె మదికిఁ
జెదరెడి మరుమరీచికలయం దెపుడు
నుదకంబు లేకుండి యుండిన ట్లుండు
నాకరణిని బ్రహ్మమందు విశ్వంబు
లేకుండి యుండినలీలగాఁ దోఁచు
నట్టి సంసార మాయారణ్యమందుఁ
బుట్టిన స్వప్నాంగముల ననేకములఁ
గనుచుండఁగానె యుగములు పెక్కేఁగె
నని తనలోన దా నాశ్చర్యపడుచు
నరిగి యత్యాదిదేహము లున్నజాడ
నరయుచుఁ దొలిభితుఁ డగుచుఁ దా నున్న

తనువు నీక్షించి చైతన్యంబు దాని
కనుఁబొంద నీయఁగా నది రుద్రుఁ డయ్యె
నారుద్రుఁ డీరుద్రుఁ డందుండి పోయి
గౌరవంబుగఁ జిదాకాశసంస్మృతిని
జెందిన జీవటు చేరి ప్రాణముల
నందీయఁగా రుద్రుఁ డయ్యె జీవపుడు
మొనసి యట్లవివ్ప్రముఖ్య దేహములఁ
గని ప్రాణముల నీయఁగా వారలెల్ల
మురువుగా శతరుద్రమూర్తులై రనఘ!
గరిమ నాభిక్షుసంకల్పంబు లటులఁ
దొలఁగక జీవలాదుల రూపులగుచు
సలలిత మవివ్ప దంశంబులై తోఁచి
నిలుకడ లై నట్లనే యుండె నన్ని
యలఘుమనోమాయ లని శతరుద్ర
జననక్రమము జెప్పి సంయమీశ్వరుఁడు
మనము రంజిల్లగా మరల నిట్లనియె
విను రామ! యిఁక నొక వృత్తాంత మమర
ననఘసుషుప్తమా నాఖ్యానసరణి
ఘన మది యెటులన్నఁ గాఢ్రతాపసుఁడు
ననఘజీవన్ముక్తుఁ డన రెండుగతులు
గల వందు నిస్సారకర్మకర్తృతిప్ర
ముల వీడి యింద్రియమ్ముల నణఁగించి

కనుమూసి నిదురించుగతి నున్నవాఁడు
ఘనుఁ డతఁ డెవఁడన్నఁ గాష్ఠతాపసుఁడు
అదియుఁగాక విరక్తి నాత్మయం దుంచి
మొదట యుక్తాయుక్తములను దా నెఱిగి
ఘనతరసచ్చిదాకాశంబునందు
మనము నెల్లప్పుడు మగ్నంబు సేసి
యజ్ఞానజనులలో నఖిలకృత్యములఁ
బ్రజ్ఞతో నడిపించు పావనాత్మకుఁడు
వంతుకెక్కిన సుజీవన్ముక్తుఁ డిట్టి
శాంతు లీయిరువురు సము లెట్టు లనిన
సరిగాను జిత్తనిశ్చయరూపమైన
పరమాత్మసత్తానుభవమె మౌనంబు
మొనయు తన్మౌనంబు మూఁడుచందముల
నొనరు నదెట్లన్న నూహతో వినుము
ఊరక మాట్లాడకున్నచందంబు
నారయ నజ్ఞానమగు నింద్రియముల
మద మణంచుట యక్షమౌన మౌ నెపుడు
నిదురించువిధముగా నే పరాత్పరము
అనుభవసరణిగా నంతరంగమునఁ
గనుచుండినదియెపో కాష్ఠమౌనంబు
అలర నీమౌనత్రయమునందుఁ జూడ
నలువొందు కాష్ఠమౌనంబు నల్లదియె

ధన్యం బనాయాసదము సదాద్వంద్వ
శూన్యము నైన సుషుప్తి నిస్సత్త
మదిని ధ్యానించి తన్మయుఁ డైన నదియె
కదలని మౌనసంగతమైన మబ్బు
పరఁగఁగా నాత్మవిశ్రాంతి ప్రపంచ
మరసి యస్థిర మని యాయర్థమందుఁ
గుదిరిన మౌనమే గూఢసుషుప్తి
యదియు నెన్నఁగ నేకమై యనేకముగ
విమలమై వెలుఁగు సచ్చిద్రూప మదియె
నమలచైతన్యము నమరియు నెఱుక
మతి నిల్పిన సుషుప్తిమౌనమై యుండు
నతిశయమైన సమ్యగ్జ్ఞానపటిమ
చే నిరతసమాధి సేయుధన్యుండు
జ్ఞానయోగి యనాఁ బ్రశస్తుఁడై యుండు
వరకాష్ఠమునికి జీవన్ముక్తుఁడైన
పురుషున కనుభవంబుగ నుండి చాల
నొనరు సంవిత్తత్త్వ మొకటియై యుండుఁ
గనుక నయ్యిరువురిగతు లేక మగును
అది యెట్టులనిన దేహాదివాసనలు
మదియును బ్రాణముల్ మగ్నమై యచట
గుఱుతు దప్పక యణంగుచు నుండునదియె
పరమపదం బండ్రు పండితోత్తములు

అరయ సంసారమహాస్వప్నమందుఁ
బరఁగెడి బేతాళుప్రశ్నవాక్యములు
ఉన్నవి చెప్పెద నొప్పుగా ననుచు
నన్నరపతి కిట్టు లనె వసిష్ఠుండు

బేతాళుని ప్రశ్నములు.

విను రామ! కర్కటివిధముగ జ్ఞాన
ధనయుక్తుఁడైన బేతాళుప్రశ్నములు
గల వవి యెట్టు లన్నఁ గ్రమముగా వినుము
పొలుచు బేతాళుండు భూతలమందు
దిట్టఁడై నడిరేయిఁ దిరుగుచు నుండు
నట్టివాఁ డొక్కనాఁ డందొక్కపురిని
గడఁకను నొకనరనాథు నీక్షించి
వెడ బొబ్బలిడి వెఱపించి యిట్లనియె
యొకఁడవే చిక్కితి వో రాజ! నిన్నుఁ
బ్రకటంబుగాఁ బట్టి భక్షింతు నీవు
బ్రదికెదవేని నా ప్రశ్నోత్తరములు
విదితంబుగాఁ దత్త్వవేత్తవై తెలుపు
పరఁగ నేరవిరశ్మిపరమాణువులును
గురుతరబ్రహ్మాండకోటులై యుండుఁ
దనియక యేమారుతము వీచుచున్నఁ
బొనరుగాఁగను రేణువులు మింట నెగరుఁ

గలనుండి కలకుఁ దక్కక పోవుచుండి
యలఘుతేజోమయ మగు నాత్మరూపు
విరివిగా విడుచుచుఁ విడువఁ డెవ్వండు
నరటికంబం బయ్యు నాకులు పొరలు
నగుచున్నకరణి నేయుణు వతివృద్ధి
యగుచుండు నెప్పుడు నణుతను విడని
పరమాణువునకు నేర్పడ నణువైన
తర మెఱుఁగఁగను బద్మభవాండసమితి
మురువొప్పు నవయవంబులు లేక యెపుడు
పరమై వెలుంగు నే పరమాణుశిఖరి
శిలలోఁ గలుగుచుండు సృష్ట్యాదు లెపుడు
తెలియఁ జెప్పుము నీవు తేటగా నిపుడు
అని ఝుంకరించి యిట్లుఘుఁగఁగా నగుచు
విని యానృపాలుండు వెఱవ కిట్లనియె
బేతాళ! నీవు సంప్రీతితో వినుము
భూతాదియై పరిపూర్ణుఁడై నట్టి
యతఁడు సంవిత్సూర్యుఁ డఖిలరూపముల
క్షితిమీఁద వెలిఁగించు చిత్ప్రభయందుఁ
దనరేణువులు జగత్త్రయమునై యెపుడు
రణయుక్తవిజ్ఞానరవిచే వెలుఁగు
ఆకారసత్తే యనాకారసత్త
ప్రాకటంబుగఁ బరిస్పందసత్తయును

ఖ్యాతిగా నొప్పు చిదానందశుద్ధ
చైతన్యసత్త యీ సర్వంబు నొక్క
పరమాత్మ యనుచుఁ జెప్పందగుచుండు
మఱియు తన్మాయాసమీరకంపమున
జగము లనెడి మహాస్వప్నజాలమున
నగణితస్వప్నంబు లరుదుగాఁ గాంచు
నది పరబ్రహ్మ మా నా బ్రహ్మ మెపుడు
పదిలమా శాంతిసంపన్నమైనట్టి
పరమనిజస్వరూపము వీడకుండు
నరఁటికంబముచుట్టు నాకులు పొరలు
పుట్టుచు లయమునుం బొందుచు నుండు
నట్టిచందంబుగా నా బ్రహ్మమందుఁ
బొరలు వృత్తము పరువును గల్గి విశ్వ
మరుదుగాఁ గల్గుచు నణఁగుచు నుండు
మొగి నలభ్యము సూక్ష్మమును విమలంబు
నగు పరమాత్మరూపణు వగునదియె
అగణితశక్తి ననంతప్రకాశ
మగుటను గనకాచలాదులై యొప్పుఁ
బరువడిగా దీని పరమాణువితతు
లరయఁగా మేరుసూర్యాదులు నయ్యెఁ
బర్వి యొప్పుచు నుండు పరమాణువితతి
సర్వపూరకమహాశైలమై వెలసె

నది మహా జ్ఞప్తిమయంబై మనమును
గదియఁగా దాన మగ్నంబయ్యె జగము
తనియు విజ్ఞాన మాత్రం బీప్రపంచ
మని యానృపాలుఁ డీ ట్లనుభవసరణి
గా తగఁ వినిపింపఁగాను మోదించి
బేతాళుఁ డతని సంప్రీతితో మెచ్చి
యతని వీడ్కొని చని యాహార ముడిగి
మతిమంతుఁడై చిత్సమాధియం దుండెఁ
దనమందిరమున కాధరణీంద్రుఁ డరిగె
ననుచు బేతాళువృత్తాంతంబు రామ
భూపాలునకుఁ జెప్పి బుద్ధి విశ్రాంతి
నీపగిదిని బొందు మిల దుర్లభంబు
అతిసులభంబుగా నవని నింకొకఁడు
హిత మొప్ప సాధించునట్టి విశ్రాంతి
మురువొప్ప నీయర్థమున నితిహాస
మెఱిఁగింతు నని యమ్మునీంద్రుఁ డిట్లనియె

భగీరథోపాఖ్యానము.

అనఘ! భగీరథుఁ డను మహారాజు
పనుపడ భూమిని బాలింపుచుండి
మనుజులు సంసారమాయాబ్ధిలోను
మునిఁగిపోయెడుచందములను భావించి

మొనసి పశ్చాత్తాపమును బొంది యపుడు
తనమదిలోఁ దానె తలఁచె నిట్లనుచుఁ
గటకట! మానవుల్ కష్టసంసార
మటమట మని పీడ కాళ్ళచేఁ జిక్కి
కాఁపురంబులునేసి కడపటఁ జచ్చి
పాపకూపములలోఁ బడిపోదు రిట్టి
హింసాస్పదంబును హేయంబునైన
సంసార మే నొల్లఁ జాలు నివెల్లఁ
దలఁప నిస్సారకృత్యంబులే కాని
యలఘుసారములు గా వాయు వహములు
రాత్రులు జరిగి తేరకుఁ బోవుఁ గనుకఁ
బుత్రమిత్రాదుల పొత్తు నా కేల
యని గాఢవైరాగ్య మగ్గలింపఁగను
జని త్రితలుం డను సద్గురుం జేరి
తనయభిప్రాయ మంతయుఁ దెల్పి మ్రొక్కి
కనుల నీరొల్క గద్గదకంఠుఁ డగుచు
వివిధ దుస్సంసారవిషయరోగమున
కవధి యెన్నఁడు గల్గు నానతిం డనినఁ
ద్రితలుఁ డిట్లనె రాజ! దీనికి నవధి
యతులితచిన్మాత్ర మగు నాత్మ మదిని
దలఁచి నీ వది యైనఁ దద్రోగ మణఁగు
నలఘుతరారోగ్య మబ్బు నీ కనిన

విని నృపాలుఁడు పల్కె విమలచిన్మాత్ర
మనుపమంబుగ సత్య మని మీకరుణను
దోఁచుచున్నది యందుఁ దొలఁగక చిత్త
మేచందమున నిల్చు నెఱిఁగింపుఁడనిన
విని యాత్రితలుఁడు భూవిభున కిట్లనియె
ననఘ! సంసారమహారోగమునకు
మొనయు రాగ ద్వేష మోహవ్యాధులకు
ఘనతరౌషధ మహంకారశోషణము
గావున నీక నహంకారబీజమును
నీవు సుజ్ఞానవహ్నిజ్వాలలందు
వెలివరివై కాల్చి విడిచితివేని
మరల దేహంబును మాయాంకురంబు
పుట్ట దప్పుడు ముక్తిఁ బొందుదు వీవు
నెట్టన నామాట నిజముగా నమ్ము
మని త్రితలుఁడుపల్క నాభగీరథుఁడు
మనమున నూహించి మరల నిట్లనియె
వరగురుస్వామి! పర్వతముపై వృక్ష
మరలేక పుట్టియున్నట్టిచందమునఁ
దనువం దహంకృతి తా నుదయించి
మనములో నెలకొని మమకారములను
బొడమింప నెట్టినేర్పున దానిఁ గొట్టి
పడవేతు ననఁగ నాభక్తునిఁ జూచి

శిరమైన దయతోడఁ ద్రితలుఁ డిట్లనియె
ధరణీశ! నీవు చిత్తంబు నడంచి
సకలంబు వర్జించి శాంతి వహించి
యకలంకహృదయుండ వై భీతి విడిచి
తలకొని యీషణత్రయమును గెల్చి
యలరు నింద్రియమనోహంకారములకు
శత్రుండవై శాంతశమదమంబులకు
మిత్రుండవై మానసమోపంబునకును
రాక యేవేళఁ బరస్వరూపంబు
నేకాగ్రబుద్ధితో నెవుడు చూచుచును
బొరిఁ జిత్తవిశ్రాంతిఁ బొందినదనుక
నరయ భిక్షాహారివై దీనదశను
బొంది నిస్పృహుండవై భూమిపైఁ దిరుగు
మందుచే ముక్తుఁడ వయ్యెద వనుచుఁ
ద్రితలుఁ డీగతి నుపదేశించినట్టి
యతులితోక్తులు విని యాభగీరథుఁడు
ఆమీఁద నిజరాజ్య మంతయు విడిచి
కామాదిశత్రువర్గమును బోనడఁచి
సర్వసన్న్యాసభాస్వరనిష్ఠఁ బూని
సర్వదేశములందు సంచరింపుచును
భిక్షాశనుండై యభేదభావమున
నక్షీణవిశ్రాంతి ననుభవింపుచును

సరసుఁడై కొన్నివత్సరములు ధరను
జరియించి మార్గవశంబుగాఁ దనదు
పురిఁ జేరవచ్చిన పురవాసు లతని
నరుదుగాఁ జూచి నిజాలయంబునకుఁ
దాము దోడ్కొనిపోయి తగఁ బూజఁజేసి
ప్రేమాతిశయమున భిక్షలు పెట్టి
యాదరింపుచు నుండి రతనిరాజ్యంబు
ప్రోడిగాఁ బాలించు పుణ్యాత్మకుండు
రయమున నాభగీరథుచెంతఁ జేరి
భయభక్తు లెసఁగఁగాఁ బ్రణమిల్లి పలికె
నోమహాయోగీంద్ర! యోకృపాసాంద్ర!
నామీఁద దయయుంచి నాఁటిచందమున
నిలను జరింపఁగా నేల యిచ్చోట
నిలువవే నన్ను మన్నించి యటంచు
నతఁడు ప్రార్థింపఁగా నాభగీరథుఁడు
హిత మొప్ప తద్రాజ్య మెల్ల నొల్లకయె
మఱి యందు నిల్వ కున్మత్తునిపగిది
సరగునఁ జని భూమిఁ జరియింపుచుండి
మార్గవశంబుగా మఱియొకచోట
భర్గుఁడో యన నొప్పు పరమదేశికుని
కడ కేఁగి మ్రొక్కి యఖండాత్మబోధ
విడక తా ననుభవించినరీతి

వినిపించి త్రితలుని వీడ్కొని వేగఁ
జని భగీరథుఁడు భూచక్రంబునందుఁ
దిరుగుచుండఁగ దనదేశంబు మున్ను
పరిపాలనము సేయు ప్రభువు నశించి
పోవఁగా నపుడు తద్భూమికి రాజు
కావలె నని మంత్రిగణములు గూడి
చని యాభగీరథు జగతిపై వెదకి
గని మ్రొక్కి ప్రార్థించి క్రమ్మఱ నతని
దోడుకవచ్చి పొందుగ రాజ్యపదము
నడరఁ బాలించుట కపుడు పట్టంబు
గట్టఁగాఁ బూర్వప్రకార మా రాజు
నెట్టన నందుండి నిస్పృహుం డగుచు
మొనసి సప్తసముద్రముద్రితధరణి
నొనరంగఁ బాలింపుచుండి శమంబు
దమమును బరమశాంతము శత్రుమిత్ర
సమదర్శనత గల్గి శాంతిని బొంది
యరయ జీవన్ముక్తుఁడై యుండె ననుచుఁ
బరఁగ భగీరథోపాఖ్యాన మమర
బట్టుగా బోధించి ప్రతిబంధకములు
నెట్టనఁ బాయకయే యొవరికైన
నిలువ దాత్మజ్ఞాననిష్ఠ యెన్నటికి
నెలమి నీయర్థమం దిల శిఖిధ్వజుని

చరితంబు చెప్పెద సావధానముగ
నరలేక వినుమంచు నావసిష్ఠుండు
సచ్చరితుండైన జానకీపతికి
మచ్చికతోఁ జెప్పి మరల నిట్లనియె

శిఖిధ్వజోపాఖ్యానము.

అనఘ! శిఖిధ్వజుఁ డను మహారాజు
పనుపడ భూమిని బాలింపుచుండు
నతనిభార్యామణియైన చూడాల
హిత మొప్పఁ బతిభక్తి నెనయుచు నుండు
నాదంపతులు వృద్ధులై యటమీఁద
వేదాంతశాస్త్రముల్ విన నిశ్చయించి
వైరాగ్యకలిత భాస్వరవివేకమున
పారజ్ఞుఁ డైనట్టి సద్గురుచెంతఁ
జేరి శుశ్రూషలు చేసి మెప్పించి
భూరిసద్భక్తితోఁ బొసఁగ వేడినను
నాగురుం డిరువుర కప్పు డధ్యాత్మ
యోగక్రమము లన్నియును కృపమీఱఁ
దెలియఁగొప్పఁగా నుపదేశంబుఁ జేసి
యరిగె శిఖిధ్వజుం డటు లాత్మబోధ
మఱచి యెప్పటిరీతి మహి నేలుచుండె
సురుచిరయుక్తిచేఁ జూడాల గురుని

పదభక్తి మఱవక పరమార్థసరణి
మదిని భావించి సమ్మతి నిట్లు దలఁచె
ధీరుఁడై గురుఁ డుపదేశించినట్టి
సారార్థసరణి విచారించి చూడ
పంచభూతములచేఁ బ్రభవించి ధరను
మించి నటించు నిమ్మేను నేఁ గాను
అందుబుట్టు దశేంద్రియాళితద్విషయ
బృందంబుగాను హృత్ప్రేరితం బయిన
తనువు సలిలబుద్బుదంబుచందమున
జెనుపొంద నుదయించి పెరిఁగి నటించి
వంచించు నక్కాలవశమునం దుదను
ఔంచికక్కై వడి భిన్నమై పోవు
నటుగాన నేను దేహంబను మాట
నట యగుఁ బ్రాణపంచకము నే ననిన
నది సూక్ష్మదేహాంగ మస్థిరం బగుట
నిదియును నేనుగా నెఱిఁగి చూచినను
మది నే ననిన మహామాయతో నెపుడు
కదిసి సంకల్పవికల్పజాలములఁ
బొరిపొరి నూరకే పుట్టించుచుండు
నరయ సంశయచంచలాత్మకం బగుచు
మొనసి తా నణుమాత్రముగ సంచరించుఁ
గనుక మానస మేను గా నెన్నటికిని

నిలకడ యగు బుద్ధి నే నంటినేని
యలరారఁగా నిశ్చయాత్మకవృత్తి
కలది తానై యహంకారభావమున
కెలమిని నిరతంబు హేతువై యుండుఁ
గాన నే నాబుద్ధి గా నహంకార
మేనని చూచిన నిలను బాలకునిఁ
బట్టినభూతంబుపగిది జీవంబు
నట్టిట్టుజరగనీయక చుట్టి పట్టి
సత్తను మఱపించి జడత నొందించి
చిత్తవృత్తులఁ బెంచి చేష్టింపుచుండుఁ
గావున నే నహంకారంబు గాను
జీవంబు నే నని చింతింతు ననిన
మాయచేతను బ్రాణమయమై కలంక
మే యెడలను వీడ కెనయుచు నుండు
మది యదే నే దీనిమర్మంబుఁ గంటి
నదియు నేఁ గాను మహాసుకుమార
యగుచిత్తు సర్వంబు నణఁగినవేళ
మిగిలి తా నన్నింటిమీఁద వెలుంగు
నీరహస్యము నేటి కెఱుకకు నెఱుక
గా రయంబున నేను గంటిఁ జిత్తమునఁ
బ్రతిఫలించిన చిదాభాసతో భూత
వితతు లెల్ల ననేకవిధములుగాను

నమలచిత్సత్తచే నలరి జీవించు
రమణీయమగు సూదిజాతిచెంగటను
దొరకొని యినుపసూదులు సంచరించు
కరణి జడములైన ఘనభూతములను
నెరయు చైతన్యసాన్నిధ్యంబునందుఁ
జరియించు నీరహస్యము నేను గంటి
నాచిదాత్మయు నైతి నఖిలేంద్రియములు
నాచెంత నటియించు నానావిధముల
విని కన నేర్చు సంవిజ్ఞానపటిమ
ఘనతరాజ్ఞానసంకలనచేఁ జిక్కి
జడత నొందుచును నిజస్వరూపంబు
నడరార మఱచి మాయలకు లోనగుచుఁ
బుట్టి గిట్టుచు నుండు పోల్కిని దోఁచు
నిట్టి జగద్భ్రాంతి యెఱుకయం దణఁగు
నింతకాలంబున కెఱిఁగితి నాత్మ
చింతించునదియంత చిద్విలాసంబ
యని పెక్కుగతుల వేదాంతార్థములను
మననంబుచేసి సమాధి నేమఱక
చిరనిష్ఠతో నభ్యసింపుచుండఁగను
గురుకటాక్షంబునఁ గుదురైన బుద్ధి
చెదరకుండఁగ యోగసిద్ధి లభించె
ముది దొలంగినయట్టి ముదిత దేహమున

నలువొప్ప నవయౌవనంబు ప్రాపించెఁ
జలనరాహిత్యంబు సర్వశాంతంబు
మొదలైన సుగుణసమూహ మాయింతి
యెద నుదయింపఁగా నింపుసొం పెసఁగ
సంతోషభరితసుస్వాంతయై యుండి
యంతలో నొక్కనాఁ డాత్మేశు చెంతఁ
జేరి నిల్చినఁ జూచి చిరునవ్వు నవ్వి
యారాజు పల్కె నెయ్యమున నిట్లనుచు
చూడాల! నీకు భాసురయౌవనంబు
పోడిమి నేరీతిఁ బొడమె వింతగను
ముదిమి యెక్కడ డాఁగె మోహనతేజ
ముదయించి నీమేన నొప్పుచుండుటకు
హేతువే మోచంద మెఱిఁగింపు మనిన
భూతలేశ్వరున కప్పొలఁతి యిట్లనియె
నరవర! యీయౌవనంబు తేజంబు
పరభూమి కరిగి సంపాదింపలేదు
వినుము తొల్లిటి మేను విడుచుటలేదు
జననాథ! క్రమ్మఱ జనియింపలేదు
యిది నాకు సహజమైయే యున్న దిపుడు
కుదురుగ మనల కాగురుఁడు సత్కృపను
నుపదేశ మిచ్చిన యుచితవాక్యముల
నెపుడు దలంచుచు నెఱుక నేమఱక

యీసర్వమును బాసి యేకమై నిలచి
తా సర్వమగు పరతత్త్వంబు గనుచు
నలగక యసమానమగు మదిలోను
దలఁగక నిస్సంగతను నే రమింతు
లే దుదయంబును లేదు నాశమును
లేదు లేనిది యాత్మ లీలఁ గల్గినది
యనుభూతి యనుభూత మనుచు సుఖింతు
జననాథ! దోషరోషము లాత్మ కెపుడు
దోఁపకున్నవి మహాతుర్యభావమున
కావలఁ గలితజగజ్జాలమునకుఁ (?)
బ్రభువునై యిహమును బాసి పాయకయె
శుభదృష్టి నను నేనె చూచి సొక్కుచును
మొనయు రాగద్వేషముఖ్యశత్రువులఁ
దునుమాడి చిత్తవృత్తుల పొత్తు వీడి
సరససద్గురువాక్యశాస్త్రదృష్టములఁ
గర మర్థితో నన్నుఁ గలసి మెలంగ
నే నాత్మతత్త్వంబు నిశ్చయించుకొని
యానంద మొందుదు నాయాత్మ కెపుడు
అదిరూప మిదిరూప మని చెప్పఁగూడ
దది సర్వవిషయేంద్రియాళి నీక్షించుఁ
గాని దానిని నివి గనుఁగొనఁజాల
వానిర్మలాత్మతత్త్వానుభవంబు

గలిగియున్నది సదాఖండలక్ష్యమున
నిలిచి చలింపక నేను నే నైతి
ననుచుఁ జూడాల నిజాత్మానుభవము
వినిపింప నంతయు విని శిఖిధ్వజుఁడు
ఆయింతిపలుకుల కప్పు డర్థంబు
చేయనేరక రాజు చిడిముడి ననియెఁ
జూడాల! నీకది చోద్యంబు దోఁప
నీడ వచ్చితివి నీవింతియే కాని
యర్థముల్ గాని నీయనృతోక్తులందు
సార్థకంబుగ నదే చర్చించి చూడఁ
బడుచుఁదనంబుచేఁ బలికితి విన్న
పడఁతి! నీ కటువంటి పరుషోక్తు లేల
చాలించు మని రాజు చపలాత్ముఁ డగుచుఁ
దా లేచి పోయె న త్తరుణి చూడాల
తనమదిఁ దా నిట్లు తలఁచె నీనృపుని
ఘనముగాఁ బట్టినకర్మబంధంబు
తెగిపోవుదనుక ముక్తిని నమ్మ లేఁడు
తగ దిప్పు డితని కీతత్త్వంబు దెలుప
ననుచుఁ దాను సమాధి నభ్యసింపుచును
దనయింటియందె స్వస్థంబుగా నుండి
ఘనయోగ మొనరించి గగనయానాదు
లనేడుసిద్ధులఁ బొంది యానంద మొంది

జనకుఁ డర్భకునకుఁ జాలుగా విద్య
లనువొంద బోధించు నట్టిచందమున
తననాథునకు సతి తత్త్వార్థములను
పనిఁబూని కొన్నియర్థములు దెల్పఁగను
వినినందుచేత వివేకంబు కొంత
జనియించె నృపున కాసమయంబునందు
వినువక యేవేళ వేదార్థములను
వసుధామరుఁడు శూద్రవానికిఁ దెల్పు
పగిది నీచూడాల పామరుండైన
మగని కీయోగక్రమము దెల్పుచుండు
నని శిఖిధ్వజునివృత్తాంత మమ్మౌని
వినిపింప రామభూవిభుఁ డిట్టు లనియె
గురుచంద్ర! యారీతి గురుతరార్థముల
నరమర లేక నెయ్యంబు రెట్టింప
గెంట కాసిద్ధయోగిని శిఖిధ్వజున
కంట బోధించు వేదాంతార్థములను
నతఁడె తెలియకుండె ననిన నిం కెవరు
ప్రతిభతోఁ దెలుతు రాపరమార్థములను
నాదంపతులకు మహాకృపమీఱ
వేదాంతసూక్తుల వినిపించుగురుఁడు
ఒక్కఁడె యుపదేశ మొకటియై యుండి
యెక్కువై చూడాల యెఱిఁగిన దేమి

యిది యాశిఖిధ్వజుఁ డెఱుఁగని దేమి
యది దెల్పుఁడని రాముఁ డడుగ వసిష్ఠ
ముని యిట్టులనియె నమ్ముదిత చూడాల
మునుపటి సంభవంబుననుండి ముక్తి
కామించి భూమికల్ క్రమముగాఁ గడచి
యామీఁదఁ జరమదేహంబు ధరించి
యున్నందుచే గురుఁ డొకమాఱు తనకుఁ
బన్నుగాఁ జెప్పిన పరమార్థసరణి
మననంబుఁ జేసి సమ్మతిఁ బొందె నపుడె
జననాయకుఁడు పూర్వజన్మంబులందు
రమణీయముక్తి గోరక కర్మములను
నమరఁ జేసి నరేంద్రుఁడై జనియించి
చూడాలతోడ భాసురతత్త్వసరణి
వేడుకగాఁ దాను వినుటయే కాని
తరుణిరీతిని బరతత్త్వచింతనము
చిరనిష్ఠనుండి చేసినవాఁడు గాఁడు
కావున నజ్ఞానకలితుఁడై తత్త్వ
మేవిధంబున విన్న యెఱుక లేకుండె
నరనాథ! యెవరికైనను గురుఁ డొక్క-
గుఱి చెప్ప నాగుఱి గొప్పఁగా నెంచి
విని యది నమ్మి వివేకియై కష్ట
మున కోర్చి తత్త్వార్థమును విచారించు

వానికి దొరకు జీవన్ముక్తిసౌఖ్య
మే నిందు కితిహాస మెఱుఁగఁ జెప్పెదను
జక్కఁగా విను రామచంద్ర! యటంచు
మక్కువ నవ్వాని మరల నిట్లనియె
విను రాఘవేశ్వర! వింధ్యాద్రిమీఁద
నొనరఁ గుటుంబియై యొకకిరాతుండు
నుండి ధనాసక్తి నుండినచోట
నుండక వనములం దొంటిగా మాని
కరణిని దిరుగ జాంగలదేశమందు
మెఱుపైన గవ్వ సమీపంబుగాను
గనిపింప నది వెండి గాఁబోలు ననుచుఁ
జని చాలవెదక నచ్చట గవ్వ తనకుఁ
గనఁబడకున్నఁ దత్కాంక్షను విడువ
కను వాఁ డచట నున్న కసవెల్లఁ బెఱికి
యూడాడ వైచుచు నలయుచు నందె
మూఁడుదినంబు లిమ్ముగ గవ్వమీఁది
యాస వీడక చూడ నమరరత్నంబు
వాసిగా దొరకఁగా వాఁడు మోదించి
దానిఁ గైకొనిపోయి ధనవంతుఁ డయ్యె
నోనరనాథ! వాఁ డొక్కటి వెదకి
యొకటి గన్నట్లు గురూపదేశార్థ
మొకకాలమునఁ దోఁచకుండినఁగాని

వేసటంబడి దాని విడువ కాత్మార్థ
మాసక్తితోఁ జూతు నని మానసమునఁ
బుట్టినసంశయంబులను ఖండించి
పట్టుగా మనమందె భావించె నేని
యమరసన్మణి వాని కబ్బినరీతి
రమణీయసుజ్ఞానరత్న మీతనికి
సరగున దొరకు మోక్షధనాఢ్యుఁ డగును
బరిపూర్ణశాంతిసంపన్నుఁ డౌ ననిన
విని రాముఁ డమ్మునివిభునకు మ్రొక్కి
మనమున మోదించి మరల నిట్లనియెఁ
దాపసోత్తమ! శిఖిధ్వజుఁడు మోక్షంబు
నేపగిదిని బొందె నెఱిఁగింపుఁ డీవుడు
అనిన వసిష్ఠుఁ డిట్లనె రామచంద్ర!
విను మాశిఖిధ్వజువృత్తాంత మతఁడు
చూడాలసుజ్ఞానసూక్తు లాలించి
యూడకాడకు మోక్షమం దాశ నుంచి
పరమాత్మతత్త్వానుభవము గాకున్నఁ
బరితాపమును బొంది పట్టణమందు
నిలువ సైరింపకే నిఖిలతీర్థములఁ
బొలుపొందఁ గ్రుంకుచు భూప్రదక్షిణము
గావించి వచ్చెదఁగా కని పోయి
తా వేగ పుణ్యతీర్థములందుఁ గ్రుంకి

క్రమ్మఱ వచ్చి చక్కఁగఁ జిత్తశాంతి
నమ్మహీపతి వివేకానంద మొంది
వైరాగ్యమున రాజ్యవైభవంబులును
ధారోసి విడిచి యంతఃపురమందుఁ
జూడాలయుండినచోటికిఁ బోయి
పోఁడిమి నాసతిఁ బుజ్జగింపుచును
ప్రియముమీఱ నిజాంకపీఠంబుమీఁద
దయ నుంచుకొని మహీధవుఁ డిట్టు లనియె
వినుము చూడాల! వివేకివి నీవు
గనుకఁ జెప్పెద నొక్క కార్య మేమనిన
నీరాజ్య మెల్ల నే నేలితి రాజ్య
భారంబు నీ వింక భరియింపవలయు
సుతుఁడు లేకుండఁగఁ జూడాల! నీకు
హిత మొప్ప నీరాష్ట్రి మింపొంద నిచ్చి
పోయెద నేను దపోవనంబునకు
నాయాజ్ఞ మీఱక నామేలు కోరి
భామ! నీ వీభూమిఁ బాలింపుచుండు
కామాదిశత్రువర్గంబు నణంచి
సారవిహీనసంసారంబు విడిచి
సారాత్మతత్త్వవిచారంబుఁ జేసి
సలలితచిత్తవిశ్రాంతిఁ బొందెదను
వెలఁది! నీ విందుకు విఘ్నంబుచేయు

వల దన్నఁ జూడాల వరునకు మ్రొక్కి
పలికె నిట్లని మహీపాలక! నిన్ను
వనవాసములయందు వర్తింపఁ బనిచి
జనులలో నాకు రాజ్యము చేయఁదగునె
యెలమి నేకాలమం దేపనిచేయ
వలయునో యది చేయవలె న దెట్లనిన
సహజవృక్షములు వసంతకాలమున
రహిమీఱఁ బూచి శరత్కాలమందు
ఫలియించు నారీతిఁ బటుయౌవనమున
నలరుచు భోగంబు లానందముగను
ననుభవింపుచునుండి యధికమౌ ముదిమి
తనువులఁ బొందినతఱి వనంబులకుఁ
బోవఁగావలయు నిప్పుడు నన్ను విడిచి
పోవుదురే పురంబున నిల్చియుండి
తఱిమి కామాదిశాత్రవులఁ బోఁగొట్టి
పరమసుజ్ఞానానుభవముచేయుచును
నన్నిటియం దంటి యుంట కారాజ్య
మున్నతమతిఁ జేయుచున్నను నీకుఁ
గొదవ లే దవల ముక్తుండ వయ్యెదవు
సదమలచిత్తవిశ్రాంతిని బొంది
నిలువు నీ విచ్చటనే యంచు నింతి
పలుకఁగా విని మహీపాలుఁ డిట్లనియె

మగువ! నామాటకు మాఱుమాటాడఁ
దగదు నీ వెఱుఁగనిధర్మంబు గలదె
యేపుణ్యమహిమనో యిపుడు నీమేన
దీపించె యౌవనదివ్యతేజంబు
వెలఁది నే నిప్పుడు వృద్ధుండ నైతి
నలభోగభాగ్యసౌఖ్యముల నే నొల్ల
నతిపతివ్రతవు నీ వైనందువలన
నతివ! నిన్నిందుంచి యరిగిన నాకు
మదిలోఁ గొదవలేదు మహి యెల్ల నీవు
పదపడి నారీతిఁ బాలింపుచుండు
క్షితినేలుచుండిన జిత్తవిశ్రాంతి
హితమొప్పఁ జెందలే నెన్నాళ్ళకైనఁ
బరఁగ బ్రహ్మేంద్రాదిపదములందునను
జిరముగా నిల్వదు చిత్తవిశ్రాంతి
కావునఁ దపము నే గహనంబులందుఁ
గావింపవలయు నిష్కర్షగా ననుచుఁ
బలికి చూడాలకుఁ బట్టంబు గట్టి
వెలయురాజ్యము నేలువిధముల నెల్లఁ
జెప్పి చూడాలచే సెలవంది నృపతి
యప్పురం బెడఁబాసి యారణ్యమునను
దూరాటవుల నొక్క దుర్గస్థలంబుఁ
జేరి యందుఁ దపంబు చేసెద నంచుఁ

దలఁచి జితేంద్రియత్వంబుచే ముక్తి
వలనుగాఁ దాఁ బొందవచ్చుఁ గాకనుచుఁ
బోడిమి నందున్న పుణ్యతీర్థమున
మూఁడుకాలములందు మునిఁగి లేచుచును
జెలఁగి దర్భలు నారచీరలు జడలు
పొలుచు రుద్రాక్షలు భూతి ధరించి
యొనరఁ గమండలమును జపమాల
యును బూలపుట్టికయును మృదువైన
హరిణాజినము దృఢంబగు నాగబెత్త
మురుపాదుకలు గల్గి యుండఁగా నతఁడు
చిరనిష్ఠచే బుద్ధసిద్ధాసనమున
నిరవొందఁ గూర్చొని యెండవానలకుఁ
దాను జలింపక ధైర్యగుణంబు
నూని తపంబుఁ జేయుచునుండె నృపుఁడు
ఇచట చూడాల తా నెల్లరాజ్యంబు
ప్రచురశక్తిని బరిపాలించుచుండి
అష్టదశాబ్దంబు లరిగినమీఁద
శిష్టుఁడై తపమొప్పఁ జేయునాయకుని
నిష్టంబుగాఁ జూడ నిచ్ఛఁ జింతించి
యష్టసిద్ధులు దన కబ్బియున్నందు
వలన నాథునిమీఁది వాంఛతో లేచి
కలఁగక గగనమార్గంబున నరిగి

తపముఁ జేసెడు శిఖిధ్వజుని వీక్షించి
యపరిమితార్తి నిట్లని మది నెంచె
నజ్ఞానమున నీతఁ డానంద మిచ్చు
విజ్ఞాన మెఱుఁగక వెఱ్ఱిచందమున
వరరత్నభూషణావళిఁ దాల్చువాఁడు
తఱుచు రుద్రాక్షలు ధరియించినాఁడు
భూరిహేమాంబరంబులు దాల్చువాఁడు
నారచీరెలు దాల్చి నవయుచున్నాఁడు
తలకొని స్వాదుగంధ మలందువాఁడు
పొలుపులేక విభూతిఁ బూసికొన్నాఁడు
మొగి మణిమందిరముల నుండువాఁడు
వగ చెడి యడవిలో వసియించినాఁడు
సుకరమైనటువంటి సుజ్ఞాన మెఱుఁగఁ
డకట కర్మాసక్తుఁ డగుచు నున్నాఁడు
స్త్రీరూపమున నేను జెప్పినమాట
లీరాజు నమ్మలే దిపుడైన నేను
మునికుమారకరూపమును దాల్చియైన
జననాయకుని చిత్తసంశయంబులను
దీర్చి తత్త్వార్థంబు దెలిపెద నేను
నేర్చి యూరకయుండ నీతిగా దింక
నని నిశ్చయించి యం దద్భుతంబైన
పనిఁబూని పురుషరూపంబు ధరించె

నది యెట్టులనిన హేమాభ దేహమున
నదమలధౌతవస్త్రములు ధరించి
పరిమళగంధ లేపము వక్షమందు
విరివిగా యజ్ఞోపవీతంబు మెఱయఁ
గర మొప్పఁగా శిఖ కళికయుందమరి
విరిదండ సారెకు వెనుక నటింప
ఘనకమండల మొక్కకరమునఁ బూని
జనపతికడ బ్రహ్మచారిచందమునఁ
బుడమికిఁ జేయెత్తుపొడవుగా నిలచి
పొడనూపఁగాఁ జూచి భూపాలమౌని
యేదేవుఁడో వచ్చె నిచటి కటంచుఁ
బాదుకల్ కడమీటి బహుతీవ్రగతిని
నెదురేఁగి తోడ్తెచ్చి యిష్టాసనమునఁ
గుదురుగా నతని దాఁ గూర్చుండఁబెట్టి
పనిఁబూని యం దర్ఘ్యపాద్యాదివిధుల
మొనసి పూజ లొనర్చి మ్రొక్కఁగా నృపుని
వీక్షించి శ్రీరస్తు విజయో స్తటంచు
నక్షీణకరుణతో నాబ్రహ్మచారి
దీవించె నపుడు పృథ్వీపతి యతని
భావించి యోమునిప్రవర! యిచ్చటికి
నామీఁద దయయుంచి నాచెంత కిపుడు
ఏమికార్యార్థమై యేతెంచినారు

శశిచంద్రు లెవరు మీస్థల మెద్ది యనిన
సలలితుఁ డగుబ్రహ్మచారి యిట్లనియె
విను పుణ్యచరిత! నావృత్తాంతమంత
ననిమిష మునిచంద్రుఁ డగు నారదుండు
కర మొప్పుచున్న గంగానది చెంత
గిరికందరమునందు గెంటక తపము
సలుపుచు నుండఁగా జాహ్నవీతటినిఁ
గలకలధ్వని లెసఁగంగ నమ్మౌని
విని యిదేమో యని వింతగా నటకుఁ
జని యందు జలకేళి సల్పుసుందరులఁ
గనుఁగొన వారిచక్కఁదనంబు లెల్ల
మనమున నాట నమ్మౌనివీర్యంబు
పడెఁ జాఱె మెఱుపుకై వడి ధాత్రిమీఁదఁ
బడగ నమ్ముని దాని స్ఫటికకుంభమునఁ
బెట్టియుండఁగ నది పిండమై యుండె
నట్టిపిండంబునం దవయవంబులును
బొడమఁగాఁ దద్ఘటంబుననుండి నేను
వెడలిన మాతండ్రి వేడ్కఁగాఁ బెంచి
విమలకుంభమునుండి వెడలితిఁ గాన
నమరగా నను కుంభుఁ డనుపేరఁ బిలిచి
సకలవిద్యలు నాకు సాంగముల్గాను
ప్రకటంబుగాఁ జెప్పి బ్రహ్మచెంగటికి

నన్ను దోడ్కొనిపోయి నాచే నజునకుఁ
బన్నుగా మ్రొక్కించి పలికె నోతండ్రి!
వీఁడు మీపౌత్రుండు వీని మన్నించి
వేడుకఁ యజ్ఞోపవీతంబు నిచ్చి
తెలివిగా నాత్మోపదేశంబు చేయు
వలె నన్న ననుఁ జూచి వనజసంభవుఁడు
నలువొప్ప నుపనయనం బందుఁ జేసి
విలసితవేదాదివిద్యలు నేర్పి
సారసత్త్వోపదేశముఁ జేసి ధరణి
నారూఢవిజ్ఞానివై సంచరింప
నీవు పొమ్మనఁగ నే నిర్మలతత్త్వ
భావుఁడనై భూమిపైఁ జేరి బ్రహ్మ
చారినై విహరింతు సర్వస్థలముల
నారీతి యిది నీకు నాఁటఁ జెప్పితిని
పరపుణ్యచరిత! యెవ్వఁడ వీవు వింధ్య
గిరిచెంత నొంటిగా గెంటక నిలిచి
యేమి గోరి తపంబు నివుడు చేసెదవు
నీమదియందున్న నిశ్చయం బేమి
యావిధ మెఱిఁగింపు మన శిఖిధ్వజుఁడు
తా విన యోక్తి న త్తపసి కిట్లనియె
వరముని! నే శిఖిధ్వజుఁ డనువాఁడ
నరనాయకుఁడను బునః

భయమున రాజ్యంబు పరిహరించుకొని
జయకారణంబైన శాంతిఁ బొందుటకు
విపినంబులోఁ జేరి విశ్రాంతిఁ గోరి
తపము సేయఁగ నమృతము విషంబైన
గతిఁ దపశ్చరణలు కష్టమై దోఁచు
నతిచాపలము పుట్టు నందుచే మదికి
నే నశక్తుఁడ నైతి నిఁక నేమి సేతు
దీనవత్సల! నాకుఁ దెలుపవే యనిన
నరనాథు నీక్షించి నవ్వి యమ్మౌని
కరుణ నిట్లనె మహాకాంత! నీరీతిఁ
దెలిసితి నాయోగదృష్టి నెట్లనినఁ
దెలియఁజెప్పెద నీసతీసమేతముగ
నొక్కట గురువుచే నుపదేశ మైతి
వక్కడ నీబుద్ధి నాత్మానుభవము
దొరకకుండఁగవచ్చి దూరాటవులకు
స్థిరబుద్ధి లేక కృశింపుచున్నావు
నీపత్ని గురుభక్తి నిలిపియున్నందు
చే పరాత్మసుఖంబుఁ జెంది నెమ్మదిని
బురమునం దున్నది భూపాల! నీవు
పర మెఱుంగక కష్టపడియెద విందు
నని పూర్వవృత్తాంత మతఁడు దెల్పఁగను
విని శిఖిధ్వజుఁ డందు వెఱఁగొంది పలికె

విమలాత్మ! నీవు నావిధముల నెల్ల
నమరఁ జెప్పితివి నీయంతధన్యుండు
దొరకఁడు నాకు సద్గురుఁడవై నీవు
పర మెట్టిదో దాని పట్టు శోధించి
రక్షింపవలె నన్న రాజు వీక్షించి
యాక్షణమ కృప నిట్లనె బ్రహ్మచారి
ధీరాత్మ! గురుఁ డుపదేశించినట్టి
సారాత్మబోధ నిశ్చయముగా మొదటఁ
జిక్కినప్పుడె దానిఁ జేపట్ట లేక
నక్కట మది సంశయంబు నుంచుకొని
నీ వెవ్వఁడై నట్టి నిశ్చయార్థంబు
భావించి యెఱుఁగక బహుఘోరతపము
చేసిన మోక్షంబు సిద్ధించు ననుచు
గాసికి నోర్చి సంకల్పవికల్ప
జాలంబులకుఁ జిక్కి చపలచిత్తమునఁ
గాలంబు నూరకే గడుపుచుండితివి
వాసనావశు లైనవారు కర్మముల
వాసక్తితోఁ జేతు రజ్ఞాను లగుచు
వసుమతీశ్వర! నీవు వారిచందమున
పస లేని కర్మప్రపంచవాసనకు
లోనైతి విచట నాలోకులకరణి
నానందకరమోక్ష మబ్బునే దీనఁ

ప్రాజ్ఞసాంగత్యంబు పరిహరించుకొని
యజ్ఞాని వగుచు నిం దడల నేమిటికి
నీకనైనఁ బరతత్త్వ మెఱఁగితి వేని
సకలదుఃఖంబులు సమయు నటంచుఁ
బలుకఁగాఁ గుంభుని పాదపద్మముల
కెలమి భక్తిని మ్రొక్కి యవనీశుఁ డనియె
గురుఁడవు నీవు నాకు నిజంబుగాను
పరులు లే రిఁక నెన్నిభంగులనైనఁ
దిరముగా నాత్మోపదేశంబు చేయ
దొరకొని నను గృతార్థునిగాను జేయు
మనుచుఁ గన్నీరొల్కఁ యార్తుఁడై యున్న
జనపతిమనము కాషాయపరతను
బనుపడి యున్నది పరమార్థవిద్య
నొనరంగ నితని కే నుపదేశమీయ
దగు నిప్పు డనుచుఁ జిత్తమున నూహించి
యగణితకరుణ నిట్లనియెఁ గుంభుండు
ప్రియముతో దండ్రి చెప్పిన విద్య సుతుఁడు
భయభక్తు లెసఁగఁ దప్పక వినురీతి
నా మాట నీవు నిశ్చయముగా వినినఁ
బ్రేమతో నీకుఁ జెప్పెద నాత్మవిద్య
మొదటి నీసంశయమునకు సాదృశ్య
మిది యనఁదగినట్టి యితిహాస మొకటి

మదికిఁ దోఁచినదీని మనుజేంద్ర! తొలుత
విదితంబుగా నీకు వినిపింతు వినుము
అదియెట్టులనిన మహాశాస్త్రవిదుఁడు
సదమలుం డగు నొకజగతీసురుండు
తనమదిలోనఁ జింతామణిఁ గోరి
ఘనతపం బొనరింపఁగా నది వచ్చి
యాభూసురునిచేత నప్పుడ నిలిచె
నాభావ మెఱుఁగక యాబ్రాహ్మణుండు
తలఁచె నీరీతిఁ జింతామణి నన్ను
వలనొప్పఁగా మెచ్చి వచ్చునే త్వరగ
నెలమిఁ జింతామణి నీయఁజాలకయు
వెలయు వేల్పులు తపోవిఘ్నంబు సేయ
నీరీతిఁ బంపినా రీగాజుపూస
నేరీతిఁ గైకొందు నిపు డంచు మదిని
దలఁచఁగా నెగిరి చింతామణి చనియె
నలవిప్రుఁ డెప్పటియట్ల తపంబు
పనిఁబూని చేయఁగా బహువత్సరముల
కొనరప్రత్యక్షమై యొకగాజుపూస
తనచేతి కొదవఁ జింతామణి దొరకె
ననుకొని తనయింటి కరిగె విప్రుండు
పొలుపొంద నాగాజుపూస నానాఁట
మలినమై పోవ బ్రాహ్మణుఁడు చింతించె

నారీతిఁ దొలుత నీ కబ్బుచున్నట్టి
సారవేదాంతసుజ్ఞానరత్నమును
విడనాడి వచ్చి యీవిపినమధ్యమునఁ
గడగండ్లఁబడుచును గర్మముల్ చేసి
కడతేరవలెనని కాంక్షించినావు
పుడమి నిందున ముక్తి పొందునే నిన్ను
విడువు నీ వాభ్రాంతి విమలాంతరంగ!
చెడిపోక యింక సుస్థిరబుద్ధి నుండు
ధరణీశ! నీవు తత్త్వజ్ఞాని వగుచు
సరసచిత్తుండవై సర్వకర్మములఁ
దలఁపకుండెడిది చింతామణిగాను
దెలియు నీయడవి నార్తిని వసియించి
కర్మముల్ చేసి తత్కర్మఫలంబు
నర్మిలి వాంఛించు టది గాజుపూస
గాను నీవెఱుఁగు దుఃఖంబు నణంచి
యానందమును బొంద నాత్మ నూహించి
మాయాశ్రయమునఁ గర్మతపంబు నిట్లు
సేయఁగా నిన్నుఁ జూచితిఁ గాన నీకుఁ
దత్త్వార్థ మెఱిఁగింపఁదలఁచితి నీవు
సాత్త్వికబుద్ధితోఁ జక్కఁగా వినుము
నీవు చింతామణినే కోరి తపము
నీవిధంబునఁ జేయు టింతయే కాని

స్ఫటికోపలంబైనఁ బ్రాప్తంబుగాదు
కటకట యిట్టిసంకల్పవికల్ప
పటలంబులో నింకఁ బడియుంటివేని
చటులమేఘము లాకసంబును బొదువు
కరణి సంకల్పవికల్పముల్ నిన్ను
మఱిమఱి పొందు సమ్మతిఁ బొందనియవు
గనుక సంకల్పవికల్పంబులందు
మననంబు విడిచి బ్రహ్మంబు నీ వగుము
అదియెట్లు నే నౌదు నని సంశయంబు
హృదయమం దున్న నీ కెన్నాళ్లకైన
దొరకదు ముక్తి సంతోష మెందునను
గరిమ సంశయము సంకల్పమౌదాని
విడువుము నీ వింక విడువకుండినను
దడఁబడి గాజు రత్న మటంచు భ్రమయు
నవనీసురునిరీతి హాస్యపాత్రుండ
వవుదువు గాన నీయజ్ఞత విడిచి
తరళత నణఁచి చిత్తత్యాగి వగుచు
నరసి సర్వత్యాగివై యుంటివేని
యది పురుషార్థసమాప్తి తదన్య
మిది యది యనఁగ లే దిరవుకొన్నట్టి
యజ్ఞానవైరి నీ కగపడినపుడు
ప్రజ్ఞతో వానిఁ జంపక పీడినందు

వల్ల నీ కిన్ని దుర్వ్యథలు ప్రాపించె
నల్లనాఁ డజ్ఞత నణఁచి యుండినను
యెనలేని దుర్దశ లెల్ల నీకా బొందు
నసఘచిదానంద మబ్బ నీజడత
విడిపించు ననుచు భూవిభున కీరీతిఁ
గడఁగి చింతామణికథ వినిపించి
యాకుంభరూపిణి యైన చూడాల
ప్రాకటకరుణతోఁ బలికెఁ గ్రమ్మఱను
నోనరనాథ! యింకొక యితిహాస
మేను జెప్పెద నది యెటు లన్న వినుము

గజోపాఖ్యానము.

అలఘువింధ్యారణ్యమం దొక్క గజము
గలదు హాస్తికుఁడు తక్కక దానిఁ బొంచి
పట్టి గొలుసు దానిపదమున నంటఁ
జుట్టి వృక్షమున కచ్చుగఁ గట్టివేసి
తా దానిముందర తాఁటిమా నెక్కఁ
గా దంతి దంత యుగంబుతోఁ గాలి
గొలుసు గ్రక్కున వీడ్చికొని ఘీంకరింప
నళికి హాస్తికుఁడు తా నామానిమీఁద
నున్న నేనుఁగు మ్రాను నురవడిక విఱిచి
తన్నుఁ జంపు నటంచుఁ దరువుపై నుఱికి

పడిన నేనుఁగు వాని భావించి చూచి
పుడమిపై వ్రాలె నీపురుషుని నేను
జంపుటిం కేలంచుఁ జనియె నాదంతి
కంప మొందుచు వాఁడు క్రమ్మఱ లేచి
చెచ్చెర నలఁత దీర్చికొని తా నవుడు
నచ్చోట నుండక యరిగి కుంజరము
చనినజాడను బోయి సామజ మున్న
యునికిపట్టు నెఱింగి యుపముగా దాని
చుట్టు వాదంబు హెచ్చుగఁ ద్రవ్వి పైనఁ
గట్టెలు తీఁగెలు కసువు నాకులును
బఱచియుండఁగ గజపతి దానిమీఁదఁ
బరునెత్తి దిగజాఱి పడి హస్తిపునకుఁ
జిక్కె నాదిని వాఁడు చిక్కినయపుడె
త్రొక్కి చంపక యున్నదోషంబుచేతఁ
గరి వానిచేతికే క్రమఱఁ జిక్కె
నిర వొందు దోఁచక యేడ్చుచునుండె
నీకథార్థంబు నీ వెఱుఁగవు నేనె
వీఁకతోఁ జెప్పిన వినుము వింధ్యభూమి
యనఁగ నీరాష్ట్ర మీ వాగజేంద్రంబు
మొనసిన వైరాగ్యమును వివేకమును
అలఘుదంతయుగంబు హస్తిపుఁ డనఁగ
బలియునజ్ఞానంబు ప్రబలమైనట్టి

రాగశృంఖల మన రహిఁ గరికాల
నాగతిఁ గట్టియున్నటువంటి గొలుసు
ఆగొలు నూడ్చు టేమన్నను నీవు
వేగ భోగేచ్ఛను విడిచిన తెగువఁ
తాటిపై వాఁడుండి ధరణిపైఁ బడిన
దేటి లక్షణ మన్న హెచ్చురాజ్యంబు
అటు నీవు విడుచుటే యజ్ఞాన మగును
బటుతాళముననుండి భయ మంది నేలఁ
బడినవాఁ డెవఁ డన్నఁ బరఁగ నీమదిని
బొడమినట్టి విరాగమును వివేకమున
రదనద్వయంబుచే రాగశృంఖలము
నది వీడ్చుకొనిన నీయట్టహాసమును
గనుఁగొని నీమస్తకంబుపైనుండి
యొనర నీకన్న మహోన్నతం బగుచు
నరిదైన యజ్ఞానమందుండు వెఱచి
యురికి కూలినవేళ నుర్విపైఁ ద్రొక్కి
చంపక యడవిలోఁ జరియింపఁ జనఁగఁ
డెంపుతో మరల నదే నిన్నుఁ బట్టి
పడఁద్రోసెఁ గర్మప్రపంచజాతమున
బడిసి చిక్కినవేళఁ జంపని దేమి
యనినను ఫలపరిత్యాగిగా కెపుడు
ననుపొందఁ గర్మక్రియాభిమానంబు

దానిఁ జంపక యున్న దయ యనంబడును
దానిచేఁ గ్రమ్మఱఁ దా లేచి మించి
పరరాజ్యమును వీడి వచ్చు నీతోడ
వెఱవ కజ్ఞానంబు వెంటనే వచ్చి
జననాథ! కర్మవాసన యనుకూప
మున నిన్ను బడఁద్రోసె మోసంబుచేసి
పరఁగ వాదంబుపై పఱచిన లతలు
దొరకొను నీతపోదుఃఖంబు లగును
అలకరిపరివార మనుమానములను
వెలసిన నీమనోవృత్తులే మఱియుఁ
గరి కూలఁగాఁ బైనఁ గప్పినదుమ్ము
నరయ నీకర్మమోహాంధకారంబు
చలచిత్త! నీవట్టి సామజేంద్రంబు
చెలువున నూరకే చెడితి వటంచు
నాగజోపాఖ్యాన మాశిఖిధ్వజున
కాగుణశాలియైనట్టి చూడాల
పురుషాభిమానియా భూపాలకునకుఁ
దరుణియై తాఁ దెల్పుతత్త్వార్థమందు
గుఱిని నిల్పఁడటంచుఁ గుంభాభిధాన
పురుషుఁడై జ్ఞాన మొప్పఁగఁ జెప్పె ననుచు
ముని రామునకుఁ జెప్పి మోహం బడంచి
మనము రంజిల్లఁగా మరల నిట్లనియె

విను రామ యెంతటివిద్వాంసుఁడైనఁ
దనియఁ దనంతనే తత్త్వశాస్త్రములు
చదివి తపం బెంత సల్పినంగాని
మది సంశయంబులు మానవు చిత్త
చపలత్వ మణఁగదు శాంతి లభింప
దపరిమితానంద మబ్బదు గాన
గురుని సంపాదించుకొని కొల్చి యతని
కరుణకుఁ బాత్రుఁడై కడతేరవలయు
నటు సేయ లేక దేహాభిమానమునఁ
గుటిలాత్ముఁ డగువాఁడు కొనకెక్క లేఁడు
యెలమి శాస్త్రజ్ఞాన మెంతైన గురుఁడు
కలుగకున్నందునఁ గడముట్టు టరుదు
అని వసిష్ఠుండు మహాకృప మీఱ
మనుకులోత్తముఁ జూచి మరల నిట్లనియె
నల కుంభరూపిణియైన చూడాల
వలనొప్పఁగా శిఖిధ్వజుని వీక్షించి
మొనసి సర్వత్యాగమును జేయు మనిన
జననాథుఁ డా బ్రహ్మచారికి మ్రొక్కి
యడర నిట్లనె నో మహాగురుస్వామి!
పుడమిరాజ్యము గృహంబులు భోగములును
విడిచి యిల్లాలిని విడిచి నే వచ్చి
యడవిలోఁ దప మిప్పు డాచరించెదను

ఇనకోటినిభ తేజ! యిపు డింతకన్న
నెనయు సర్వత్యాగ మెటువంటి దనినఁ
గుంభుఁ డిట్లనియె మక్కువ నీతపంబు
దంభమే కాని తత్త్వజ్ఞాన మగునె
యొనర నన్నియు వీడి యొంటిగా వచ్చి
వనవాసి వగుట సర్వత్యాగ మగునె
బడలినఁగాని తపంబుపై నాశ
విడువలే వనుచు భూవిభునిచెంగట నె
తా నుండి యతని దుస్తరతపశ్చరణ
మూని చూచుచునుండి యొకకొన్నినాళ్లు
జరగినవెనుకఁ దాఁ జాలిని బొంది
యరమర లేక యిట్లనియెఁ గుంభుండు
ఓమహారాజ! యీయుగ్రతపంబు
నీమాడ్కిఁ జేసి నీ వెంత పెంచినను
నరయ సర్వత్యాగ మబ్బదు నీకు
మఱియెట్టు లనిన నీమానసగ్రంథి
తెగఁద్రుంచివైచి ముక్తిని బొందవలయుఁ
దగు జగంబులకుఁ జిత్తము బంధకంబు
గాన దానిని ముందుగాఁ ద్రుంచితేని
దాన సర్వత్యాగధన్యత నీకుఁ
గలుగునన్నను మహీకాంతుఁ డాకుంభు
నలర వీక్షించి యిట్లనియెఁ జిత్తంబు

ఎట్టిది దాని నే నెటు త్రుంపవచ్చు
నట్టిచందము దెల్పుఁ డనినఁ గుంభుండు
పలికె నిట్లనుచు నోపార్థివాధీశ!
యలవేదనాత్మీశహాంకృతి చిత్త
బీజంబులోపల బెరసిన రూప
బీజం బనఁగ నొప్పుఁ బెనుపొంద దాని
లీలచేఁ జాల గల్గినయనుభూతి
లాలితంబైన పల్లవము తద్వృద్ధి
నెరయు నిరాకార నిశ్చలాత్మికయు
మురువొప్పు సంకల్పమూర్తియు ననఁగఁ
దగు బుద్ధి దానిభేదము మానసంబు
నగుఁ జేతనంబునం దతివృద్ధిఁ బొంది
చేకొనఁగా రాని చిత్తవృత్తులను
గూఁకటిప్రేళ్లైన గుణములతోడఁ
బడఁద్రోయు మనిన భూపతి కుంభుఁ జూచి
యుడరఁ జిత్తమ్మున కహమిక మూల
కారణంబైనది కావున దాని
పారంబు భావించి భస్మంబుసేయఁ
దగు నగ్ని యద్ది సిద్ధంబుగా నాకు
నగణితకృపను మీ రానతిం డనిన
విని కుంభుఁ డనియె నోవిమలాంతరంగ!
తనరూపపంచభూతములనే గాని

యులరు నీవిషయేంద్రియములు నేఁ గాను
జెలఁగు మనోబుద్ధిచిత్తముల్ నేను
గా నహంకృతి నేను గాను మఱెవ్వఁ
డ నెడివిచార మెప్పుడు నీకు బుద్ధి (?)
జనియించు నపుడు సుజ్ఞానపావకుఁడు
పెనఁగు నహంకారబీజంబు నంటి
చెచ్చెర భస్మంబుఁ జేయు నటంచు
నచ్చుగాఁ దెల్పఁగా నవనీశ్వరుండు
బుద్ధి నూహించి కుంభుని మోముఁ జూచి
సిద్ధంబుగా మీరు చెప్పినరీతి
గానె భావించితిఁ గాను దేహంబు
గాను గోచరములు గా నింద్రియములు
గాను మనంబును గాను బుద్ధియును
గాను జిత్తంబును గా నహంకృతియు
గా నని రాజు పల్కఁగ బ్రహ్మచారి
మనుజేంద్రుఁ జూచి సమ్మతి నిన్ని నేను
గాను గా నంటివిగద మఱెవ్వఁడవు
వూని దెల్పు మటన్న భూపాలుఁ డనియె
సకలేంద్రియాదులు జడములై పోఁగ
నకలంక మజడమై యమలమై యెఱుక
యగును జావును బుట్టువను రెండు లేని
యగణితచిన్మాత్ర మగుదును నేను

నిటువంటి నన్ను నే నెఱుఁగంగనీక
పటుతరహంకృతిభ్రాంతి పుట్టించి
బెట్టుగాఁ దాఁ జిత్తబీజమై నిలిచి
నట్టుపడంజేసె న న్నేఁచి యేఁచి
పూని నే నెంతతపోనిష్ఠ నున్నఁ
గాని నన్నారకే గావింపుచుండు
దీనితోఁ బోరుచు దిక్కేమి దోఁచ
కే నశక్తుఁడ నైతి నిఁక నెట్టు లనుచుఁ
బలుకఁగాఁ గుంభుఁ డాపార్థివేశ్వరుని
సులలితకరుణతోఁ జూచి కారణము
వలనఁ గార్యము పుట్టు వసుధేశ! యనఁగ
నలనరేశ్వరుఁ డిట్టు లనె గురుదేవ!
దొరకొన్న తొల్లిటి దోష మీవ్యథల
నరయ కారణ మయ్యె నటుగాక దీనిఁ
బొరిగొని నను మీరు ప్రోవఁగావలయు
నురుకు చిత్తంబు చిత్తోన్ముఖగాఁగ
నీరీతి నహమిక యుదయించి మించి (?)
పొరిపొరి వేదనల్ పుట్టించె ననిన
నలకుంభుఁ డిట్లనె నట్టివేదనల
కిలను గారణ మెద్ది యెఱిఁగింపు మనిన
జననాథుఁ డనియె నోసద్గురుస్వామి!
యనలవేదన కన్యమై ప్రకాశించె

మొనయు సత్తామాత్రమునన వేదనలు
జనియింపుచుండుఁ దత్సర్వదుర్వ్యథల
నలిఁగెడిచిత్తంబునకు విత్తుగాఁగ
నల యుహామిక వేదనాత్మకం బయ్యె
ననినఁ గుంభుఁడు పల్కె నటువంటికార్య
మునకుఁ గారణకార్యములు రెండు లేవు
భ్రమయు భ్రాంతిని ద్రాటఁ బాము న్నరీతి
నమరఁగా గనిపించి యరసి చూచినను
బామందు లేకున్నపగిది బ్రహ్మమునఁ
దా మించి సకలభూతప్రపంచంబు
భ్రాంతిచే నుండినభంగిఁ గన్పించు
వింతగా నందె భావించి చూచినను
మెఱయుప్రపంచంబు మిథ్యయై పోవు
నెరయు చిద్బ్రహ్మమే నిత్యమై నిలుచు
నట్టి మిథ్యారూప మగుప్రపంచంబు
పుట్టినకారణంబుగ నున్న నృపుఁడు
చెలఁగి యీసృష్టి చేసిన పద్మభవుఁడు
నెలమిని గారణం బేల కాఁ డనిన
విని కుంభుఁ డాభూమివిభుఁ జూచి శాంత
మనుపమం బగును బ్రహ్మంబు తదీయ
కలన మాబ్రహ్మకుఁ గారణం బనుచుఁ
బలికిన విని మహీపతి కారణంబు

ద్విపద. ప్ర. ర.

లేకయే బ్రహ్మ యేలీల జనించె
నాకుఁ దెల్పుఁ డటన్న నగి కుంభుఁ డనియె
ధరణీశ! విను మనంతం బద్వయంబు
పరమంబు శాంతంబు పరిపూర్ణ మజము
అప్రతర్క్యం బవ్యయం బమేయంబు
స్వప్రకాశంబును స్వస్వరూపంబు
నగుచు నవిజ్ఞేయమై శుద్ధ బుద్ధ
మగుచు నెద్ది వెలుఁగు నయ్యాత్మ వలన
నాపద్మభవుఁడు తానై యుదయించె
నాపట్ల సృష్టి తదాత్మకం బగుచు
నెరసి తన్మాత్రమై నెగడుచు నుండుఁ
గర మొప్ప నటుగానఁ గార్యంబు లేదు
కారణంబును లేదు కావున నాకు
భూరికర్తృత లేదు భోక్తృత లేదు
ఆపరబ్రహ్మమే యఖిలమై పెరిఁగి
భూపతి సజ్ఞానబుద్ధి నణంచు
నద్వయంబై పరమామృతంబైన
సద్వస్తువునకు నాశంబు లే దెందు
నట్టిబ్రహ్మంబు నీవై యుంటి వైన
గట్టిగా నిల్వ నెక్కడఁ జోటు లేక
యజ్ఞాన మాత్మయం దణఁగి నశించుఁ
బ్రజ్ఞానమే పరబ్రహ్మమై నిలుచు

నాదిదేవుఁడు తాఁ జిదాత్మకుం డగుట
చే దివ్యమై ప్రకాశించుఁ దనంత
నరయ భూసలిలాదులై పలుమాఱు
పరఁగెడు శక్తిసంభవితసంపాద
నాత్మత నొంది తా నటు బ్రహ్మ యనఁగ
నాత్మరూ యుండుఁ దదన్యసంవేది
మఱి వేఱె లేదు బ్రహ్మమె సర్వ మనుచు
నెఱుకకు నెఱుకగా నెఱుఁగు చైతన్య
సాన్నిధ్యమం దెన్న సకలప్రపంచ
మున్నచందంబుగా నుండు లేకుండు
నున్నది సత్తయై యుండు లే దనుచు
నన్నది మాయయై యణఁగు బంగారు
రూపనామములచే రూఢంబు లగుచుఁ
జూపట్టు భూషణస్తోమంబులట్ల
నాపరబ్రహ్మమే హరిహరబ్రహ్మ
రూపాదు లగును వేఱుగ నుండు లేదు
బంగారుగాక యాభరణముల్ గాని
భంగి బ్రహ్మముగాక ప్రత్యేకముగను
గలదె విశ్వం బనఁగా భూవిభుండు
పలికె నిట్లనుచు నోపరమమునీంద్ర!
అరయ నాబ్రహ్మమే యై ప్రపంచంబు
మెఱయుచుండఁగ మీరు మిథ్యను టేమి

యనినఁ గుంభుం డిట్టు లనియె నోనృపతి!
వినుము చెప్పెద నట్టివృత్తాంత మమర
ఘర్మమం దొనర నాభరణముల్ చిత్ర
కర్మకల్పితములై గనిపించి యణఁగు
చందంబుగా బ్రహ్మసత్తాస్వరూప
మందు మాయాకల్పితాజ్ఞానరూప
నామక్రియాదులు నశియించిపోవు
నామహాబ్రహ్మమే యంతటనుండి
తెలివియై హాస్తిభాతిం బ్రియంబు లన
నలువొప్పుసచ్చిదానందమై యుండు
నామరూపంబులు నశియించుఁ గనుక
నే మిథ్యయంటిని నిఖిలవిశ్వంబు
నీవు నావాక్యంబు నిజముగా నెంచి
భావనాతీతసద్బ్రహ్మ మే ననుచుఁ
జెప్పి చూపఁగరాని చిద్వస్తువందుఁ
దెప్పునఁ బొందు సందేహంబు విడువు
నామాట నిజముగా నమ్ము నమ్మినన
భూమీశ్వరుండు కుంభునిపాదములకు
మ్రొక్కి యిట్లనియె నోమునికులోత్తంస!
మిక్కుటంబైనట్టి మీబోధవలన
నెఱిఁగితిఁ దత్త్వం బదెట్లన్న వినుఁడు
పరమాత్మయం దీప్రపంచజాలంబు

తెలఁగొడి మరుమరీచికయందు జలము
గలరీతిఁ దోఁచినకైవడిగాను
బరఁగ రజ్జువునందుఁ బామున్నరీతి
బరయ స్వప్నప్రాయమగు ప్రపంచంబు
కర్తలేమిని జని కలుగుట లేదు
పూర్తిగా నుండుట పోవుట లేదు
ఆదిమధ్యాంతంబు లరయంగరాని
వేదాంతసారాత్మ విమలమై నిండి
యిది యది యని చెప్ప హేతువు లేక
తుదమొదల్ గనరాక తుర్యమై యున్న
యదియె సత్తామాత్ర మదియె నే నైతి
నిది మిథ్య యనఁగూడ దీచిత్సుఖంబు
మీకటాక్షమున నమేయానుభవము
నీకాలమునకు నే నెఱిఁగితిఁ దనువు
నే ననెడియహంత నీరసం బయ్యె
నేనును దెలివిలోనే యున్న గుట్టు
తెలిసితి మీయుపదేశంబు నాకు
ఫలియించె నని మ్రొక్కి పాషాణమటులఁ
గదలక చిత్తంబు కనుదృష్టిలోనఁ
గుదిరియుండఁగ నట్ల కొంతసే పుండి
ముదమంది యట బహిర్ముఖుఁడై నఁ జూచి
కొదవ లే దిఁక ననుకొని కుంభుఁ డనియె

క్రమ మొప్పఁగా మహీకాంత! నీ విపుడు
అమలమై పరిపూర్ణమగు చిత్పదమునఁ
జెందితివే శాంతి చిత్తవిశ్రాంతి
నొందితివే యన్న నుర్వీశుఁ డనియె
నోగురుస్వామి! మీయురుకటాక్షమున
వేగ చిత్పదసౌఖ్యవిభవంబుఁ గంటి
సాధుసాంగత్యంబు చపలాత్ములైన
బోధ సుధారసంబును దెల్పునంత
కాలంబు నా కీసుఖము దోఁచకుండు
టేలొకో యనఁ గుంభుఁ డిట్లని పలికె
ధరణీశ! తెలియు మంతఃప్రశాంతమునఁ
గరుణాదివిషయభోగముల నణంపఁ
గోరినవాఁడు సద్గురువాక్య మాత్మ
నారూఢిగా నమ్మి యనవరతంబు
తక్కక గురుపదధ్యానంబు సేయ
నెక్కువయగుచు మహీజంబునందుఁ
గాలవశంబునఁ గలిగినపండ్లు
వ్రాలి నశించుకైవడి లింగ దేహ
మాలిన్య మూనాఁడె మ్రగ్గి నశించు
నాలోన నుండు భేదాఖ్యాన మణఁగు
నజ్ఞాన మణఁగిన నాత్మానుభవము
ప్రజ్ఞానమై నిండి పండునంతటికి

సరససద్గురుకటాక్షము గల్గినట్టి
నరునకు సచ్చిదానందసౌఖ్యంబు
దొరకు చిత్తమణంగుఁ దుర్వ్యసమాధి
యిర వగుచుండు నీ వీనాఁటి కట్టి
పరమవిజ్ఞానసంపన్నుండ వగుచుఁ
బొరిని జీవన్ముక్తిఁ బొందితి వనిన
వసుధేశుఁ డనియె నో వరగురుస్వామి!
వసుధమీఁదను జీవవరముక్తుఁడైన
నరునిచిత్తంబు వినాశ మొందినను
బరఁగ జిత్తములేక బ్రతికి యతండు
ధరణిపై నుండువిధం బెట్టు లనిన
గురుతరకరుణ నాకుంభుఁ డిట్లనియె
నో రాజ! విను పునరుత్పత్తివాస
నారూఢమై చిత్త మజ్ఞునియందుఁ
జలన మొందుచు నుండు సద్గురుకరుణ
వలన ముక్తుండైన వరయోగియందుఁ
దరళత మాని సత్తామాత్ర మగుచు
నిరుపమచిత్తంబు నిలిచియుండుటను
రహి నొప్పు సంకల్పరహిత మైనట్టి
సహజకర్మంబున సక్తుఁడై యతఁడు
గావింపుచున్న తత్కర్మ మాయోగ
పావకముఖమందు భస్మమై పోవు

వరుసగా దాన జీవన్ముక్తుఁడైన
పురుషుండు క్రమ్మఱఁ బుట్టుట లేక
తుదను విదేహముక్తుం డగు నీవు
పొదువుగా శమదమంబుల నొంది సర్వ
శాంతుఁడవై సర్వసముఁడవై నిరత
మంతరంగజ్ఞప్తి నరయుచు నుండు
వసుధఁ బ్రాప్తంబులై వస్తుజాలములు
పొసఁగును వాని సుబుద్ధిచే నీవు
ననుభవింపుచు నుండు మచలుండ వగుచు
ననఘ! నిశ్చలచిత్తు లగువారి కిలను
దొడరుపునర్జన్మదుఃఖసంసార
ముడిగి నశించిపోవుచు నుండుఁ గాన
నీవు చలింపక నిన్ను నీ విపుడు
భావింపు మనిన భూపతి కుంభుఁ జూచి
చలతాచలత్వముల్ సహజముల్ గాను
గలుగు నారెంటి నేగతిని వారింతు
నావిధ మెఱిఁగింపు మనినఁ గుంభుండు
భూవరుఁ జూచి యోపుణ్యాత్మ! వినుము
పొగడొందు సలిల మంభోనిధియైన
పగిదిఁ బ్రపంచమే బ్రహ్మమై యుండుఁ
గావున నీవ యఖండ లక్ష్యమున
భావించు మాపరబ్రహ్మ మే ననుచు

లలి నందుఁ జలతాచలత్వంబు లణఁగుఁ
బోలుచు రజ్జువునందుఁ బుట్టినసర్ప
భయ మట్టిరజ్జువుగఁ భావింప మొదటి
భయము రజ్జువునందె ప్రవిలీనమైన
పగిది బ్రహ్మమునఁ బ్రపంచవిభ్రాంతి
తగిలినప్పుడు పరతత్త్వ మైనట్టి
బ్రహ్మమందే లెస్స భావించి చూడ
బ్రహ్మమందే జగద్భ్రాంతి లయించు
జననాథ! వేదాంతశాస్త్రచింతనను
ఘనతరసాధుసాంగత్యంబుచేతఁ
జిత్తంబు చల్లనై శీతాంశురీతి
సత్తాస్వరూపమై శాంతిని బొందు
నాసత్తయే కేవలాభాస మగుచు
భాసురమై స్వానుభవముగా యోగి
వరులకుఁ దోఁచు సర్వము దోఁచు బ్రహ్మ
మఱి యెవ్వ రెఱుఁగ రామర్మ మటంచుఁ
దెలివిగా నిట్లుపదేశింపఁగాను
వలనొప్ప నాశిఖిధ్వజుఁ డందుఁ బూర్వ
సందేహముక్తుఁడై సతతసమాధి
యం దుండె చూడాల యపుడాత్మపురముఁ
జేరి తొల్లిటిరీతిఁ జెలువొప్ప రాజ్య
భారంబు కొన్నాళ్లు భరియించియుండి

క్రమ్మఱ నాకాశగమనయై పోయి
సమ్మతిగా నిజేశ్వరుచెంతఁ జేరి
కనుమూసి కదల కక్కడ నున్నవిభునిఁ
గనుఁగొని సంతోషకలితాత్మ యగుచు
మురిసి నాథుని బహిర్ముఖుని జేయుటకు
నరుదుగాఁ దాను సింహంబుచందమున
ఘనగిరుల్ ఘూర్ణిల్ల గర్జించె నపుడు
వనచరుల్ బెదరి రావసుమతీశ్వరుఁడు
చలియింపకున్న నాశ్చర్యంబు నొంది
చెలరేఁగి మఱియు గర్జిల్లి గర్జిల్లి
యలసినప్పటికైన నవనీశ్వరుండు
వలనొప్ప మేరుపర్వతముచందమున
కదలక మెదల కక్కడ సత్వనిష్ఠ
వదలకున్నటువంటివాని వీక్షించి
యారమణీమణి యతని మేల్కొలుప
వేఱె యుపాయంబు వెదకె నెట్లనిన
స్థూలాంగమందుంచి సూక్ష్మదేహమును
లాలితమతి నవలంబించుకొనుచు
ధరణీశుసత్వచిత్తంబులోఁ జేరి
సరగునఁ జైతన్యచలన మొందించి
జగముచందమున నాకాశమార్గమున
కెగసి భూమికి డిగ్గి యెప్పటివలెనె

చిలుక పంజరములోఁ జేరినమాడ్కి
నలరుచు నిజదేహమందుఁ దాఁ జేరి
నిలిచి చూచుచునుండె నృపునిచిత్తంబు
చలనంబు నొందఁగా సామగానంబు
కరణి సహస్రారకమలమధ్యమున
సురచిర మైనట్టి సూక్ష్మలక్ష్యమునఁ
దనరు నోంకారనాదము మ్రోయ దాని
వినుచు జంకుచు మహీవిభుఁడు కన్నులను
దెఱచి యాముందర దీపించి మున్ను
గురుఁడైనయట్టి యక్కుంభు నీక్షించి
యతని సద్భక్తితో నర్చించి నిలిచి
హిత మొప్పఁగా మ్రొక్కి యెదుట నుండఁగను
భూపాలుఁ జూచి కుంభుఁడు సంతసించి
ఓపార్థివేశ్వర! ఓపుణ్యచరిత!
వలనైన విమలజీవన్ముక్తిసుఖము
పొలుపొంద సుస్థితిఁ బొందెనే నీకు
పరముదానందాదిపదవియం దిపుడు
సరససుబుద్ధివిశ్రాంతి నొందితివె
యిది భేద మిది మోద మిది ఖేద మనుచు
మదిఁ దోఁచ కవి యెల్ల మఱచితే యిపుడు
కదలని కర్మసంకల్పజాలముల
వదలితె జ్ఞానవైభవము నొందితివె

సర్వవైరాగ్యంబు సర్వసౌఖ్యంబు
సర్వశాంతము నీకు సంభవించినదె
యని పెక్కువిధముల నడుగఁగా నన్ని
విని కుంభునకు మహావిభుఁ డిట్టు లనియె
సద్గురువర్య! మీసత్కటాక్షమునఁ
జిద్గగనానందసీమలోఁ జేరి
సారవిహీనసంసారాంతమైన
భూరివిశ్రాంతిని బొందితి ననిన
విని కుంభుఁ డనియె సంవిత్సుఖం బిచట
ననుభవింపుచు నుండు మని యొప్పఁ జెప్పి
చాల సంతోషించి చని నిజభూమి
లీల దీపింపఁ బాలింపుచు నుండె
నన విని రాముఁ డిట్లనె నోమునీంద్ర!
ఘనశాంతిఁ బొంది యఖండాత్మనిష్ఠ
నొందియున్నట్టి యాయుర్వీశుబుద్ధి
చెంది సత్వగుణంబు శేషించి నిలిచి
యుండెనే యని వేడ్క నొప్పుగా నడుగ
నిండినమది నామునిప్రభుం డనియె
విను రఘురామ! యావృత్తాంతమెల్ల
నెనయుప్రబోధకు హేతువై యవని
మనము సత్తైకనిమగ్నమై యుండు
ననువొంద నట్టిమహాత్ముని తనువు

సమయకుండఁగ శివాంశంబై ధరిత్రి
నమలమై జీవించు నని చెప్పి మరలఁ
బలికె నిట్లని రామభద్ర! చూడాల
విలసితచరితమే విను మదెట్లనినఁ
బతిని వీడ్కొని నిజపట్టణమందు
హితమొప్ప రాజ్యంబు నేలుచునుండి
మఱికొన్నినాళ్ల కామనుజేంద్రుఁ జూడ
ముఱిసి కుంభునిరూపమునఁ బోయి ఖిన్న
వదనంబుతోఁ దలవంచి ఖేదంబు
మదిలోఁ బెనంగొనుమాడ్కిఁ గన్నీరు
వెడలుచునుండఁగా వేఁడినిట్టూర్పు
వెడలఁగా నమ్మహీవిభుచెంత నిలిచె
నారీతి నిలిచి యున్నటువంటి బ్రహ్మ
చారిని జూచి యాజననాథుఁ డనియె
సదమలచరిత! యోసద్గురుస్వామి!
యిదియేమి యీక్లేశ మెందుకు వచ్చె
ననినఁ గుంభుం డిట్టు లనె జననాథ!
నినుఁ జూడ నిచటికి నేఁ బ్రేమచేత
వచ్చుమార్గమున దుర్వాసుండు నాకు
హెచ్చుకోపంబుతో నెదురేఁగుదెంచి
తరమిడి నిర్నిమిత్తంబుగాఁ బగలు
పురుషుఁడవై నటింపుచునుండు రాత్రి

పాలఁతివై నీ వుండు పొమ్ముపొమ్మనుచు
ఖలముతో నిటుఘోరశాపంబు నిచ్చెఁ
గావున మదికి దుఃఖము పుట్టె ననిన
భూవిభుఁ డనియె నోపుణ్యాత్మ! నీవు
అడ్డల నేటికి యెవ్వారై నను విధిని
గడువలే రని పల్కఁగా బ్రహ్మచారి
పగ లెల్లఁ బురుషుఁడై భావింప రాత్రి
మగువయై యిటు కొన్ని మాసముల్ గడపి
తదనంతరమున భూధవుని వీక్షించి
పదపడి యొకరేయి పల్కె నిట్లనుచు
భామను నే నైతిఁ బార్థివాధీశ!
భూమి నా కనుగుణపురుషుఁడు లేఁడు
కావున ననుఁ బొందఁగావలె నింక
నీ వని పల్కఁగా నృపుఁ డందు కొప్పె
నదిమొద ల్రాత్రులయందు వేడుకగ

....

రమణీయ కపటానురాగంబుచేతఁ
గ్రమముగాఁ గొన్నాళ్లు కవ గూడి యతని
సకలసమత్వభాస్వరచిత్తశుద్ధి
ప్రకటనిర్లేపసద్భావనిశ్చయము
గని మెచ్చి యువల నొకానొకనాఁడు
పనిఁబూని యామహీపాలు భోగేచ్ఛఁ

జెలువొప్పఁగాఁ బరీక్షించెద ననుచుఁ
దలఁచి యద్భుతమైన తనయోగమాయ
చేత దేవేంద్రుని సృజియించె వేడ్క
నాతఁడె నయ్యింద్రుఁ డైరావతంబు
పై నెక్కి సురసతుల్ ప్రకటదేవతలు
నానాముఖంబుల నలువుగాఁ గొలువ
వచ్చి సురేంద్రుఁ డావసుధేశుచెంత
నచ్చెరువుగ నిల్చె నాశిఖిధ్వజుఁడు
చూచి యాజిష్ణు నచ్చోటఁ బూజించి
యీచందమున నను మీ రిటను వచ్చుటకు
హేతు వేమన నింద్రుఁ డిట్లని పలికె
భూతలాధీశ! నీపుణ్యాతిశయము
మెచ్చి రంభాదికామినులు నీపొందు
హెచ్చుగాఁ గోరి యం దెదురు చూచెదరు
సకలభోగమ్ము లాస్వర్గలోకమున
నకలంకమతిని నీ వనుభవింపుచును
నచ్చోట నిల్చి కల్పాంతంబుదనుక
విచ్చలవిడిగాను విహరింపవలయుఁ
గావున నాకలోకమునకు నీవు
రావలె ననఁగ నారాజేంద్రుఁ డనియె
నింతమాత్రపుఁబని కింద్ర! నీ విటకు
దంతేంద్రు నెక్కి రాఁ దగునె నన్నిల్వ

నీ వెంతఁ బిల్చిన నే స్వర్గమునకు
రావలసినదేమి రంభాదిసతుల
పొందు నే నొల్లఁ దద్భోగంబు లొల్ల
నందిందు నిండి నే నంతట నుండి
యరమరలేక బ్రహ్మంబునం దెపుడు
మెఱయుచు నేన రమింతు నీస్వర్గ
భోగంబు నే నొల్లఁ బొమ్మన్న నింద్రుఁ
డేఁగె మహీపాలుఁ డిం దుండె నవలఁ
జూడాల మదిలోను జోద్యమందుచును
బోఁడెమిఁ బతియందు భోగేచ్ఛ లేని
చందంబు భావించి సంప్రీతి మెఱయ
నందుండి కొన్నినా ళ్లరిగినమీఁదఁ
గ్రమముగా నతని రాగద్వేషయుగము
నమరఁ బరీక్షింతు నని నిశ్చయించి
యారూఢయోగమాయాప్రభావమున
జారపురుషుని ముచ్చటగ సృజించి
పగలు రాతిరిగాని బలుసంధ్యవేళ
సొగసు లుప్పతిలంగఁ జూతవృక్షంబు
క్రింద జారుఁడు తాను గ్రీడింపుచున్న
నందడి నృపతి కాశ్చర్యంబుగాను
వినుపింపఁ జేసె నవ్విధము భావించి
మనమున హర్షించి మచ్చికగా వీర

లోనరంగఁ గ్రీడింపుచుండురుగాక
యని సైగగా లేచి యందుండి యవలఁ
జనుచున్న యారాజచంద్రుని జూచి
తనమదిలో నిట్లు తలఁచెఁ జూడాల
రాగరోషంబు లీరాజును విడిచె
భోగేచ్ఛతోడనే పోయె నీరీతి
సర్వసన్న్యాసియై శాంతుఁడై పరమ
నిర్వాణపదమందు నిల్చినాఁ డహహా!
యింకఁ బరీక్షింపనేల నారూప
మంకితముగఁ జూపు టర్హ మీమీఁద
నని పతి చనుత్రోవ కడ్డంబుపోయి
నెనరుతో ముందఱ నిలిచినఁ జూచి
యిందుబింబాస్య! నీ వెవ్వ రిచ్చటికి
నెందుకు వచ్చితి విపుడు నీమోము
చూచితే మద్భార్య చూడాలవలెనె
తోఁచుచున్న దదేమి తోయరుహాక్షి!
యనుచు రాజడుగఁగా నయ్యింతి పలికె
ననఘ! చూడాల నే నైనది నిజము
నెరయఁ దత్త్వార్థంబు నీకు బోధించు
కొఱకుఁ గుంభుండనై కొనవెళ్లఁగాను
నద్వైతసారార్థమై ప్రకాశించు
చిద్వస్తుతత్త్వంబు చెప్పి పిమ్మటను

బరఁగ దేవేంద్రరూపంబును జార
పురుషరూపంబు నొప్పుగఁ దాల్చి నేన
పొందుగా నీగుణంబులు పరీక్షించి
యిందు నానిజరూప మిపుడు చూపితిని
ధరణీశ! యివి యెల్ల దబ్బఱో నిజమొ
తెఱఁగొప్ప నీయోగదృష్టిని జూడు
మనిన శిఖిధ్వజుఁ డాత్మ భావించి
మొనసి నన్నియు నిజంబుగ మది నెంచి
పలికె నిట్లనుచు నో భామాలలామ!
పెలుచ నీ విపుడు చెప్పినమాట లన్ని
సత్యమా వేదాంతశాస్త్రార్థములను
నిత్యంబు నన్ను మన్నించి బోధించి
వదలని నాకర్మవాసన నఱఁచి
చెదరని సుజ్ఞానసిద్ధి పట్టించి
చెప్పి చూపఁగ రాని చిద్బ్రహ్మమందుఁ
దెప్పున నన్నుఁ బొందించితి వీవు
కావున నిపుడు నిష్కర్షగాఁ జూడ
నీవె నాగురుఁడవు నీకు మ్రొక్కెదను
అన విని చూడాల యమ్మహీపతికి
మనము రంజిలఁ జెప్పి మరల నాథునిని
నిజపురిఁ జేర్చె నానృపకులోత్తముఁడు
సుజనులు మెచ్చఁగాఁ జూడాల తాను

వదలక యమల జీవన్ముక్తు లగుచుఁ
బదివేలయేండ్లు భూపాలనఁ జేసి
మొనసి యంత విదేహముక్తిని బొంది
రనుచుఁ జూడాలవృత్తాంత మంతయును
జెప్పి వసిష్ఠుండు శ్రీరాముఁ జూచి
యప్పా! చిత్తత్యాగ మైనదే శుభము
యెవరికైనను ధాత్రి నిది నిక్క మనుచు
నవిరళకరుణతో నావసిష్ఠుండు
ఘనమైన చూడాలకథ రఘూత్తమున
కనువుగా బోధించె ననుచు వాల్మీకి
తనశిష్యుఁ డగు భరద్వాజసంయమికి
వినుపించెఁ దత్కథ విశదంబుగాను
నిది సోమనాథవిశ్వేశ్వరస్వామి
పదపద్మభక్తసుబ్రహ్మణ్యయోగి
చరణాంబుజాతషట్చరణాయమాన
పరిపూర్ణనిత్యసద్భావనిమగ్న
మానసాంబుజ వెంగమాంబికారచిత
మై నిత్యమై సత్యమై ధన్య మగుచు
సామార్థసారసుజ్ఞానవాసిష్ఠ
రామాయణం బను రమ్యసద్విపద
యందు నెన్నఁ జతుర్థమగు ప్రకరణము
నందమై విమలమోక్షకరం బగుచు

శ్రీతరిగొండనృసింహుఁ డనంగ
ఖ్యాతిగా వెలయువేంకటరాయ నీదు
పదయుగళికి సమర్పణమయ్యె దీని
సదమలులై వ్రాసి చదివిన వినిన
నరులు తాపత్రయార్ణవము తరించి
పరమైన నిర్వాణపదము నొందుదురు
భూచక్రమున నిది పురుషార్థ మగుచు
నాచంద్రతారార్క మయ్యెండుఁగాత.

చతుర్థప్రకరణము సమాప్తము.

పంచమ ప్రకరణము.

శ్రీతారకోల్లాస శేషాద్రివాస
శ్రీతరిగొండనృసింహా! ధూతాంహా!
విన్నవించెద నది వినుము వాల్మీకి
క్రన్నన చూడాలకథ తెల్పఁగాను
తగ విని యాభరద్వాజుండు మరల
నగణితభక్తి నిట్లనె గురుస్వామి!
సురుచిరాత్ముఁడు వసిష్ఠుఁడు రాఘవునకుఁ
జిరకృపఁ మఱి యేమి చెప్పె నటంచు
నడుగ భరద్వాజు నమ్ముని చూచి
యడరినకరుణ నిట్లని చెప్పఁదొడఁగె
ఆవసిష్ఠుండు రామావనీశ్వరుని
భావించి క్రమ్మఱఁ బలికె నిట్లనుచు
ధరణీశ! వినుము చిత్తత్యాగసరణి
నెఱిఁగి సేయందగు నీయర్థమందు
ఫలితార్థమగు కచోపాఖ్యాన మొకటి
కలదు చెప్పెద రామ క్రమముగా వినుము

కచోపాఖ్యానము.

అనిమిష దేశికుం డైనట్టి గురుని
తనయుండు కచుఁ డాత్మతత్వంబు దెలియ

గొఱకు దండ్రికి మ్రొక్కి కొంక కిట్లనియె
నరులకు సంసృతి నశియించువిధము
దెలుపు మన్నను సురదేశికుం డనియె
వలనుగా వినుము సర్వవిసర్జనంబు
చేసిన సంసృతి చెడు నన్నఁ గచుఁడు
వాసిగా విని మ్రొక్కి వనముల కేఁగి
ఘనతరవై రాగ్యకలితాత్ముఁ డగుచు
నెనిమిదేండ్లు చరించి యుంచుకంతైన
శమము నొందక మదిఁ జలన మొందఁగను
అమరదేశికుపాలి కరిగి కచుండు
ఓతండ్రి! మది శమ మొందలే దేమి
సేతు నటంచు వచింపఁగా గురుఁడు
మది శమ మొందు మర్మంబు లన్నియును
వదలక చెప్పి సర్వత్యాగవిధము
నప్పుడు బోధించె నటమీఁదఁ గచుఁడు
తెప్పునఁ బటువిరక్తిని బొంది పోయి
గతవల్కలుండై యఖండతపంబు
మతి నిల్పి చేసి శమం బొందలేక
మూఁడేండ్లమీఁద నిమ్ముగ గురుఁ జేరి
యేడ నుండినఁ దపం బెంతచేసినను
జిత్తవిశ్రమ మొందుఁ జిక్కలే దనఁగ
న త్తనయుని జూచి యనియె గురుండు

ఎలమిఁ జిత్తత్యాగ మెఱిఁగి చేసినను
వలనుగా నీకు సర్వత్యాగ మొదవు
ననఁ గచుం డనెఁ జిత్త మనునది యెద్ది
గని దానిఁ బట్టి త్యాగము సేయు టెట్లు
దెలుపుఁ డన్నను సురదేశికుం డనియె
నలువొప్పఁ జిత్త మనంగ వేఱొకటి
లే దహంకృతియె తల్లీలయే మనము
పాడుగ మదిలోన భావించి తెలిసి
తత్త్యాగ మొనరించు తనయ! నీ వనఁగ
నత్యంతభక్తితో నప్పు డాకచుఁడు
యేరీతిఁ దత్త్యాగ మేను గావింతు
నారీతిఁ దెల్పవే యన గురుం డనియె
నెలవొప్పఁ జిత్తముల్ నిటలమం దుంచి
తళుకుకన్నులు మూయుతఱి మీఁదికంటి
మనమునఁ దోఁచు నాత్మప్రత్యయమును
మనసుచేతనె లోన మథియింపుచున్న
నదియె తారకయోగ మగు దృశ్యములను
జెదరఁ జూచినదె నీచిత్త మాచిత్త
మునకు దృశ్యములుగా మొనసిన వెల్ల
నొనర నన్యము లగుచుండఁగా నట్టి
దృశ్యంబులకు నగు దృక్కు చిత్తంబు
దృశ్యమా నీ కాదిదృక్కువే నీవు

నన్నుగా మదిలోన భావించి చూడ
నన్నిటికిని ద్రష్ట వయ్యెద వీవె
యనినఁ గచుం డిట్టు లనియె నే నెవఁడ
నని చూతుఁ దెల్పవే యన గురుం డనియె
నానోటనున్న నే నాల్క యటన్న
వానిచందంబుగ వచియించె దీవు
క్రన్నన నాల్క లేకయె నోట నాల్క
యున్నదో లేదో మీ రొగిఁ జూడుఁ డనెదు
పలుకు పుట్టునె నాల్క పల్కకుండినను
కలిగిన నీవు లేకయె నే నెవఁడను
దెలుప మనెదు వాఁడు తేర కన్యుండు
గలుగఁడు లోన నిష్కర్షగాఁ జూడఁ
దెలుపు నా కిపు డన్నదే నీవు సుమ్ము
పొలుచు చైతన్యరూపుఁడ వైన నీవు
లేకయే నాల్క యేలీల వచించు
నో కుమారక! జడ మూహింప జిహ్వ
నీ వజడంబును నిత్యంబు నిజము
పావనంబును బరాత్పరము నద్వయము
కావున నిన్నేఁచు కాయాభిమాన
భావన నొందక బ్రహ్మమే నేను
నని నిగమాంతసిద్ధాంతసౌఖ్యంబు
ననుభవింపుచునుండు మదె చిత్సమాధి

యేక మాద్యంతరహిత మవ్యయంబు
నాకాశసదృశంబు నగుణ మనంత
సచ్చిదానంద మాస్వానుభవంబు
వచ్చుగాఁ బొందు నం దడ్డమై నిన్ను
బొదువు నహంకారభూతంబు నడఁచి
కుదురుగా నిందుండు కొడుక! యటంచుఁ
జెప్పిన తండ్రి వీక్షించి కచుండు
కప్పుచుండెడు నహంకార మెచ్చోట
పుట్టు నెచ్చట చెడిపోవు నారీతి
దిట్టముగా నాకుఁ దెలుపవే యనిన
విని యమరగురుండు వేడ్క నిట్లనియె
ననఘ! యహంకార మాకాశమందుఁ
బుట్టు తోయదమట్లు పొడము నణంగు
నట్టి మిథ్యారూప మగు నహంకృతిని
నజ్ఞులు నిజముగా ననుసరింపుదురు
ప్రాజ్ఞుల కది వట్టిభ్రాంతిగాఁ దోఁచి
విడిచిన మాయ తా విరిసి నశించు
నడరఁగా నీవు నే నను ద్వైతబుద్ధి
మెఱసి పిమ్మట నదే మిథ్యయై పోవు
నటిముటి స్వప్నంబు లన్నివశ్యములు
కావున దిగ్దేశకాలకర్మములు
పోవఁగా నంతట పూర్ణమై పైన

మిగిలిన సద్రూప మేనె యటంచు
జగదతీతంబై ప్రశాంతిని బొందు
మపుడు సర్వత్యాగ మగు నీ కటంచు
నుపదేశ మిచ్చిన నూహించి కచుఁడు
సర్వశాంతిని బొంది సచ్చిదానంద
నిర్వాణపద మంది నిలిచె నటంచుఁ
బావనంబగు కచోపాఖ్యానసరణి
నావసిష్ఠమునీంద్రుఁ డా రాఘవునకు
వినిపించి కల్పితవిశ్వచిత్రంబు
మనమున భావించి మరల నిట్లనియె
రామా! విచారింప రమణీయ మగుచు
నామహనీయ చిదానంద మొదవుఁ
జక్కఁగా నాత్మ విచారింపకున్న
నిక్క యహంకృతి నేను నే ననుచుఁ
జెలఁగి మమత్వంబు చే విజృంభించి
పొలుపార సుఖదుఃఖములఁ బొందుచుండి
యవల నిరర్థకంబై చెడిపోవు
నవిరళచరిత! యీయర్థంబునందు
అలర మిథ్యాపురుషాఖ్యాన మొకటి
కలదది యెట్లన్నఁ గ్రమముగా వినుము
కలఁడు మాయాయంత్రగతుఁడైన పురుషుఁ
డలరి యాకాశంబు నార్జించి దాని

నీవె యనుచు నెంచి నీటుగా నాత్మ
భావింపు మోరామభద్ర! సంసార
విరహితుఁడై భేదవిభ్రాంతి మఱచి
నెరసి బ్రహ్మంబు తా నే నని చూచు
పురుషునకును బంధుబుద్ధివిశ్రాంతి
యరయగా నతఁడె మహాకర్త యగును
నది యెటువలె నన్న నఖిలచింతలను
మదిలో విసర్జించి మాయాబ్ధి దాఁటి
శోదకక చిన్మాత్రకోటరపదవి
విదితంబుగాఁ బొంది వేద్యనిర్ముక్త
నిరతసంవిత్తత్త్వనిష్ఠ నేమఱక
నెఱకనే భావింపు మెల్లదిక్కులను
వెలయుశబ్దములను వినును శీతోష్ణ
ముల నెఱుంగును రూపములను గన్గొనును
గోరి షడ్రసములఁ గొనును గంధముల
మూరుకొనును యోగ్యమున నుండు తెలివి
యాపరమాత్మగా కన్య మెుం డొకటి
యేపట్టునైన లే దెఱుకె పరాత్మ
యారహస్యాత్మయం దంట కజ్ఞాన
కారణమై యహంకారపురుషుఁడు
తా నన్నిటికిని గర్త నటంచు మూఢ
మానవులను వృథా మాయాబ్ధియందు

ముంచు నంతియె కాని ముక్తపురుషుల
యంచున నిల్వలే కణఁగు మిథ్యగుచు
శ్రీరామచంద్ర! యీచిద్విభిష్టామునకుఁ
బారంబు లే దిట్లు భావించినట్టి
యతఁడె మహాత్యాగి యనఁబడు మఱియు
నతఁడె మహాకర్త యన నొప్పుచుండు
నతఁడె మహాభోక్త యగుచుండు దీని
కితిహాస మొక్కటి యేను జెప్పెదను

భృంగ్యుపాఖ్యానము.

విను భృంగి యొకనాఁడు విశ్వేశుఁ జేరి
ఘనభక్తితో మ్రొక్కి కరములు మొగిచి
యోనాగభూషణ! యోధర్మనిపుణ!
యేనిశ్చయముఁ బట్టి యీజగజ్జన్మ
గేహమం దుండి మీ క్లేశసంసార
మోహాబ్ధి నెటు దాఁటి ముక్తిఁ బొందుదును
ఆవిధ మెఱిఁగింపు మనిన సత్కృపను
భావకాత్ముఁడు నవ్వి పల్కె నిట్లనుచు
ననఘ! భృంగీశ! మహాగోప్య మొకటి
వినిపింతు నది నీవు వేర్వేఱ వినుము
దలఁప జన్మము మృతి ధర్మ మధర్మ
ములు లేవు సుఖదుఃఖములు లేవు తనకు

నని దృఢంబుగ నెంచినటువంటిపురుషుఁ
డనఘాత్ముఁ డగుచు మహాత్యాగి యగును
సంతోషమున సర్వసమబుద్ధితోడ
శాంతుఁడై క్రోధవాసన లంట కెపుడు
తగు కోర్కెలను వీడి తనకుఁ బ్రాప్తంబు
లగు పదార్థంబుల ననుభవింపుచును
విమలాంతరంగుఁడై విహరింపుచున్న
నమరఁగా నతఁడె మహాభోక్త యగును
పొలుచు ధర్మాధర్మముల సుఖదుఃఖ
ముల రాగదోషదుర్మోహలోభముల
ఫలఫలాభావముల్ భావించి మదిని
దలఁప కంతటఁ బరతత్త్వమే చూచు
నతఁడు మహాకర్త యగు దృశ్యకరణ
వితతిఁ దొరంగిన విమలవర్తనుఁడు
నగును మహాభోక్త యని శంకరుండు
తగ నుపదేశింప ధన్యుఁడై భృంగి
యారీతిగాఁ ద్యాగియై కర్త భోక్త
యై రాజయోగసౌఖ్యముఁ బొందుచుండె
నీవు నవ్విధమున నిపుణుండ వగుచు
భావించి యానందపదమందుఁ బొందు
మలరి యంతస్సుఖుండై బాహ్యమందు
వలనుగాఁ దాఁ జేయవలయు కార్యములఁ

జేయుచు నుండియుఁ జిత్సౌఖ్యపదవి
నేయెడలను వీడ కెనసి వర్తించు
నతఁడు శాంతుఁడు నిరహంకారుఁ డగుచు
హితమొప్పఁ దన్నుఁ దా నెఱఁగి మోదించు
ననఘాత్మ! విను మాయహంకారభావ
మున నాత్మతత్త్వ మిమ్ముగఁ బొందరాదు
గురుఁడు చెప్పినమీఁద గుఱుతుగా నాత్మ
నెఱఁగి యహంకృతి నెడఁబాయవచ్చు
ననిన రాఘవుఁ డిట్టు లనె నోమహాత్మ!
తనర నహంతాభిధానచిత్తంబు
గతమైన యప్పు డక్కడ సత్త్వగుణము
హిత మొప్ప నొక్కటే యేరీతి నిలుచు
నానతిం డనిన రామావనీంద్రునకు
మౌని యిట్లనియె నోమనువంశతిలక!
విలసితప్రజ్ఞతో వినుము చెప్పెదను
గలుషం బణఁగ నహంకారమయంబు
గా నుండుచిత్తంబు గతమైనవెనుక
నూని కామాదులం దుదయింప కణఁగి
పోవు సత్త్వగుణంబు పొసఁగ శేషించి
యావిమలాత్మయం దంటి విదేహ
ముక్తిపర్యంత మిమ్ముగ నుండు విషయ
రక్తిలోఁ జొరదు వారక రక్తి మరలఁ

బోరిఁ గాలవశమునఁ బుట్టినఁగాని
సరసిజంబును ముట్టఁజాలనిజలము
కరణి నయ్యాత్మ నక్కడ ముంపలేక
వెఱచి తొలంగు నావిమలవర్తనుని
వాసనగ్రంథులు వాఁడి నశించు
భాసురశాంతిసంపద చాల మించుఁ
గోప మానాఁట సంకుచితమై పోవు
దీపించు సుజ్ఞానదృష్టి యంతటను
బోలుపొంద నిటు సులభోపాయమైన
యలఘుసన్ముక్తిప్రయత్నంబు సేయఁ
జాలక సంసారజలధిలో మునిఁగి
యాలస్యమున మూర్ఖుఁడగు వానితనువు
కాలిచి చెప్పినఁ గలుగునే జ్ఞాన
మేల వారిఁ దలంప నినకులోత్తంస!
యని ముని భృంగీశ్వరాఖ్యాన మెల్ల
మనుజేంద్రునకుఁ జెప్పి మఱియు నిట్లనియె

ఇక్ష్వాకూపాఖ్యానము.

ననఘాత్మ! యిక్ష్వాకుఁ డనుమహారాజు
మనువును జేరి సమ్మతముగా మ్రొక్కి
పలికె నిట్లని యీప్రపంచ మేరీతిఁ
గలుగు నెట్లణఁగు నేఁ గర్మపాశమును

నేరీతిఁ దెగఁద్రెంతు నిరవైనముక్తి
నేరీతిఁ బొందుదు నెఱిఁగింపుఁ డనిన
మను విట్టు లనియెఁ గుమార! నీబుద్ధి
యనఘమై దీపించె నహహా! నీప్రశ్న
యనుపమంబగు శరీరాదిదృశ్యములు
గనుపించు మృగతృష్ణకై వడి నంతె
కాని నిక్కముగా దఖండచిద్గగన
మే నిత్య మగు నది మిథ్యగా నెపుడు
జగము దుర్మోహాతిశయభావములను
నిగుడి యద్దములోని నీడకైవడిని
భ్రాంతచిత్తులకు నిబద్ధిగాఁ దోఁచు
నంతియె కాని నిత్యంబుగా దెవుడు
రక్తిగా మాయాస్ఫురణచే ననేక
శక్తులే బ్రహ్మాండజాలంబు లనుచు
పలుమాఱు బహుభూతభావనభావ్య
ముల నగు నాబ్రహ్మము చలింపకుండు
రమణీయజలము తరంగంబులైన
క్రమమునఁ జిచ్ఛక్తికళ విశ్వమగును
గావున బంధమోక్షంబులు రెండు
లేవు చలాచలలీలమనములఁ
దలఁపక సర్వశాంతమును వహించి
యొలమిని రాజ్యంబు నేలుచు నుండుఁ

దనతొమ్ముపై నున్న తనయుని దాను
గనక యెం దరిగెనో గద యని యేడ్చు
జననిచందంబున జరయును మరణ
మును లేక హృదయాబ్జమున వెలుంగుచును
నున్నయాత్మను గాన కురుచింత నొంది
విన్ననై యెచటనో వెదకు మూఢుండు
తానె దేహం బని తనువున కొక్క
హాని వచ్చినఁ దానె యణఁగుదు నంచుఁ
దలఁకుచుండునుగాని తా నాత్మ ననెడి
తెలివి నొందఁగ లేఁడు దేహాభిమాని
యిట్టిముఢాత్ము లనేకులు ధరను
బుట్టుచుందురు ముక్తిఁ బొందనేరక యె
యరయ నబ్ధులు బుగ్గలైనచందమున
సరవి నొప్పెడు చిత్తసంకల్పమహిమ
వలననే సృష్టి సర్వము నగుచుండుఁ
దలఁపునఁ గదలి కదల కుండు నాత్మ
సంకల్ప మది రాజ్యసౌఖ్య మంతటను
బొంకమై యనుభవింపుచు నుండు నెప్పు
డరయఁ జిత్తము మాయ యగునది లేక
నిర వంది సర్వమోహిని యగుఁగాన
ఘనతరంబుగ సర్వగతమగు నాత్మ
యెన లేని తన్నుఁ దా నెఱుఁగంగ లేదు

అగణితంబగు సచ్చిదాకాశమయము
జగ మని భావించు శాంతవర్తనుఁడు
క్రమముగా సద్బ్రహ్మకవచుఁడై సతత
మమితసుఖం బొంది యహమిక లేక
నంతయు సద్బ్రహ్మ మని సతతంబు
చింతించు వరయోగి చిత్పద మొందుఁ
గావున నీ వీజగద్భ్రాంతి విడిచి
పావనచిద్బ్రహ్మపదమందుఁ బొందు
యతి యైన గృహి యైన నతిశాంతుఁ డైన
సతత మీజ్ఞానమే సాధింపవలయుఁ
బూని పుట్టుటయును బోవుట నీవు
నే నను టాత్మలో నిరసించి మమత
వీడి తనను దానె వీక్షించుచున్న
వాఁ డెటు లున్న జీవన్ముక్తుఁ డగును
అనుదిన మీధ్యాన మభ్యసింపక యె
తనుసుఖంబును గోరు తామసాత్మునకుఁ
దెలియఁజెప్పిన యుపదేశవాక్యములు
మేలుగాఁ జవిటిభూమిని విత్తినట్టి
విత్తులవలెఁ బోవు విఫలంబు లగుచుఁ
జిత్తశుద్ధుం డైన శిష్యోత్తమునకుఁ
దేటగా గురుఁ డుపదేశించినట్టి
మాటలు ప్రోదియౌ మహిమీఁద నిడిన

ఘనబీజములరీతిగాను ఫలించుఁ
బనుపడ హరిహరబ్రహ్మాదు లొనర
బహువిధలీల లేర్పడఁ జూపుచున్న
సహజమే చిద్విలాసంబుగా నెఱుఁగు
సలలితసర్వదర్శనములయందుఁ
గలయర్థములను నిష్కర్షగాఁ జూచి
యది భేదరహితమహాబ్రహ్మ మనుచుఁ
జెదరక యాత్మలోఁ జింతించువాఁడు
కుదిరికగా నిరంకుశతృప్తిఁ బొందుఁ
జెదరిపోవుచునున్న చిత్తలయంబుఁ
జేసినసరయోగి చిత్సౌఖ్యపటిమ
వాసిగా ధర నెంతవారికి రాదు
లలి ముక్తి దేశకాలములందు లేదు
బలయు నహంకారభావంబు నణఁచి
విడిచిన దే ముక్తి విమలాంతరంగ!
పుడమి నీయనుభవంబును దృఢంబుగను
దలఁపుచు నుండు మంతర్లక్ష్యమతిని
నలవడు వర్ణాశ్రమాచారశాస్త్ర
వనధిఁ దరించు నెవ్వఁడు వాఁడు కర్మ
జనితప్రపంచపంజరమును ద్రెంచి
యనఘుఁడై యిచ్ఛావిహారియై ముక్తి
కనుకూలుఁడై యుండు నానంద మొందు

లలితాత్మ కర్మఫలత్యాగి నిలను
బొలుపుగా నంటవు పుణ్యపాపములు
కామకర్మంబులు గావించువారు
కాముకులై పుణ్యపాపఫలముల
ననుభవింపుచు నుందు రజ్ఞాను లగుచు
ఘనతరజ్ఞానమార్గము నెఱుంగకయె
తనువుల సకలతీర్థములలో ముంచి
పనివడఁ గష్టంబుపాలు గావించి
తుదను ముక్తిని బొందుదు మటంచుఁ దలఁతు
రది యెట్టులన్న మహాతీర్థములను
శ్వానముల్ మునిఁగినచందంబు గాదె
జ్ఞానంబు గలుగ నాక్షణమాత్రమందె
యానందకరమగు నమలసమాధిఁ
బూని జీవన్ముక్తిఁ బొందఁగావచ్చు
ననఁగ నిత్యాత్ముఁ డిట్లనె నింద్రియముల
కును విషయంబులకును బరాత్మకును
వేఱుగా నొకటి యేవిధము దోఁచినది
యారీతిఁ దెలియు టెట్లన మను వనియె
విను పక్షు లంబరవీథిఁ జరించు
ననువున విషయేంద్రియము లాత్మయందు
వరుసగాఁ దమతమ వ్యాపారములను
జరియించు నాత్మ కాసంగంబు గలదె

గగనాంతరమునందు గాలి చరింప
గగనవాయువునకుఁ గలదె సంగంబు
ఆచందమున సచ్చిదాకాశమందుఁ
దోఁచెఁ బ్రపంచంబు తుద నంట లేదు
కనుకఁ బ్రపంచంబు కల్లగా నెఱిఁగి
తనుతరశుద్ధచైతన్యంబు నెపుడు
గనుఁగొనుచుండు మఖండలక్ష్యమున
ననఁగ నిక్ష్వాకుఁ డిట్లనియె నో తండ్రి!
త్రిగుణంబు లడ్డమై త్రిమ్మరుచున్న
నగుణచైతన్యంబు నరయు టెట్లనిన
మను విట్టు లనియెఁ జిన్మయమగుగుణము
ఘనమగు చైతన్యగగనవస్తువును
గుణములచేఁ గనఁగూడు నే యనిన
గుణవంత! విను కొండ గుఱి వెట్టినటుల
నంతయు బ్రహ్మమే యని యఖండముగ
చింతించి పొందుమా చిత్పదమందె
యని యుపదేశించి యామను వరిగె
ననఘుఁడై యిక్ష్వాకుఁ డాజ్ఞాన మెఱిఁగి
పొసఁగ జీవన్ముక్తిఁ బొంది రాజ్యంబు
పసమీఱ ధీరుఁడై పాలించుచుండె
ననుచు నిక్ష్వాకువృత్తాంత మామౌని
మనుజేంద్రునకుఁ జెప్పి మఱియు నిట్లనియె

శ్రీరామ! యిపుడు నేఁ జెప్పినరీతి
నారూఢవిజ్ఞాని యగువాని కిలను
లౌకికాచారజాలంబులు తఱుచు
లేక ప్రపంచనిర్లేపుఁడై యుండు
నన విని శ్రీరాముఁ డతనికి మ్రొక్కి
మునినాథ! జీవన్ముక్తు లీయిలను
నాకాశగమనాదులై నసిద్ధులను
జోకగాఁ గోర రెచ్చోటుల నైన
నని యంటి రిఁక వారియధికత లెట్లు
గనవచ్చు నని పల్కఁగా నావసిష్ఠ
ముని రాము నీక్షించి మొనసి యిట్లనియె
ననఘాత్మ! విజ్ఞాను లైనట్టివారు
అతిశయసిద్ధులం దాసక్తిపడరు
ప్రతిభతో మంత్రజపక్రియాధ్యాన
వరహఠయోగముల్ వరుసగా సల్పు
పురుషు లాసిద్ధులం బొంది లోకముల
సురుచిరమహిమముల్ చూపుచు నుందు
రరుదుగా నందుచే నధికత రాదు
అక్కజంబుగ జ్ఞాని కజ్ఞాని కరయ
నెక్కువ తక్కువ నేరీతిఁ దెలియ
వచ్చు నటన్న సర్వప్రపంచంబు
మెచ్చి యిదంతయు మిథ్యగాఁ గనుట

మూఁడవది యటంచు మునినాయకుండు
వేడుకగాఁ దెల్ప విని రాఘవుండు
మరల నాలోచించి మౌని నీక్షించి
సొరిది జాగ్రత్స్వప్నసుప్తినిష్ఠంబు
గాని తుర్యమును దక్కఁగ తెల్పుఁ డనిన
మౌని రామునిఁ జూచి మఱియు నిట్లనియె
విహితంబు చెప్పెద విను మనుజేంద్ర!
యహమికానహమిక లాత్మఁ దోఁచకయ
సత్తు నసత్తను సంజ్ఞలు మఱచి
చిత్తవిశ్రాంతిని జెంది నిర్మలుఁడు
సర్వశాంతుఁడు నై యసక్తుఁ డై నదియె
నిర్వాణపదతుర్యనిష్ఠ యానందుఁ
బొరిపొరి సంకల్పములు లేమి నదియె
సరసజాగ్రత్తయు స్వప్నముంగాదు
అరసి చూచినను జాడ్యము లేనికతన
సురుచిరంబైన సుషుప్తియుఁ గాదు
నెరయు నహంకారనిరసనబుద్ధి
నఱిముఱి సమతోదయం బగు నందుఁ
జిత్తంబు విశదమై చేష్టింపకుండు
నత్తఱి నందుఁ దుర్యావస్థ పొడము
భూనాథ! నీవు ప్రబుద్ధుండ విలను
గాన నీబోధ చక్కఁగ వృద్ధిఁ బొందె

నిటువంటి సద్బోధ నెఱసిన మౌని
పటునిశ్చలత్వంబు భావించి వినుము

—— వ్యాధునిచరిత్ర. ——

ఒక్క కాననములో నొక్క కిరాతుఁ
డొక్క బాణముఁ బూని యొక్క మృగంబు
పై నేయుఁగా నేటువడి పోయె మృగము
దాని వెన్నంటి యత్తఱిఁ బర్వవారి
వ్యాధుఁ డయ్యాశతో నరిగి యొక్కెడను
బోధనిమగ్నుఁడై పూర్ణుఁడై యున్న
మౌని నీక్షించి యామార్గంబునందుఁ
దాను నాచే నొచ్చి తరలినమృగము
వచ్చెనే యనఁగ నవ్వరముని వాని
నచ్చెరువుగఁ జూచి యనియె నిట్లనుచు
సర్వసమత్వభాస్వరనిష్ఠఁ బూని
నిర్వాణపదమందు నిలిచి యుండెదను
నేను నీమృగముపోయినజాడ నెఱుఁగ
నోనిషాదుఁడ! యని పూర్ణుఁడై నట్టి
మునివాక్యముల కర్థము నెఱుంగ కతఁడు
తన యిచ్చ నరిగె న త్తపసి యుండుండె
యెందు కీకథ జెప్పవె తెలుఁగింపు మనిన
ముందర సరభసంబుగఁ బోవుచున్న

మొకముసే చూడక మిన్నంటియున్న
యకలంకతుర్యసౌఖ్యం బిది యంచుఁ
దెలియఁజెప్పితి నిది తెలిసి యందున్న
చెలఁగి తుర్యము నభ్యసింపుచు నుండు
మిట్టి ప్రశాంతాత్ము లెందున్నఁగాని
గట్టిగా ముక్తులుగాఁ జూడు మనుచుఁ
గ్రమముగా వ్యాధునికథ వినిపింప
నమలుఁడై శ్రీరాముఁ డతని వీక్షించి
మౌనీంద్ర! యిట్టిసమాధి నేరీతిఁ
బూనుచు నభ్యసించుదు రార్యు లనిన
విని యమ్మునీంద్రుఁడు విజయరాఘవుని
గని యిట్టులనియె నోకాకుత్స్థతిలక!
సారవేదాంతవిచారంబుచేసి
ధీరసమాధి సాధించు టెట్లనినఁ
బరువడి బాహ్యప్రపంచదృశ్యముల
నరసి మిథ్య లటంచు నన్నిటియందు
నున్న సద్రూపంబు నూహింపుచున్నఁ
బన్నుగాను వికల్పబాహ్యదృశ్యాను
విద్ధసమాధి యిద్విధ మగుఁ జ్ఞాన
పద్ధతి మఱివక ప్రణవంబువలనఁ
గలుగు శబ్దం బనేకప్రకారములఁ
బలుక నవెల్ల శబ్దబ్రహ్మ మనుచుఁ

దెలిసి యా తెలిసిన తెలివి నే ననుచుఁ
దలఁపుచు నుండుచందంబు నూహింప
జనహిత! సవికల్పశబ్దానువిద్ధ
మనెడు బాహ్యసమాధి యగు నవ్విధంబు
శాంతమై స్వచ్ఛమై చలనంబు లేని
యంతరంగసమాధి యగు నదెట్లనిన
దెలిపెద హృదయమందే మానసమును
నిలిపి లోలోఁ జూడ నెఱసి కామాది
వృత్తు లనేకముల్ విరివిగాఁ బొడము
చిత్తంబు వాని నీక్షింపుచు నుండు
ననఘుమై చిత్తకామాది దృశ్యముల
కును బ్రకాశము నిచ్చు గూఢచైతన్య
కళ యన్నిటిని దాను గనుఁగొనుచుండుఁ
గళవళ మొందక కక్కడ నిదానించి
యమలమై తగుప్రత్యగాత్మ నే ననుచు
నమర భావింపుచున్నట్టి చందంబు
విను లోనిదృశ్యానువిద్ధసమాధి
యని చెప్పఁదగుచుండు నదియునుంగాక
యరయ నిస్సంగంబు నద్వయం బజము
పరమాత్మ యని సదా బహువిధశ్రుతులు
పలికెడి శబ్దార్థపటిమ నే మఱచి
దలఁపుచున్నట్టి శబ్దజ్ఞానమందుఁ

గలసి మనంబు మగ్నం బైనరీతి
తెలియు లోశబ్దానువిద్ధసమాధి
యగు దృశ్యశబ్దంబులందు లక్ష్యంబు
తగులక తను దానె దలఁచుచు నుండి
యదియును మఱచి బ్రహ్మైక్యసంధాన
మొదవఁగా నందు మనోన్మనినొంది
యిది యది యనుట లే కేకమై నిలిచి
కదల కున్నది నిర్వికల్పసమాధి
యగు మఱి జన్మకర్మాదులు లేక
మిగులుచు నాపరమేశరూపముగఁ
గలుగ నానందమే ఘనశరీరముగఁ
గలుగఁగా మహదాది ఘనతత్త్వములకు
నాధారభూతమై యద్వయంబైన
బోధస్వరూపసంపూర్ణచిద్రసము
లో లీన మగుచు బాలునిమాడ్కి జడుని
పోలిక బలువేల్పుపూనినవాని
కరణి సంకల్పవికల్పవృత్తులను
మఱచుచు దేహాభిమానంబు లేక
యపుడును భూతిరసావేశ మెసఁగ
విపులంబుగా బుద్ధివిశ్రాంతి నొంద
మురువొప్పఁగాఁ దుదిమొదలు దోఁచకయె
తెలిసి యంతట నిండి నిదురించువాని

వగిది నున్నది యసంప్రజ్ఞాత మనఁగఁ
దగినసమాధియై తనియుచు నుండు
శ్రీరామ! నీకు నేఁ జెప్పినరీతి
నాలు సమాధు లిట్లభ్యసించుచును
నవఘులై వర్తింతు రార్యు లటన్న
మునిని వీక్షించి రాముఁడు వల్కె మరలఁ
బొలుపొందఁగా సప్తభూమిక లేడు
గలవని మును చెప్పఁగా వింటి నిపుడు
పొసఁగ సవిస్తరంబుగ మీరు మరల
వినుపక తెల్పుఁ డావిధము లటంచు
నడుగ వసిష్ఠుండు నారాముఁ జూచి
యడరినకరుణ నిట్లని చెప్పఁదొడఁగె

సప్తభూమికలు.

మనుజేంద్ర భూమికల్ మఱి యవెట్లనిన
విను ప్రవృత్తుండు నివృత్తుం డనంగఁ
గల రాయిరువురందుఁ గ్రతుకర్మయుతుఁడు
పొలుపుగా స్వర్గాదిభోగంబులందు
నానివృత్తుఁడు భోగ మస్థిరం బనుచుఁ
దా నిశ్చయించి తత్పదలక్ష్యమందుఁ
బొందుఁ బ్రవృత్తుండు పుణ్యపాపంబు
లిందుఁ జేయుచును దన్నెఱుఁగక యుండి

పొలియుచుఁ బుట్టుచుం బుణ్యపాపముల
ఫలము లనుభవించుఁ బరఁగ నిందందు
నిలుక డెక్కడ లేక నింగిని నేల
నలయక యమితదేహములు ధరించి
తిరుగుచుండఁగఁ గడతేరుకాలమున
వరయోగిజనసహవాసంబు దొరకు
వారిసూక్తులు విన వాంఛ జనించు
వైరాగ్యమున మది వర్తించు నవలఁ
గడఁదోతు రబ్ధులకరుడులలోనఁ
బడినకూర్మము మేడపై కెక్కినటుల
పెక్కుజన్మంబులపిదప వివేక
మొక్కంత జనియించుచుండఁగా మదిని
సంసారసుఖము లసారంబు లధిక
హింసాస్పదము లని యోజిఁగి కామాది
రిపులను ఖండించురీతులఁ గరుణ
నిపుడు నా కెఱిఁగించి యీభవార్ణవము
తరియింపఁ జేసి యాత్మను జూపఁదగిన
గురుఁడు నా కెందుఁ గల్గు నటంచు ధరను
క్రమముగా వెదకఁగాఁ గర్మవాసనలు
సమయుచునుండఁగా సద్ధర్మభక్తి
వైరాగ్యములమీఁది వాంఛలు పొడము
సారవిచారభాస్వరనిష్ఠ గలుగుఁ

గర్వాభిలాష తక్కక విడి యాత్మ
మర్మశాస్త్రములఁ బల్కుటఁ జూడఁగోరు
సదమలధర్మవిచారుఁడై యుండు
నది విచారాభిమానాత్మకం బగుచుఁ
బొలుపొందు నిది యాదిభూమికై యుండు
నెలమిని భూమిపై కెక్కినవాఁడు
సారశ్రుతిస్మృతిశాస్త్రేతిహాస
ధారణయోగితత్త్వధ్యానగోష్ఠి
గలిగినవాఁడై యఖండపాండిత్య
కలితులౌ పండితాగ్రణులను జేరి
మొనసి తద్వ్యాఖ్యానములఁ జేసి బుద్ధి
తనియఁగాఁ బదపదార్థజ్ఞానసూక్ష్మ
భావజ్ఞు లగుచు లోపలఁ బ్రవేశించి
యేవేళఁ దను బట్టి యేఁచుచున్నట్టి
కామాదిశత్రువర్గమును ఖండించి
పాము పొరను వీడ్చుపగిది నవిద్య
యను తెరం దెగఁద్రెంచి యమలుఁడైనట్టి
తను దాను దెలియఁ దత్త్వజ్ఞుఁ డైనట్టి
గురుసేవఁ జేసి యెక్కువరహస్యముల
నెఱిఁగి తదర్థమం దెపుడు నీ వున్న
బుద్ధియే రెండవభూమిక యంచు
సిద్ధాంతముగ బుధుల్ సెప్పుచుండుదురు

ఎలమిని భూమిక నెక్కిన పురుషుఁ
డలరి యసంగమం బనెడి తృతీయ
భూమికపై కెక్కి పూలపానుపున
సామోదచిత్తుఁడై శయనించువాని
కరణిని సంతోషకలితాత్ముఁ డగుచు
నరుడుగా నుపనిషదర్థసారంబు
మదియందు నిండఁగా మనుజసంగంబు
వదలి యేకాకియై వనగుహాలందుఁ
జరియింపుచును మహాసంతోషి యగుచుఁ
బరఁగ నాత్మానాత్మభావవివేక
కలితుఁడై కాలంబు గడుపుచుఁ జిత్త
చలనంబు నణఁచుచు శాంతుఁడై యుండు
నతనికిఁ దత్త్వశాస్త్రాభ్యాసపటిమ
నతిశయమైన జ్ఞానానందవస్తు
దృష్టి నానాటికి దీపించి మించి
యిష్టమై యెఱుకకు నెఱుకయై యుండు
నామాడ్కి నిస్సంగ మనెడి తృతీయ
భూమిక ద్వివిధమై పొలుచు నెట్లనిన
సామాన్యమును విశేషము న రెండు
గా మహి నుండు నాక్రమ మెల్ల వినుము
ఘనపదార్థములందుఁ గర్తయు భోక్త
యును బాధ్యుఁడును మఱియును బాధకుఁడును

నిజముగాఁ జూచిన నిముఁ గాన ననియు
గజిబిజిసేయు సుఖంబుదుఃఖంబు
తెలియ సర్వేశ్వరాధీనంబు లనియుఁ
గలితభోగములు రోగంబుల కనియు
మొనసినసంయోగములు వియోగముల
కనియు నన్నియును గాలాధీన మనియుఁ
దొడరి యనేకవస్తువులయుం దాళ
పడక ప్రాప్తాళి యై బ్రతికి యుండుటయు
సరవి సామాన్యనిస్సంగమై యుండు
మఱి విశేషాసంగమం బెట్టి దనిన
నవని దుర్జనదూరుఁ డనుచు వసించి
ప్రవిమలంబౌ నాత్మ భావించుకొనుచుఁ
జిరశాంతి నిట్లభ్యసించిన నాత్మ
కరతలామలకంబుగాఁ దోఁచు నపుడు
పనుపడు సంసారపారంబు సాగ
మన నొప్పు పరతత్త్వమందుఁ దాఁ బొంది
యెప్పుడు సర్వం బీశ్వరాధీన మనుట
కపటకారణపూర్వకర్మ మే ననుట
మఱచి శాంతిని లోనె మానంబు పూని
మురిసి ప్రపంచనిర్ముక్తుఁడై యున్న
నది విశేషాసంగ మన నొప్పు మఱియు
విదితంబుగా లోను వెలి క్రింద మీఁదు

దిక్కుల గగనవీథిని జేతనంబు
లెక్కువలై జాడ్యహీనంబు లగుచు
లలి వస్తువస్తుకలన మొందకున్న
నలఘుచిదాభాస లంబరాకృతులు
వెలుఁగులలోన భావించి చూచినది
యలవిశేషాసంగ మన నొప్పు మఱియుఁ
బరఁగ సమ్మదసౌరభము చిత్తనాశ
కరము సంసృతిపత్త్రకలితంబు విఘ్న
విరహితంబైన వివేకపద్మంబు
మురువుగా నెదలోను ముందుగా మొలిచి
రహిని దత్త్వవిచారరవిరశ్మిచేత
విహితప్రబుద్ధమై వృద్ధిఁ బొందుచును
గుఱుతుగా నీయసంగులకు ఫలంబు
తిరముగా నిచ్చుఁ దృతీయభూమికను
జనునకు సజ్జనసంగతికర్మ
మునఁ గాకతాలీయముగ నుదయించు
నదియు భూమికయును నమృతాంకురమున
కాదరంబుగ వివేకాంబుసేచనము
సేయ సదంశంబుచేఁ జిగుళ్లెత్తు
నా యెడఁ గృషిసేయు నతఁ డాదియందు
మొలుచుసస్యాళి నిమ్ముగఁ బ్రోచుకరణి
నల యాదిభూమిక నరయఁగావలయు

నేమిటి కటు లన్న నిటువంటిప్రథమ
భూమిక తనమీఁదఁ బొడమఁభూములకు
మనికిప ట్టగుఁ గాన మఱవక యాత్మ
మననఁ జేయుచు సద్విమర్శంబు నొంది
యామీఁద నిస్సంగమై యాత్మతీయ
భూమికయందు సొంపుగ నొప్పుచుండు
నిట్టిమూఁడవభూమి కెక్కినమీఁదఁ
బుట్టువు సంకల్పబుద్ధ్యాదాపళులు
అని వసిష్ఠుఁడు పల్క నారామచంద్రుఁ
డనుపమభక్తితో నప్పు డిట్లనియె
మునినాథ! ధరణిపై మూఢాత్ముఁడైన
జనుఁ డేవిధంబున సంసారజలధి
తరియించు నట్టిచందము దెల్పవలయు
మెఱవడి నేఁడు భూమికలయం దొక్క
భూమికపై నెక్కి పొలిసినమనుజుఁ
డేమార్గమునఁ బోవు నెఱిఁగింపుఁ డనిన
విని వసిష్ఠుఁడు మహీవిభుని వీక్షించి
విను రామ! చెప్పెద విశదంబుగాను
రూఢదోషుఁడు భవరోగి తామసుఁడు
మూఢుండు నైనట్టి మూర్ఖచిత్తుండు
సంసారియై బహుజన్మంబు లెత్తి
హింసలఁ బడుచుండు నెన్నటికైన

దిక్కుల గగనవీథిని జేతనంబు
లెక్కవల్లె జాడ్యహీనంబు లగుచు
లలి వస్తు వస్తుకలన మొందకున్న
నలఘుచిదాభాస లంబరాకృతులు
వెలుఁగులలోన భావించి చూచినది
యలవిశేషాసంగ మన నొప్పు మఱియుఁ
బరఁగ సమ్మదసౌరభము చిత్తనాళ
కరము సంసృతిపత్రకలితంబు విఘ్న
విరహితంబైన వివేకపద్మంబు
మురువుగా నెదలోను ముందుగా మొలిచి
రహిని దత్త్వవిచారరవిరశ్మిచేత
విహితప్రబుద్ధమై వృద్ధిఁ బొందుచును
గుఱుతుగా నీయసంగులకు ఫలంబు
తిరముగా నిచ్చుఁ దృతీయభూమికను
జనునకు సజ్జనసంగతికర్మ
మునఁ గాకతాళీయముగ నుదయించు
నదియు భూమికయును నమృతాంకురమున
కాదరంబుగ వివేకాంబు సేచనము
సేయు సదంశంబుచేఁ జిగుళ్లెత్తు
నా యెడఁ గృషి సేయు నతఁ డాదియందు
మొలుచు సస్యాళి నిమ్ముగఁ బ్రోచుకరణి
నల యాదిభూమిక నరయఁ గావలయు

నేమిటి కటు లన్న నిటువంటిప్రథమ
భూమిక తనమీఁదఁ బొడముభూములకు
మనికిప ట్టగుఁ గాన మఱవక యాత్మ
మననఁ జేయుచు సద్విమర్శంబు నొంది
యామీఁద నిస్సంగమై యాతృతీయ
భూమికయందు సొంపుగ నొప్పుచుండు
నిట్టిమూఁడవభూమి కెక్కినమీఁదఁ
బుట్టువు సంకల్పబుద్ధ్యాద్యఖిలు
అని వసిష్ఠుఁడు పల్క నారామచంద్రుఁ
డనుపమభక్తితో నప్పు డిట్లనియె
మునినాథ! ధరణిపై మూఢాత్ముఁడైన
జనుఁ డేవిధంబున సంసారజలధి
తరియించు నట్టిచందము దెల్పవలయు
మెఱవడి నేఁడు భూమికలయం దొక్క
భూమికపై నెక్కి పొలిసినమనుజుఁ
డేమార్గమునఁ బోవు నెఱిఁగింపుఁ డనిన
విని వసిష్ఠుఁడు మహీవిభుని వీక్షించి
విను రామ! చెప్పెద విశదంబుగాను
రూఢదోషుఁడు భవరోగి తామసుఁడు
మూఢుండు నైనట్టి మూర్ఖచిత్తుండు
సంసారియై బహుజన్మంబు లెత్తి
హింసలఁ బడుచుండు నెన్నటికైన

ఘనభవాంబుధి దాఁటి గట్టెక్క లేఁడు
మొనసి కర్మంబు లిమ్ముగఁ జేయువాఁడు
భూరివైరాగ్యంబు పుట్టినదనుక
ధారుణి జన్మశతంబులు దాల్చి
యలసి యాపల నీశ్వరార్పితకర్మ
ములఁ జేసి దుష్టామములవీడుచున్న
నప్పు డాపరమేశ్వరానుగ్రహంబు
తప్పక గల్గు నద్వైతవిజ్ఞాన
వాసన వొడము నవ్వల విరాగంబు
వాసిగా నుదయించి వాంఛల నణఁచు
మెలుపగు నాదిభూమిక యిదే యగును
బొలుచు సంసార మీభూమికయందు
సమయు నిదే తత్త్వశాస్త్రసమ్మతము
క్రమముగా నీభూమికను జేరియున్న
యతఁ డొకవేళ దేహము వీడి చనిన
నతులితభూమికాంశానుసారమున
నమలమైన ప్రభ నమరలోకమునఁ
గమనీయదేవతాంగనలను గూడి
యచట భోగంబుల ననుభవింపఁగను
బ్రచురసత్పుణ్యపాపము లుడిపోవ
నలరి యాపుణ్యాత్ముఁ డవనిపై వ్రాలి
తొలఁగక భాగ్యవంతులయింట నైన

పరయోగి యగువాని వంశమందైన
నరయఁ బ్రజ్ఞాశాలి యై యుదయించి
వరుసఁ బూర్వజ్ఞానవాసనచేత
మెఱయు తదూర్ధ్వభూమికలను దాఁటి
తదనంతరంబునఁ దా బ్రహ్మ మగును
మొదటిభూమికనుండి మూఁడుభూమికలు
వ్యవహారమాత్రభేదాస్పదంబులుగ
నవనిపైఁ దోఁపించునది జాగరంబు
ఇట్టిజాగ్రద్భూమి కెక్కినఘనుఁడు
పట్టుగా నార్యుఁడన్ ప్రస్తుతి నొంది
వర్తింపుచుండి సర్వప్రయత్నములఁ
గర్తయై కావించుఁ గర్త గాకుండుఁ
దత్త్వశాస్త్రవిచారతత్పరుం డగుచు
సాత్త్వికబుద్ధి నాచార్యుఁడై యుండు
నట్టియాచార్యత్వ మాదిభూమికను
దట్టమై యంకురితం బగుచుండుఁ
దెఱఁగొప్ప నదియె ద్వితీయభూమికను
విరివి చూపట్టఁగా వికసితం బగును
దెప్పున నదియె తృతీయభూమికను
దప్పక సంభావితం బగుచుండు
నాగతి నార్యుఁడై యట మృతుండైన
యోగసత్పుణ్యసంయుతసంచితంబు

ముదముమీఱ విదేహముక్తిని బొందు
నదియె సప్తమభూమికాఖ్యయై యుండు
మెఱయునయ్యాఱుభూమికల కన్నిటికి
నరయ సీమాభూమికై యుండు నదియె
యారూఢి వాఙ్మనసాతీత మగుచు
సారమై యుండు నాసచ్చిత్పదమును
కొందఱు శివుఁ డంద్రు కొందఱు విష్ణుఁ
డందురు మఱికొంద ఱజు డంద్రు మఱియు
నందుఁ గొందఱు శూన్య మందురు కాల
మందురు ధరఁ గొంద ఱమరఁగాఁ బ్రకృతి
పురుషసంయోగవిభూతి యటంద్రు
పరఁగ నీవిధమున బహుశాస్త్రవిదులు
అతిశయప్రజ్ఞచే నందఱు నన్ని
మతములఁ బుట్టించి మహిమఁ గల్పించి
నామరూపంబు లెన్నఁడు లేని యాత్మ
కీమాడ్కి ధరణి ననేకముల్ గాను
బనుపడ నామరూపములఁ గల్పించి
కొనియాడికొనుచు నెక్కువతక్కువలుగఁ
దలపడి దేవతాంతరభేదములను
గలుగఁజేయుదు రాయఖండభూమికకు
జననాథ! యిటువంటి సప్తభూమికల
మొనసి సాధించిన ముఖ్యాధికారి

భవపాశమును ద్రెంచి పరమందుఁ బొందు
నవిరళచరిత! నీ వాప్రకారముగ
భూమికాభ్యాస మొప్పఁగఁ జేసి శాంతి
నామహాబ్రహ్మమై యన్నిటియందు
నీ వంటి యంటక నిస్పృహత్వమునఁ
బావనరాజ్యంబు పాలించు మనిన
జననాథుఁ డామునీశ్వరుని వీక్షించి
మనమున నూహించి మరల నిట్లనియెఁ
బొలుచు కారణకార్యభూతాళితోడ
బలసియున్నట్టి ప్రపంచ మంతయును
బరమైన నిర్గుణబ్రహ్మముం దైక్య
మెఱఁగి గావించురీ తెట్లన్న మాని
నరనాథు నీక్షించి నగుమోము మెఱయ
నరమరలేక యిట్లని చెప్పఁదొడఁగె

బ్రహ్మైక్యసంధానము.

వినవంశతిలక! నీ వీరహస్యంబు
వినుము నేఁ జెప్పెద విశదంబుగాను
బరఁగ జీవేశ్వరుపాదుల కైక్య
మెఱుఁగకుండిన ధాత్రి నెవ్వరికైన
నరుదైన తత్త్వం వదార్థైక్యభావ
మరయు మనోరథ మగు నింతె గానఁ

గర మొప్ప నీకార్యకారణైక్యంబు
నెఱుఁగంగవలె నది యెఱిఁగినయపుడె
తహాపొంది పరమతత్త్వంబు తా నొకటి
సహజంబుగా నిండి శాంతమై యుండు
జననాథ! యీశ్వరు సర్వదేహంబు
ననుపమబ్రహ్మాండ మగుచుండు మఱియు
నెఱసినజీవుని నిఖిలదేహంబు
నరయఁగాఁ బిండాండ మగు నివి రెండు
ధర ముఖ్యపంచభూతంబులచేతఁ
బరువడి నిర్మింపఁబడి యుండుఁగాన
మొనయు నీబ్రహ్మాండమునకుఁ బిండాండ
మునకుఁ గారణ మిల ముఖ్యభూతములు
అలపద్మజాండపిండాండముల్ కార్య
ములు కార్యకారణములకు భేదంబు
లేదు కారణ మిల లేక కార్యంబు
లేదు తంతుచయంబు లేక వస్త్రంబు
కలుగ దాచందంబుగా నజాండంబు
కలుగక పిండంబు గలుగ దా రెండు
కారణకార్యముల్ గావున వాని
కేరీతినను భేద మెన్నఁగరాదు
బాహుళ్యమైన యీపద్మజాండమున
నూహించి చూచిన

మొనయు నీపిండాండమునకు భావించి
కనిన జాగ్రదవస్థ గనుక రెంటికిని
సరవితో నైక్యంబు సహజమై యుండు
మఱియు జాగ్రత కభిమానియై పనుల
జేయించు నీశుండు సృష్టికర్తైన
యాయబ్జజుని యంశ మగుచుండుఁ గనుక
రమణీయబీజాంకురన్యాయ మొప్ప
నమర నయ్యిరువుర కైక్యంబు గలుగు
ఘనత నొప్పు హిరణ్యగర్భమై యీశ్వ
రుని లింగదేహ మా రూఢిగాఁ జూడ
నినుము కాలిచికొట్ట నెగురుచుఁ జెదరి
గనిపించు విస్ఫులింగంబులమాడ్కిఁ
దెలియ నీశ్వరలింగదేహంబునుండి
గలిగి యనేకలింగశరీరతతులు
గనుక నీశ్వరుని లింగశరీరమునకు
మొనయు నీలింగాంగములు వేఱుగావు
అరయహిరణ్యగర్భాంశమే యష్ట
పురి యయ్యెఁ దత్సంగమున నాత్మలోన
మఱియు గర్భావాసములు గల్గసాఁగె
గరిమనొప్పు హిరణ్యగర్భ మఁట దాని
వరప్రతిపాలనావస్థాంశుపటిమ
నరయ జీవునికి స్వప్నావస్థ యగును

గనుక నా రెంటి కైక్యం బని యెఱుఁగు
మనఘ! యాలింగదేహాభిమానమున
తెలియు తైజసుఁ డగు విష్ణునంశంబు
వల కార్యకారణన్యాయంబుచేత
సలలితవిష్ణుతైజసుల కిద్దఱికి
వలరార నైక్యమా నదియునుగాక
తగిలి వీడని మహాతత్త్వస్వరూప
మగు పుత్రకృత్యమే యజ్ఞానశక్తి
యగుఁ గాన నా రెంటి కైక్యమా నెఱుఁగు
మగణితసర్వసంహారరూపమున
నతిశయంబగు ప్రళయావస్థచేతఁ
బ్రతిభతోఁ బుట్టింపఁబడియె సుషుప్తి
యందుచే నా రెంటి కైక్యమా మఱియు
నందు సంహారకర్తైన రుద్రాంశ
మే మించి ప్రాజ్ఞుఁడై మెఱయు నీ రెండు
తామసాహంకారతత్త్వమై యుండు
నా రెంటి కందుచే నైక్యమా మఱియు
సారజ్ఞుఁ డైన యీశ్వరు నిజశక్తి
యనెడు మాయకును జీవాత్మువిజ్ఞాన
మునకు వేఱనువారు మూఢు లీశ్వరుని
సర్వసాక్షిత్వమెంచంగ జీవునకుఁ
బర్విన లీలతోఁ బ్రతిబింబమైన

యలఘుతుర్యావస్థ యగు రెంటి కైక్య
మెలమిఁ గల్గుచునుండు నీప్రకారముగఁ
బరఁగ జీవేశ్వరోపాధుల కైక్య
మిరవొందఁ గల్గఁగ నీశ్వర జీవ
భేదంబు గల దంచు బెట్టుగా నిలిచి
వాదించు నెట్లన్న వసుధేశుఁ డనియెఁ
బెలుచ జీవేశ్వరభేదంబు వేర
మలరి పల్కుట దేమి యానతిం డనిన
మాని యిట్లనియె రామ! తొలుత భేద
మూని చెప్పకయున్న నుర్విని జనులు
మొదట నభేద మిమ్ముగ విచారించి
తుదముట్టఁ జాల రందున దయచేత
బెట్టుగా జీవేశభేదవాక్యములు
పుట్టించి యీశ్వరపూజ గావించి
తదనుగ్రహమున నద్వైతచింతనము
కుదిరికగాఁ జేసి కొన్నాళ్లకైనఁ
బొసఁగ జీవన్ముక్తి పొందెద రనుచు
విసువక భేద మభేదంబు పలుకుఁ
గావునఁ బూర్వపక్షమును ధరింపఁ
గావలెఁ దొలుత సత్కర్మపద్ధతిని
నెఱిఁగినయటువలె నేతివాక్యాను
సరణంబుచేత దూషణసేసి విడిచి

యామీఁద సిద్ధాంతమైన యర్థమును
క్షేమంబుగాఁ బ్రతిష్ఠింపఁగావలయు
నొనరఁగ నదియు వేదోక్తమే గనుక
జననాథ! వేదశాస్త్రము లివ్విధమునఁ
జెలరేఁగి భేదముల్ చెప్పు నవ్వాలను
దొలఁగక యుపనిషత్తులు నిదానముగఁ
గ్రమ మొప్ప భేదవాక్యముల ఖండించి
యమలమై యద్వయంబైన బ్రహ్మమును
ఘనులకుఁ గనుసంజ్ఞగాఁ జూపుచుండు
ఘనత కెక్కు హిరణ్యగర్భంబు లింగ
తనువులు రెండు సిద్ధముగ లేకున్నఁ
బెనుపునొందు నజాండపిండాండములును
గలుగవు కారణకార్యంబులైన
యలపద్మజాండపిండాండంబులకును
సహజ మైక్యముస్థితి స్వప్నముయొక్క
విహితావయవములై వెలయుచున్నట్టి
సృష్టిజాగ్రత లని చెప్పఁగా నొప్పు
నిష్టంబుగా విషయేంద్రియంబులను
జెలఁగి కూడిన మనస్స్వప్నానురూప
కలితమై దినమును గనిపింపుచుండు
వేడుకగా నదే విషయవాసనలఁ
గూడి బాహ్యేంద్రియగోళకంబులను

వెలసి నిల్చిన బాహ్యవిషయకృత్యముల
సలుపునదే యగుజాగ్రదవస్థ
గాన నాస్వప్నంబు కారణం బగును
దానికార్యంబునఁ దగును జాగ్రత్త
యలరు నందున రెంటి కైక్యమా మఱియు
వెలయు తైజసుఁ డగు విష్ణునంశంబు
కావున వారి కైక్యము గల్గుచుండు
నావిశ్వుఁడగు పద్మజాంశమందునను
నాయిద్దఱికిఁ గల్గు నైక్యసౌఖ్యంబు
మాయచే నభిమానమగ్నుఁడై మొదట
నమరు నవ్యాకృతముం దంకురించి
రమణీయమైన హిరణ్యగర్భమును
నరయ నజ్ఞానాంశమగు లింగతనువు
నఱిముఱి కైక్య మానవివ్వధంబుగను
దనరు మాయకు నవిద్యకు నైక్య మొదవు
సునిశితప్రళయసుషుప్తులు రెండు
కారణలా స్థితకలయుకార్యంబు (?)
లారయ నీయుభయముల కైక్యములు
కలిగినతఱి వేఱ కారణం బొకటి
వలవ దో శ్రీరామవసుధాతలేంద్ర
సరవి నావిష్ణుతైజసులవుట్టువులు
పరఁగ రుద్రునివల్లఁ బ్రాజ్ఞునివలనఁ

గలిగె రాజససాత్వికంబులు రెండు
నలఘుత్వతామసాహంకారమందుఁ
బొలువు లేకయణంగిపోవుచు నుండు
నలరు నజ్ఞానంబు నవ్యాకృతంబు
మఱచు నాత్మజ్ఞానమాయలనుండి
యరుదుగా నుదయించు నం దైక్య మొందుఁ
దొలి సర్వసాక్షిత్వతుర్యంబులందు
ప్రళయసుషుప్తులు ప్రభవించి యచటఁ
గర మర్థిఁ గారణకార్యభావనను
బరఁగ నైక్యమునొందుఁ బార్థివాధీశ!
తలకొని మఱియు రుద్రప్రాజ్ఞు లిద్వ
రల యీశ్వరప్రత్యగాత్మలవలన
గలిగిరి వారి కక్కడ నైక్య మొదవు
నెలమి నేదేది యేయే కారణమున
గలుగు నాకార్య మాకారణంబునకుఁ
దలఁచిచూచినను భేదంబు గాకుండుఁ
గుదిరి సర్వంబును గుణసామ్య మొందుఁ
బొదువుగాఁ బలుమాఱు పుట్టి యణంగు
రూఢిగా మాయాస్వరూపమైనట్టి
గాఢమై తగు కార్యకారణైక్యంబు
గలుగఁగాఁ దత్కార్యకారణోపాధు
లెలమిని గల్గు జీవేశ్వరైక్యంబు

నిత్యసిద్ధం బయ్యె నేఁ జెప్ప నేల
ప్రత్యక్ష మీయనుభవము భావించు
తలఁపఁగాఁ దత్పద త్వంపదశబ్ద
ముల కైక్యమగురీతి మొనసి చెప్పితిని
సరసజీవేశ్వరచైతన్యమునకుఁ
బరమైన యసిపదభావనచేతఁ
బరఁగ నైక్యంబుఁ జెప్పక యే లభించు
టెఱుఁగఁ జెప్పితి నిది యిటు లుండనిమ్ము
అగణితబ్రహ్మాంబునందు వికర్త
మగు గుణసామ్యాది యఖిలవిశ్వంబు
నరయఁగా వేఱు గా దాబ్రహ్మమునకు
వరగుణసాంద్ర! సర్వము బ్రహ్మ మగును
భ్రాంతిచే రజ్జువు పామని చూచి
నంతటనే రజ్జు వగునె సర్పంబు
బ్రహ్మమున్ జూచి ప్రపంచ మటన్న
బ్రహ్మ మీమిథ్యాప్రపంచ మే లగును
జలమె తరంగముల్ శబ్దముల్ సుడులు
వలబుగ్గలై తోఁచినట్లు పరాత్మ
భ్రాంతచిత్తులకుఁ బ్రపంచమై తోఁచు
నింతియే కాని లే దీప్రపంచంబు
తలకొన్నఁ దత్త్వనిర్ధారణచేతఁ
జెలఁగి విచారణ చేసి చూచినను

అల బ్రహ్మమై విశ్వమై గనిపించుఁ
బొలుపొంద నిటువంటి పూర్ణానుభవము
గలిగిన ధన్యుఁ డాకారంబు లేని
యలఘుపరబ్రహ్మ మనుచు భావించు
మాయశరీరాభిమానంబు లేక
నా యమలబ్రహ్మ మగు యోగివరుని
డెంద మెందెందు వాఁడిగఁ బోవుచున్న
నందందు బ్రహ్మమే యగపడుచుండుఁ
గాని విశ్వము వేఱుగాఁ గానరాదు
గాన సమాధి యేకాంతమం దుండి
గావింతు ననెడి సంకల్ప మేమిటికి
నేవేళ నిన్ను నీ వెఱుఁగుచు భూమి
పాలించు మన రామభద్రుండు పలికె
నోలలితమునీంద్ర! యుర్వి నేలుచును
నే నసంప్రజ్ఞాతనిర్వికల్పంబు
నూని యేకాంతమం దుండక వినుట
కనుట మాట్లాడుట గలిగి యుండుటను
మన మాత్మతత్త్వంబు మఱవదే యనిన
నరపతిఁ జూచి యంతన యవ్వసిష్ఠుఁ
డరలేని నెనరుతో నమర నిట్లనియె
విను రామ! జనకభూవిభుఁ డాత్మతత్త్వ
మొనర నీక్షించుచునుండి విశ్వంబు

ఉన్నటు లుండఁగా నూహించి మించి
పన్నుగాఁ దాబరబ్రహ్మంబు నంటెఁ
బొసఁగ జీవన్ముక్తిఁ బొంది రాజ్యంబు
పసమీఱ ధీరుఁడై పాలింప లేదె
ఘనతనుప్రారబ్ధకర్మవాసనలు
ననుపమజ్ఞానంబు నర్ధక్షణంబు
చెనఁటులై యావరించినమాత్రముననె
యనఘుఁడై బ్రహ్మవేత్తై ధన్యుఁడైన
వాని మోక్షమునకు వచ్చునే హాని
పూని స్వప్నంబులో భూరిదుఃఖంబు
ననుభవించుచు నుండి యపుడె మేల్కొనిన
వేన దుఃఖము వాని వేధింపఁగలదె
యాప్రకారంబుగా నధ్యాత్మవిజ్ఞుఁ
డై ప్రపంచము మిథ్య యనుచు భావించు
జ్ఞాని యొక్కొకవేళఁ జపలసంసార
మూని గావించుచు నున్నమాత్రమున
నతని కాసంసార మంట దెన్నటికి
యతఁ డిల నిర్లేపుఁ డఖిలపూజ్యుండు
సర్వస్వతంత్రుండు సర్వశాంతుండు
సర్వపూర్ణుఁడు సర్వసముఁ డిటుగాన
వాఁ డెటు లున్న జీవన్ముక్తుఁ డగుచు
వేడుకగాఁ జూచు విశ్వచిత్రముల

అంతఃఁ బరబ్రహ్మ మని తోఁచినపుడు
వింత సంసారంబు వేఱైయుండు
భావింపు మీయనుభవమాత్రయందు
నీవె సత్ప్రిజ్ఞాతనిర్వికల్పముల
సాధింపనేల విశ్రాంతిచే నాత్మ
బోధానుభవ మొంది పూర్ణుండ వగుము
మఱపు నిన్నంటదు మనువంశతిలక!
పరమహంసున కసంప్రజ్ఞాతనిష్ఠ
తగు గృహస్థున కది తగ దందువలన
జగతి నేలుచు నుండు జనకుఁ డారీతి
నిరుపమప్రజ్ఞతో నిఖిలరాజ్యంబు
పరుఁడవై లీలగాఁ బాలింపుచుండు
పరమహంసుని కమ్రపదము నొందెదవు
నరనాథ! నిజముగా నమ్ము నామాట
చెలఁగుచుండెడి జగజ్జీవేశ్వరులకు
గలుగు నీవ్యాపారగౌరవస్థితులు
అవియెల్ల సగుణమాయాచిద్విలాస
సవరణంబులుగాని సత్యముల్ గావు
సత్యంబు నీ వైన సత్పదవస్తు
వత్యంతనిర్మల మగుణ మద్వయము
ఆజగజ్జీవేశ్వరాధార మజము
రాజయోగానందరససముద్రంబు

కావున నీవైన యఖండచైతన్య
భావన నొంది సద్బ్రహ్మమై యుండు
మని యుపదేశింప నారాఘవుండు
కనుఁగవ మోడ్చి చిద్గగనంబు నంటి
తను దాను భావించి తన్మయుం డగుచు
ననుభూతిరసమగ్నుఁడై కొంత తడవు
మనుజేశ్వరుఁడు చిత్సమాధిసౌఖ్యంబు
ననుభవించి కృతార్థుఁడై కనుల్ దెఱచి
యాగురునకు మ్రొక్కి యంచున నిలువ
గా గురుఁ డమ్మహీకాంతు నీక్షించి
యున్న శ్రీరామ! బ్రహ్మైక్యసౌఖ్యంబు
చెన్నొంద ననుభవించితివే యటంచుఁ
గరుణతో నడుగ నుత్కంఠ దీపింపఁ
గరములు మొగిచి రాఘవుఁ డిట్టు లనియె
నో గురుచంద్ర! మీయుపదేశమహిమ
చే గుఱిగా జగజ్జీవేశ కార్య
కారణైకత్వప్రకాశమర్మముల
ధారాళముగఁ గంటి ద్వైతం బడంగె
నహహా మహాద్వైత మాదిమధ్యాంత
రహితమై యమితమై రమ్యమై యేక
మై సచ్చిదానందమై నిర్విశేష
మై సర్వపరిపూర్ణ మయ్యె నే నదియె

యిటువంటి యనుభూతి నిదమిత్థ మనుచుఁ
బటిమతోఁ జెప్పి చూప నశక్యమయ్యె
నతిశయజ్ఞానరహస్యవాక్యముల
హితమొప్ప మీరు నా కెఱిఁగించుకతన
నన్నిటికి నతీతమగు పదమందుఁ
బన్నుగాఁ బొందితి భవభయం బణఁగెఁ
దల్లివి తండ్రివి దైవము గురుఁడ
వెల్లభంగులను నా కెవ రింక మీరె
కావున మీపదకమలయుగ్మంబు
భావించి నిర్వాణపదము నొందితిని
నని పల్కి భక్తితో నంజలిచేసి
వినుతింప రామభూవిభుని వసిష్ఠ
మౌని ప్రేమను జూచి మరల నిట్లనియె
మానవాధీశ! బ్రహ్మంబు నీ వయ్యె
నారాయణుఁడ వయ్యె నన్ను మన్నించి
సారవేదాంతశాస్త్రము నేను దెలుప
విశదంబుగా నీవు విననందువలన
దశరథాత్మజ! నేను ధన్యుండ నైతి
నని పెక్కువిధముల నారఘూత్తముని
గొనియాడి పూజ గైకొని వసిష్ఠుండు
అంతరంగంబునం దారాము మెచ్చి
సంతసింపుచు నిజాశ్రమభూమిఁ జేరె

నంత నా శ్రీరాముఁ డాత్మార్థ మెఱిఁగి
వింతగాఁ దను దాను వీక్షించుకొనుచు
సలలితవిమలసుస్వాంతుఁడై లేచి
చెలువొప్ప దశరథుచే సెలవంది
యారాముఁ డపుడు విశ్వామిత్రువెంట
సారజ్ఞుఁడైనట్టి సౌమిత్రితోడ
శరచాపములు పూని చని యరణ్యమునఁ
దిరుగు తాటకను మర్దించి పిమ్మటను
నతివేగ మారీచుఁ డనువానిఁ దఱిమి
ప్రతిభ దీపింప సుబాహుని ద్రుంచి
కరుణతో గాధేయుక్రతువు రక్షించి
పరఁగ నహల్యశాపంబును దీర్చి
గరళకంఠుని కార్ముకంబు ఖండించి
సురలు మెచ్చఁగ మహీసుతను వరించి
పరశురాముని బాహుబలము నణంచి
ధరణిజతో నయోధ్యాపురిఁ జేరి
మెఱయుచు సీతాసమేతుఁడై యచట
సురుచిరలీలను సుఖయింపుచుండె
మఱికొన్నినాళ్లకు మంథరవలన
దురుసుగాఁ గైకకు దుర్బుద్ధి పొడమ
రామచంద్రుని మహారణ్యభూములకుఁ
దా మించి పొమ్మన్న దశరథేశ్వరుని

యనుమతిఁ గైకొని యతిశాంతుఁ డగుచు
జనకజాసహితుఁ డై సౌమిత్రితోడ
నా రాముఁ డడవుల కరుగఁగా సీత
నా రావణాసురుఁ డపహరింపఁగను
శ్రీ రాముఁ డచ్చట జింతించి పంపఁ
జేరి సుగ్రీవుతో స్నేహంబుచేసి
వనచరోత్తముఁ డైన వాలిని ద్రుంచి
యినసూనునకు రాజ్య మిచ్చి యంగదుని
యువరాజుగాఁ జేసి యుంచి యామీఁదఁ
బవనాత్మజుని భక్తిభావన మెచ్చి
యతనిచేతికి సీత కానవా లిచ్చి
ప్రతిభతోఁ బంప నప్పవననందనుఁడు
లవణాబ్ధి లంఘించి లంకలోఁ జొచ్చి
యవనీతనూభవ నచ్చోటఁ గాంచి
శ్రీరామచంద్రుఁ డిచ్చిన యుంగరంబు
గౌరవంబుగ సీతకరమునందుంచి
చెచ్చెర సీత యిచ్చిన మానికంబు
నచ్చుగాఁ గైకొని యందుండి కదలి
వనపాలకుల నొంచి వనము మాయించి
ఘనశూరుఁ డైన యక్షకుమారు నణఁచి
లంకాధిపతిని నిర్లక్ష్యంబుచేసి
లంక గ్రక్కునఁ గాల్చి లవణాబ్ధిఁ గడచి

రామున కాశిరోరత్నంబు నిచ్చె
నామీఁద రఘువరుఁ డఖిలవానరులఁ
గూడి తోయధిని మిక్కుటముగాఁ గట్టి
పోడిమి లంకకుఁ బోయి శౌర్యమునఁ
గడఁగి రావణకుంభకర్ణాదులైన
చెడుగురక్కసులఁ గూల్చి విభీషణునకుఁ
బనిఁబూని లంకలోఁ బట్టంబుఁ గట్టి
జనకజఁ దోడ్కొని సౌమిత్రితోడ
వానరాదులతోడ వరపుష్పకంబు
పై నెక్కి సాకేతపట్టణంబునకు
వరశక్తి దీపింప వచ్చె లక్ష్మణుఁడు
భరతశత్రుఘ్నుఁడు పవననందనుఁడు
తనుఁ జేరి కొలువఁగాఁ దగినవేడుకల
మొనసి వసిష్ఠాదిమునులకు మ్రొక్క
సీతతోఁ బట్టాభిషిక్తుఁడై సురలు
ఖ్యాతిగాఁ బొగడ నుత్కంఠ దీపింప
గురుతరకల్యాణగుణగణుం డగుచు
పరమాత్ముఁడై తాను భావ మేమఱక
పరిపూర్ణభావసంపన్నుఁడై ప్రజలఁ
బరమశాంతాత్ముఁడై పాలించుచుండె

నని భరద్వాజసంయమికి వాల్మీకి
ఘనతరజ్ఞానయోగప్రకారంబు
వినిపింప నంతయు విని భరద్వాజుఁ
డనఘుఁడై వాల్మీకి కంజలిసేసి
కొనియాడి యచ్చట గురుభక్తి మెఱయ
ననుపమవిజ్ఞానియై శాంతిఁ బొంది
శమదమప్రముఖభాస్వరసద్గుణముల
నమర జీవన్ముక్తుఁ డగుచు సుఖించె
నిది సోమనాథవిశ్వేశ్వరస్వామి
పదపద్మభక్తసుబ్రహ్మణ్యయోగి
చరణాంబుజాతషట్చరణాయమాన
పరిపూర్ణనిత్యసద్భావనిమగ్న
మానసాంబుజ వెంగమాంబికారచిత
మై నిత్యమై సత్యమై ధన్య మగుచు
సామార్థసారసుజ్ఞానవాసిష్ఠ
రామాయణం బను రమ్యసద్విపద
యం దంత పంచమం బగు ప్రకరణము
నందమై విమలమోక్షాకరం బగుచు
శ్రీతరిగొండనృసింహుఁ డనంగ
ఖ్యాతిగా వెలయు వేంకటరాయ! నీదు

పదయుగళికి సమర్పణ మయ్యె దీని
సదమలులై వ్రాసి చదివిన వినిన
నరులు తాపత్రయార్ణవము తరించి
పరమైన నిర్వాణపదము నొందుదురు
భూచక్రమున నిది పురుషార్థ మగుచు
నాచంద్రతారార్కమై యుండుఁగాత.

వాసిష్ఠ రామాయణము

సంపూర్ణము.

చెన్నపురి: 'వావిళ్ల' ప్రెస్సున ముద్రితము.—1925.